హిందూధర్మశాస్త్ర గ్రంథమాల 17.

శ్రీ

ఆంధ్రకవితరంగిణి

తొమ్మిదవ సంపుటము

రచయిత:

శ్రీ చాగంటి శేషయ్య

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.
10602

హిందూధర్మశాస్త్ర గ్రంథనిలయము
కపిలేశ్వరపురం (తూ. గోదావరి)

A

894.8271
SES

ప్రథమముద్రణము : 1952.
మూడు రూపాయలు.

MEMORIAL LIBRARY

శ్రీ ఆనంద తీర్థ ప్రెస్ :
రామచంద్రపురం.

B

(A0UA104B111)

ఆంధ్రకవి తరంగిణి ముద్రణమునకు విరాళములొసంగిన

భాషాభిమానులు.

రాజపోషకులు:

౧ శ్రీ బలుసు బుచ్చిసర్వారాయఁడు జమీందారువారు. కపిలేశ్వరపురం కేశనకుర్రు ఎస్టేట్లు, కపిలేశ్వరపురం.

ప్రధానపోషకులు:

౧ శ్రీ బిక్కని వెంకటరత్నంగారు, భూస్వామి ఎమ్. ఎల్. ఎ. మాజీమంత్రి, రామచంద్రపురం కో ఆపరేటివు సెంట్రల్ బ్యాంకిఅధ్యక్షులు చోడవరము.

పోషకులు.

౧ శ్రీ బలుసు బుచ్చిపట్టాభిరామయ్యగారి కుమారులు అచ్యుతరామయ్యగారు, భూస్వామి, కపిలేశ్వరపురం.

౨ శ్రీ మద్దూరి నూరన్నగారు, వర్తకులు, గోపాలపురం.

3 శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డిగారు, భూస్వామి, బుచ్చిరెడ్డిపాలెం.

౪ శ్రీ వాడ్రేవు విశ్వసుందరరావు బహద్దర్ వారు, జమీందారు వేగాయమ్మపేట

సహాయులు:

౧ శ్రీ దేశరాజు వేంకట సుబ్బారావుగారు, భూస్వామి, కపిలేశ్వరపురము.

౨ శ్రీ పోతాప్రగడ సూర్యనారాయణగారు, ప్రొప్రయిటరు: సుజనరంజనీ ప్రింటింగువర్క్సు, రాజమహేంద్రవరము.

3 శ్రీ వటికూటి పట్టాభిరామయ్యగారు, వునకరమిల్లి యస్టేటు జమీందారు, వెల్ల.

౪ శ్రీ బండారు చినవెంకటయ్య అనే రామకృష్ణయ్యగారు భూస్వామి, వాడపాలెం.

౫ శ్రీ బలుసు వెంకటరామారావుగారి భార్య మాణిక్యంగారు భూస్వామిని, కపిలేశ్వరపురము.

౬ శ్రీ కొరపాటి వెంకట్రాయుడుగారి భార్య శ్రీమతి సత్యవతమ్మగారు భూస్వామిని, కపిలేశ్వరపురము.

౭ శ్రీ కేసాప్రగడ వెంకటరమణ రాజేశ్వరరావుగారు, భూస్వామి, అన్నంపల్లి.

౮ శ్రీ పోతాప్రగడ కృష్ణమూర్తిగారు, ప్రొ॥ మాస్టరుమాన్ ప్రింటరుస్, కాకినాడ.

౯ శ్రీ వాడ్రేవు రత్నేశ్వరరావుగారు, భూస్వామి, పసలపూడి.

౧౦ శ్రీ నెక్కంటి దొరయ్యగారు, భూస్వామి, కపిలేశ్వరపురము.

౧౧ శ్రీ నెక్కంటి రామయ్యగారు, భూస్వామి, ఆసిస్టెంటు యింజనీరు కపిలేశ్వరపురం

౧౨ శ్రీ బుద్ధవరపు మహాదేవుడుగారు, బి. ఎ. బి. ఎల్. వకీలు, రామచంద్రపురము.

౧౩ శ్రీ లక్కరాజు సుబ్బారావు పంతులుగారు, అడ్వకేటు, భూస్వామి, కాకినాడ

౧౪ శ్రీ వుప్పలూరి వెంకటరమణమూర్తిగారు, భూస్వామి అడ్వకేటు, కాకినాడ.

౧౫ శ్రీ నెక్కంటి జగపతిరామయ్యగారు, భూస్వామి, ప్రొప్రయిటరు రైసుమిల్లు, వెదురుమూడి.

౧౬ శ్రీ ఏకా ఆంజనేయులుపంతులుగారు, భూస్వామి గుంటూరు.

౧౭ శ్రీ కె. వెంకయ్యచౌదరిగారు, భూస్వామి డివిజనలు యింజనీరు కాకినాడ.

౧౮ శ్రీ ఏలూరిపాటి నరసింహసర్వతోముఖయాజులుగారు, భూస్వామి, ఓళ్ళకుర్రు

౧౯ శ్రీ తురగా పుషోత్తం పంతులుగారు, ఎమ్. ఎల్. సి. పలివెల.

౨౦ శ్రీ మల్లాడి సత్యలింగం నాయకరు చారిటీసువారు, సత్యలింగవరం, కాకినాడ.

౨౧ శ్రీ అయ్యగారి మోహనరావు పంతులుగారు, బి. ఎ. బి. ఎల్., అడ్వకేట్, సీతానగరం, విశాఖపట్టణంజిల్లా.

౨౨ శ్రీ రావుసాహెబ్ పట్టమట్ట శేషగిరిరావు పంతులుగారు, ప్రొప్రయిటరు, జార్జిప్రెస్, కాకినాడ.

౨౩ శ్రీ వెంటూరు దొరయ్యగారు, కోటిపల్లి.

౨౪ శ్రీ బొప్పన దొరయ్యగారు, కందులపాలెం.

౨౫ శ్రీ వైట్ల వీర్రాజుగారు, కందులపాలెం.

౨౬ శ్రీ తురగా రామచంద్రరావు పంతులుగారు, ఇన్‌కమ్‌టాక్సు ఆఫీసరుగారు, మదరాసు.

౨౭ శ్రీ ఏనుగు తమ్మిరాజుగారు, తాపేశ్వరం.

౨౮ శ్రీ వాడ్రేవు వెంకప్పారావుగారు, జమీందారు, దానవాయిపేట, రాజమహేంద్రవరము.

౨౯ శ్రీ వాడ్రేవు గోపాలకృష్ణగారు పిఠాపురము.

౩౦ శ్రీ నేమాని వెంకటనారాయణగారు, బి. కామ్. ఇన్‌కమ్‌టాక్సు ప్రాక్టీషనరు, కాకినాడ.

౩౧ శ్రీ మరివాడ సూర్యనారాయణమూర్తిగారు, కపిలేశ్వరపురం.

౩౨ శ్రీ దంటు సూర్యారావుగారు, మర్చంట్సు, కాకినాడ.

౩౩ శ్రీ గుండపునీడు జానకిరామయ్యగారు, రామచంద్రపురం.

౩౪ శ్రీ మేడవరపు సత్యనారాయణమూర్తి గారు హసన్ బాదా.

౩౫ శ్రీ బండారు పెదవెర్రెయ్యగారు, భూస్వామి, వాడపాలెం.

౩౬ శ్రీ మాజేటి హనుమంతరావుగారు, మర్చంటు, గుంటూరు.

౩౭ శ్రీ దేశరాజు రామారావుగారు, మర్చంటు, గుంటూరు.

౩౮ శ్రీ టి. కె. నాగయ్యగారు, మర్చంటు, గుంటూరు.

౩౯ శ్రీ గోపాలుని వీరరాఘవయ్యగారు **B. A. B. L.** అడ్వకేటు, **President: Bar Association** గుంటూరు.

౪౦ శ్రీ ఉన్నం వెంకటరామారావుగారు, **B. A. B. L.** విశాఖపట్టణము

౪౧ శ్రీ బెండపూడి పేర్రాజు పంతులుగారు, **M. B. B. S** విశాఖపట్టణము.

౪౨ శ్రీ చీమలపాటి గనేశ్వరరావుగారు, శక్రటరీ, ది విశాఖపట్టణం ఎలక్ట్రిక్ సప్లయి కార్పొరేషను లిమిటెడ్ విశాఖపట్టణము.

౪౩ శ్రీ దూర్వాసుల సీతారామమూర్తిగారు **B. A. B. L.** విశాఖపట్టణము.

౪౪ శ్రీ మాదిరాజు సుబ్బారావుగారు, మేనేజింగు ప్రొపిృయిటరు సిటిహైస్కూలు, విశాఖపట్టణము.

౪౫ శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య పంతులుగారు, విజయవాడ.

౪౬ శ్రీ దాట్ల సత్యనారాయణరాజుగారు, **M. B. B. S., L. R. C. A., M. R. C. S. (Eng) M.R.C.P. (Lond)** రాజమహేంద్రవరము.

౪౭ శ్రీ ఈదర వేంకట్రావు పంతులుగారు, ఏలూరు.

౪౮ శ్రీ పేర్ల సత్తెయ్య శెట్టిగారు చినవాల్తేరు యస్టేటు, విజయనగరం

౪౯ శ్రీ రామదాసు ట్రాన్సుపోర్టు, లిమిటెడ్., కాకినాడ.

ఏతత్కవికృతులు:

దుర్గేశనందని	నవల
నవాబు నందిని	,,
విశ్వప్రయత్నము	,,
శ్రీ	,,
రాధారాణి	,,
చంద్రసేనుడు	,,

హిందూలా (సమిష్టికుటుంబము)

మదరాసులోకలుబోర్డుఆక్టురెండుసంపుటములు

మదరాసు సహకార సంఘముల ఆక్టు

ఆంధ్రకవి తరంగిణి సంపుటములు

విషయసూచిక

132	రాధామాధవకవి (చింతలపూఁడి ఎల్లనార్యుఁడు)	1
133	కుడిచెర్ల తిప్పరాజు	17
134	నాగలూటి శేషనాథార్యుఁడు	19
135	ఘటశాసి మల్లుభట్టు ...	25
136	కానుకొలను అన్నమరాజు	27
137	ఎడపాటి యెఱ్ఱనకవి	30
138	బొడ్డపాటి పేరయకవి ...	39
139	బొడ్డపాటి కొండయ	45
140	తెనాలి అన్నయకవి	48
141	రెడ్డిపల్లె ముద్దమరాజు ...	62
142	ఒడ్డెపూడి పెద్దయకవి	63
143	గంగరాజు చౌడయ్య	72
144	నారన సూరన ...	75
145	పలకలూరి గోపన	87
146	పోతరాజు వీరయ్య	88
147	పచ్చకప్పురపు తిరువెంగళకవి ...	90
148	తెల్లపూడి కసవరాజు	95
149	కోట శివరామకవి	96
150	చిత్రకవి పెద్దనకవి ...	101
151	పోతరాజు	105
152	సిద్ధరాజు తిమ్మరాజు ...	107
153	ఫణిధవు మాధవుఁడు	112
154	బైచరాజు వేంకటనాథకవి	115
155	సర్వదేవుఁడు ...	123
156	పొన్నతోట యాబళకవి	124
157	పొన్నాడ పెద్దిరాజు	129
158	కొటికెలపూఁడి సోమనాథకవి ...	131
159	తులసి బసవయ్య	139
160	కలిదిండి భావనారాయణకవి ...	141

161	ఎలకుర్తి రామరాజు ...	148
162	జైతరాజు ముమ్మయ	149
163	చెందలూరి చిక్కయ్య	152
164	భద్రకవి లింగకవి ...	155
165	పెమ్మన బావన	161
166	కుంటముక్కల తిరుమలనాథకవి	165
167	కంచిరాజు సూరయ్య ...	173
168	లింగమకుంట రామకవి	175
169	చిరుమూరి గంగరాజు	181
170	లింగమకుంట తిమ్మకవి ...	182
171	నెల్లూరి ముత్తరాజు	186
172	కాసె సర్వప్ప	187
173	పెద్దిరాజు రామరాజు ...	189
174	శంకరకవి	190
175	భాస్కరాచార్యులు	206
176	పద్మకవి ...	219
177	మొల్ల	220
178	రాపరిది దేచిరాజు ...	226
179	పోశెట్టి లింగకవి	227
180	గార్లపాటి లక్ష్మణకవి ...	233
181	తాళ్ళపాక తిరువెంగళనాథుఁడు	234
182	నైషధము తిమ్మయమంత్రి	236
183	కావూరి వెల్లయకవి ...	238
184	అంగద బసవయ్య	242
185	కోడూరి వల్లభసూరి	244
186	మద్దికాయఁల మల్లయ ...	247
187	నామయోగి	248
188	గౌడయకవి ...	249
189	విశ్వేశ్వరకవి	249
190	ఎడవల్లి పర్వతన్న ...	252

VI

శ్రీ రామచంద్ర

ఆంధ్రకవితరంగిణి

(తొమ్మిదవ సంపుటము)

132 రాధామాధవకవి

[చింతలపూడి ఎల్లనార్యుఁడు]

ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; శ్రీవత్స గోత్రుఁడు; కృష్ణభట్టారక పౌత్రుఁడు; కామయప్రభు సుపుత్రుఁడు; లచ్చుమాంబ యాతని తల్లి.

ఈకవి రాధామాధవము తారకబ్రహ్మరాజీయము నను రెండుత్తమకావ్యములను రచియించి యాంధ్రలోకమున కొసంగియుండెను. రాధామాధవమునఁ గవితనుగూర్చి యిట్లు చెప్పుకొనియున్నాఁడు.

సీ. శ్రీవత్సలాంఛన శ్రీముఖాంబుజమున
శ్రీవత్స మునికులశేఖరుండు
ప్రభవించె నా మహాభాగు వంశాంబుధి
దివ్యరత్నంబుల తెఱఁగుమీఱ
బుట్టిరనేకులు పురుషార్థపరులైన
వారు వారలలోన వంశకర్త
వర్ణిత సత్కీర్తి వల్లభుఁడొప్పారె
నతనికి శ్రీకృష్ణుఁడవతరించె
ఆ. నతనియందుఁ గామనార్యుండు జన్మించె
నతనికేను లచ్చుమాంబయందు
జననమైతి నెల్లనసత్కవి చంద్రుండ
సరసహిత చకోరసఖ్య మలర.

ఈమహాకవి తాను రచించిన రాధామాధవమును ఆంధ్రభోజ బిరుదాంచితుఁడను గర్ణాటప్రభుఁడునైన శ్రీకృష్ణదేవరాయలకుఁ జదివి వినిపింపఁగా నాతఁడు మిగుల సానందమొంది యీకవికి రాధామాధవుఁడను బిరుదమిచ్చి రత్నాంబరంబులతో విశేష బహుమానము లొసంగి పూజించెనని కవి రాధామాధవమున నీక్రింది పద్యములోఁ జెప్పియున్నాఁడు.

శా. రాధామాధవ మచ్యుతాంకితముగాఁ బ్రౌఢక్రియం జెప్పి త
న్మాధుర్యంబునఁ గృష్ణరాయవిభుఁ గర్ణాటేశు మెప్పించి నా
నాధాత్ర్య ప్రతిమాన సత్కవులలోనన్ భూషణశ్రేణితో
రాధామాధవ నామమందిన జగత్ప్రఖ్యాత చారిత్రుఁడన్.

ఈపద్యమందలి "ధాత్ర్యప్రతిమానసత్కవి" శబ్దమునఁ గృష్ణరాయల యాస్థానకవియగు కవితాపితామహ బిరుదాంకితుఁడైన యల్లసాని పెద్దనామాత్యుఁడు సూచింపఁబడియెనని తలంపవచ్చును. ఈపెద్దనామాత్యుఁడు నగరు, తగరు, తొగరు, వగరు అను పదములను ప్రాసస్థానములయందుంచి భారత భాగవత రామాయణ పరములుగాఁ బద్యములను జెప్పుమని రాయలయాస్థానమున కెల్లయార్యుఁడు వచ్చినప్పుడాతని నడిగెననియు నతఁ డీక్రిందిపద్యములను రచియించె ననియుఁ జెప్పుదురు.

చ. నగరు పగాయె నింక విపినంబుల కేఁగుఁడు రాజ్యకాంక్షులం
దగరు కుమారులార! యని తల్లి వగల్మిగులంగఁ దోఁపఁగాఁ
దొగరున రక్షగట్టి మదిఁ దోఁపక గద్గదఖిన్నకంఠుఁడై
వగరుచుచున్నఁ జూచి రఘువంశవరేణ్యుఁడు తల్లికిట్లనున్.

చ. వగరుపు మాత్రమే వరుఁడు వశ్యుఁడుకాఁడు సఖీ సఖిత్వ మె
న్న గరుడవాహనుండు మము నాఁడటు డించుట యెల్ల నుద్ధవా!
తగరని కాక మోహపులతాతను వైన విడంగఁ జూతురే!
తొగరుచి యోషధీశునకుఁ దోఁపఁగఁ జేయునె వీడనాడగన్.

చ. తొగరుచి కన్నుదోయిఁ గదుఁ దోఁపఁగఁ గర్ణుఁడు భీమసేనుపైఁ
దగరు ధరాధరంబుపయిఁ దాఁకిన భంగిని దాఁకి నొచ్చి తా

వగరుచుచుర్ఱ వెసం బరుగువాఱిన నచ్చటి రాజలోకముల్
నగరు సుయోధనాజ్ఞ మది నాటుటఁ జేసి ధరాతలేశ్వరా!

ఈకవి తనగ్రంథమును కృష్ణరాయల కంకితమీయలేదు. మదనగోపాలస్వామికిఁ గృతియిచ్చియుండెను. ఇతఁడు భూపతులకుఁ గృతుల నిచ్చుటకిష్టములేనివాఁడై నట్లీ క్రింది పద్యములలోఁ జెప్పియున్నాఁడు.

ఆ. నన్నుఁగన్న ఫలము నాతల్లిదండ్రుల
వంశమునకు మిగుల వన్నెగలుగ
సకల పితృగణంబు శాశ్వత బ్రహ్మ లో
కైక సుఖము లందునట్లుగాను.

క. నాయకరత్నము లక్ష్మీ
నాయకు హరినిష్టదాత నాకృతికిఁ బతిం
జేయుదు భూములకగు భూ
నాయకులను బరులఁ గైకొనక పటుబుద్ధిన్

ఇతనియుద్దేశ మెఱింగి సరసుఁడును రసగ్రహణ పారీణుఁడు నగు కృష్ణదేవరాయలీతని సత్కరించి, గ్రంథనామమునే యాతనికి బిరుదముగా నొసంగి గౌరవించెను. ఈకవి పరులనాశ్రయించి, తనకవితకు గౌరవము దెచ్చుకొనవలయునను నూహకలవాఁడు కాఁడు. తన కవిత యందు రసమున్నచో లోకము గౌరవింపక మానదను ధైర్యముకలవాఁడు. ఈభావములీక్రింది రెండు పద్యములలోఁ బ్రతిఫలించుచున్నవి.

చ. సరవి నొసర్చు సత్కవుల చక్కని కావ్యకలాప మర్మముల్
నిరుపమ కోవిదుల్ దెలియ నేర్తురు గానియెఱుంగజాల రొం
డొరులు చకోరకప్రకర ముజ్జ్వలపూర్ణసుధాంశు చంద్రికో
త్కరము భవానునట్టులుగఁ దక్కిన పక్షికులం బెఱుంగునే.

చ. సరసులు చిత్తగింపుఁడని చాటను మామకవాణి సన్మనో
హరయగునేని, వారి హృదయంబుల కింపొనరింపకున్నె? యె
వ్వరు పిలువంగ వచ్చి యళివర్గము లాత్మలఁ జొక్కు దేనియల్
గురియు ప్రసూనగుచ్ఛ భరకుంచిత వల్లిమతల్లి కావనిన్.

శ్రీకృష్ణభగవానుఁడు కలలోఁ గన్పడి యాజ్ఞయిడుటచే దా
సీరాధామాధవమును జెప్పితి నని కవి యీక్రింది పద్యములలోఁ జెప్పి
యున్నాఁడు.

క. బోధించి యిష్టదేవము
రాధాసతిఁగూడి సౌమ్యరమ్యాకృతి హృ
త్సౌధమునఁ దోఁచి కృష్ణుఁడు
రాధామాధవము చెప్పురా! యనిపలికెన్.

తే. ఇష్టదైవంబు పొడకట్టి హృదయవీథిఁ
దనకుఁ గృతిఁజెప్పుమని ప్రసాదంబు సేసె
నింతకంటెను సౌభాగ్య మేమి చెప్ప
దైవకృప గల్గనేని వింతలె శుభములు.

రాధామాధవము సంస్కృతమున జయదేవకవి రచియించెనని
కవి యీక్రింది పద్యములో వ్రాసియున్నాఁడు.

క. నుతియింతు వాగ్విశేష
స్థితి రాధామాధవంబు చెప్పినవిద్యా
చతురాననుఁ శీలాంచల
పతిహితు జయదేవసుకవి పంచప్రదరున్.

జయదేవకవి నామధారులు ముగ్గురున్నారు. అందీరాధా
మాధవకావ్యమును రచియించిన జయదేవుఁ డెవ్వరో నిశ్చయింపలేము.
ఈవిషయమునుగూర్చి జయదేవకవి చరిత్రమునఁ జర్చించియున్నాఁడను.

ఈకవి రచించిన రాధామాధవమందలి రాధ పరకీయ కాదు.
ఈతనితరువాత రాధాకృష్ణవిలాస మనుపేర కృష్ణదాసును, రాధామాధవ
సమాగమమనుపేర, నెడవిల్లి వేంకటపతియు రాధామాధవసంవాదమను
పేర వెలిదిండ్ల వేంకటపతియు, రాధికాసాంత్వన మనుపేర ముద్దుపళ
నియుఁ బ్రబంధములను రచియించియుండిరి. వీరి గ్రంథములన్నిటి
యందును రాధ పరకీయగా వర్ణితమైనది. ఈరాధామాధవులకథ భాగ
వతాదులయందులేదు. ఈవిషయమున రాధామాధవ పీఠికయందు విమ
ర్శాదర్శక శ్రీ నడకుదుటి వీరరాజు పంతులుగారిట్లు వ్రాసియున్నారు.

"బ్రహ్మవైవర్తపురాణమున రాధాదేవీ పరమోత్కృష్టము వివిధవిశేష మహిమలతో వర్ణింపఁబడియున్నది. అప్పురాణమునందు విష్ణుదేవునకు లక్ష్మీదేవివలెనే త్రిమూర్తులకును మూలకారణుఁడైన శ్రీకృష్ణదేవునకు సీరాధాదేవి నిత్యానపాయినియైన దేవిగా నభివర్ణింపఁబడియున్నది. మఱియు నందునీ రాధయే మూలప్రకృతిగను శ్రీకృష్ణుఁడే యాది పురుషుఁడుగను గీర్తింపఁబడిరి.

◆ ◆ ◆ ◆

భగవంతునియెడ భక్తునికిఁగల యెడతెగని ప్రేమము, స్వైరిణికి నుపపతియందు గలుగు నిరంతర దృఢతరానురాగమువంటిదను ననుభవసాధ్య దృష్టాంతమును రూపకముగాఁ బ్రదర్శించుటకుఁగాను బ్రహ్మవైవర్త పురాణకారుఁడు శాపమిషంబున మూలప్రకృతీ స్వరూపిణియైన రాధాదేవిని భూలోకమునకుఁ దెచ్చి యామెకుఁ బరకీయా భూమికను గల్పించి యాత్మభర్తయైన శ్రీకృష్ణునినే యుపభర్తగాఁ జేసి, యామెకు నాతనియెడఁగల నిరతిశయానురాగవ్యాజమునఁ బరమభక్తినే (లోకమునకై) ప్రబోధించినాఁడు. ఇక్కథలోని బహిర్భావమునుమాత్రమే కావ్యవస్తువుగాఁ బరిగ్రహించిన యితర కవులు రాధికను కేవలజారిణిగనే ప్రదర్శించి తమ తమ గ్రంథముల నతివేల శృంగారరసవాహినులలోఁ దేల్చివైచినారు. భక్తిప్రబోధమునకై పురాణకర్తచేఁ గల్పింపబడిన యిక్కథ యిక్కవులచే వ్యత్యస్తముగాఁ బరిణమించినది. మన రాధామాధవకవి యట్టిమార్గము ననుసరింపక లక్ష్మీనారాయణులనే రాధామాధవులనుగాఁ జేసికొని యిమ్మనోహర కావ్యరాజమును శృంగారరసాను ప్రాణితమైన భక్తిరస సుధా సాగరముగాఁ జేసివైచినాఁడు. మఱియు, పల్లవనాయకుఁడైన సహస్రగోపుని తనయయగు రాధను దేవీమూర్తిగనే భావించి యామెనువర్ణించుపట్టునఁ (గవిసంప్రదాయానుసారము) పాదాదిశిరఃపర్యంతము నవయవవర్ణనము నొనర్చియున్నాఁడు. ఇట్టి భక్తి తాత్పర్యముచేతనే యాతనికి గవితాతాదాత్మ్యము గలిగి రాధామాధవత్వము ప్రాప్తించినది.

ఇక్కావ్యమునందంతటను బవిత్రమైన రాధామాధవతత్త్వమే ప్రతిపాదితమై యున్నది.

సీతారాములవలెనే విష్ణుభక్తులకు రాధాకృష్ణులు నభీష్టదైవతములై యున్నారు. రాధాదేవిగాక రుక్మిణ్యాద్యష్టమహిషులు శ్రీకృష్ణునకు ధర్మపత్నులై యున్నట్లు పురాణాదులయందున్నను, భక్తులెల్లరు రాధాకృష్ణ నామమునకే ప్రియపడెదరు. మఱియు, వారు తక్కిన యే దేవేరుల నామములతోడను శ్రీకృష్ణనామమును జేర్చి సంస్తుతించుచున్నట్లు (రుకిణీ కృష్ణ, సత్యభామా కృష్ణ...ఇత్యాదిగ) గానరాదు."

ఈమహాప్రబంధమును గోదావరి మండలమందలి కపిలేశ్వరపురము జమీందారుగారగు శ్రీ బలుసు బుచ్చిసర్వారాయఁడుగారు వీరరాజుపంతులుగారి పీఠికతోఁ జక్కగా ముద్రింపించి యున్నారు. ఈరాధామాధవము శ్రీకృష్ణదేవరాయల జీవితకాలములో ననఁగా కీ. శ. ౧౫౨౦–౩౦ నడుమ రచితమయ్యెనని చెప్పవచ్చును.

ఈకవిరచించిన రెండవగ్రంథము తారక బ్రహ్మరాజీయము. ఇది సంస్కృతమున నారాయణాశ్రముఁడు రచించిన గ్రంథమున కాంధ్రీకరణమని కవి యీక్రింది వాక్యములలోఁ జెప్పియున్నాఁడు.

"శ్రీరామబ్రహ్మ తారకరాజీయంబు పరమభాగవతోత్తముండు ప్రయాగ క్షేత్రవాసి నారాయణాశ్రములను మహాయతీశ్వరుండు సంస్కృతంబున రచియించె నదితెలుంగున సకలజనులకుం దెలియునట్లుగా..."

ఈగ్రంథమెన్ని యాశ్వాసములో తెలియదు. ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున నాల్గవయాశ్వాసమువఱకున్న ప్రతియొకటియు రెండాశ్వాసములు గల ప్రతియొకటియునున్నవి. ఆంధ్రసాహిత్యపరిషత్కార్యాలయమున నొక ప్రతికలదు.

ఈకవి యీగ్రంథము నచ్యుతరాయలకడ కందాచారమును (Military accounts) వ్రాయుసంజయతిమ్మరుసు కోర్కెపై శ్రీరామచంద్రున కంకితము చేసెను. సంజయకుమారుఁడు తిమ్మరుసు నియోగి

బ్రాహ్మణుఁడు; కాశ్యపగోత్రుఁడు; నంజయ తిప్పాంబలకుఁ బుత్రుఁడు గాయమంత్రి తిప్పాంబలకు పౌత్రుఁడు; ఈతిమ్మరుసుభార్య లింగాంబిక. ఈదంపతులకు నంజయ యనుకుమారుఁడు కలఁడని యీక్రింది పద్యములలో గవి చెప్పియుండుటచే, గృతిప్రదానకాలమునాటి కాతని కేఁబదేండ్లుండునని తలంపవచ్చును.

క. శృంగారవతీమణి పు
ణ్యాంగన నంజరుసు తిమ్మనార్యుని సతియౌ
లింగాంబిక యంబిక కెన
మంగళసూత్రప్రభావ మానధనములన్.

ఉ. ఆహరిణాక్షియందు సుగుణాఢ్యుఁడు తిమ్మరుసయ్యగాంచె దే
జోహరి సత్కృపాహరి విశుద్ధయశోహరి నిత్యభోగ ల
క్ష్మీహరి నంజమంత్రిని సమిద్ధకులాంబునిధీంద్ర చంద్రునిన్
మోహనపుష్పసాయక సముజ్జ్వల రూపవిశాల వైభవున్.

అచ్యుతదేవరాయలు ప్రతిసంవత్సరమును శ్రీ వేంకటేశ్వరున కొకొక్క ప్రబంధమును రచియించి సమర్పించుచున్నట్లీ క్రిందివచనమువలనఁ దెలియుచున్నది.

"అమ్మహామహీశ్వరుం (నంజయతిమ్మరుసు) డొకనాఁడు చతుస్సముద్ర ముద్రిత మధ్యభూభువన సింహాసనాధీశ్వరుండగు నచ్యుతదేవరాయల కొలువు చేసివచ్చి నిజనివాస భాసురచంద్రశాలా ప్రాంగణ మణిమంటపంబున విజయనగర రాజధానింగల బంధువర్గంబును విద్వత్కవీంద్రులును వందిమాగధగాయక వారకామినీ నికరంబును సముచిత ప్రకారంబున సేవింప సుఖగోష్ఠిం బ్రవర్తింపుచు నిజస్వామియగు నచ్యుతదేవరాయలు ప్రతిసంవత్సరంబు శ్రీ వెంకటేశ్వరునకు సత్కావ్య ప్రబంధ పుష్పాంజలి సమర్పించుచుఁ గీర్తిసుకృతంబులు నిర్వహించుకొనుచున్నవాఁడు. తదనుమతంబున నవ్విభునకు నాకు నభ్యుదయ పరంపరాభివృద్ధియుఁ జతుర్విధపురుషార్థసిద్ధియుఁ గలుగునట్లుగా నాయిష్టదైవంబగు

శ్రీరామచంద్రునకు సంకితంబుగా నొక్క ప్రబంధంబు చెప్పింప వలయునని సుహృజ్జనంబులతో నాలోచించి

క. రాధారుణాధరోరుప
యోధర కాశ్మీర పరశురసరసోదయ కవితో
మాధుర్యధుర్యు నన్నుఁ
రాధామాధవుని సుకవిరత్నముఁ బలికెన్.

కృతిపతియుఁ గృతినాయకుడును బంధువులైన ట్లీక్రిందిపద్యము సూచించుచున్నది.

ఉ. నావుఁడు నీకు సంకితమొనర్పఁదలంచినవాఁడ బంధు సం
భావన నీకు నిష్టముగ బ్రహ్మమయుం డగురామభద్రు ధా
త్రీవరమౌళికంకిత మిదే యొనరించి (రచింతు) వైఁడికిన్
దావి ఘటిల్లె నేమియన నంజయతిమ్మ! వివేకభూషణా!

కృతిపతిని వర్ణించిన పద్యములలో రెండిటి నీక్రిందనిచ్చుచు న్నాఁడను.

చ. తిరుపతి గెల్చి పాండ్యనరదేవుని పట్టముగట్టి యుత్కళే
శ్వరుఁ గరుణించి మ్రొక్కిన సవాయికిఁ దా నభయంబొసంగి పెం
పరుదుగఁ గీర్తిఁ జేకొనిన యచ్యుతరాయుల మంత్రిరత్నమై
తిరముగనున్న నంజవిభుతిమ్మరుసుం డగుఁ బ్రస్తుతింపఁగన్.

ఉ. వేదపురాణశాస్త్రముఖవిద్యల కెల్ల గురుండు బ్రహ్మవి
ద్యాదృఢబుద్ధి నేర్పు విపులన్నిధియు వ్రాయ, సమస్తదేశ భా
షాదులెఱుంగు స్వామి హితమైన ప్రయోజన మాచరించునా
నాదిశలం బ్రసిద్ధుఁడగు నంజయతిమ్మని బోల రెవ్వరున్.

అచ్యుతరాయలు క్రీ. శ. ౧౫౩౧ మొదలు ౧౫౪౨ వఱకును విజయనగర సింహాసనమునందున్నవాఁడు. రాధామాధవకవి యీమధ్య కాలములోఁ దారక బ్రహ్మ రాజీయమును రచియించి నంజయతిమ్మ రుసునకంకితముచేసెను. ఈకవి కాలము క్రీ. శ. ౧౫౫౦-౧౫౬౦ అని తలంపవచ్చును.

ఈతని రాధామాధవముననుసరించి, వల్లన కవి రాధామురుంద వనుపేర నొకపద్య కావ్యమును రచియించెను.

ఈ యెల్లయార్యకవి విష్ణుమాయానాటకమును రచియించెనని యాగ్రంథముద్రిత ప్రతులు చెప్పుచున్నవి. ఆగ్రంథమీ యెల్లయార్యు నిది కాదనియు, నాగ్రంథకర్త, మడికి యనంతయ్యయనియు, నేనా యనంతయ్య చారిత్రమున వ్రాసియుంటిని. పాఠకులీసందర్భమున నా చారిత్రము నొకమారు మరలఁ జదువవలసియున్నది. అందుపైని శ్రీ వేదము వెంకటరాయ శాస్త్రులవారీక్రిందివాక్యములను వ్రాసి విష్ణు మాయానాటకగ్రంథకర్త మడికి యనంతయ్య కాఁడనియు, నీయెల్లయా ర్యుఁడే యాగ్రంథమును రచియించెననియు నిర్ణయించియున్నారు. ౧

"మడికి సింగయ్యకు అనంతయ్యయను సోదరుఁడు కలడు. కాని అతఁడు వీరివిమర్శచే కవిగా నెలకొన్నాఁడు. వీరి కాధారము నామసామ్యము వహించుటచేతను, గోత్రము లొకటే యగుటవలనను, విష్ణు మాయానాటక గ్రంథకర్తయైన యనంతకవియు, మడికి యనం తయ్యయు నొకరేయని వీరి నిర్ణయము. వీరు మరచిపోయినది, లేక వీరికి తెలియని విషయ మొకటికలదు. రాధామాధవమతము మడికి సింగన కాలమున నాంధ్రదేశమున లేదు. భాగవత కథలను గొనిరచిం చిన పారిజాతాపహరణాదులుకూడ తర్వాతివే. ౧౬ వ శతాబ్దమధ్యము వఱకును ఈ మతానుసారి గ్రంథములు బయలువెడలలేదు. రాధా మాధవ మతాభినివేశముతో రచితమైన యీ విష్ణుమాయానాటకము రాధామాధవకవిదే గాని మడికి అనంతయ్యది కాదు. తర్వాతి అనం తయ్య దొంగయగుటచేతను, మడికి అనంతయ్య చాలప్రాచీనుడగుట చేతను, చారిత్రకదృష్టి లేని శేషయ్యగారి మతము నిలువదు. శ్రీకోరాడ రామకృష్ణయ్యగారి యభిప్రాయమే సమంజసము. ఏదో నూతనసిద్ధాం తము నెలకొల్పుచున్నామను భావముతో వీరు అసలు విషయమును చూడలేదు." అని వారు వ్రాసినారు

---

౧ భారతి సం ౨౬ పుట ౨౦౭.

విష్ణుమాయానాటకకర్త యెల్లయార్యుఁడే కాని యనంతయ్య కాఁడనుటకు శ్రీ శాస్త్రిలుగారు పైవిమర్శనమునఁ జూపిన హేతువులు మూఁడు.

౧. అనంతయ్య కవి కాఁడు.

౨. మడికి సింగన కాలమున రాధామాధవమత మాంధ్రదేశమున లేదు.

౩. విష్ణుమాయానాటకము రాధామాధవ మతాభినివేశముతో వ్రాయబడినది. కావున రాధామాధవ మతము నెలుఁగని కాలమున నీగ్రంథము బయలు వెడలుట యసంభవము.

(౧) అనంతయ్య కవి కాఁడా?

అనంతయ్య నా విమర్శనమువలనఁ గవిగా నెలకొనలేదు. ఒక తాళపత్త్రప్రతియందున్న గ్రంథాంత గద్యవలనఁ గవిగా నెలకొనినాఁడు. గోత్రమును బితృనామమును గొన్ని యితర సందర్భములును సరిపోవుటచే నా గద్యయందు నెలకొనిన యనంతయ్య మడికి సింగనకు సోదరుఁడని నేను నిర్ణయించితిని. సింగన, తన తమ్ముఁడు కవియని చెప్పనంత మాత్రమున నాతఁడు కవి కాఁడనియు నాతనిని నా విమర్శనమే కవిగాఁ జేసిన దనియుఁ దలంపరాదు. తెనాలి సోదరకవులు ఒకరినొకరు తమ తమ గ్రంథములలోఁ గవులని చెప్పలేదు. తాళ్లపాక కవులు నట్లే చెప్పలేదు. ఇట్టివారు మఱికొందఱుండవచ్చును. అంతమాత్రమున వారు కవులు కాకపోలేదు.

చింతలపూఁడి యెల్లనార్యునకుఁ దరువాతి కాలమున గోత్రమును బితృనామమును సరిపోయిన మఱియొక యనంతయ్యను శ్రీశాస్త్రిలుగారు చూపి రేని, వారికి వందనములొనర్చి నా యభిప్రాయమును మార్చుకొనియుందును. శ్రీ శాస్త్రిలుగారట్టి యనంతయ్యను జూపలేదు.

(౨) మడికి సింగన కాలమున రాధామాధవమత మాంధ్రదేశమునలేదా?

రాధామాధవమతము బ్రహ్మవైవర్త పురాణమున విపులముగాఁ జెప్పఁబడినది. ఆమతము చైతన్యునితో వచ్చినది కాదు. బ్రహ్మవైవ

ర్త పురాణము మడికి సింగనకుఁ దరువాతఁ బుట్టినది కాదు. రాధామాధవనామములును ఆకథలయందలి భక్తి, ప్రేమ భావములును బ్రహ్మవైవర్త పురాణమును బదునాఱవ శతాబ్ది మధ్యభాగమువఱకును ఆంధ్రులెఱుంగరని తలంచుట యన్యాయము.

రాధానామము ప్రత్యేకముగాఁ జెప్పకున్నను. రాధామాధవ తత్త్వమే శ్రీకృష్ణలీలయందు భాగవత దశమస్కంధమునఁ జెప్పఁబడినదని పండితులంగీకరించియున్నారు. ఆభాగవత దశమస్కంధమును మడికి సింగన ద్విపద కావ్యముగా రచియించియుండెను. పారిజాతాపహరణ కథను హరివంశమునుండి తిమ్మయార్యుఁడు గ్రహించెను.

బ్రహ్మవైవర్త పురాణమును జదివి రాధామాధవ తత్త్వమును అనంతయ్య తెలుసుకొనియుండెనని భావించుటలోఁ దప్పులేదు. ఇంతకును:—

(౩) విష్ణుమాయా నాటకము రాధామాధవ మతానుసారియా?

రాధామాధవతత్త్వమన నేమియో రాధామాధవ పీఠికాకారులు వ్రాసిన వాక్యములవలనఁ (పైనినుదాహరించితిని) దెలియఁగలదు. ఆమతమును బోధించు కథలుగాని వాక్యములుగాని విష్ణుమాయానాటకమున లేవు. ఈగ్రంథమునకు విపులమైన పీఠిక వ్రాసిన శ్రీ కోరాడ రామకృష్ణ పండితుల కిందు రాధామాధవమతము గన్పడలేదు. ఆమతమును గూర్చి వారేమియు నందు వ్రాయలేదు.

ఈగ్రంథమున సంశయాస్పదములైన యాశ్వాసాద్యంత పద్యములందక్క మఱియెచ్చటను రాధానామ ముదాహృతము కాలేదు. "గోప వధూసహస్ర గోబృంద కనత్కదంబ విటపీ వ్రజకేళివిహార" "కలశాంభోనిధి కన్యకాకుచతటీకస్తూరికా పంకసంకిలసుస్నిగ్ధవిసీల" అని యాశ్వాసాంత పద్యములయందున్నది. గ్రంథమంతయుఁ బూర్తియైనపిదప ధర్మరాజు శ్రీకృష్ణుని నుతించు దండకమున మాత్రమే రాధానామము గన్పడుచున్నది. రాధామాధవకవి రచియించినట్లు గన్పడు గద్య

మునుబట్టి యీగ్రంథము రాధామాధవ మతానుసారియని తలంచిరేమో గాని రాధామాధవతత్త్వ మిందించుకంతయును లేదు.

రాధామాధవ తత్త్వమును దెలుపుటకే గ్రంథముద్దేశింపబడలేదు. నేనే గొప్పవాఁడనను నహంభావ మెవ్వరికినుండఁగూడదనియు, నట్టియహంభావపూరితులగువారి గర్వమును బరమేశ్వరుఁడడఁచివేయుననియు సర్వజ్ఞుఁడు సర్వశక్తుఁడు శ్రీమహావిష్ణువొక్కఁడేయనియు బోధించుటకే గ్రంథముద్దేశింపఁబడినది. శ్రీకృష్ణునకత్యంతము ప్రియురాలైన సత్యభామయు; శ్రీమహావిష్ణునిభార్యయైన లక్ష్మీదేవియుఁ; గుమారుఁడును సృష్టికర్తయునైన బ్రహ్మయు; పరమభక్తాగ్రేసరుండును బ్రహ్మమానసపుత్రుఁడునైన నారదుఁడును; జగదీశ్వరుఁడైన యీశ్వరుఁడును గూడ నహంభావ పూరితులై యెట్లు భంగపడిరో వారిగర్వయలనా శ్రీమహావిష్ణువెట్లడంచెనో తెలుపు కథలే యిందు వర్ణితములైనవి. విష్ణుమాయానాటకమున రాధాకృష్ణ మతతత్త్వము లేదు. కావున క్రీ. శ. ౧౫౫౦ సంవత్సరము దాఁటినపిమ్మటఁగాని యిట్టిగ్రంథనిర్మాణమున కవకాశములేదని నిర్ణయించిన శ్రీశాస్త్రిలువారి యభిప్రాయములో నేనేకీభవింపఁజాలను.

నాయభిప్రాయమును మార్చుకొనవలసిన యవసరమును దెలుపు హేతువులు శ్రీశాస్త్రిలువారి విమర్శనమునలేవు. అందుచే నీయెల్లయకవి రచనములలో విష్ణుమాయానాటకమును జేర్చలేదు. ఆగ్రంథకర్త యనంతయ్యయనియే యిప్పటికిని నావిశ్వాసము.

రాజమహేంద్రవరమున శుకబ్రహ్మచే స్థాపితుఁడైన గోపాలస్వామి యుండెననియు, నాస్వామికిఁ గాటయవేముఁడు కుమారగిరిరెడ్డిలోఁజెప్పి యనపర్తిగ్రామము నిప్పించెననియు ననపర్తిశాసనమువలనఁ దెలియుచున్నది. విష్ణుమాయానాటకమునఁ బలుతావుల శుకబ్రహ్మయని పేర్కొనుటనుబట్టియు నాగ్రంథమును గోపాలస్వామికంకితము సేయుటనుబట్టియు నాకృతికర్త మడికి యనంతయ్యయని నిర్ణయించుటలో నావిశ్వాసము మఱింత దృఢమైనది. అనంతయ్య తండ్రియైన

యయ్యలమంత్రి, రాజమహేంద్రపురి కధిపతియైన లోయ్యేటి యన పోతభూపాలునికడ మంత్రిగానుండినట్లు వాసిష్ఠ రామాయణకృత్యాది యందు సింగనకవి చెప్పియున్నాఁడు. అనంతయ్య తన కృతిని రాజ మహేంద్రవరమందు శుకబ్రహ్మచే స్థాపితుఁడైన గోపాలస్వామి కంకి తముచేసెనని నిశ్చయింపవచ్చును.౧

శ్రీనాథుని పద్యములను బోలిన పద్యములు రాధామాధవ కవి కృత రాధామాధవ గ్రంథమునఁ గలవని శ్రీబులుసు వేంకటరమణయ్యగా రును ౨ పింగళిసూరనార్యుఁడీతని రాధామాధవము నాదర్శముగాఁ గైకొ నెనని శ్రీవీరరాజుపంతులుగారును ౩ వ్రాసియున్నారు.

ఈతనికవిత్వము ద్రాక్షాపాకమున మృదుమధురపదసంయుతమై హృదయంగమముగా నున్నది. ఎల్లయార్యుఁడుత్తమ కవుల తరగతిలోఁ జేర్పఁదగినవాఁడు.

వ్యాకరణ సంబంధములయిన కొన్ని నెరసులున్నను, నీతని కవి త్వము శ్రీ వీరరాజుపంతులుగారనినట్లు ప్రౌఢమై ద్రాక్షాపాకలలితమై హృదయంగమమై యొప్పారుచున్నది. శైలితెలియుటకై కొన్నిపద్య ముల నుదాహరించి యీతని చారిత్రమును ముగించెదను.

ఉ. శ్రీయుతమూర్తి గోపకులశేఖరు నందకుమారు రూప నా
రాయణుఁ జూచియుఱ జనపరంపరచే వినియు స్వనంబులఱ
బాయనివంత వేఁగిరి నృపాలక! సర్వజగంబులందుఁ బ
ద్మాయతనేత్రలెల్ల మదనాశుగ సంప్రభవానలార్చులఱ. ౧౫౧౦౮

ఉ. ఈతరళాయతాక్షి రచియించెడి చాతురి యెట్లు గల్గెనో
ధాతకు ధాతచేత రచితంబగునే యిటువంటి రూపు నేఁ
జూతునకాదె యక్షసుర సుందరులఱ సృజియించువేళలం
జేతదమాన విభ్రమము లెక్కఁడి వాచిగురాకుబోండ్లరుఱ. ౨౫౨౨

౧. ఆంధ్రకవితరంగిణి. ౭ వ సంపుట. ౧౮౮ వ పుట.
౨. భారతిసం ౧౩ భా ౨ పుట ౩౨౧.౩౨౭
౩. రాధామాధవ పీఠిక

ఉ. కోరికఁజేరి కామినులకుంతలముల్గబళించి మించి పై
చీరచెఱంగెడల్చి కుచసీమలయందు సుగంధఘర్మవాః
పూరముదీర్చి మర్మపదముల్ దగనంటుచు సంవృతాత్ముఁడై
జారిమిసల్పునట్లు దిరుగు న్మలయానిలుఁ డప్పురంబునన్. ౩౪౮౭

ఉ. రాజకళావిశేషముఁ దెరల్చి విభావరినంటుమాన్చి పా
థోజనికిం బ్రియంబొసఁగు తొందరవచ్చె నినుండు వచ్చె మీ
ర్వేజరగుండు విచ్చియని వేగరి వేగరికాఁడు తారకా
రాజికిఁ జెప్పవచ్చెననఁ గ్రిక్కునఁ జుక్క వెలింగెఁ దూర్పునన్.

ఉ. నాసరి గొల్లవారని మనంబునఁ జూచెదవేమొ కౌముసూ
పాసిన దాకళంకము కృపానిధియైన సువర్ణభూధరే
ష్వాసనుచేత రాజ్యవహిమాతిశయంబును భూపతిత్వమున్
వాసియుఁ గల్గినాము సరివారె? మహీశులు మాకు నీభువిన్.

తారకబ్రహ్మరాజీయము:—

శా. శ్రీరాజీవదళాక్షి కౌస్తుభమణీసింహాసనం బెక్కి యు
ర్వ్యారూఢస్ఫుట దీప్తియుంబలెనె పెంపారన్ నభోమండలా
ధార శ్రీ విలసిల్లు విష్ణుఁడు జగత్కళ్యాణచారిత్రిగం
భీరున్ సంజయతిమ్మమంత్రివరు లక్ష్మీవంతునిం జేయుతన్. ౧౪౧

క. అక్షయ కరుణాసంప
ద్వీక్షి విశాలాక్షితోడ విశ్వేశ్వరుఁడే
సాక్షాత్కరించె నని ప
ద్మాక్షియుతున్ నిన్నుఁగంటి మాహ్లాదమునన్ ౧౪

క. కులశీలంబులు విడిచెను
దలఁకక ప్రాణంబు విడువఁ దలఁచెను విప్రిం
డలివేణి నెత్తుకొనిచను
తలఁపున నెవ్వాఁడు చెడఁడు దైవముచేతన్. ౨౪

ఉ. సీతయు నాదిలక్ష్మి యని చిత్తములం బరికించి రాముడున్
సీతయు నాగిరీంద్రమునఁ జిత్తజులీలలఁ దేలుచున్ వన

వ్రాతములన్ గొలంకుల విరాజితరత్నదరీగృహంబులన్
బ్రీతిఁ జరింప నమ్మునిగరిష్ఠులు నిష్ఠలు దక్కరందఱున్.

క. మారుని కగపడక కులాచారాదులు నిర్వహించుసతులునుబురుషుల్
వేరు జగంబులఁ బుట్టనివారున్ దేహంబులేనివారున్ దక్కన్.

శా. ఆవిశ్వప్రభుఁ డర్కవంశమున మాయామానవాకారుఁడై
యావిర్భావమునొంది ప్రాకృతునియట్లయ్యో భువిం
దేవీదివ్యకళాంశమున్ జనకపుత్త్రింగూడి క్రీడించెడున్
బూవిల్కానికిఁ జిక్కి తక్కనజనుల్ పుష్పాయుధున్ గెల్తురే?

పండితులు నూతనవధూవరుల నాశీర్వదించు

శ్లో॥ కల్యాణదాయి భవతోऽస్తు పినాకపాణేః
పాణిగ్రహే భుజగకంకణ భీషితాయాః
సంభ్రాంతచిత్తసహసైవ నమశ్శివాయ
ఇత్యర్ధోక్తలజ్జితనతం ముఖమంబికాయాః

అను శ్లోకమందలి భావమునుగైకొని రాధామాధవకవి; కృత్యాదియందలి ౮ వ పద్యము నిట్లు రచియించియున్నాఁడు.

చ. పరిణయవేళయందు నిజభర్తృవిభూషణ శేషఫూత్కృతి
స్ఫురణఁ దలంకి కన్నొగిచి చూడఁగ నోడి నమశ్శివాయ యం
చరనుడి వాత సిగ్గువడి యానతకోమల మందహాసమం
దరవదనారవింద యగు తన్వి మహీధరకన్యఁ గొల్చెదన్.

శ్లోకమునందలి రసము పద్యమునఁ గన్పట్టకపోయినను మనోహరముగానేయున్నది.

(గ్రంథాంతమునం దీక్రింది పద్యము ముద్రితమైయున్నది. ఇది యెవరి రచనమో)

ఉ. సంతతభావశుద్ధియుత సంస్థితియున్ సదయ క్రియాపరి
శాంతియు సర్వలక్షణవిచారణయున్ ఫలియించె రాధికా
కాంతుఁడు ప్రాణవల్లభుఁడు గావునఁ బావనమూర్తియైన యీ
చింతలపూడి యెల్లకవిశేఖరు కోమల కావ్యకన్యకున్.

మాకుబంధువులును బరమమిత్రులును నగు కవిరాజ హంస బాలాంత్రపు వేంకటరావుగారు విష్ణుమాయానాటక కర్తృత్వమును గూర్చి యీగ్రంథము శ్రీనాథ విరచితమనియు ననంతయ్య ప్రణీతకవి యనియు నొక నూతనాభిప్రాయమును వెలిబుచ్చుచు, నాకుత్తరము వ్రాసియుండిరి.

౧. శ్రీనాథుని శైలిని బోలిన పద్యములిందనేకములుండుట.

౨. భీమఖండములోని తుల్యభాగ సర్పవరము గోదావరి మొదలగు వానివర్ణనములను బోలిన వర్ణనములిందుండుట.

౩. శ్రీనాథవిరచితమగు క్రీడాభిరామమునందును విష్ణుమాయానాటకమునందును గోవిందశర్మయుండి మఱియెచ్చటను లేకుండుట;

౪. శ్రీనాథుడు నందనందన చరిత్రమును రచియించెనని జనశ్రుతి యుండుట; ఈవిష్ణుమాయానాటక మదియేయని తలంచుట కవకాశ ముండుట.

౫. శ్రీనాథుడు ననంతయ్యయు, నేకనగరమందో, సమీపగ్రామములయందో నేకకాలముననుండుట.

౬. రాధామాధవకవి కాలమునాటికీగ్రంథము శ్రీనాథవిరచితమని యనుకొనుచుండిరని తలంచుటకవకాశముకలిగయుండుట మొదలగు ననేకహేతువులచే నీవిష్ణుమాయానాటకమును శ్రీనాథుడు రచియించి క్రీడాభిరామమువలెనే కర్తృత్వమును అనంతయ్యకొసంగియుండునని శ్రీ వేంకటరావు పంతులుగారియూహ.

ఈవిషయమింకను బరిశోధనీయము.

133 కుడిచెర్ల తిప్పరాజు

ఈతని చరిత్రమేమియుఁ దెలియలేదు. ఆంధ్రసాహిత్య పరిషత్తునందున్న యుదాహరణ గ్రంథములోనివని యీక్రిందిపద్యములు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రబంధ రత్నావళిలోఁ బ్రకటించియున్నారు. ఈపద్యములు కాంచీమాహాత్మ్యములోనివని యందు వ్రాయఁబడియున్నది.

గీ. అరుణమణిదీప్తు లంతంత నతిశయిల్ల
విమల శశికాంతరోచులు విస్తరిల్లఁ
గావ్యబుధగురు సంగతి గలిగిపురము
సూర్యసోమవీథులు కడు సొంపుమిగిలె

గీ. కనకభూధర శిఖరాను కారులగుచు
నాపురంబున నొప్పారు గోపురములు
సంతతాధ్వగమన పరిశ్రాంతులైన
చంద్రసూర్యుల విశ్రమస్థలములగుచు.

మ. జ్వలదగ్ని ప్రథమాన తేజుని భరద్వాజున్ వినిర్ధౌత వ
ల్కల భాస్వత్పరిధానుఁ బింగళ జటాలంకారుఁ గృష్ణాజినో
జ్జ్వల సంవ్యానుఁ దపఃకృశీకృతతనున్ శాంతాత్ము బ్రహ్మైకని
శ్చలచిత్తున్ విజితేంద్రియుం బ్రముదిత స్వాంతున్ గృపావంతునిన్

సీ. పద్మరాగ ప్రభాభాసుర పటలము
కాల సంధ్యారాగ లీలఁ బెనుపఁ
గాశ్మీర కనకనిర్మితదీప్తి యసమయ
బాలాతపస్ఫూర్తిఁ బరిఢవింప
హరినీలరుచులు గస్తురిప్రోవులును ననా
రంభ నీలాభ్ర విభ్రమముఁ జేయ
వజ్రమౌక్తిక హీరవాలుకాదీప్తులు
నిర్నిశాచంద్రిక నిర్వహింపఁ

గీ. జతుర బహువర్ణ పట్టవస్త్రప్రభాతి
నిర్జలదజాల సముదీర్ణ నిర్జరేందిర
బాపలక్ష్మి రచింపఁ బ్రశస్త (దీప్తి)
(వి) తతినొప్పారు నప్పురి విపణివీధి

సీ. మహనీయతర యాజమాన మంత్రంబులు
జపియించు ముఖచతుష్టయము దనరఁ
బావననవనీత పరిలేపనంబున
మెఱుఁగెక్కియున్న కొమ్మేను వెలుఁగ,
బహుచిత్ర మృదుసూక్ష్మ పక్ష్మశోభితమైన
హరిణాజినోత్తరీయంబు మెరయ
శ్రీవత్సలాంఛన శ్రీమూర్తి చింతన
సంభృతానంద బాష్పములు దొరుగ

గీ. శారదాదేవి, సావిత్రి, శ్రద్ధ, తుష్టి,
మఱియుఁ గుశసూత్రి కాంచిదామములు వెట్ట
నెమ్మిఁ గొలువంగ దర్భాసనమ్మమీఁదఁ
జూడనొప్పెఁ బితామహ సోమయాజి.

ఉ. సహ్యముఁ గాంచె వాజి పనస్సైరభ సామజ సింహగండకా
సహ్యము సిద్ధసాధ్య సురచారణ కిన్నరసన్మునీశ్వర
గ్రాహ్యము శృంగసంశ్రిత కిరాతవధూశ్రిత దివ్యయోషిదై
తిహ్యము నగ్రిభాసుఖితతిగ్మమయూఖర ఘోపవాహ్యమున్.

పైపద్యములలో భరద్వాజమాని వినుతుఁడగుటచే కావ్యకర్త గాని కావ్యభర్తగాని యాగోత్రీయుఁడేమోయని యూహకలుగుచున్నది. కాంచీమాహాత్మ్యమిప్పుడెచ్చటను దొరకుటలేదు. ఉదాహరణ గంథకర్త క్రీ.శ. ౧౫౬౦ ప్రాంతమువాఁడైయుండునని శ్రీప్రభాకర శాస్త్రిలువారు నిర్ణయించియుండుటచే సీకవి యంతకుఁ బూర్వుఁడనుట నిశ్చయము.

134 నాగలూటి శేషనాథార్యుఁడు

ఇతఁడు శ్రీపర్వతపురాణమను నాఱాశ్వాసముల పద్యకావ్యమును రచియించి శ్రీశైల మల్లికార్జున కంకితముచేసెను. ఇతఁడారాధ్య బ్రాహ్మణుఁడు. వీరశైవధర్మము ననుసరించి యీకవి తన కులగోత్రములను జెప్పకొనన నిష్టములేనివాఁడై యీగ్రంథమునఁ దననుగూర్చి

క. శివజన్ముఁడ శివగోత్రుఁడ
శివలింగధ్యానరతుఁడ శీలవ్రతుఁడన్
శివపూజాపరతంత్రుఁడ
శివయోగసుధానుభవుఁడ శేషాహ్వయుఁడన్.

అని చెప్పినాఁడు. ఎట్లో తనపేరును జెప్పకొనుటకంగీకరించుటచే నీతని పేరైన దెలియవచ్చినది. కాని యదికూడ శివనామములోఁ జెప్పినచో మనకీతఁడెవ్వరో తెలియక యీగ్రంథమొక యనామధేయ కవి ప్రణీతంబని చెప్పుకొనవలసివచ్చును.

ఈక్రింది పద్యమువలన నీతఁడువ్యాకరణశాస్త్రపండితుఁడనియు నిరుపమాన కవితాశక్తి కలవాఁడనియుఁ దెలియుచున్నది.

మ. ప్రణుత శ్రీగిరినాథలబ్ధకవితా ప్రజ్ఞాకళాభిజ్ఞుఁడన్
గణధృగ్గ్రంథ మతప్రయోగ విలుఠద్గాధార్థసంవేత్త ద
త్ప్రణిభాష్యాన్వయుత ఫక్కికాద్యర్థపదప్రౌఢీ సమాధాంకిత
ప్రణిపత్యస్ఫుట శబ్దశాస్త్రనివహప్రాముఖ్య పారీణుఁడన్.

ఈక్రింది రెండుపద్యములలో నీతఁడు సంస్కృతాంధ్రభాషలను జాతుర్యముగా వర్ణించియున్నాఁడు.

ఆ. భాషణలీలల దేశవి
భాషలుత త్తత్ప్రదేశ భాసురములగున్
భూషించు వస్త్రవర్ణను సు
భాషితమై సంస్కృతంబు బహుదేశములన్

చ. జనని సమస్త భాషలకు సంస్కృతభాష ధరాతలంబునన్
ఘనలలితార్థ గౌరవవికాసి తెనుం గభిరమ్య మంతకున్

గను(గొన(జూతబీజమునకం కురము గోమలపత్రిపుష్ప శో
భన మృదుపల్లవాభి నవబాలరసాలము సొంపునింపదే.

ఈకవిసత్తముఁడు కవిత యెటులుండవలయునో, ఈక్రిందిపద్య
ములలోఁ దెలిపి తదనుగుణముగఁ దన గ్రంథమును రచియించి
యున్నవాఁడు.

శా. చేతశ్శుక్తికయందునిల్చి కళలం జేకూడి శాస్త్రోదక
వ్రాతం బక్షరమూర్తి మౌక్తికములై వర్ధిల్లెడున్ సత్ప్రభు
ఖ్యాతోపేత గుణప్రయుక్తి సదలంకారాంగ హారాళి నా
రీతిన్ సత్కవి కూర్చునేర్చును బుధశ్రేణీగళాగ్రంబునన్.

ఈపద్యము మురారికవికృత యనర్ఘరాఘవమందలి యీక్రింది
శ్లోకమున కాంధ్రీకరణము.

శ్లో. చేతశ్శుక్తికయా నిపీయ శనైః శాస్త్రాద్విమృతానిక్రమా
ద్ధానైర్రక్షరమూర్తిభిః సుకవినా ముక్తాఫలైర్గుమ్ఫితాః
ఉన్మీలత్కమనీయనాయక గుణగ్రామోప సంవర్ణనా
ప్రౌఢాలంకృతయో లుఠన్తి సుదృశాం కంఠేషు హారస్రజః.

క. తెనుఁగైననేమి కవితా
జనితాలంకార చిత్రసంగత పదవ
ర్ణన వచన రచన చతురత
వినయోగ్యంబైన కృతియ విందురె మహాత్ముల్.

ఈకవి చిన్నతనమునుండియు శివభక్తుఁడనియుఁ దన గ్రంథ
రచనమునకు శివభక్తియే కారణమనియు నీక్రిందిపద్యములలోఁ దెలిపి
యున్నాఁడు.

శా. నావారున్ గడు చిన్నప్రాయమున "నోనామశ్శివాయ" యని
శ్రీవాయకు(లు జెప్ప నాటఁగోలె నే సేవింతు నీయాన నా
భావంబందున నిన్నె యెన్నుదును విభ్రాజద్భవద్భక్తి స
ద్భావజ్ఞాన సుధానుభావరతుఁగా భావింపు మల్లేశ్వరా!

మ. శివచారిత్రము బీజ మంకురము నీసేవావివేకంబు స
త్కవితాశ్రేణులు పల్లవంబులు సమాఖ్యా వ్రాతముల్ పుష్పముల్.

భవదీయస్తవముల్ ఫలావళులు సద్భావంబులే కీరముల్
భువి మత్కావ్యమహీరుహంబునకు శ్రీభూభృత్పురాధీశ్వరా!

కవిచరిత్రకారులీ కవిగృహనామము "నాగులూరి" యనియుం బేరు శేషనారాధ్యుండనియు నూటయేంబది సంవత్సరముల క్రిందట (క్రీ. శ. ౧౭౫౦) నుండి యుండుననియు వ్రాసియున్నారు. వ్రాంత ప్రతులయందును ముద్రితప్రతియందును నీక్రింది పద్యమున నాగలూటి యనియే యున్నది. ఇది కృత్యాదియందలిది.

శా. ఆస్ఫాలించిన దైత్యగర్వ తిమిరంబు బ్రాంతముం బాపెం ద
త్యుత్కృష్టతాసికనుఃకుఠార పరిఘప్రాసాది శస్త్రప్రభా
విస్ఫూర్తుల్ గరపంక్తుల న్నెలయంగా విశ్వామరత్రాణ శౌ
ర్యస్ఫారుండగు నాగలూటిపుర వీరస్వామిం గీర్తించెదన్.

ఇందలి 'పుర' శబ్దమునకు ముద్రిత ప్రతిలో 'చిన' అనియున్నది. కాని యది పొరపాటు.

కర్నూలు మండలమున నందికొట్కూరున కైదుమైళ్ల దూరమున నాగలూటి యను గ్రామమున్నది. అందు వీరభద్రేశ్వరాలయమున్నది. ఆయాలయమునకుం దూర్పుగోపురమును బొంతల నాగిశెట్టి యనునాతండు శా. శ. ౧౫౮౭ రక్తాక్షి సంవత్సరమునం గట్టించినట్లు వ్రాయించిన శాసన మొకటి నాగలూటిలోనే యున్నది ౧. నాగలూటిని సంస్కృతీకరించి కాంబోలు శాసనమున "లాంగలూటి" అని వ్రాసి యుండెను. కావునం గవిగృహనామము నాగలూటియనియు నాతని నివాసమాగ్రామమే యనియు నిశ్చయముగాం జెప్పవచ్చును. శ్రీపర్వత పురాణమున శ్రీశైల మాహాత్మ్యమే వర్ణితమైనది. శ్రీశైలముకూడ నందికొట్కూరు తాలూకాలోనిదే.

ఈకవి గ్రంథాంతగద్యలో శేషనాథార్యుండననియే చెప్పికొని యున్నాండు.

గద్య:— ఇది శ్రీ మల్లికార్జున కృపాలబ్ధ మేదురాష్ట్రభాషావిశిష్ట శివయోగి గుణవర్య శేషనాథార్య ప్రణీతంబైన శ్రీపర్వతపురాణంబు

౧. A. R. 63 of 1915.

నందుసర్గంబును షష్ఠమాశ్వాసము. గద్యయందలి శబ్దాలంకారమును బట్టి యీతనిపేరు శేషనాథార్యుఁడనియే నిర్ణయింపవలసియున్నది.

ఈగ్రంథమునఁ జాలభాగము శ్రీపర్వతముయొక్కయు నందలి వృక్షములు, నదులు, బిలములు, దేవతాగృహము మొదలగువాని యొక్కయు మహిమలు వర్ణితములై యున్నవి. ఇందలి నాల్గవయాశ్వాసమున నొక కథకలదు. చంద్రగుప్తుఁడను రాజునకుఁ జంద్రవతీదేవియను తనయ, యత్యంత సౌందర్యవతి కలదు. ఒకనాఁడామె మనోహరముగా నలంకరించుకొని, సఖీజనులతో సరససల్లాపంబు లాడుచు:—

గీ. పడఁతి నానారసప్రాయ భంగులందుఁ
భ్రాంధరీతుల గీతముల్ బాడ నృపతి
సూడ నంగజన్ముఁడు ప్రసూనశరము
వాడి గావించి నిగుడించి వంకదీర్చె'నఁట!

తండ్రిదనను:—

క. మోహించిన జనకవ్యా
మోహంబది దురితకర్మమూలంబని తా
నూహించి మగుడ తన
గృహ"బాహ్యదేశమున నిల్చెఁ దెరవలు దానున్"

చంద్రవతియది గ్రహించి:—

క. మదనుండు పాపకర్ముఁడు
మొదలున దర్పకుఁడు గాన మూర్ఖుఁడు గాఁడే
మదనాంతకు డెందంబున
పదిలంబుగ నిల్పి తండ్రిపగ సాధింతున్.

అని చెప్పి శ్రీశైలమున కేగి, యీశ్వరుని మల్లికా పుష్పములచే ననుదినమారాధింపుచుండ స్వామి ప్రత్యక్షమై వరంబుఁ గోరుకొమ్మని యానతీయ, మల్లికాపుష్పములచే నారాధితుండవై ప్రత్యక్షమైతివి. కావున నానామమును ధరింపుమని చంద్రవతి కోరెనఁట. అప్పటినుం

డియును దేవుఁడు మల్లికార్జుననామమును వహించెనఁట. ఈకథయుండు టనుబట్టి బ్రౌనుపండితుఁడీగ్రంథముపైఁ దనయభిప్రాయము నీక్రింది విధముగా వ్రాసియుంచినాఁడు.

"This volume contains two tales translated from the Schandapuranam, Probably that part called Sreesailakhandam, though this is not named It is a silly stupid book, utterly worthless, yet written by a man of learning and in a good style of poetry. The name of it is Sri Parvatapuranam"

"This poem the Parvatapuranam is written in classical and learned style but the story is a parcel of odds and ends. In the third canto a new tale commences regarding a father who is in love with his own daughter"

శ్రీపర్వతపురాణ కృత్యాదియందలి

ఉ. తత్తరపాటులో నిరులు దద్దయు మాన్పఁగఁజాలు కన్ను ను
వ్వెత్తున వేల్పుమూఁకలకు విందులు పెట్టెడుకన్నుఁ దమ్మియు౯
మొత్తమునత్త లచ్చికిని మున్మును బుట్టిన ముద్దుపట్టి మే
నెత్తిలఁజూచు కన్నుగల వేల్పుఁ గొల్తు నిచ్చలు౯.

అను పద్యమును బ్రబంధరత్నాకరమున రామామాత్యప్రెగ్గడ జగ్గన యుదాహరించి యుండుటచే నీశేషనాథార్యుఁడు పదునాలవ శతాబ్దికిఁ బూర్వుఁడనుట నిశ్చయము.

ఇతఁడు పాలకురికి సోమనారాధ్యుని గ్రంథములను బాగుగాఁ జదివి, యందలి భావములను దనగ్రంథమునఁ జేర్చుకొనినట్లుభయ గ్రంథములను జదివినవారికిఁ దెలియును.

శేషనాథార్యుని కవిత్వము ప్రౌఢమై మనోహరముగానున్నది. శైలితెలియుటకై ఆఱాశ్వాసములనుండియు నాలుపద్యములనిట నుదాహరించుచున్నాఁడను.

మ. కనియె౯ వ్యాసుఁడు వాగ్విలాసుఁడు సమగ్రప్రీతి మందాకినిన్
ఘనపాఠీనధురీణరత్నమకరనక్రాక్రాంతనిర్నిత్య ఖే
లన దేవేంద్రపురాంగనా కుచతటాలంకార కర్పూర చం
దనమందాకినిఁ జక్రవాకిని విశుద్ధన్యాయత శ్లోకిని౯. ౧ ఆ.

ఉ. పంకజగర్భవంద్య శివభక్త గణప్రియ! విన్నపంబు నా
వంకఁ గృపాసుధార్ద్రపరివృద్ధిత దృష్టి యొనర్చి నన్ను నీ
వెంకగణాళిలోన నొకవెంకనుగాఁ గృపఁజూడుమయ్య ని
శ్శంక వృషాంకకింకర వశంకర శంకర! శాంకరీప్రియా! ౨ ఆ.

శా. దుత్తూరంబులబిల్వహల్లకములన్ ద్రోణాది పుష్పంబులన్
దత్త ద్వేళల మల్లికార్జునిని యేధన్యుండు పూజించినం
దొత్తుల్ వానికి ముక్తికామినులు యస్తోకంబులైశ్వర్యముల్
బత్తుల్ పంకజసంభవాదులు దివోభాగ్య ప్రభావోన్నతుల్. ౩ ఆ.

చ. సుజనుఁడు శృంగముం గనినచూపులు ముక్తిపురీకవాటముల్
విజయవిలాసతం దెరుచు వీక్షణచాతురి యేమి చెప్ప నీ
త్రిజగములందు సద్భుతము దృష్టికవాటపు కుంచెకోలయో
గజదనుజాంతకుండు కడఁగట్టిన కీలకతంత్ర సూత్రమో. ౪ ఆ.

తాళవృత్తము:-

విపులహిరణ్యాం విశ్రుతపుణ్యాం వికసితకీర్తిం విలసితమూర్తిం
నిరుపమశక్తిం నిశ్చలభక్తిం ద్రవ్యపతిత్వం ధరణీశత్వం
కురుతేస్మృజలి కరోతివర్ధత్తే రచయతి వివిదాంత్యత్రప్రద
యతి ప్రధన విభావతి సంపాదయతి. ౫ ఆ.

ఉ. అత్యంతవ్రత లాద్యకందఫల దుగ్ధాహారకుక్షింభరుల్
నిత్యారాధకు లుంఛవృత్తి నిరతుల్ నీవార ముష్టింపచుల్
ప్రత్యక్షప్రమథుల్ ప్రబోధిత పరబ్రహ్మైవ వాచంయముల్
సత్యాత్మల్ కదళీ తపోధనవరుల్ షట్చక్రపారంగతుల్. ౬ ఆ.

భద్రకవి లింగకవి యీ శేషనాథార్యునిఁ బూర్వకవిగా నుతించి యుండుటచేతను లింగకవి, యచ్యుతదేవరాయల కాలమువాఁడని ఋజువగుట మూలమునను నీతఁడు, క్రీ.శ. ౧౫౦౦ ప్రాంతమువాఁడని నిరయించుటకు సంశయింపనక్కఱలేదు. ఇంకను గొంచెము ముందువాఁడైనఁ గావచ్చును. ఈకవినిగూర్చి యింకనేమయినఁ దెలియునేమో యని నాగబూటి కుత్తరములు వ్రాసితిని గాని యేమియుఁ దెలియరాలేదు.

135 ఘటశాసి మల్లుభట్టు

రామాప్రెగ్గడ జగ్గనకవి ప్రబంధరత్నాకరములో నీతని జలపాలి మహాత్త్వములోనివని మూఁడు పద్యముల నుదాహరించియుంచుటచే నీకవి నామము మనకుఁ దెలిసినది. ఇంతకంటె నీతని చరిత్రమేమియుఁ దెలియలేదు. ఈతని గ్రంథము కాలగర్భమునఁ బడిపోయినది. ఆమూఁడుపద్యముల నీక్రిందనుదాహరించు చున్నాఁడను.

సీ. అత్రిమునీశ్వరుం డడవి కేఁగినవేళ
హరిహరబ్రహ్మలు ధరకు వచ్చి
యనసూయవర్తనం బరయఁ దలంచి వా
రతిథులై యాహార మడిగినంత
యవుఁగాక యని వేగ నన్నపానాదులు
వడ్డింపఁ దలఁచుచో వారికోర్కి-
తప్పకుండఁ బతివ్రతాప్రభావంబున
నకలంక యగుచు బాలకులఁ జేసి
గీ. యంబరములూడ్చి సకల పదార్థములను
బాత్రములఁ బెట్టి తొంటిరూపము లొనర్ప
సంతసంబంది తత్తదంశముల సుతుల
వరములందె నయ్యాది పతివ్రతలమహిమ.
సీ. కచభర కృష్ణమేఘంబులఁ బ్రభవించు
మెఱుఁగుఁదీగలరీతి మేనులలర
వదనేందు దరహాస వరశరచ్చంద్రిక
లక్షీచకోరంబు లనుభవింప,
నతులసౌందర్యాబ్ధి కధరబింబద్యుతుల్
పవడంపుఁదీగెల బాగుమెఱయ,
బిగము గెల్వఁగ దక్షనగరంబు దొనసేసి
మరుఁడు దాఁచిన దివ్యశరములనఁగ

గీ. సరసలీలావలోకన చతురగతుల
నప్సరస్త్రీసమూహంబు లభ్యసింపఁ
బద్మినీజాతి ముఖ్యస్వభావములను
వన్నె మెఱయుదురప్సరివారసతులు.

సీ. ధవళాంగుఁడగు శంభుదత్త గర్భముగాఁగ
వసితదేహము పాండువర్ణమయ్యెఁ
బుత్త్రలాభానంద పూరిత కుక్షియై
యఖిలభక్ష్యములందు నరుచియయ్యెఁ
దెలులు వచ్చినఁజూచి సిగ్గుననున్నట్లు
పలుక నోపకయుండె నలసవృత్తిఁ,
దలిమరాళములకు గతి నేర్పుకైవడి
నళినాక్షి మందయానము వహించె,

గీ. హేమకలశాగ్రములయందు నింద్రనీల
రత్నములరీతిఁ దక్కుచాగ్రంబులందు
నలుపు సొంపార గర్భచిహ్నములుగలుగ
నతివతల్లికి సంతోషమావహిల్లె.

ఘడిశాసలవారు బ్రాహ్మణులలో కరణకమ్మశాఖలో నున్నారు. ఘటశాసి - ఘడిశాసలవారొక్కరో భిన్నులో తెలియదు.

ఏనుఁగు లక్ష్మణకవి పూర్వులలో జలపాలామాత్యుఁడున్నాఁడు. జలపాలేశ్వరునిబట్టి యతని కానామము వచ్చినది. ఏలూరున జలపాలేశ్వరుఁడున్నాఁడని తెలియుచున్నది. జలపాలి అనుగ్రామముండెనేమో తెలిసికొనవలసియున్నది. ఆమాహాత్మ్యములో సంబంధించిన కథలిందు వర్ణితములైనవేమో! ఉత్తరార్కాడు మండలమున జలనాథేశ్వరుఁడున్నాఁడు. కాని ఆయీశ్వరునకును నీగ్రంథమునకును సంబంధముండియుండదు.

రెండవపద్యమందలి "దక్షనగరము" ద్రాక్షారామమేమో!

---

136 కానుకొలను అన్నమరాజు

ఇతఁడు సంస్కృతమందలి అమరుకమను శృంగారకావ్యము నాంధ్రీకరించెను. ఇతనియాంధ్రామరుకమెచ్చటను కనఁబడుటలేదు. కామావెగ్గడ జగ్గన ప్రబంధ రత్నాకరమునందీ క్రింది రెండుపద్యములు దాహృతములయియున్నవి.

చ. చులుకన జాపముందిగుచుచోఁ గటకాముఖ పాణిమీఁదఁ బె
ల్లొలయు నఖాంశులం గదిసి యొప్పెడు కెంజిగురాకు గుత్తిచే
నలవడి కర్ణపూరమున నంటిన తుమ్మెదవోని పార్వతీ
లలన కటాక్షదృష్టి మనలం జరితార్థులఁ జేయుఁ గావుతన్

సీ. తమిరి రాశికి నెక్కి తిరుగు చక్రంబులు
మెట్టులఁ బదిలమై మెఱయుతేరు,
బహుముఖంబుల నేర్పు పచరించు సారథి
వ్రాసిచూపఁగరాని వారువములు
గట్టియై వీఁకనక్కఱఁదీర్పు విలుగమ్మి
శ్రుతిహితంబుగ మ్రోఁతచూపు నారి
విజయానుకూలమై విలసిల్లు బాణంబు
సరిలేని కోటు లసంఖ్యబలము

గీ. దనకు నబ్బుటయునుఁ బురత్రయముఁ గెలిచి
పృథులవిఖ్యాతిఁ గైకొన్నరథికవరుఁడు
జయముఁ దేజంబు భూతియుఁ బ్రియమెలర్ప
మనలఁ గరుణావిధేయుఁడై మనుచుఁ గాత!

ఈయన్నమరాజును అన్నమయ్య యనికూడ నందురు. అన్నమరాజు అనియే శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిలువారు ప్రకటించిన ప్రబంధ రత్నావళియందున్నది. అన్నమరాజని నామముండుటచేతను, కానుకొలనువారు నియోగి బ్రాహ్మణులలో నుండుటవలనను నితఁడు నియోగి బ్రాహ్మణుఁడని యూహింప నవకాశము కలుగుచున్నది.

ఇతఁడే కాలమువాఁడో ఎచ్చటివాఁడో తెలియదు. ప్రబంధ రత్నాకర కృతికర్త క్రీ.శ. ౧౫౬౦ ప్రాంతమువాఁడు. కావున అన్నమ రాజుకవి యంతకుఁ బూర్వుఁడనుట నిశ్చయము. పై నిరుదాహరించిన రెండుపద్యములును అమరుక కృత్యాదియందలి పద్యములవలెఁ గన్పట్టుచున్నవి.

కానుకొల్లు అనుగ్రామము కృష్ణామండలములోనున్నది. ఆగ్రామమునుబట్టి యీకవి గృహనామ మేర్పడినదని చెప్పఁజాలము. "కానుకొల్లు" అను నింటిపేరుగల నియోగిబ్రాహ్మణులు వేలుగఁ గృష్ణామండలములో నున్నారు. వారు భారద్వాజ గోత్రులు. వారి గృహనామ మాగ్రామమునుబట్టి వచ్చియుండును 'కానుకొలను' అను గ్రామమెచ్చటనున్నదో తెలియదు. ఈయన్నమరాజునుగూర్చి శ్రీనిడదవోలు వేంకటరావు పంతులు ఎం. ఏ. గారిట్లు వ్రాసియున్నారు. ౧.

"ఈయన్నమరాజు క్రీ.శ. ౧౪౯౪ లో నున్నట్లీక్రింది శాసనము వలనఁ దెలియుచున్నది. శ్రీగణాధిపతయేనమః. శ్రీజయాభ్యుదయ శాలివాహన శకవర్షంబులు ౧౪౧౬ అగు నేంటి ఆనందసంవత్సర శ్రావణ బ ౧౦ ఆ రోహిణీనక్షత్ర తులాలగ్నమందు యజన యాజనాధ్యయన అధ్యాపక దానప్రతిగ్రహషట్కర్మనిరతులైన యజుఃశాఖ ఆంగిరస, బార్హస్పత్య భారద్వాజ గోత్రులైన కానుఁగొలని సూరపరాజు అన్నయ్యకొడుకు అన్నమ్య(ను) శ్రీతుంగభద్రాతీరం భాస్కర క్షేత్రమందుల శ్రీ పంపావిరూపాక్ష దేవండు ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధి అగునట్లుగాను ఆచంద్రార్క పర్యంతం రక్షిం(చు)సు. మంగళంమహా శ్రీ శ్రీం జేయుః. (దక్షిణహిందూదేశ శాసనసంపుటములు ౪ సంపుటము. నెం ౨౭౧ రు, ౭౮ పుట హంపీక్షేత్రశాసనములు) ఇందు పేర్కొన్న భాస్కరక్షేత్రము గుత్తి ప్రదేశము.

---

౧. భారతి. సంపుటము ౧౬ పుట ౨౧.

ఈశాసనమునఁ జేర్కొనఁబడిన అన్నయ్యయే అన్నమరాజు. ఈతనితాత సూరపరాజు నామమీ విషయమును స్పష్టముచేయుచున్నది. మఱియు నీతఁడాపస్తంబసూత్రుఁడనియు, భాస్కరక్షేత్రవాసియనియు తెలియుచున్నది. కాముంగోలనే 'కానుకోలను అయినది. ఈఅన్నమ రాజు పద్యము త్రిపురాంతకదేవునిగూర్చి నది ప్రబంధరత్నావళిలో కలదు. (ఇది పైనివ్రాసిన సీసపద్యమే) శతక కవులచరిత్రలో (పుట ౪౪౬) 'కానుకోలను నాయనప్ప' అని కలదు. అతనిగూర్చి ప్రకటితములైన వివరములు తెలియవు."

కాముంగోలనువారు కానుకోలనువారైరనుటకొక్క ప్రతిబంధకమున్నది. కృష్ణామండలములోని కానుకోలనువారు శ్రీవత్ససగోత్రులు కానుకోలనువారిలో భారద్వాజ గోత్రులున్నారని ధ్రువపడిననేతప్ప కాముంగోలనువారే వీరని చెప్పుట కవకాశములేదు. ఈశాసనమును కానుకోలనువారి కనువర్తింపఁ జేయవీలులేదు.

కాముంగోలను అను గ్రామమునుబట్టి కాముంగోలను అను గృహనామము వచ్చియుండునని తోఁచుచున్నది. కాని యాపేరిటి గ్రామ మెచ్చటనున్నదియో తెలిసినదికాదు. కాముగోలను అను నింటిపేరుగలవారు వేరుగా నున్నట్లు తెలియుచున్నది. ఆంధ్రసాహిత్య పరిషత్తునందున్న యోబనామాత్యకృత కృష్ణార్జున సంవాదమునకుఁ బ్రతి వ్రాసిన బిళేఖరి కాముకోలను సాంబయ్యయని యందువ్రాసియున్నది. కావున నీవిషయమింకను బరిశోధనీయము.

ఈతని పద్యములను రామాప్రగ్గడ జగ్గన ప్రబంధ రత్నాకరమునందుదాహరించియుండుటచే నీయన్నమరాజకవి క్రీ.శ. ౧౫౦౦ ప్రాంతమునందున్నవాఁడని నిశ్చయింపవచ్చును. కృష్ణామండలములోని కానుకోలనునందు అన్నమరాజు వృత్తాంతము తెలిసికొనవలయునని ప్రయత్నించితిని కాని యదిలభింపలేదు.

137 ఎడపాటి యెఱ్ఱనకవి

ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; సోమయామాత్య పుత్రుఁడు. కౌండిన్యగోత్రుఁడు;

ఈకవి మల్హణ చరిత్రమను మూఁడాశ్వాసముల శృంగార ప్రబంధమును రచించి, చుండి కాళయమంత్రి కంకితముచేసెను. కృతి పతి కవినిగూర్చి యాడిన పలుకులుగా రచింపఁబడిన యీక్రిందిపద్య ములువలనఁ గవివృత్తాంతము కొంత తెలియుచున్నది.

క. శివభక్తినిధివి, మంత్రివి
కవితాభిజ్ఞుఁడవు నిత్యకారుణ్య మహో
త్సవుఁడవు కౌండిన్యకులో
ద్భవుఁడవుఁ గడుఁగూర్చినట్టి బంధుఁడవనఘా!

ఉ. పాటిగలట్టిమేటి యెడపాటి పురాధిప! యెఱ్ఱనార్య!
నీసాటిగఁ జెప్పినట్టికృతి సాటువమై విలసిల్లుఁగా కిటుల్
జాటుచు హీనమానవుల చాటున మాటున వ్యర్థకూటకా
ర్పాటకథల్ వినంగ నగుబాటగుఁగాక రుచింపనేర్చునే!

క. మలహరు భక్తులలోపలఁ
బొలుపుగ నుతికెక్కి జగతిఁబూజ్యుండగునా
మలహణుకథ నాపేరిటఁ
జెలువుగ నంకితముచేసి చెప్పఁగవలయున్.

కవి ఎడపాడు గ్రామకరణమయినట్లు పైయుత్పలమాలనుబట్టి తెలియుచున్నది. ఈయెడపాడు గ్రామమునుబట్టియే కవిగృహనామ మేర్పడియుండును. ఈగ్రామ మెచ్చటనున్నదియుఁ దెలియలేదు. కొందఱు కవిగృహనామము "పెదపాటి" యని యనుచున్నారు. కాని తాళపత్రప్రతియందును ముద్రితప్రతియందునుగూడ "ఎ డ పా టి" అనియే యున్నది. కవితండ్రి సోమయామాత్యుఁడయిన ట్లీక్రింది గద్యవలనఁ దెలియుచున్నది.

"గద్య. ఇది శ్రీమత్సకలసుకవిమిత్రి సోమయామాత్య పుత్రసరస కవితాధుర్య యెడపాటి యెఱ్ఱనార్యప్రణీతంబైన మల్హాణ చరిత్రంబు"

కవినిగూర్చి యింతకన్న నేమియుఁ దెలియరాలేదు. ఈతఁడు కుమారనైషధమను మఱియొక ప్రబంధమును రచించినట్లందలి కొన్ని పద్యములను జగన్నాథకవి తన ప్రబంధరత్నాకరమున నుదాహరించి యుండుటచేఁ దెలియుచున్నది. కాని యాగ్రంథమిప్పుడెచ్చటను లభించుటలేదు. జగన్నాథకవి, మల్హాణ చరిత్రమును, గుమారనైషధమును రచించిన కవుల నామములు పెదపాటి ఎఱ్ఱాప్రెగడ యనియే వ్రాసియున్నట్లు శ్రీప్రభాకరశాస్త్రిలువారు ప్రకటించిన ప్రబంధరత్నావళిలోఁ గన్పట్టుచున్నది. మల్హాణ చరిత్రి రచించిన కవి యింటిపేరు ఎడపాటియైనచోఁ గుమారనైషధమును రచించిన కవి గృహనామము కూడ ఎడపాటియని మార్చవలయునా? లేక "పెదపాటి" యనియే భావించి, యీగ్రంథకర్తలిరువురును భిన్నులని భావింపవలయునా? యను ప్రశ్నయుదయించుచున్నది. పెదపాటివారిలోఁ గవులున్నారు. కవిబ్రహ్మ బిరుదాంచితుఁడగు సోమయ్య గృహనామము పెదపాటియే. గోదావరిమండలమందలి యేలూరు తాలూకాలో నొక పెదపాడుకలదు. అందిప్పుడు పెదపాటివారితర కులములవారున్నారు. కాని నియోగి బ్రాహ్మణులులేరు. పెదపాటియను నింటిపేరు గలవారు నియోగి బ్రాహ్మణులలో నీప్రాంతములయందున్నారు. వారు శ్రీవత్స సగోత్రులు. మల్హాణ చరిత్రి కర్తకౌండిన్యగోత్రుఁడు. పెదపాటి వారిలోఁ గౌండిన్యసగోత్రులున్నారని ఋజువగువఱకును మల్హాణ చరిత్రి కవిగృహనామము పెదపాటి యని తలంపవీలులేదు. మల్హాణ చరిత్రి కృతిపతి నెల్లూరి మండలములోని చుండిగ్రామ నివాసుఁడు. ఆతఁడును గ్రంథకర్తయుఁ గడుఁగూర్చునట్టి బంధువులు. గోదావరి మండలవాసునకు నెల్లూరి మండలనివాసునితో బంధుత్వము కలియుట యాకాలమున నసంభవముకాకపోయినను దుర్ఘటము. కావున నెఱ్ఱాప్రగడ నివాసమేలూరు తాలూకా పెదపాడని నిర్ణయింపరాదు.

మల్హణచరిత్ర కుమారనైషధకర్తలనామ యెఱ్ఱాప్రెగ్గడయే. అందొకరు ఎడపాటివారగుటయు నింకొకరు పెదపాటివారగుటయుఁ గాకతాళీన్యాయము కావలయును. అది యెప్పుడోగాని సమకూడదు చాల అరుదుగా సంభవించెడి ఘటనముపై నాధారపడి వారిరువురును భిన్నులని యనుటకంటె ఏకవ్యక్తియే (ఎడపాటి యెఱ్ఱాప్రెగ్గడయే) యీరెండు గ్రంథములను రచించెనని నిర్ణయించుటయే లెస్స.

కర్నూలు మండలమునఁ బెద్దపాడు గ్రామమొకటియున్నది. ఆగ్రామమునకును నీగ్రంథకర్తకు నేమయిన సంబంధమున్నదేమో తెలిసికొనవలసియున్నది. ప్రబంధరత్నావళీ కర్త యింటిపేరు పెదపాటివారని తలంచి యీకవిని పెదపాటి యెఱ్ఱయని తలంచుచున్నారు. ప్రబంధరత్నావళిని సమకూర్చిన యాతని యింటిపేరు "రామామ్రెగ్గడ" కాని పెదపాటి కాదు. పెదపాడు నివాసుఁడగుటచేఁ బెదపాటిజగ్గన యని వాడుచున్నారు.

ఈకవి మల్హణచరిత్రమును గృష్ణరాయ ప్రభున కంకితమీయక దాఁచియుంచిన ట్లీక్రిందిపద్యములోఁ జెప్పియున్నాఁడు.

ఉ. ఇట్టిమహాప్రధాన పరమేశ్వరమూర్తివి గాన నీవు చే
పట్టితి, మేలుచుండిపురిపాలక! కాళన మంత్రిచంద్ర! ముక్
నట్టిగఁ గృష్ణరాయజనకాంతున కీయక దాఁచినట్టి యీ
రట్టడినైన యెఱ్ఱకవిరాజిత మల్హణ కావ్యకన్యకన్.

యీకావ్యమును గృష్ణరాయలకీయక యేల దాఁచినాఁడో తెలియదు. కాని కవి యీగ్రంథమును గృష్ణరాయల కాలములో రచించినట్లీ పద్యమువలన స్పష్టమగుచున్నది. ఈకృష్ణరాయలు ఆంధ్రభోజుఁడని కీర్తివహించిన కర్ణాట ప్రభువగు తుళువ కృష్ణదేవరాయలనియే యూహింపఁదగియున్నది. అది సత్యమయినచో నాతఁడు శాలివాహనశకము. ౧౫౦౮–౧౫౩౦ సంవత్సరముల నడుమఁ గర్ణాటక రాజ్యము నేలినవాఁడు కావున నీకవియున్నప్పటివాఁడని చెప్పుటకు సంశయమక్కఱలేదు.

ఈకృష్ణజనకాంతుఁడు శ్రీకృష్ణదేవరాయలు కాక మఱియొక కృష్ణభూపాలుఁడైనచోఁ గాలము మారును. కాని గ్రంథములను గృతినొందు నభిలాషకలవారా కాలమునఁ గన్పడుటలేదు. నంద్యాల కృష్ణమరాజగునేమో యని మల్హణ చరిత్ర పీఠికాకారులూహించినారు. నంద్యాల కృష్ణమరాజు లిరువురున్నారు. వారిరువురునుగూడ క్రీ. శ. ౧౫౦౦–౧౫౬౦ నడుమనున్నవారు. నంద్యాల కృష్ణమరాజయినను గవికాలములో విశేషభేదముండదు. పీఠికాకారులు "ఎట్లయినను, ఇందలి చుండికాళ్ళుఁడు పదునారవ శతాబ్దమునకు చెందినవాఁడు **మాత్రము కాఁడు. 17 వశతాబ్దమున నుండియుండవచ్చును."** అని పీఠికలో వ్రాసియున్నారు. కాని వారియూహల కాధారముల నిచ్చియుండలేదు. ప్రబంధరత్నావళీ కర్త క్రీ. శ. ౧౫౮౦ ప్రాంతమువాఁడని శ్రీప్రభాకరశాస్త్రిలుగారు నిర్ణయించియున్నారు. అతఁడీకవి గ్రంథములనుండి పద్యములను గైకొనియుండుటచే నీకవియంతకుఁ బూర్వుఁడై యుండునుగాని తరువాతివాఁడు కాఁజాలఁడు. చుండి సంస్థానాధిపతికడ నీకృతిపతి యుద్యోగస్థుఁడని పీఠికాకారులు వ్రాసిరి. కాని యందులకాధారము లేదు. చుండిగ్రామమునకుఁ గరణమైనట్లు చుండిస్థల కరణచంద్ర! యను వాక్యమువలన స్పష్టమగుచున్నది.

చుండి సంస్థానము క్రీ. శ. ౧౫౦౦ ప్రాంతమునుండి కామినేని వారిక్రింద నుండినట్లును అంతకుఁబూర్వము కర్ణాటక ప్రభువులక్రిందను రెడ్డిప్రభువులక్రింద నున్నట్లును గన్పట్టుచున్నది. కృతిపతి గోత్ర సూత్రములను గవి యీగ్రంథమునం దెచ్చటను జెప్పలేదు. ద్వితీయాశ్వాసాది పద్యములో "శ్రీమహిత వేద్యవాటీమందిర" యను సంబోధనమున్నది. ఈవేద్యవాటి యెచ్చటిదో! చుండిలో నొకభాగమేమో! తెలియదు.

కృతిపతియైన కాళ్ళయామాత్యుఁడు రామయమంత్రి సోమాంబల కుమారుడు. కృతిపతి భార్య పిస్సమాంబ. కవి కృతిపతిని వర్ణించిన వానిలో రెండు పద్యముల నీక్రింద వ్రాయుచున్నాఁడను.

ఉ. ఇమ్మహిఁ గల్గు మంత్రుల ననేకులఁ జూచితి మేము వారు మో
దమ్మున నిచ్చినట్టి ధనధాన్యయుతంబగు దొడ్డయీవియున్
సమ్మతితోడ నీవొసఁగు సారపుఁగప్రపువీడియంబు తు
ల్యమ్మగుఁ జుండిపాలన! దయాకర! కాళన మంత్రిశేఖరా!

సీ. పరకాంతఁ జూడఁడు పైత్రోవఁ జూచెనా
వర్ణించు మఱి కానివానిఁ గాను
తలఁచు మాటాడఁడు తగుచోట నాడెనా
యది బ్రహ్మపదము శిలాక్షరంబు
తలమెఱుంగక యీఁడు తగమెచ్చియిచ్చెనా
చాలు నర్థికి జన్మజన్మములకు
మనసీక నిల్పఁడు మదినిచ్చి నిల్పెనా
యది విభీషణపట్టమచ్యుతంబు
రక్షరాష్ట్రమునకును శ్రీరామరక్ష
యాజ్ఞ సుగ్రీవునాజ్ఞగాఁ నడఁచె రిపులఁ
బుణ్యవంతుఁడు సద్గుణ భూషణుండు
చుండిరామయ కాళఁ డఖండ యశుఁడు.

నెల్లూరు మండలమందలి చుండి గ్రామమున కిప్పటికిని 'చుండి' వారే కరణములుగా నున్నారు. వీరాఱువేల నియోగులు. కౌశికగోత్రులు. యజుశ్శాఖ. కాళయమంత్రి వీరిపూర్వుఁడని నిశ్చయించుటకు సంశయము నొందఁబనిలేదు.

శివప్రభావమును దెలుపు కథ యిందు వర్ణితమయినది. కల్యాణపురమున యజ్ఞదత్తుఁడను బ్రాహ్మణునకు లేక లేక పరమేశ్వరప్రసాదమున మల్హణుఁడను కుమారుఁడు కలిగి విద్యానిధియను పండితునియొద్ద సంగీత సాహిత్యాది విద్యలఁ బ్రాజ్ఞుఁడయ్యెను. ఆపురమున మదనసేనయను వేశ్య తన తనయ యగు పుష్పగంధి నాగురువునొద్దనే విద్య నభ్యసింపఁ జేర్చెను. మల్హణ పుష్పగంధులు సమవయస్కులై సంపూర్ణముగ విద్య నభ్యసింపుచు యుక్తవయస్సురాఁగా నన్యోన్య ప్రేమచే

బద్ధులై భార్యాభర్తలవలె వినోదముగాఁ గాలము గడుపుచుండ, వేశ్యమాత, వారి ప్రేమమున కడ్డుతగిలి ధనాశచే నాపురమందలి యొక వైశ్యునిచే విశేషధనమునుగొని కూఁతు నాతనిఁగూర్ప యత్నించి, మల్హణుని తన యింటికి రాకుండఁ జేసెను. వైశ్యుఁడరుదెంచిన నాఁటి రాత్రి పుష్పగంధి యాతనితోనుండ నిష్టములేక మాటలతోఁ గాలయాపనము సేయుచుఁ దమలపునీరుమియుటకై యివ్వలకువచ్చి యుమియ నది పుష్పగంధి మాటలను వినుటకైవచ్చి వీధియరుగుక్రింద నిలుచుండి యున్న మల్హణునిపైఁ బడియెను. ఇంతలో మెఱుపుమెఱయనా కాంతి వలన మల్హణు నెఱింగి పుష్పగంధి, యాతనికి నమస్కరించి క్షమింప వేఁడి, వారిరువురకును శాశ్వతానుబంధ మొనఁగూడున ట్లీశ్వరునిఁ బ్రార్థింపుమని ప్రోత్సహించి యిరువురు నూరిబయటనున్న శివాలయమునకుఁ బోయిరి. మల్హణుఁడు పుష్పగంధితో "నాహృదయము నిన్నువీడి యీశ్వరునిమీఁదకు బోవుటలేదన నట్లయినచో నేను నిన్నుఁ గాఁగిలించుకొని నీవెనుకవైపున నుండెదననియు నీశ్వరుని బ్రార్థింపుమనియుఁ జెప్పి పుష్పగంధియట్లుచేయ మల్హణుం డేకాగ్రచిత్తుఁడై యీశ్వరునిఁ బ్రార్థింప నాదేవుఁడు ప్రత్యక్షమై మల్హణ పుష్పగంధులకును, వారు పెంచిన చిలుకకును, వేశ్యమాతకును, మల్హణుని జననీజనకులకును గైవల్యము నొసంగిన కథ యిందు వర్ణింపఁబడినది. ఇందఱకు గైవల్యమిచ్చిన యీశ్వరుఁడెందుచేతనో వైశ్యోత్తమునకుమాత్రము కైవల్యము నీయనందున నాతఁడు భయభ్రష్టుఁడైనాఁడు.

ఈగ్రంథమున నింకొక యుపకథయున్నది. అదియుఁగూడ నిట్టిదే. ఈకథోపకథలు పాలకురికి సోమనాథుఁడు రచించిన పండితారాధ్య చరిత్రమున నున్నవి. వానినే, ఎఱ్ఱనకవి పెంచి మూఁడాశ్వాసముల కావ్యముగా రచించినాఁడు. గ్రంథమున శృంగార వర్ణనములు కొంత పచ్చిగానున్నను, నీతిని బోధించు పద్యములుకూడ నందందు లేకపోలేదు. ఇకారసంధులు మొదలుగాఁ గొన్ని వ్యాకరణ దోషములున్నను మొత్తముమీఁద నీతని కవిత్వము మృదు మధురపదగుంభితమై

మనోహరముగా నున్నది. కవిత్వశైలి తెలియుటకై కొన్నిపద్యముల నిట నుదాహరించుచున్నాఁడను.

చ. ఎక్కడిబాపనయ్య! యితఁడిక్కడ వచ్చుచునున్నవాఁడు దా
నిక్కమె సాధుఁబోలి తననెయ్యముఁ దియ్యము చాలుఁజాలు నీ
చక్కటిఁజేరనీయకుఁడు జాడఁజలింపఁగ నీతఁడెంతయున్
వెక్కస మైనచేఁత లిఖివిన్నను నాపదిఁ గోపమయ్యెడున్. ౧ ఆ

క. మగవాని చిత్తమంతయు
నిగురొత్తఁగఁజేసి వేఁటయిఱ్ఱియపోలెన్
దగిలింపక తాఁదగిలిన
మగువెంతయు సొంపుచెడి యమాన్యత నొందున్. ౨ ఆ

ఉ. వేయునునేల నామనసు వేడుక మ్లాణు మీఁదగాని యో
తోయజగంధి! యన్యునెడఁ దూకొని రోయుచునుండు నందన
చ్ఛాయలఁ గల్పక ప్రసవసౌరభమానుచుఁ జొక్కు మక్కువం
బాయనితేఁటి హేయమగు ప్రిబ్బలిపూవుల కాసనేయునే ౨ ఆ

గీ. దద్దరముచేత నాచులోఁ దమ్మివిరిని
నున్నయొలతేఁటిపైఁ దేనె యొలికినట్లు
మలహాణునిమీఁదఁ బడియె నాజలకణములు
మదన సంతాపవహ్నికి మాటుదోఁప. ౩ ఆ

చ. అటువలె నుంటివేని, జలజాసన! యేనును నాదిభోగిధా
ట్కటకు సుమాకళత్రు శితికంధరు సన్నుతి చేసి నీదుముం
దటనట మెచ్చు చేకొనియెదన్ విను నావుడు నింతి యట్లకోఁ
గిటఁ గదియించె భక్తిఁబలికించె శివున్ నుతియించె నాతఁడున్.

కుమారనైషధమందలి కథ నలచరిత్రమే యైయుండును. ఇందలి ౧౬ పద్యములు ప్రబంధ రత్నావళియందుదాహృతములైనవి. వానిలో గొన్నిఁటి నీక్రింద నుదాహరించుచున్నాఁడను.

సీ. అల్లరెడు తెప్పలల్లార్చినయందాఁక
నవిమిషకన్యఁ గాదనఁగ వశమె?

యమృతంబు చిలుక మాటాడినయందాఁక
గనకంపుఁబ్రతిమ గాదనఁగ వశమె?
నడుఁగక యడుగెత్తి నడచినయందాఁక
గొనబు పూఁదీగె గాదనఁగవశమె?
కలికితనూరేఖఁ గదిసి కన్గొనుదాఁక
ఘనవనలక్ష్మి గాదనఁగ వశమె?
గీ. యువిద సఖిమీఁద వెడవ్రాలియున్నదాఁక
నొనరు తొలుకారు మెఱుఁగు గాదనఁగవశమె?
వెలఁదిగుణములు సఖులచే వినినదాఁక
నంగసంభవుమాయ గాదనఁగ వశమె?
సీ. ఈశుచేఁగాంచి సాహిత్యవిద్య ధరిత్రి
నిల్పినయట్టిపాణిని భజించి,
శ్లోకార్థమునఁ జంద్రజూటు మెప్పించి యి
ష్టార్థముల్గొన్న మల్హణు నుతించి,
గద్యంబు చెప్పి శంకరునిచేఁ గరములు
ప్రతిభతోఁ బడసిన బాణుఁదలఁచి
శతకంబుఁజెప్పి భాస్కరుని మెచ్చఁగఁ జేసి
యురుదేహుఁడైన మయూరుఁ గొలిచి
గీ. భవుని మెప్పించి కన్నులు పడసితెచ్చి
వనితకిచ్చిన కాళిదాసునకు మ్రొక్కి
హరుని వినుతులచే బాసలాడఁజేసి
నట్టి భట్టుని నన్నయభట్టుఁ బొగడి.
సీ. మన్మథ దివ్యాగమమున కోంకారంబు
భూతేశు నొదల పువ్వుదండ
యల్లుశృంగార రేఖాగ్రళకుంచిక
యధికత మోదంతి కంకుశంబు
విరహిణీజనమర్మవిచ్ఛేద కర్తరి
యంబరక్రోడదంష్ట్రాంకురంబు

తారకామౌక్తికతతికి సంచితశుక్తి
దగునంబునిధికి ముత్యాలజోగు

గీ. మారు పట్టాభిషేకార్థవారికుంభి
చిత్తజునికోట లగ్గడంచెనపుగుండు
నాఁగనానాఁటి కభివృద్ధి నారుకొనిన
చంద్రుఁడుదయించెఁ గాంతినిస్తంద్రుఁడగుచు.

చ. కలసి యొకళ్లొకళ్లు కనుగందని వేడ్కలఁ జూచువేళ నె
ప్పులు మఱువయ్యనే నవియ పాయుట, తత్సుఖపారవశ్యులై
పలుకకయుండుటే యలిగి పైకొనకుండుట, యంతెకాని లో
య్యలియు విభుండు బాయుటయు నల్గుట నాఁగనెఱుంగ రెన్నడున్

సీ. కొమరువెన్నెలమోసు నవలి ప్రాణేశ్వరు
కొసంగి యింపొనరించు నొకచకోరి,
పరపువెన్నెల గుజ్జుబంతెన గూళ్ళాడు
నోలినెచ్చెలులతో నొకచకోరి
పాకైనవెన్నెల తేటకేళాకూళి
నోలలాడుచునుండు నొకచకోరి
గట్టివెన్నెల చల్దిగాఁ గట్టి వల్లభు
నుడు రాజుకడ కంపు నొకచకోరి

గీ. చేగవెన్నెల క్రొవ్వు భుజించి విందు
లొనరఁ జేయును జుట్టాలకొకచకోరి
పండువెన్నెల మేర్పఱచి పతికి
నుబ్బుగానిచ్చు వేకువ నొకచకోరి.

సీ. పులు సొట్టి చేఁదు నుప్పును దీపు నొగరును
గణుతింప భాగాధికములు గాక,
వీముడంగఁ బొఱక చిక్కనై యిగురక
కాఁటువోవక మఱికలఁతవడక,
యుడికియు నుడుకకయుండి నిక్కమ్మాక (?)
పసరువేయక పరిపాటి చెడక,

సంబారములతోడి సంబంధ మెడలక
పోగుధూపవాసన విరిపోటుగాక,
గీ. వింతలై జిహ్వకును రుచుల్విస్తరిల్లఁ
దగు పదార్థంబు లెడనెడఁ దాము తామ
భోక్తలకు భోజనాసక్తిఁ బొడమఁజేయ
నిండు వేడుకఁ గూరలు వండనేర్తు

ఈపద్యము నలుని పాకవర్ణనముగానోపు. ఈగ్రంథము లభించె నేని కవివృత్తాంతమింకను గొంత తెలియును.

---

138 బొడ్డపాటి పేరయకవి

రామాప్రెగ్గడ జగ్గనకవి సేకరించిన పద్యములనుబట్టి యీతఁడు కవిమోహనియు, అనంతమహాత్త్వము, పద్మినీవల్లభము, మంగళగిరి విలాసము, శంకరవిజయము, సూర్యశతకము, అనుగ్రంథములను రచియించినవాఁడనియుఁ దెలియుచున్నది. మంగళగిరి విలాసమును రచియించినవాఁడగుటచే నీకవి కృష్ణామండలములోనివాఁడనుట నిశ్చయము. కృష్ణామండలములో బెజవాడకు సమీపమున బొడ్డపాడను గ్రామమున్నదనియు, నందు బొడ్డపాటివారాక్వేల నియోగులున్నారనియు, శతక కవుల చరిత్రకారులు వ్రాసియున్నారు. మరికొన్ని ప్రదేశములలో బొడ్డపాటివారు వెలనాటి వైదికబ్రాహ్మణులును గలరు. కవికాలము తెలియదు. కాని క్రీ. శ. ౧౫౬౦ కిఁ బూర్వుఁడనుట నిశ్చయము. ఈతని గ్రంథములలో నొక్కటియు నిపుడు కన్పించుటలేదు. ప్రబంధ రత్నాకరములోనివని, యీక్రింది పద్యములను శ్రీప్రభాకరశాస్త్రులుగారు ప్రబంధ రత్నావళిలోఁ బ్రకటించియున్నారు.

అనంతమహాత్మ్యము :—

సీ. తన యనురాగాభ్యుదయమూర్తి పద్మినీ
సతికిని ముఖవికాసంబొనర్పఁ
దనదుర్నిరీక్ష ప్రతాపవైఖరి యరి
తమముల గిరిగుహాంతములఁ దార్పఁ
దనకరవిదళిత దానధారాశక్తి
కలయలోకులకు నాకండ్లుదీర్పఁ
దనదు మిన్నందిన ఘనతరైశ్వర్యంబు
నకు విబుధాళి సన్నుతులొనర్పఁ

గీ. దేజరిల్లెడు రాజన దినదినంబు
మూఁడుమూర్తుల జనులచే మ్రొక్కఁగొనెడు
పద్మినీవల్లభుని నాదుపాలివేల్పు
భక్తసులభునిఁ గొల్తు హృత్పద్మమలర.

పద్మినీవల్లభము:—

సీ. కమలాకరస్ఫూర్తి కాసారములయందుఁ
దమయందుఁ గలుగంగఁ దనరుచుండు
గంభీర జీవనక్రమ మగర్తులయందుఁ
దమయందుఁ గలుగంగఁ దనరుచుండు
ధారావిహారముత్తమ తురంగములయందుఁ
దమయందుఁ గలుగంగఁ దనరుచుండు
సుమనోవికాసంబు ప్రమదావనములందుఁ
దమయందుఁ గలుగంగఁ దనరుచుండు
దానమహిమ సముత్తుంగ దంతులందుఁ
దమకరంబులఁ గలుగంగఁ దనరుచుండు
సిరుల సంతోషమున ముఖ్యశీలవృత్తి
రణజయౌదార్యములఁ బురి రాజకులము.

సీ. గజముల నడలుఁ దత్కరముల బిగువుఁ ద
త్కుంభగౌరవములుఁ గూర్చి కూర్చి

జలజస్ఫుటములుఁ దచ్ఛద విభ్రమములుఁ ద
త్కేసర సురభులు గిలిమిగిలిమి
మరువిండ్లుఁ దన్మౌర్వి మధుకరరుచులుఁ ద
దస్త్రంబు మొనలును నలమి యలమి
గనకవేదులు నందుఁ గాంతినుగ్గులును ద
త్సగిత సన్మణులును దాఁచితార్చి.

గీ. గతులు నూరు కుచములు మొగములు నేత్ర
ములును దనుగంధములు బొమ లలకములును
చూపులు నితంబములును రుచులును దశన
ములును విధిచేసె నా సుందరి పురి చెలువలు.

క. ఒక యొనిమిదడఁగె దిక్కుల
మకరంబున కొకటి యోడె మలహరుచే ము
న్నొకటుడిగె ధిక్కరింపఁగ
నిఁక నేలని మాఱుమలయు నేనుఁగులు పురిన్.

ఉ. పాయక కన్నె నాథుతలఁ బ్రోలిడఁ బూన్చిన యాణిముత్తెముల్
దోయిట పద్మరాగమణులో యన నించుక యెత్తి చూచుచోఁ
జాయల నింద్రనీలముల చాయలుగాఁ బతి మాళిమీఁదటన్
బోయఁగఁ బూవుమొగ్గలనఁ బొల్చు విచిత్రవిలాస వైఖరిన్.

ఉ. సారసరః ప్రతీర వనసౌరభపుష్పరజో విభూతి నొ
య్యారపుఁ జొక్కుచల్లి మలయానిలుఁడన్ గడిదొంగ వేకువన్
జోరనగండ్లఁ గన్నములఁ జొచ్చియు దివ్వెలు దూల్చి భోగభా
మారతితాంత ఘర్మకణమౌక్తికపంక్తులు దార్చు నిచ్చలున్.

శంకరవిజయము:—

చ. అడవి సరోజరాగమణు లామిషఖండములంచుఁ గట్టుకు
ట్లొడికము సేయు వేడుకల నుజ్జ్వలసన్మణు లేర్చి నిప్పులం
దిడియును భల్లుకవ్రజనిరీక్షణముల్గని దివ్వెలంచు దేఁ
దడవుదు రొయ్య్య మార్గ్యమునఁ దద్గిరిసీమఁ గిరాతబాలికల్.

ఉ. ఆమనికెంకిపట్లు మలయానిలు నిత్యవిహారసీమముల్
కామునిపాళెముల్ శుకపికంబుల జీతపుటూళ్లు కామినీ
కాముక విశ్రమంబులకు గల్లని యోర్వకు (?) లాపురాంగనా
స్తోమమునందు నెందు నెలతోఁటలు శైలశిలోన్నత స్థితిన్.

గీ. తనకు బలముగలిగి తనమంత్రి మిత్రాప్త
బలము దనకుఁ దోడుపడుట గలిగి
వైరిబలము దఱిగి వారిచుట్టము లెల్లఁ
గ్రిందువడిన వేళ గెలువవచ్చు.

చ. తనరుచిగాని వేళ బెడిదంబగు వేఁడి నినుండు దోఁచినన్
గనుమొఱఁగుంట రాజునకుఁ గర్జమటంచెటయేనిఁ జన్నయ
ట్లను చరులై వెలింగెడి గ్రహంబులుఁ దారలుఁ దోడరాఁగ వేఁ
గనచనె వెల్లవెల్లని మొగంబు కళంకమునన్ శశాంకుఁడున్.

గీ. రాజురాకకుఁ దారహారములలోడి
యామినీ పాత్రి నాడింప నేమి సమయ
నాటకుఁడు దోఁపుతెర వారినాఁడనంగ
సాంధ్యరాగము పశ్చిమాశను దనర్చె

సీ. సంజప్రొద్దున నాటసలుపు నంబరకేశు
తలయేటి జలకణ తతులనంగ
రజనీవధూద్విజరాజుల పెండ్లికే
ర్పఱచు ముత్తెపుఁ దలఁబ్రాలనంగ
గాలవాణిజ్యంబు నీలాంబరస్థలీ
స (?) జచరించు వజ్రములనంగ
వేళాఖ్య పుష్పలావిక యిందుఁడను రాజు
నకు నేరిచిన ప్రసూనంబు లనఁగఁ

గీ. బాలవెల్లి మథించు తొల్కాలమునను
నమృతబిందువులు దరి నున్నందె ననఁగ
గగనమనుకొల నలమిన తొగ లనంగఁ
గలయఁ జుక్కలు తోఁచె నాకాశవీథి.

మ. సమలావణ్యము వన్నెగూడి రసముల్ సంధించి శృంగారవే
షములోఁ జొక్కఁపుఁజూపు నవ్వొలయ నిచ్ఛాతూలికన్ భావచి
త్రముగాఁ బంచశరుండు రాగరతిఁ జెంతం జూచుచున్ వ్రాసి ప్రా
ణము వాగీశ్వరువేఁడి సించెననమే నాపుత్త్రి యొప్పం గడున్.

మంగళగిరి విలాసము:—

ఉ. హారతులిచ్చు వేయి న...సారికి రాయని గన్నతండ్రి కొ
య్యారి మెఱుంగుఁ జూపులనె యారతులిచ్చె నొకర్తు తజ్ఝణా
త్కారకరద్వ యీవలయ కాంతులు గుత్తపుఁ జన్నదోయి తా
హారగళంచలన్నలు జాలతశ నెంతకు రాయభా-కాంతిమై (?)

సూర్యశతకము:—

శా. ఈఁగల్వోలె వ్రణంబులే వెదకుచు నీక్షాంబరున్ మెచ్చకే
మూఁగల్వోలె నిరంతరాస్యలగుచున్ మూర్ఖించి తర్కించినన్
వీఁగన్నేరని దుష్కవుల్ బ్రతుకనీ విక్రాంతులై వారినో
రాఁగం బోవఁగ నేల సత్కవులు సూర్యా! పద్మినీవల్లభా!

మల్లిఖార్జునలింగ శతకము:

సీ. కాంతులఁ జూపట్టు కడ్లమరించిన
తిరమైనవిపులపుఁ దేరునందు
విద్యలపోఁక యా వృద్ధసారథినిల్పి
యతఁడుశిక్షించు హయములఁ బన్ని
తన్నివాసులమించు తిన్ననిప్రావిల్లు
చొక్కఁబైనారి నెక్కువెట్టి (?)
గరితోడఁగూడ నాకసపు సూటిని బాగు
నెమ్మేనుఁ బసనిచ్చు నమ్ముఁ దొడిగి

గీ. యమరభటులార్వ దైత్యపురములు గెడపి
విజయమందిన జోద వీవిశ్వమునను
వేల్పులెవ్వరు నీసాటి విజయవాటి
మల్లికార్జునలింగ! యుమాప్రసంగ!

సీ. ఖండఖండంబుగఁ గదిసిన తేరును
భంగంపు టిరుసు బొసంగఁగూర్చి
విజ్జోడుపడి నిచ్చ వినువీధిఁ దిరిగెడు
చక్రంబు లానగూడ సంఘటించి
తరుకొన్న భీతిఁ గొందలపడ బహుముఖ
బ్రాంతసారథి నేరుపరిగ నిలిపి
పలుకఁ బదక్రమంబుల నలుజాడలఁ
బోయెడి గుఱ్ఱముల్ పూనుకొలిపి
గీ. కుంటి వింటను బలువంకకోలఁ దొడిగి
విషమలక్ష్యంబు వేగతి వేసితయ్య... వేల్పు...
సీ. బంట్లున్నపాలెంబు బలువిల్లుగాఁ జేసి
నవమణివలయంబు నారిఁ జేసి
నుదుటి నెన్నుడిమికన్నును ములికిగాఁ జేసి
దక్షిణాంగంబయస్త్రంబుఁ జేసి
చేకోకతలవాని జోకసారథి సేసి
తనమూర్తి యొకటి రథంబు సేసి
కనుఁదోయిఁ జక్రియుగ్మముగ యోజన చేసి
సమతనూరుపుల నశ్వములఁ జేసి
గీ. యన్నియును నీయధీనంబు లగుటఁ జేసి
పురము లేసితి గాక నీకొరులులోఁడె... వేల్పు...
"వేల్పులెవ్వరు నీసాటి విజయవాటి
మల్లికార్జునలింగ! యుమాప్రసంగ!"

అనుమకుటములో శతకము వ్రాసియుండుటచే నీకవి బొడ్డపాడు నివాసుఁడగుట నిశ్చయమని చెప్పవచ్చును. ఆగ్రామమున బొడ్డపాటి వారార్వేలనియోగులు ఆత్రేయసగోత్రులును, భారద్వాజసగోత్రులును గలరనియు, నూఱు సంవత్సరములక్రిందట నాత్రేయస గోత్రులలో బొడ్డపాటి పేరరాజుగారును, భారద్వాజస గోత్రులలోఁ గొండయ్య గారును నుండిరనియు, వారు కవిత్వము చెప్పినట్లు కానరాదనియు,

నాగ్రామకరణమగు బొడ్డపాటి లింగరాజుగారు నాకువ్రాసియున్నారు. తాతపేరు మనుమనికిఁ బెట్టుచు వచ్చుటచే నా నామములు గ్రమముగా వచ్చినవని భావించినచో నీబొడ్డపాటి పేరయకవి క్రీ.శ.౧౫౦౦ ప్రాంతమున నీబొడ్డపాడు గ్రామమున నివసించియుండెననియు నాత్రేయసగోత్రజుఁడనియు నిర్ణయింపవచ్చును. బొడ్డపాటి కొండయకవి కూడ నున్నాఁడు. ఆతని చరిత్రము నీతరువాతనే వ్రాసెదను. ఇంతకంటె నీకవినిగూర్చి యేమియుఁ దెలిసినది కాదు.

ఉదాహృత పద్యములవలన నీకవి రసజ్ఞులు మెచ్చునట్టి కవిత్వమును జెప్పగలవాఁడని స్పష్టమగుచున్నది. ఈతని గ్రంథ మొక్కటియైనను లభింపకుండుట విచారకరమైన సంగతి.

139 బొడ్డపాటి కొండయ

రామాప్రెగ్గడ జగ్గన ప్రబంధ రత్నాకరములో నీతని పద్యములని యుదాహరించిన యీక్రింది మూఁడు పద్యములను బ్రబంధరత్నావళినుండి గైకొని యిటవ్రాయుచున్నాఁడను. ఇతఁడు "అంగభవభంగ తిరుకాళహస్తిలింగ" యనుమకుటములో నొకశతకమో తారావళియో వ్రాసియుండవచ్చును. అనంతమహాత్త్వాది గ్రంథములను రచియించిన పేరయకవి యీతనివంశము లోనివాఁడేమో!

సీ. కడఁగి యెక్కడనైనఁ గదలని యరదంబు
నరదంబుపై నిల్చినట్టి విల్లు
వింటికిఁ గాపుగా విహరించు చక్రముల్
చక్రములను బ్రొద్దు జరపుశరము

శరమునఁ బొడమిన చక్కని సారథి
సారథి మొగమున జాఁగుహరులు
హరుల సామర్థ్యంబు నరసిన శింజిని
శింజినిఁ దరిత్రాడు సేయుబలముఁ
గీ. బొందుపడఁ జేసి దైత్యులపురము లేసి
యఖిలజగములు రక్షించునట్టిజోద
వనుచుఁ గొనియాడుదురు నిన్ను ననుదినంబు
నంగభవభంగ! తిరుకాళహస్తిలింగ!
సీ. తొమ్మిది తునుకల నెమ్మిఁగూర్చిన తేరు
సరిజోకఁ గూడని చక్రియుగము
నొకముఖంబునఁ గప్పు నోపనిసారథి
రూపింపరాని వారువపు సమితి
బెడిదంపు దెగలకుఁ జెలువైన విలుకమ్మి
గాలిచేఁ బొద్దులు గడపునారి
పదివంకలై చాయఁబొలని బాణంబు
పడి బత్తెములులేని భటగణంబుఁ
గీ. బొందువడఁ జేసి దైత్యుల పురములేసి
యఖిలజగములు రక్షించునట్టిజోద
వనుచుఁ గొనియాడుదురు నిన్ను ననుదినంబు
నంగభవభంగ! తిరుకాళహస్తిలింగ!
సీ. దేహంబు మిక్కిలి తిరమైనరథముగా
ఘననేత్రియుగము చక్రములుగాఁగ
నూర్పులశ్వంబులై యొప్పారుచుండఁగ
(?) దోరయు బల్లెరము సూతుండుగాఁగ
సర్వాంగ మతిఘోరసాయకం బదిగాఁగ
సారిదిఁ గుంతలములు జోడుగాఁగ
దలమైన విహరణస్థలము కార్ముకముగా
నలువైన హారంబు నారిగాఁగ

గీ. నన్నియును నీమహత్త్వంబ యగుటఁ జేసి
లీలఁద్రిపురంబులేసి గెల్చితివిగాక
నీకు నొరులు సహాయులై నిలువఁగలరె?
యంగభవభంగ! తిరుకాళహస్తిలింగ!

ఈమూఁడుపద్యములయందును త్రిపురసంహారమే మూఁడువిధములుగ వర్ణింపఁబడినది.

ఈకవినిగూర్చి బొడ్డపాటి పేరయకవి చారిత్రమున నించుక వ్రాసియుంటిని. కొండయకవి భారద్వాజసగోత్రుఁడనియు, విజయవాడకుఁ దూర్పునఁ బదునైదు మైళ్ళ దూరముననున్న బొడ్డపాడీతని నివాసమనియుఁ దెలియుచున్నది. "వేల్పులెవ్వరు నీసాటి విజయవాటి మల్లికార్జునలింగ! యుమాప్రసంగ!" అను మకుటముతోఁ బేరయకవి రచించిన శతకమందలి మూఁడు పద్యముల నాతని చారిత్రమున నిచ్చియుంటిని. ఈకొండయకవి "అంగభవభంగ! తిరుకాళహస్తిలింగ!" యను మకుటముతోఁ గాళహస్తీశ్వరునిపై నొకశతకమును రచియించెను. వీరిరువురును భిన్నగోత్రీయులగుటచే నొకవంశమువారు కారనుట నిశ్చయము. వీరుసమకాలికులో వీరినడుమ నంతరమెంతయున్నదో చెప్పఁజాలము. వీరిరువురును దమతమ శతకములలోఁ ద్రిపురసంహారకథను వర్ణించియున్నారు. ఈపద్యములలో రెండిటికిని బోలికలున్నవి. పదసామ్యమును భావసామ్యమును గూడఁగలదు. ఎవరి నెవరనుకరించిరో చెప్పఁజాలను.

ఈకవినిగూర్చి యింక నేమియుఁ దెలియదు.

---

140 తెనాలి అన్నయకవి

ఇతఁడు యాజ్ఞవల్క్య నియోగిబ్రాహ్మణుఁడు. కౌండిన్యస గోత్రుఁడు. రామమంత్రి పుత్త్రుఁడు. పాండురంగ విజయ, ఘటికాచల మాహాత్మ్యాది గ్రంథములను రచియించి సుప్రసిద్ధుఁడైన తెనాలిరామ కృష్ణకవియు, శ్రీశైలమాహాత్మ్య కృతికర్తయగు తెనాలి శ్రీగిరికవియు నీకవి కగ్రజులు. ఈభ్రాతృత్వమును ధ్రువపరచు పద్యములను వారివారి కృతులయందిచ్చియున్నాఁడను. ఒకరినిగూర్చి యొకరు వీరుమువ్వురును దమతమ గ్రంథములయందు వ్రాసికొనియుండలేదు. అయినను వీరన్నదమ్ములనుట నిర్వివాదాంశము.

ఇతఁడు సుదక్షిణాపరిణయమను నైదాశ్వాసముల ప్రబంధమును రచియించి, పులిజాల సోమయామాత్యున కంకితముచేసెను. రామ కృష్ణ కవివలెనే యీయన్నయకవియు, మొదట శైవుఁడై పిదప వైష్ణవమతమును గ్రహించినట్లీతఁడు దనగ్రంథమునఁ జేసిన గురువర్ణనములనుబట్టి తెలియుచున్నది.

గీ. కాళిదాసాది సంస్కృత కవులఁదలఁచి
యాంధ్రభాషావిశేష భాషాధిపతుల
నన్నపార్యాదులను బుద్ధి సన్నుతించి
పాలగుమ్మి భీమగురుని సద్భక్తిఁగొలుతు.

ఈతని సోదరుఁడైన రామలింగకవి గురువు పాలగుమ్మి యేలేశ్వరుఁడు. రామలింగ (రామకృష్ణ) కవియు నీయన్నయయు సోదరులైనట్లే యీసోదరులకు గురువులైన పాలగుమ్మి యేలేశ్వర భీమేశ్వరులుకూడ సోదరులేమో! ఈభీమేశ్వరుఁడు విద్యాగురువై యుండును. వైష్ణవమంత్ర మొసంగినవాఁడు కందాళభావనాచార్యుల తనయుఁడైన శ్రీరంగాచార్యులు. ఆతని నీకవి యిట్లనుతించియున్నాఁడు.

క. కందాళభావనార్యుల
నందను శ్రీరంగగురుని నతబుధరక్షా

మందారంబు నుతింతును
మందారమరందబిందు మధురారభటిన్.

తెనాల్యగ్రహారమునం దీకవి కెంతవఱకు సంబంధమున్నదియుఁ జెప్పఁజాలము. కాని యీతని నివాసము తెనాలియేయని సుదక్షిణా పరిణయమందలి యీక్రింది గద్యమువలనఁ దెలియుచున్నది.

"ఇది శ్రీమత్తెనాలి రామేశ్వర శాశ్వతకృపాకటాక్షలక్షిత కవితాభిరామ రామయపండిత కుమార సహజశైవాచార సంపన్న ధీమదన్నయ నామధేయ ప్రణీతంబైన సుదక్షిణా పరిణయంబను శృంగార కావ్యంబు"

తాను వైష్ణవాచార్యుని శిష్యుఁడనని వ్రాసికొనియుఁ నాగ్రంథాంతగద్యయందే శైవాచార సంపన్నుఁడనని వ్రాసికొనుటఁజూడ నీతఁడు వీరవైష్ణవుఁడును వీరశైవుఁడునుగూడఁ గాఁడనియు, ముద్రాంకితుఁడయ్యును శైవాచారములను విడనాడలేదనియు శివకేశవులయెడ సమానాంతఃకరణము గలవాఁడనియు నిశ్చయింపఁదగియున్నది.

సుదక్షిణాపరిణయకృతిపతి తననుగూర్చి పలికిన వాక్యముల నీక్రింది పద్యములలోఁ జెప్పుకొనియున్నాఁడు.

గీ. నవ్యసుగుణాభిరామ తెనాలిరామ
పండితాగ్రణి సత్పుత్త్ర భవ్యమిత్త్ర
హారపదాంభోజ సౌముఖ్య నన్నపాఖ్య
నన్నుఁబిలిపించి యాదరోన్నతివహించి.

చ. పలుకులకల్కి కప్పురపుఁ బల్కులు చల్లినరీతిఁ బండువె
న్నెల తళుకుల్ విధుండు హవణించిన మించున శంబరారిచెం
గలువలతూపుఁగోపుల ముఖాముఖిఁ జూపినయేపునం గృతుల్
పలుకఁగ నేర్తు పూర్వకవిపద్ధతి రామయయన్నసత్కవీ!

గీ. సరససాహిత్య సౌహిత్య పరతనీవు
పరిఢవించు సుదక్షిణా పరిణయంబు
కీర్తివిలసిల్ల మాకు నంకితముసేయు
తేటయగు వాగ్విలాసంబు కోటిసేయు"

ఈకవికగ్రజుఁడగు రామకృష్ణకవి క్రీ. శ. ౧౫౦౦ – ౧౫౩౦ నడుమ నున్నవాఁడని యాతని చారిత్రమున వ్రాసియుంటిని. ఆతని సోదరుఁడగు నీకవి పదేండ్లుతక్కువగా నాకాలమువాఁడని తెల్పి యీ కవి కాలమును సులభముగా నిర్ణయింపవచ్చును. కాని యిందులకొక యాక్షేపణము రావచ్చునని రామకృష్ణకవి చారిత్రములో ననుమానమునుజూపి యందులకు సమాధానము నిచ్చుటవ్రాయుదునని చెప్పియున్నాఁడను (అ). కావున రామకృష్ణకవి కాలముపై నాధారపడకుండ నీతని కాలమును స్వతంత్రముగ నిర్ణయించి పైయనుమానమును దీర్పఁ బ్రియత్నించెదను.

సుదక్షిణా పరిణయ కృతిపతిని పోషించినవాఁడు కోనేటి రామరాజు. ఇతని కాలములోని యాతఁడు తెనాలి యన్నయకవి. కోనేటి రామరాజునకు చిన్నముత్తాత కొడుకు అళియరామరాయలు. రామకృష్ణకవి యీతని కాలములోనివాఁడు. ముత్తాత మునిమనుమల కాలములోనున్న రామకృష్ణాన్నయ కవులు సోదరులగుట సంభవమా? అనునదియే శంకాస్పదమైన విషయము.

ఈయన్నయకవి తన సుదక్షిణా పరిణయమును పులిజాల సోమయామాత్యుని కంకితము చేసెనని పైని వ్రాసియుంటిని. ఈతని వంశమును గవి ముప్పది పద్యములలో వర్ణించియున్నాఁడు. అందు రెండు పద్యములలోఁదక్క తక్కినవి కాలనిర్ణయమునకుఁ దోడుపడునవి కావు. ఈ రెండుపద్యములైనను స్వతంత్రముగఁ గాలనిర్ణయమును జేయఁజాలవు అయినను నాపద్యముల నిటవ్రాయుదును.

స్రగ్ధర, శ్రీమత్కోనేటి రామక్షితిపతి కరుణాసింధు సంభూత రాజ్య
శ్రీమాధుర్యైకధుర్యా శ్రితభరణ కళాశేష భూషోపమానా!
రామోద్దానుభావా! రసిక నుతగుణా రామరమ్యస్వభావా!
సామర్థ్యైకల్పమూర్తీ సతతనయ విశేషప్రధాసత్యకీర్తీ. ౧౪౧౩౮

(అ) ఆంధ్రకవితరంగిణి సం ౮ పుట ౨౬.

క. కోనేటి రామరాజ ద
యానూన ప్రాప్త శాశ్వతైశ్వర్యనిధీ!
దానకలాజిత జలధీ!
నానాబాంధవగృహాంగణ స్థాననిధీ! ౪ ఆ ౧౬౮

కృతిపతిని సంబోధించిన యీ రెండు పద్యములలోను, నతఁడు కోనేటి రామరాజునొద్ద నుద్యోగిగా నున్నట్లు స్పష్టమగుచున్నది. ఇంతియగాక:—

మ. స్మరజిద్వక్త్రసుధామఁ డాయలియ రామక్ష్మావరోత్తంసుచే
గురుసామ్రాజ్య ధురంధరత్వఘనుఁ డాకోనేటి రామాధిప
స్థిరసైన్యాధిపుఁ డబ్బమంత్రి వరియించెన్ యజ్ఞమాంబన్ మనో
హర భాగ్యోన్నతిఁ గంకిపాటిపుర వేదామాత్య పుత్రీమణిన్.

ఈపద్యమున నుదాహృతుఁడైన యబ్బమంత్రి కృతిపతికి రెండవ తమ్ముఁడు. కోనేటి రామరాజునొద్ద సేనాధిపతి. ఈపద్యములనుబట్టి పులిజాల సోమయామాత్యున కాశ్రితుఁడు కోనేటి రామరాజని నిశ్చయమయినది. కావున నారామరాజు కాలమును దెలిసికొనఁగలిగితిమేని, కృతిపతి కాలమును దానిననుసరించి కవికాలమును నెఱుఁగగలము.

కోనేటి రామరాజు వంశమును నన్నయకవి సుదక్షిణాపరిణయమున నెనిమిది పద్యములలో వర్ణించియున్నాఁడు. వానిననుసరించియు రామపరాజు రంగపరాజుకవి రచించిన సాంబోపాఖ్యానమును బట్టియు, నీకవికాల నిర్ణయమునకుఁ వలయునంతవఱకు వంశవృక్షము నీక్రింద నిచ్చుచున్నాఁడను.

ఈక్రిందఁ జూపఁబోవు వంశవృక్షములో బుక్కరాజు, రామరాజు, తిమ్మరాజులను, దిమ్మరాజునకు మొదటి భార్యవలన కలిగిన నల్గురు కుమారులను ఇందులోఁ జినకొండరాజు తనయులు నల్వురను కోనేటి రామరాజును మాత్రమే అన్నయకవి వర్ణించియున్నాఁడు.

తక్కిన వంశవృక్షమును రంగపరాజు సాంబోపాఖ్యానమునుండి గ్రహించితిని.

ఆరవీటి బుక్క రాజు

రామరాజు

- (పొట్లపాడి) తిమ్మరాజు
- పెదకొండరాజు — ఇతని వంశము చాలకలదు. కాని మనకిట పనిలేదని వ్రాయలేదు
- శ్రీరంగరాజు — ఇతనివంశము విశేషమున్నది. అదియంతయు నవసరము ఇతని యైదుగురు కుమారులలో మూఁడవవాఁడు అళియ రామరాయలు

మొదటిభార్య ......వలన

- చినకొండ్రాజు (1) కోనప్ప
- తిమ్మరాజు (2)
- అప్పలరాజు (3)
- రామరాజు (4)

రెండవభార్య లక్ష్మమ్మవలన

- పెదతిరుమలరాజు (5)
- చినతిరుమలరాజు (6)

మూఁడవభార్య గోపమాంబవలన

- పలతిమ్మ రాజు (7)
- విఠల రాజు (8)
- చినతిమ్మ రాజు (9)
- పాపతిమ్మ రాజు 10

4 వ భార్య తిరుమలమ్మవలన

- తిమ్మప్ప (11)
- కోనప్ప (12)
- సింగరాజు (13)

కోనప్ప:

- కోనేటితిమ్మరాజు
  - కోనేటి రామరాజు : (ఇతనియొద్దనే సుదక్షిణాపరిణయ కృతిపతి మంత్రిగానుండెను)
- చినతిమ్మరాజు
- అప్పలరాజు
- రంగపరాజు — సాంబోపాఖ్యాన కృతికర్త

ఇందులో శ్రీరంగరాజునకు మూఁడవ కుమారుఁడును శ్రీకృష్ణదేవరాయలకల్లుఁడునైన యళియ రామరాయలు క్రీ. శ. ౧౫౦౦ సంవత్సర ప్రాంతమున జన్మించి ౧౫౬౫ వ సంవత్సరమునఁ దాళికోట యుద్ధములోఁ జనిపోయెనని యనేక హేతువులను జూపి కృష్ణదేవరాయల చారిత్రమున నిర్ణయించియుంటిమి. అళియ రామరాయల పెదతండ్రికి మునిమనుమఁడైన కోనేటి రామరాజు అళియరామరాయల కెంతయో తరువాతనుండునని స్థూలదృష్టికిఁ గోచరించును. కాని విమర్శించి చూచినచో నీకోనేటి రామరాజు అళియరామరాయలతో సమకాలికుఁడని స్పష్టమగుచున్నది. అళియ రామరాయలచే నీకోనేటి రామరాజు గురుసామ్రాజ్య ధురంధరత్వము వడసెనని పైనుదాహరించిన "స్మరజద్విక్రమధాముఁ"డను పద్యము సాక్ష్యమొసంగుచున్నది. క్రీ. శ. ౧౫౪౨ వఱకును గర్ణాటకరాజ్యపరిపాలమున నళియ రామరాయలకు విశేషాధికారములేదు. సదాశివరాయలను పేరునకు రాజుగానుంచి ౧౫౪౨ మొదలుగ నళియరామరాయలు కర్ణాట రాజ్యపాలనమున సర్వాధికారము వహించెను. ఆకాలములో నీకోనేటి రామరాజునకు రాజ్యపాలనములో జోక్యము కలిగినది. అళియ రామరాజీతనికి రాజ్యాధికారమొసంగినది. క్రీ. శ. ౧౫౫౦ ప్రాంతమని యనుకొందము, అప్పటికాతని కధమము ౨౫ సంవత్సరముల వయసైననుండియుండును. అందుచే నాతని జననము ౧౫౩౦ ప్రాంతమై అళియరామరాయలకంటె ముప్పదియేండ్లు చిన్నవాఁడై ౧౫౫౦ మొదలు ౧౫౬౫ వఱకు నాతనితో సమకాలికుఁడై యాతనిచే గౌరవింపఁబడుచు రాజ్యాధికారమును వహించెనని స్పష్టమగుచున్నది. రామకృష్ణకవి చారిత్రమునఁ జూపిన సంశయమును నివారించుట కీసంఘటన మొక్కటియే చాలును. కోనేటి రామరాజునొద్ద మంత్రిగానున్న సోమయామాత్యుఁడు ౧౫౬౦ ప్రాంతమున సుదక్షిణాపరిణయమును గృతినొందెననినచో నందు విపరీతమేమియు లేదు.

అళియరామరాజు క్రీ. శ. ౧౪౯౫–౧౫౦౦ ప్రాంతమునజన్మించినపుడు ఆతని పెదతండ్రి మునిమనుమఁడు ౧౫౨౫ ప్రాంతమున

జన్మించు టెట్లు సంభవమగునను సంశయము పై వాక్యములవలనఁదీరదు. కావున నావిషయమును విమర్శింతము. అళియరామరాజు, తండ్రి సంతానములో మూఁడవవాఁడు. అందుచే శ్రీరంగరాజునకును నళియ రామరాజునకును నడుమ వ్యత్యాసము ౪౦ యేండ్లుండవచ్చును. ఆపక్షములో శ్రీరంగరాజు జననము ౧౪౫౫ ప్రాంతమగును, శ్రీరంగరాజునకు జ్యేష్ఠాగ్రజుఁడైన పొట్లపాడితిమ్మరాజు౧౪౪౫ ప్రాంతమును నాతని పెద్దకుమారుఁడైన చినకొండ్రాజు ౧౪౭౦ ప్రాంతముననుు, నాతని పెద్దకుమారుఁడైన కోనేటి తిమ్మరాజు ౧౪౭౫ పాంతముననుు, నాతనికి౧౫౨౫ ప్రాంతమునఁ గోనేటి రామరాజును పుట్టియుందురని తలంచుటయందసంభవమేమియును లేదు. కావునఁ బైనిజూపిన సంశయమునకుఁ దావులేదు.

(౨) పై వంశవృక్షములోని 7 వ సంఖ్యగల నలతిమ్మరాజు, గోనేరు కోనేరు కవిచే పద్య భాగవతమును వ్రాయించి తనతండ్రియు నప్పటికిఁ గీర్తిశేషుఁడునైన పొట్లపాడి తిమ్మరాజునకుఁ గృతియిప్పించెను. మఱియు నాతఁడే 9 వ సంఖ్యగల చిన తిమ్మరాజునకాకోనేరు కవిచేతనే ద్విపద భాగవతమును గృతినిప్పించెను. కోనేరుకవి తన ద్విపద భాగవత రచనాకాలము శా. శ. ౧౪౬౮ వ సంవత్సరమని చెప్పియున్నాఁడు. (కోనేరు కవిచారిత్రమును జూడుఁడు) నలతిరుమలరాజున కప్పటికేఁబది సంవత్సరముల వయసుండునని తలంచినచో నాతని జననము ౧౪౮౫ ప్రాంతమగును. ఇతనికైదుగురన్నలు కలరు. అందు మొదటివాని జననము ౧౪౭౦ ప్రాంతమని తలంపవచ్చును. దీనినిబట్టికూడఁ బై కాలము సరియైనదిగానే కన్పించుచున్నది. నలతిరుమలరాజును ఇతని జ్యేష్ఠాగ్రజుని తనయుఁడైన కోనేటి తిమ్మరాజును సమవయస్కులగుదురు. అందస్వాభావికములేదు. చినతిరుమలరాజు కృతిచేయించిన పది - పండ్రెండేండ్లకు, కోనేటి రామరాజు దగ్గర మంత్రిగానుండిన సోమయామాత్యుఁడు కృతిపొందెననుటలోను విరోధములేదు.

(3) సాంబోపాఖ్యాన కావ్యమును రచించిన రంగపరాజు,

కోనేటి రామరాజునకుఁ బినతండ్రి. దోనేరుకోనేరు కవిరచించిన భాగవత కావ్యమును దన సాంబోపాఖ్యానములో నీతడు పేర్కొని నాఁడు. సాంబోపాఖ్యానము క్రీ. శ. ౧౫౫౦ ప్రాంతమున రచియించెనని సహేతుకముగ రంగపరాజు చారిత్రమున నిర్ణయించియుంటిని. రంగపరాజు తండ్రి యైన చినకొండరాజు జననము ౧౪౭౦ ప్రాంతమైయుండునని పైని వ్రాసియుంటిని. ఆతని నాల్గవ కుమారుఁడైన యీ రంగపరాజు ౧౫౧౦ ప్రాంతమున జనియించి నలువదేండ్ల వయసున సాంబోపాఖ్యానమును రచియించియుండును. ఆతనిపెద్దయన్న గారైన కోనేటి తిమ్మరాజు జననము ౧౪౯౫ అని యనుటలో విరుద్ధములేదు. రంగపరాజుకంటె నాతని యన్నకుమారుఁడైన కోనేటి రామరాజు పదునైదేండ్లచిన్నవాఁడనుటలోఁగాని తన కావ్యమునకుఁదరువాత పదేండ్లలో నాతనియొద్ద మంత్రిగానున్న పులిజాల సోమయామాత్యుఁడు సుదక్షిణా పరిణయమును గృతినందెనని తలంచుటలోఁగాని విరుద్ధముండదు.

పైమూఁడు కావ్యముల నాధారముగాఁ జేసికొని తెనాలి యన్నయకవి క్రీ. శ. ౧౫౬౦ ప్రాంతమున సుదక్షిణా పరిణయమును సోమయామాత్యున కంకితము చేసియుండునని నిర్ణయించితిమి.

బ్ర. శ్రీ. వీరేశలింగము పంతులు గారాంధ్రకవుల చారిత్రమున సుదక్షిణా పరిణయ రచనా కాలము ౧౫౯౦ ప్రాంతమని నిర్ణయించి యున్నారు. శ్రీ మా. రామకృష్ణకవిగారా కాలము ౧౫౬౫ ప్రాంతమని వ్రాసిరి ౧. ఇదియే సరియైన నిర్ణయమని నాయభిప్రాయము.

ఆంధ్రవిజ్ఞాన సర్వస్వమున శ్రీ. కొమఱ్ఱాజు లక్ష్మణరావు పంతులు గారు, సుదక్షిణాపరిణయ ద్వితీయాశ్వాసములో మాయాశివుఁడు తన నివాసమునుగూర్చి చెప్పిన

క. పెనుగొండ నిలుతుఁ దఱుచుగ
మనసెనసి ధనాఢ్యుఁ డొకఁడు మముఁ గూడుక రాఁ

---

౧ ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక పుట ౧౦౩.

జనవున సకలజనంబులుఁ
బనిసేయఁగఁ గొదవలేని బలగముతోడన్. ౨౨౮.

అనుపద్యమున శ్లేషార్థమున్నదనియుఁ, బెనుగొండ యనఁగాఁ బెద్ద పర్వతమునకును, బెనుగొండ పట్టణమునకును, ధనాఢ్యుఁడనఁగాఁ గుబేరునకును మహారాజునకును జెల్లుననియుఁ దిరుమలరాయలు విజయ నగరమునుండి పెనుగొండకు క్రీ. శ. ౧౫౬౭ వ సంవత్సరమునను పెనుగొండనుండి చంద్రగిరికి ౧౫౯౨ వ సంవత్సరమునను దన రాజధానిని మార్చెననియుఁ గావున నీకావ్యము ౧౫౬౭–౧౫౯౨ నడుమ రచితమయ్యెనని యూహింపనగుననియు వ్రాసియున్నారు. కాని నేనీయభిప్రాయముతో నేకీభవింపఁజాలకున్నాఁడను. పెనుగొండ. రాజధానీనగరమేయైనచోఁ గవి "తలఁచుగ" అను శబ్దమునుపయోగింపఁడు. ఈశ్వరునకు ప్రధాననివాసము వేలుగనున్నది. అట్లే యిచ్చట ప్రధాననివాసము వేఱుగనున్న పురుషుఁడింకొకఁడుండవలయును. ఆపురుషుఁడు తిరుమలరాయలైనను గావచ్చును. మఱియెవ్వరైనఁ గావచ్చును. కావున నీపద్యమునుబట్టి కావ్యరచనాకాలము ౧౫౬౧–౧౫౨౨ నడుమనని నిర్ణయింపఁజాలము.

ఈకావ్యకృత్యాదియందలి పద్యములనుబట్టి రచనాకాలము ౧౫౬౦ అనియే నిశ్చయింపవలసియున్నది.

పైపద్యము సుదక్షిణా పరిణయకవికిఁ గానికృపతికిగానియన్వయించునేమోచూడవలసియున్నది. ధనాఢ్యుఁడైన పులిజాల సోమయామాత్యునిలోఁగూడి యప్పుడప్పుడు పెనుగొండయందుండెడివాఁడనని కవితనస్థితిని శ్లేషగా యిందుఁదెలిపియుండుననియుఁ బెనుగొండ, కోనేటిరామరాజు పరిపాలనలోఁ జేరిన ప్రదేశమనియుఁ బరిపాలనా కార్యములపై సోమయామాత్యుఁడు తరచుగఁ బెనుగొండకు వచ్చుచుండెడివాఁడనియుఁ నీపద్యమున కర్థము చెప్పవచ్చును. కోనేటి రామరాజు నంద్యాల ప్రభువంశములోని వాఁడైనను, నాతని ప్రజ్ఞావిశేషములనుబట్టి బెనుగొండసీమపై యధికారమును దాత్కాలికముగనైనను రామరాయలీతని కొసంగియుండును. అయిన నీవిషయమింకను బరి

శోధనీయము.

తెనాలి రామకృష్ణుని జననము ౧౪౮౫-౧౫౦౦ ప్రాంతమని యాతని చరిత్రమునఁ జెప్పియుంటిమి. ఆతని రెండవసోదరుఁడగు నీయన్నయకవి ౧౫౧౦ ప్రాంతమున జన్మించి తనతో సమవయస్కుఁడగు సోమయామాత్యునకు తనకు ౫౦ సంవత్సరముల ప్రాయమున నీకృతిప్రదానము చేసియుండునని తలంచుటలో విరుద్ధముండదు.

రామకృష్ణకవి పాండురంగ విజయమును, క్రీ.శ. ౧౫౫౦ ప్రాంతమున విరూరి వేదాద్రికిఁ గృతియిచ్చియుండునని యాతని చారిత్రమున వ్రాసియుంటిని. ఆతనికంటెఁ బదేండ్లు పిన్నవాఁడును రెండవ సోదరుఁడునగు నీయన్నయకవి దాదాపుగ నావయసుననే పులిజాల సోమయామాత్యునకుఁ దనగ్రంథమును క్రీ. శ. ౧౫౬౦ ప్రాంతమునఁ గృతియిచ్చియుండునని నిర్ణయింతము.

పైని జేసిన కాలనిర్ణయము శాసనములనుబట్టి పరీక్షించినప్పుడు నిలుచునా? మారిపోవునా? యనికూడఁ జూడవలసియున్నది. కృతిపతియైన పులిజాల సోమయామాత్యుని వంశములోనివారుగాని కృతిపతికాశ్రయుఁడైన కోనేటిరామరాజుగాని వ్రాయించిన శాసనములు కనుపట్టలేదు. ఈరామరాజు తండ్రియైన కోనేటి తిమ్మరాజునకుఁ బుణ్యముకొరకాతని కార్యకర్త వ్రాయించినది ౧ క్రీ. శ. ౧౫౪౬ సంవత్సరమునాఁటిది కలదు. ఈతిమ్మరాజు జననము ౧౪౮౦ ప్రాంతమని పైని వ్రాసియుంటిమి. ఈశాసనకాలమునాఁటికి ౫౬ పండ్లు వయసున నీతఁడుండియుండును. అప్పటికాతనికి ముప్పదేండ్లు వయస్సుగల రామరాజను కుమారుఁడును నుండియుండును. ఈశాసనమునుబట్టి యప్పటికాతఁడు జీవించియుండెనో లేదో తెలియదు. జీవించియున్నాఁడనుకొనినను ౧౫౫౦-౧౫౬౦ ప్రాంతమునఁ దెనాలియన్నయయాతని కుమారుని మంత్రికిఁ గృతియిచ్చెనని నిర్ణయించుట కీశాసనము తోడుపడునుగాని యాటంకమును గలుగఁజేయదు. నెల్లూరు శాసన సంపుటములలో కోనేటి తిమ్మరాజు శాసనమొకటి శా. శ.

౧. A R. 269 of 1928

౧౪౭౧ (క్రీ. శ. ౧౫౪౮) లోఁగలదు ౧. ఈశాసనముకూడ పైనిఁ జేసిన కాల నిర్ణయమును బాధింపదు.

కోనేటి రామరాజునకుఁ బినతాతలైన విఠలరాజు, చినతిమ్మ రాజు, పాపతిమ్మరాజు (పై వంశవృక్షములో 8. 9. 10 సంఖ్యలలోఁ జూపఁబడినవారు) అనువారల శాసనములు చాలఁగలవు ౨. అవి క్రీ. శ. ౧౫౪౩ మొదలు ౧౫౫౧ వఱకు నున్నవి. వీనినిబట్టిచూచినఁ దాతయు మనుమఁడు నేకకాలమువారుగా గన్పట్టెదరు. కాని విమర్శించిచూచినచో నీవ్యత్యాసము గన్పింపదు. విఠలరాజు తన నలువది - నలువదైదేండ్ల వయసున మొదటి శాసనము వ్రాయించెనను కొనుఁడు. అప్పుడాతని జననము ౧౪౮౫ ప్రాంతమగును. ఇతఁడు పొట్లపాడి తిమ్మరాజునకు మూఁడవభార్యవలనఁ గలిగిన రెండవ సంతానము. ప్రథమభార్యవలనఁ గలిగిన ప్రథమసంతానమునకును విఠల రాజునకును నడుమనంతరము ౨౫ సంవత్సరములుండునని తలంచితిమేని చినకొండ్రాజు జననము ౧౪౬౦ ప్రాంతమనియుఁ గోనేటి తిమ్మ రాజు జననము ౧౪౮౫ ప్రాంతమనియుఁ గోనేటి రామరాజుజననము ౧౫౨౫ ప్రాంతమనియుఁ దేలును. ఇందువిరుద్ధమైన దేమియు లేదు.

పొట్లపాడి తిమ్మరాజు జననము౧౪౪౫ ప్రాంతమని యూహించితిమి. ఆతని తుదిసంతానముయొక్క జననము౧౫౦౫ అయినచో నప్పటికిఁ దిమ్మరాజునకు ౬౫ వత్సరములవయ సుండును. ఇందును న స్వాభావికము లేదు. ఈయూహలలో నెచ్చటనైనఁ గొంచె మెచ్చు లొచ్చు లున్నను, గృతిప్రదాన కాలమును బాధించునవి కావు. రామ కృష్ణాన్నయల సోదరత్వమునుగాని వారి చారిత్రములయందిచ్చిన కాలములను గాని బాధింపవు. ఆళియరామరాయలు కోనేటిరామరాజునకు సామ్రాజ్యపాలనాభారము నప్పగించెననినమాట యసత్యము కాదనియు

౧. నె. శా. సం. పుట. ౨౧౬.

౨. **A. R** 360 361 of 1932; 269 of 1935; 265 of 193 ; 671, 674, 708 of 1917, 18 of 193 . తి. దే. సం ౫ సంఖ్య ౧, ౫౧, ౧౨౨, ౧౫౬.

ముత్తాతయు మునిమనమఁడును నేకకాలములో నుండుట కొన్నిసందర్భములనుబట్టి కొన్నికుటుంబములలో నసంభవముకాదనియుఁ జూపుటకై యింతదూరము చర్చింపవలసి వచ్చినది.

ఈయన్నయకవి తనకుఁ గందాళభావనాచార్యుని తనయుఁడైన శ్రీరంగాచార్యులు గురువని వ్రాసికొనినపద్యమును బైని నుదాహరించితిని. ఆరంగాచార్యుని శాసనములు క్రీ.శ ౧౫౮౦ ప్రాంతమునఁ గన్పట్టుచున్నవి ౧. ఇతఁడన్నయకవికి ముద్రాగురువుగాని విద్యాగురువు కాఁడు. విద్యాగురువు పాలగుమ్మి భీమేశ్వరుఁడైయుండును. అతఁడే శైవదీక్షనిచ్చియుండును.

కృతిపతికిఁ గుమారుఁడును కృతిపతి తమ్మునకుఁ బౌత్రులునున్నారని కవి వర్ణించియుండుటచేఁ గృతిప్రదానకాలమునకుఁ గృతిపతి యేఁబదియేండ్లకు మించిన వయసు కలవాఁడుగా గాన్పించుచున్నాఁడు. కృతిపతినివాసము పులిజాల అయినట్లు "పులిజాలధామ" అనువాక్యమునుబట్టి తెలియుచున్నది. అది యెచ్చటనున్నదో తెలియలేదు. సుదక్షిణాపరిణయ కృత్యాదియందుఁ గవి "దానొకకృప్రబంధంబు రచియింపనుద్యోగించు సమయంబున మణికుట్టిమప్రాసాదసౌధమహాహట్టబాదాలి పట్టణ శ్రీ కిరీటం బగు కొలువుకూటంబునఁ" గృతిపతియగు సోమామాత్యుఁడు సత్కావ్యగోష్ఠి యందుండి తనను బిలిపించినట్లు చెప్పియున్నాఁడు. ఈబాదాలిపట్టణ మెచ్చట నున్నదో యదియు నెఱుంగ రాలేదు. బళ్ళారిమండలమున హర్పణహల్లి తాలూకాయందు 'బాగాలి' యను గ్రామమును ననంతపురము మండలమున హిందూపురముతాలూకాలో 'బూకలి' యనుగ్రామమును గలవు. బాదాలి ఈరెండింటిలో నేదైన నొకటియేమో! బాగాలి పులిజాలమాత్రము కాదు. పులిజాల కృతిపతి జన్మస్థానమును బాదాలి యుద్యోగస్థానము నై యుండును.

ఇక్ష్వాకువంశమున జన్మించిన దిలీపమహారాజు చరిత్రయు, నాకేఁడు రత్నచూడుఁ డనురాక్షసుని సంహరించి సురథుఁడనువాని తనయ సుదక్షిణయను గన్యను బరిణయమాడుటయు నీకావ్యమందలి

౧. A. R 703 of 1922; 528 of 1915. తి.దే.సం 654, 655 T. T.

ప్రధానవిషయములు. గ్రంథమునకు సుదక్షిణాపరిణయ మను నామమే కాని పంచమాశ్వాసమునందక్క మఱియెచ్చటను నామెపేరే కాన్పింపదు. దిలీపునితండ్రి యంశుమంతుని పరిణయవృత్తాంతము, ఆతనికి సంతానములేకపోఁగాఁ దపముచేయుట, దిలీపజననము, ఆతని పరాక్రమ వర్ణనము, మృగయాఖేలనము మొదలుగాఁ బ్రబంధముననుండఁదగిన వర్ణనములు వీనిలో గ్రంథము నిండిపోయినది. ఇందుఁ గథావైచిత్ర్యమేమియు లేదు.

అన్నయకవిత్వము ప్రౌఢమై సలక్షణమై యన్నగారి కవిత్వముతోఁ దులతూగుచు మనోహరముగా నున్నదనుటకు సందియము లేదు. సంస్కృత రఘువంశమునఁ గాళిదాసు దిలీపమహారాజు చారిత్రమును విశేషముగా వర్ణించియున్నాఁడు. కాని యందు సుదక్షిణాపరిణయ మొకటి రెండు శ్లోకములకంటె నధికముగా లేదు. రఘువంశకావ్య మీ దిలీపమహారాజుతోడనే యారంభ మైనది. అంశుమంతునకు దిలీపుని వలెనే దిలీపునకు రఘుమహారాజును లేక లేక కలిగిన సంతానమే. రఘుమహారాజునకు కౌత్సుఁడను ఋషీశ్వరుని యాశీర్వాదబలమున నజమహారా జుదయించెను. దశరథునకుఁ బుత్రకామేష్టి చేసినపిమ్మటఁ గాని శ్రీరామచంద్రాదులు కలుగలేదు. రఘువంశమునం దిదియొకవిచిత్ర సంఘటనము.

కవిత్వశైలి తెలియుటకై కొన్నిపద్యముల నుదాహరించెదను.

ఉ. కాంచనసౌధవీథిఁ బురకాంతలు నిల్చి వియత్తరంగిణీ
కాంచనపంకజమ్ముల నఖప్రతతిం జిదుమంగఁబోయి త
త్ప్రాంచితచంచరీకవలయంబులు జుమ్మన నాటమాని యో
డించుకొనంగఁ బూనినవడిన్ మరలింతురు మోముఁదామరల్. ౧ఆ.

ఉ. విప్రకులావతంస! వినవే యనుమానము మాని పుత్రకుం
డప్రతిమప్రభావనిధి యన్వయదీపకుఁడు ద్భవిల్లు న
వ్యప్రచురాంగకాంతిభర యౌవన లక్ష్మియు నిన్నుఁ జెందు ని
త్యప్రమదంబు చేకుఱు మహౌషధ మొక్కటి నీకు నిచ్చెదన్. ౨ఆ

మ. ఉపథాసిద్ధుఁ ద్రివర్గశోభితు శుభోద్యోగిన్ నియోగింగృపా
విపులస్వాంతు నితాంతశాంతు స్వమనోవిశ్రాంతు నశ్రాంతు జ్ఞా
నవరున్ దానగురున్ బ్రసిద్ధగుణసంతానున్ సమానున్ గళా
నిపుణున్ మంత్రిగఁ జేసి భూపతిగనున్ నిర్ణిద్రసౌఖ్యోన్నతిన్. ౨ ఆ.

ఉ. భానుమతీకుమారకుఁడు పల్కు మహేంద్రునిఁ జూచి దేవయె
వ్వానికి గెల్పు నోటమియు వచ్చునొ కానొకవేళ దీనికై
దీనతయింత యేటికి మదీయభుజాగ్ర ధనుర్విముక్త నా
నానిశితాస్త్రపాతముల నాకుల నేనవలీలఁ గాచెదన్. ౩ ఆ.

ఉ. భానుమతీకుమార! పటుబాహుబలాఢ్యుఁడు రత్నచూడుఁడె
వ్వానికి వానికిన్ సమరవైఖరు లందలచూపరాదు ము
న్నే నలినాసనుండిఁక నభీష్టవరంబుల నిచ్చెనేనిఁ బై
పై నెఱిమించు కేసరికిఁ బక్కెరవేయుట గాదె మేదినిన్. ౩ ఆ.

ఉ. ఎక్కడనుండి వచ్చితి మునీంద్ర మహేంద్రుని వీటినుండియో
యక్కమలామనోహరున కాస్పదమౌ తెలిదీవినుండియో
ఫుక్కిటియందు నిందుముఖిఁ బూనిన వేలుపుఱెంకినుండియో
చక్కెరవిల్తునేర్చు దొరసావడినుండియో ధాత్రినుండియో. ౪ ఆ.

ఉ. తమ్ములగొంగ జక్కవలదాడి వియోగులముక్కుగొయ్యలో
కమ్ములతన్పుపాల్కడలికానుపు వేల్పులచద్ది చంద్రకాం
తమ్ములు నానువాఁడు కుముదమ్ముల జన్మఫలంబు కల్వచే ౪ ఆ.
ల్వమ్ములయిక్క చక్కనగువాఁడు సుధాంశుఁడు దోఁచెఁ దూర్పునన్.

శా. పన్నీటంజిలకంబు దీర్చితరుణీపంచాస్త్రిఁ డారాజు లే
మిన్నల్ గుల్కెడునొంట్లు హారలతయున్ మేతావినున్నాఁతయు
న్నిన్నుంగన్ను మెఱుంగు రంగును సురామెట్టుంబసల్ వేల్పుఁబూఁ
బిన్నల్ చుట్టుశిఖాకలాపము దగంబ్రేమంబు దైవాఱఁగన్. ౫ ఆ.

చ. ఎదుట మహీశుఁ గాంచి తరళేక్షణ మేను చెమర్ప సమ్మదం
బొదవియు సిగ్గుపెంపునఁ బయోజదళాక్షుల వంపుఁ జూపుముం
దుదలన దల్చి వైచి కరలోయజకేళి సరోరుహంబునన్
బదగాచుఁ ద్రిప్పివైచె విభుపార్శ్వగతంబగు రత్నదీపమున్. ౫ ఆ.

141 రెడ్డిపల్లె ముద్దమరాజు.

ఈకవినిగురించి యేమియుఁ దెలియరాలేదు. ఆంధ్రసాహిత్య పరిషత్తునం దున్న యుదాహరణ గ్రంథములో నీముద్దమరాజు అష్టమహిషీ కల్యాణము లోనివని రెండుపద్యము లుదాహరింపఁబడియున్నవి. వాని నీక్రింద నుదాహరించుచున్నాఁడను.

ఉ. రామకథాసుధారసము బ్రహ్మపయోంబుధి ముగ్గియుండఁగా
నేముని వాక్యమందర మహీధరసన్మథనంబుచే సము
ద్దామత సంగ్రహించి విబుధప్రకరంబున కిచ్చె నర్థిమై
నామహితుం బ్రచేతసుని యాత్మజుఁ గొల్చెద నాదిసత్కవిన్.

శా. శ్రీవామాగ్రహలిప్త సన్మృగమదశ్రీఁబొల్చు వక్షంబునన్
శ్రీవత్సంబు వెలుంగఁ గౌస్తుభము లక్ష్మీదీపమై యొప్పఁ ద
ద్దేవీఖేలనలోలచిత్తుఁ డగు శ్రీదేవుండు కృష్ణుండు స
ద్భావం బొప్పఁ గృపావలోకనమునన్ బాలించు త్రైలోక్యమున్.

రెడ్డిపల్లె అనంతపురమండలమున కదిరితాలూకాలో నున్నది. ఆగ్రామమునుబట్టి యీకవి యింటిపే రేర్పడియుండవచ్చును. ఆగ్రామమున రెడ్డిపల్లెవా రుండి రేమో తెలిసికొనుటకుఁ బ్రయత్నించితిని గాని నాప్రయత్నము నెరవేరలేదు. ఈపద్యముల నుదాహరించిన యుదాహరణగ్రంథకర్త క్రి. శ. ౧౫౬౦ ప్రాంతమువాఁడుకావున నీకవి యంతకుఁబూర్వుఁ డగుట నిశ్చయము.

62

142 ఒడ్డెపూడి పెద్దయకవి.

ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కాశ్యప గోత్రుఁడు; పేరమాంబా వెంకటమంత్రులతనయుఁడు.

ఈతఁడు వాయుపురాణమందలి మాఘమాహాత్మ్యము నాంధ్రీకరించి కమ్మచౌదరీపట్టభద్రుఁడగు దాసరి చినగంగన్న కంకితము చేసెను. ఈకవి చినయొడ్డెపూడికిఁ గరణమైన ట్లీక్రిందిపద్యము వలనఁ దెలియుచున్నది. ఈచినయొడ్డెపూడి నైజామురాష్ట్రములోనిదై యుండును.

చ. వినతసమస్తభూభుజుని వేంకటమంత్రికిఁ బేరమాంబకున్
దనయుని బుణ్యవర్తనుని దానగుణాన్వితు నారసింహస
ద్ఘనగుహచంచరీకు ననివార్యవచోరచనావిశారదున్
ననుఁ జినయొడ్డెపూడిపురనాథునిఁ బెద్దకవీంద్రచంద్రునిన్.

ఈకవి లక్ష్మీనృసింహ వరప్రసాద లబ్ధకవితాసార యశస్కుఁడైన ట్లీక్రిందిగద్యములోఁ గాననగును.

"ఇది శ్రీమద్వరాహగిరి లక్ష్మీనృసింహవరప్రసాదలబ్ధ సారస్వతవిచిత్రాపస్తంబసూత్ర కాశ్యపగోత్రపవిత్ర ఒడ్డెపూడి వేంకటమంత్రిపుత్ర సకలసుకవిజనవిధేయ పెద్దయ నామధేయప్రణీతం బైనవాయుపురాణంబునందు మాఘమాహాత్మ్యం బనుమహాప్రబంధంబు"

ఈలక్ష్మీనరసింహస్వామి విశాఖపట్టణమందలి సింహాచలమందున్నాఁడు. ఈకవి యాస్వామి యనుగ్రహముచే లబ్ధమైన సారస్వతము గలవాఁ డనుటచే నాప్రాంతములవాఁడనితోఁచుచున్నది. ఈకవియో, యాతనితండ్రియో, యచ్చటనుండి యోఢ్రరాజులనాశ్రయించి, తెలంగాణమునకు వచ్చి యొడ్డెపూడికరణికమును సంపాదించి యుండును. ఈగ్రంథకృత్యాదిలో:—

"అని శ్రీమద్వరాహగిరి వేంకటలక్ష్మీనృసింహులం దలంచి తదనుగ్రహంబున నిరఘుండనై కృతార్థతం జెందితి" నని చెప్పకొని యున్నాఁడు.

గ్రంథాదిపద్యమున శోభనాద్రీశ్వరుని నీక్రిందిపద్యములో నుతించియున్నాఁడు.

శా. శ్రీ లింపొందఁగ నాల్గుహస్తముల లక్ష్మీదేవి నుంజెక్కులన్
బాలిండ్లన్ సవినోదలీల మకరీపత్రావళుల్ వ్రాయుశౌ
బాలంకారుఁడు శోభనాచలనృసింహస్వామి సద్ధర్మసం
శీలున్ దాసరిచిన్నగంగవిభు దాక్షిణ్యంబునం బ్రోవుతన్.

కవినిగూర్చి కృతిపతిపలికినవాక్యముల నిందుక్రిందఁబొందుపరచుచున్నాఁడను.

వ......వాయుపురాణం బుత్తమం బని యార్యజనంబు లెన్నుదురు. తదీయఖండత్రయంబులో మాఘమాహాత్మ్యఖండంబు పయఃపారావారమథనంబున నుదయం బగు సుధారసంబుపోల్కి హరిభక్తి హేతుకంబును సకలజన వర్ణితంబునునై యొప్పు నప్పుణ్యకథ యాంధ్రభాషానిరూఢి నొక్కకృతి చమత్కృతిగా రచింపుమని......

ఉ. పంకజగర్భదారకటిభాగ వికాసితభర్మమేఖలా
కింకిణికావిరావములఁ గేరి తదీయకరాగ్రవిస్ఫుర
త్కంకణ నిష్కళంకనినదంబు నగున్ చినయొడ్డెపూఁడిమా
వేంకటమంత్రిపెద్దన నవీనవిలాసవచోనిగుంభనుల్.

ఈయొడ్డెపూఁడిసిబట్టి కవి గృహనామమేర్పడియుండును.

ఈకవి యీక్రిందిపద్యములోఁ గావ్యలక్షణమును జెప్పి యందులకు లక్ష్యముగాఁ దన కావ్యమును రచియించియున్నాఁడు.

ఉ. లక్షణయుక్తమై కనదలంకృతిలో నతులార్థసంగ్రహో
ద్వీక్షణ గల్గి భర్తకునుదీర్ణయశంబును గల్గఁజేయుచున్
దక్షతలోడుతన్ వినిన దారితకల్మషమై పతివ్రతా
బ్జాక్షి యనంగ నొప్పవలదా కృతి సర్వసభాంతరంబులన్.

కవి తనగ్రంథమునఁ గమ్మవారి నిట్లు వర్ణించియున్నాఁడు.

చ. హరిపదసంభవుల్ బుధహితాతిశయుల్ కమలాశ్రయుల్ శుభా
చరులును బుణ్యజీవనులు సత్పథవర్తులు లోకపావనుల్

సరసకవిప్రజాస్పదులు చారుగభీరులు నై వియన్నదీ
స్థిరగతు లై; వారి నుతిచేసెదఁ గవ్యకులాగ్రగణ్యులన్.

కృతిపతిని గవివర్ణించిన పద్యము నీక్రింద నుదాహరించుచున్నాఁడను.

సీ. సహకారపనసకేసరనింబజంబీర
సరళాది భూరుహోత్కరము నిల్పె
నిఖిలజీవాధార నిష్పుష్కరమైన
చెఱువు చేయించె నచ్చెరువుగాఁగఁ
జతురదేవాగార శార్ఙ్గ కోదండప్ర
తిష్ఠాసమాసక్తిఁ దేజరిల్లె
నుర్వీసురశ్రేణి కుపనయనోద్వాహ
వస్తుప్రదాతృఁడై వాసికెక్కె
నౌర!యన మీఱెఁ బురుషోత్తమాభిధాన
పట్టణ స్థిరచౌదరి పట్టభద్రుఁ
డనుపమోదారనియతవర్తనుఁడు మాన
ధనుఁడు దాసరిచినగంగఘనయశుండు

కృతిపతికిఁగలవిద్యాదక్షత, యీక్రిందిపద్యమువలనఁ దెలియును.

మ. క్రమమింపొంద పురాణముల్ వినియు, ముఖ్యగ్రంథశాస్త్రేతిహా
సములున్ నాటకకావ్యలక్షణ బహుచ్ఛందంబులన్ జ్యోతిషా
గమసంగీతరహస్యముల్ స్మృతు లనేకంబుల్ విమర్శించితిన్
సమబుద్ధిప్రతిభన్ రమేశ్వరపదాబ్జ ధ్యానసంశీలినై;

కృతిపతినివాసము, బెజవాడసమీపమందున్న కొండపల్లికిఁ జేరువనుగల పురుషోత్తమపట్టణమనియు, నది పురుషోత్తమగజపతిచే నిర్మింపఁబడినదనియు నీక్రిందివచనమువలనఁ దెలియుచున్నది.

"......కొండపల్లికిం బ్రాగ్భాగంబున నున్నతత్స్థలంబునఁ గటకసింహాసనాధీశ్వర వీరశ్రీపురుషోత్తమ గజపతి నిర్మితంబును,... పురుషోత్తమనామ పట్టణంబునఁ బరిపూర్ణ కరుణాసముద్రుండును గమ్మ

వంశ పారావార చంద్రుండును,... శ్రీమన్నారుట్ల గోత్ర పవిత్రుండును, సూరివర్ణిత చరిత్రుండును మద్దాలి తిరుమలాచార్య శిష్యుండును కవిత వైదుష్యుండును నగు దాసరి చినగంగనాహ్వయుండు".

కృతిపతికి నల్వురు పుత్రులున్నట్లును, వారు దానశౌర్యాది గుణములుగల యుత్తములైనట్లును కవివర్ణించియుండుటచే నీగ్రంథమును గృతిపొందిననాఁటికి, గృతిపతి యఱువది సంవత్సరములకుఁ దక్కువ కాని వయసునందుండియున్నట్లూహింపఁదగియున్నది.

గ్రంథరచనాకాలమును కవి చెప్పియుండలేదు. ఈకవి కాలమునుగూర్చి భిన్నాభిప్రాయమున్నది. కృతిపతినివాసమైన పురుషోత్తమపట్టణము పురుషోత్తమ గజపతికాలమున నిర్మింపఁబడినదని చెప్పియుండుటచేతను, పురుషోత్తమ గజపతి హయాణశకము ౧౪౬౭ మొదలు ౧౪౯౭ వరకు రాజ్యముచేసినవాఁడగుటను నీకావ్యము పదునైదవ శతాబ్దికిఁ దరువాత రచితమయ్యెననుట స్పష్టము. ఇదిగాక కవికాలమును దెలిసికొనుట కింకొక యాధారము గన్పట్టుచున్నది. కృతిపతియైన దాసరి చినగంగన హరిశ్చంద్రమహీపతిచేత బహుమతులనుబడసినట్లీక్రిందిపద్యములోఁ జెప్పియున్నాఁడు.

ఉ. సాంద్రయశోధనుండు హరిశౌర్యుఁడు బాహుబలేంద్రుఁడా హరి
శ్చంద్రమహీతలేశుఁడు భృశంబుగ సత్యవచో (?) నాసంగఁగాఁ
జంద్రసుగంధపుష్పఘన సంకుమదాంబర రత్నరాజి ని
స్తంద్ర శుభోక్తిఁ గైకొనియె దాసరి గంగన లోకమెన్నఁగన్.

ఈహరిశ్చంద్రుఁడు, ఓఢ్రదేశపు రాజులైనగజపతులకడ సైన్యాధిపతిగానున్నవాఁడు. ఈతనిని కులీకుతుబ్‌షాహాయను గోలకొండ ప్రభువు కుమారుఁడగు హైదర్‌ఖాన్ అనునాతఁడు జయించి పట్టుకొనినట్లు అద్దంకి గంగాధరకవి తపతీసంవరణోపాఖ్యానమున నీక్రింది పద్యములోఁ జెప్పియున్నాఁడు.

శా. శీవిన్ హైదరుఖానుఁడుద్ధవిడి నాడ్డీలన్ విభాళింపుచో
నావేళన్ బెదకొండపల్లికడ జన్యక్షోణి దీప్తారి ర

ఖా వైయర్తులు వాహినీపతి హరిశ్చంద్రుండు మార్కొన్నచో
జీవగ్రాహముగాఁగఁ బట్టుకొనె నక్షీణప్రభావోన్నతిన్.

కులీకుతుబ్‌షాహ క్రీ. శ. ౧౫౧౧ మొదలు ౧౫౪౩ వఱకును రాజ్యముచేసినవాఁడు. ఈతని రాజ్యకాలములోనే హైదర్‌ఖాను హరిశ్చంద్రుని జయించియుండును. కావున గృతిపతియైన చినగంగన యాకాలమువాఁడని యనుటకు సంశయము లేదు. కులీకుతుబ్షా కుమారుఁడైన హైదరుఖానును ఆతని కొమ్మఁడైన జంషడ్‌కుతుబ్‌షా తండ్రి జీవితకాలములోనే యంధునిఁ గావించి, తండ్రియైన కులీకుతుబ్షానును వధించి క్రీ. శ. ౧౫౪౩ లో గోలకొండ సింహాసన మాక్రమించుకొనియెను. అందుచేత హైదరుఖాను, హరిశ్చంద్రునిఁ బట్టుకొనినది ౧౫౪౩ సంవత్సరమునకుఁ బూర్వమైయుండును. హరిశ్చంద్రుఁడు చినగంగనను గౌరవించినకథ యీగ్రంథమున వర్ణితమైనది కావునను, ముకుందదేవుని పేరుదాహృతమైనది కావునను, నీకావ్యము క్రీ.శ. ౧౫౫౦–౬౦ ప్రాంతమున రచితమయ్యెనని నాయభిప్రాయము.

బ్ర. శ్రీ. వీరేశలింగము పంతులుగారు, "వాయు పురాణము కృష్ణదేవరాయని కాలమున కనంతరముననే రచియింపఁ బడినట్లు తెలిసినది. కాని యెప్పుడు చేయఁబడినదో తెలియదు. అప్పకవియీపురాణమునుండి పద్యముల నుదాహరించి యుండక పోవుటమొదలయిన కొన్నిహేతువులనుబట్టి హరిబట్టకవి కాలము వలెనేయీకవికాలమును ౧౬౬౦ సంవత్సరప్రాంతమని యూహింపదగియున్నది." అని వ్రాసియున్నారు. శ్రీపంతులుగారి హృదయమునకుఁ దట్టిన "మొదలైనకొన్ని హేతువు" లేవో మనకుఁ దెలియవు. అప్పకవి యీతని గ్రంథమునుండి పద్యముల నుదాహరింపకపోవుట కారణముగాఁ గైకొని యీకవిని అప్పకవికిఁ దరువాతివాఁడనుట సమంజసముకాదు. అప్పకవి లక్ష్యములుగాఁ దీసికొనని గ్రంథములనేకము లంతకుఁబూర్వపుఁవికలవు. శ్రీపంతులుగా రీకారణముచేతనే యప్పకవికిఁ దరువాతివాఁడని నిర్ణయించిన హరిభట్టు శాసనవాఙ్మయాధారములచే నప్పకవికి నూఱేండ్లు

పూర్వుఁడని స్పష్టమైనది. కావున నిప్పట్టున శ్రీపంతులుగారి యూహ యనుసరణీయము కాఁజాలదు.

కమ్మవారి చారిత్రమును రచించిన శ్రీకొత్త భావయ్య చౌదరి గారు శ్రీపంతులుగారియూహ నాధారముగాఁ గైకొని మరికొన్ని యుపపత్తులను జేర్చి కృతిపతి కాలము క్రీ. శ. ౧౬౬౦ ప్రాంతమని నిర్ణయించియున్నారు. పెద్దయకవి రచించిన మాఘమాహాత్మ్యకృత్యాది యందలి పద్యములనుబట్టి యీక్రింది వంశవృక్షమేర్పడుచున్నది.

నారయ్య
|
తిమ్మనీఁడు
|
నాగయ్య = సూరమ్మ
|
పెదగంగన = అక్కమ, నాగన, తిమ్మన, ఎల్లన

పెదగంగన = అక్కమ
|
నాగినేఁడు, చినగంగన =
|
| | | |

దాసరి తిమ్మనేఁడనునాతఁడు, వెలుగోటి కస్తూరి రంగనాయనితోఁ బోరి పాఱిపోయినట్లు వెలుగోటివారి వంశావళిలో నున్నదనియు, నాయుద్ధము క్రీ. శ. ౧౫౭౮ లో జరిగెననియు, నాతిమ్మనేఁడే, పై వంశవృక్షములోని రెండవ పురుషుఁడనియు, నాతనికి మునిమనుమఁడైన చినగంగన క్రీ. శ. ౧౬౬౦ ప్రాంతమున నున్నవాఁడని నిశ్చయింపవచ్చుననియు, శ్రీ భావయ్య చౌదరిగారి యభిప్రాయము.

శ్రీచౌదరిగారాధారపడిన వెలుగోటివారి వంశావళిలోని పద్య భాగమిదిగానేయుండును.

"దాసరేంద్రుని తిమ్మనిం దళితమితతిమి
జయముంజేకొన్న వెలుగోటి సార్వభౌమ
విమతమదభంగ యేచభూవిభునిరంగ! 132 వ పుట

ఆతిమ్మనీఁడే యీతిమ్మనీఁడనుట కాధారములులేవు. కృతిపతికిఁ బిమ్మట నావంశములోనో మఱియొక వంశములోనో వేఱొక తిమ్మనేఁడుదయించి శూరుఁడై యుండును. కృతిపతినివాసము కొండపల్లిసమీపముననున్న పురుషోత్తమపట్టణము. ఈ కొండపల్లి దుర్గమును క్రీ. శ. ౧౫౧౫ లో శ్రీకృష్ణదేవరాయలు స్వాధీనము చేసికొనియెను. ప్రతాపరుద్ర గజపతికిని, రాయలకును జరిగిన సంధిననుసరించి, తరువాతనాదుర్గము గజపతుల పరమైనను నది విశేషకాలము వారిక్రింద నుండలేదు. రాయలయనంతరమునఁ గులీకుతుబ్షా స్వాధీనము చేసికొనినట్లు తపతీసంవరణోపాఖ్యానములోని "కొండంత జయములోఁ గొండపల్లి" యను వాక్యము చెప్పుచున్నది. ఆప్రాంతమా తరువాత నెప్పుడును మరల గజపతుల స్వాధీనములోనికి రాలేదు. చినగంగని కాలము ౧౬౬౦ ప్రాంతమనిచో గజపతుల వాహినీపతియైన హరిశ్చంద్రుని యధికారమాకాలమునఁ బానప్రాంతమునఁ జెల్లుచుండవలసి యుండును. అట్లుండెననుట కాధారములేమియు లేవు. ౧౬౬౦ వ సంవత్సరమునకుఁ బూర్వమే ఒరిస్సారాజ్యమే మహమ్మదీయుల వశమైపోయినది. ఒరిస్సావారియధికారము కొండపల్లి ప్రాంతమునఁ జెల్లుచున్నదని తలంప వీలులేదు. మాఘమాహాత్మ్య ద్వితీయాశ్వాస ప్రారంభమునందలి:

"క. శ్రీసార్వ హరిశ్చంద్ర మ
హీస్థలసుత్రామ పరిహృష్టహృదయాదరణో
ద్భాసిత విభవముకుంద స
దాసేవాంతరంగ! దాసరిగంగా!"

అనుపద్యమునుబట్టి ముకుందదేవుని సామంతుఁడై యుండునని శ్రీభావయ్యచౌదరి గారూహించినారు. ముకుందదేవుఁడు ఒరిస్సా రాజ్యమును క్రీ. శ. 1559–1568 సంవత్సరములలోఁ బరిపాలించిన వాఁడు. ఇతఁడు అక్బరుతో క్రీ. శ. ౧౫౬౫ వ సంవత్సరములో సంధి కావించుకొనియెను. ఈముకుందదేవుని కుమారుఁడైన బాహుబలేంద్రుని శాసనము క్రీ. శ. ౧౬౦౪ లోఁ గన్పట్టుచున్నది. ౧. కాని యీబాహుబలేంద్రుఁడు దాసరిగంగన కాలములోని బాహుబలేంద్రుఁడు కాఁడు. దాసరిగంగన్న కాలములోని బాహుబలేంద్ర హరిశ్చంద్రులు ముకుందదేవునకుఁబూర్వులు. ముకుందదేవునిబట్టి చూచినను, మాఘ మాహాత్మ్యకృతిపతి క్రీ. శ. ౧౫౬౦ ప్రాంతమువాఁడగును. కాని ౧౬౬౦ ప్రాంతమువాఁడు కాఁజాలఁడు. గోలకొండ సుల్తానగు కులీకు తుబ్షాకుమారులు జంషడ్‌కుతుబ్షా, ఇబ్రహీంకుతుబ్షాలును, మనవఁడగు మహమ్మద్ కులీకుతుబ్షాయును దమతమ కాలములలో (1544–1611) ఒరిస్సాదేశముపై దండెత్తియుండిరని చరిత్రలు చెప్పుచున్నవి. ఆపక్షములో 1660 ప్రాంతమునఁ గొండపల్లిప్రాంతము ఒరిస్సా పరిపాలకులక్రిందను, వారి సామంతులక్రిందను నున్నదని తలంచుట కవకాశములేదు. కావునఁ గృతిపతిని బహూకరించిన హరిశ్చంద్రుఁడును హైదరుఖానుచే జయింపఁబడిన హరిశ్చంద్రుఁడును నొక్కఁడేయనియుఁ మాఘమాహాత్మ్యకృతిపతి క్రీ. శ. ౧౫౧౦–౧౫౬౦ కాలమువాఁడేనియు, పెద్దయకవియు నానాఁటివాఁడేయనియు నిశ్చయింతము. చినగంగనను బహూకరించిన హరిశ్చంద్రుఁడు బాహుబలేంద్రుని కుమారుఁడని తోఁచుచున్నది. వీరికిని ముకుందదేవునకునుగల సంబంధము విచారణీయము.

కవి, కృతిపతినెంతగా వర్ణించియున్నను, నీతఁడొక రాజ్యమేలెడి ప్రభువుగాఁడనియు, మహౌదార్యగుణముగల ధనవంతుఁడగు నొకగొప్ప భూస్వామియనియుఁ దలంపవలసియున్నది. పురుషోత్తమ పట్టణమునందు చౌదరీ పట్టభద్రుఁడని కవియే చెప్పియున్నాడు.

---

౧. కళింగదేశచరిత్ర. పుటలు ౬౫౭–౬౬౧.

కవిత్వమునందక్కడక్కడఁ గొన్ని నెరసులున్నను మొత్తము మీఁద నీతని రచన రసవంతముగానే యున్నది. కవిత్వశైలి తెలియుటకై మాఘమాహాత్మ్యమునుండి కొన్నిపద్యముల నుదాహరించుచున్నాఁడను. ఈగ్రంథమింకను ముద్రితముకాలేదు. మదరాసుప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునందొక తాళపత్రప్రతి యున్నది.

మ. కరణాచ్ఛాదితమై ఘనాఘన బృహద్గర్జారవస్ఫారమై
వరవిద్యుల్లతికాతతి ప్రభవమై వాస్తోష్పతిప్రాప బం
ధురమై సర్వదిశావిభాగముల నస్తోకాంబు పూర్ణంబుగాఁ
గురిసె న్వర్షము నీడజవ్రజము సంక్షోభింప భీమంబుగాన్.

చ. చెలఁగి వసంతవేళ విలసిల్లిన చంపకకింశుకావళీ
విలసిత సుప్రసూనములు విస్ఫుటమై తగుకోకకాకలీ
కలకలరావముల్ బహుముఖంబుల భవ్యరసాల పంక్తులన్
వెలయఁగ బంభరధ్వనులు వీనులకింపుదలిర్పుచుండఁగన్.

మ. అలగ్రీష్మర్తువుచేతఁ బంకము నిరాహారమ్ముసూర్యోదయా
కలనన్ చీఁకటిమాడ్కి జ్ఞానమొదవంగాఁ గర్మవిచ్ఛిత్తియా
విలసజ్జ్ఞానము కర్మమూల మనుప్రావిద్యోవ్యశ్రమ వాక్పద్ధతిన్
సలుపంగా వలయున్ నిరంతరము విశ్వాసంబు సంధిల్లగన్. ౪ ఆ.

ఉ. ఎందులనుండి యెచ్చటికి నేఁగుచు నెట్టివ్రతంబు పూని మీ
రిందుల కేఁగుదెంచితి రహీన గుణాకరులార! యిట్లు నా
నందములొదవ వచ్చుకతనన్ జననంబు ఫలించె భాగ్యముల్
సెందె సమస్తపుణ్యములు సేరె కృతార్థుఁడ నైతినింతటన్ ౪ ఆ.

మ. అని మందానిలుఁ బంచి కీరవరవాహారూఢుఁడై తుంటవి
ల్గాని వేదంబులు నారిఁగూర్చి మకరాంకుండుల్లసత్పుష్పబా
ణనికాయంబులు గాధినందనువది న్నాటించినన్ సంచలిం
చిన చిత్తంబున వమ్మునీశ్వరుఁడు రాజీవాక్షి నీక్షింపుచున్ ౫ ఆ.

చ. ననవిలుతుండు గాధినిజనందనుఁడున్నతపోవనంబు చే
రిన సకలాగమంబులు పరిస్ఫుటమై విలసిల్లినం గనుం
గొని కడుచోద్యమంది మునిపుంగవు డంగభవుండు వచ్చినాఁ
డని కని వ్యాఘ్రరూపధరుఁడై భయదాకృతి నేగుదెంచినన్.

143 గంగరాజు చౌడయ్య

ఈతని చరిత్రమేమియుఁ దెలియరాలేదు. జగ్గన కవిసేకరించిన ప్రబంధ రత్నాకరములోనివని శ్రీప్రభాకర శాస్త్రిలుగారు ప్రబంధ రత్నావళిలో నీక్రిందిపద్యములను బ్రకటించియున్నారు. ఇందు సాముద్రికశాస్త్రము కసువయామాత్యున కంకితమీయఁబడినది యున్నదని శ్రీశాస్త్రిగారు పీఠికలో వ్రాసియుండిరి.

సాముద్రిక శాస్త్రము:—

క. ఉదరంబు దర్దురోదర
సదృశంబై జఘన మతివిశాలంబైనన్
సుదతీ రత్నంబున క
భ్యుదయంబుగ ధరణియేలు పుత్త్రుఁడు పుట్టున్.

క. కడునిడుదయుఁ గడుఁగుఱుచయుఁ
గడువలుఁదయుఁ గడుగృశంబుఁ గడునల్లనిదిన్
గడు నెఱ్ఱని దగుమెయిగల
పడఁతిని గీడనిరి మునులు వరమునిచరితా!

నందనచరిత్ర:—

ఉ. వెన్నెలరూపు కప్పురపు వేలుపు వజ్రపుబొమ్మ తెల్లతా
మన్నిన నొప్పు లెప్పమనఁ బంకజ మధ్యమునందుఁ బొల్చి క్రే
గన్నుల బ్రహ్మఁజూచి చిలుకం బలికించుచు నున్నవాణియు
ద్యన్నవశబ్దభావరస తత్త్వము మత్కృతి కిచ్చు నెప్పుడున్.

సీ. కురులు వ్రాయుటయును గొదమతుమ్మెదలయ్యెఁ
గన్నులువ్రాయఁగఁ గలువలయ్యె
నధరంబు వ్రాసిన మధురబింబంబయ్యె
గళము వ్రాయుటయును గంబువయ్యెఁ
జనుఁగవ వ్రాసినఁ జక్రవాకము లయ్యెఁ
జేతులు వ్రాసినఁ జివుళ్లులయ్యె
నడుము వ్రాయుటయును నవలతయై యొప్పెఁ
బొలుపారఁ గటి వ్రాయఁ బులినమయ్యెఁ
గీ. దరుణితొడలు పాదతలములు వ్రాసినఁ
గరికరములు పల్లకములు నయ్యె
నేమివ్రాయఁదలఁచి యేమివ్రాసితి నని
మదన విభ్రమమున మనుజవిభుఁడు.
క. కులమున బలమునఁ జలమున
నలవునఁ గార్యమున సదృశులగు వారలతో
బలిమి యుడిగి సామముగాఁ
దలకొని చేయునది నీతితత్త్వజ్ఞులకుఁ.
గీ. దొడ్డముత్తియంబు తోరంపుఁ బటికంబు
వెండిగుండు మొల్లవిరులచెండు
రసము గుళికకప్పురంబున కరుదు నా
సొంపుమిగిలి వేగుఁజుక్క వొడిచె.
సీ. బచ్చెనయోవరి బంధాల మేల్కట్టు
సకినల మంచంబు జమిలిపఱుపు
నిలువుటద్దము హరినీలఁపు గద్దియ
పటికంపుగిండి హొంబట్టు సురఁటి
పసిఁడిపావలు వెండి పడిగంబు ముత్యంపు
జాలవల్లిక కెంపుసాన ఱాయి
పగడంపుదివియకంబము వజ్రములతట్ట
మరకతమయ మగుమధుపుకుడుక

గీ. గరిగె పోఁకయొత్తు బరణిసున్నపుఁగ్రోవి
కప్పురంపుఁబెట్టె గాజుకోర
తనువు నునుపు తడియొత్తు మడుఁగులు
నాదియైనవాని నలవరించి.

చ. ముదిమికి మందు వాకలిమి ముంగలి జిహ్వతపః ఫలంబు స
మ్మదము నివాస మింపుగని మారవికారము ప్రోది కామినీ
వదన విభూషణంబు జనవశ్యము హాస్యరసాబ్ధిలాస్య సం
పద యుదయస్థలంబు మధుపాన సుఖంబు జగత్ప్రియంబునన్.

గీ. వికసితంబైన మోమున వెండికోరఁ
గదిసి మధువొక్కయొత్తున సుదతి కొనిన
మగువమొగ మెచ్చునను శశిమండలంబు
చెలువముగఁ జేయఁ బెట్టింపఁ జేర్చినట్లు.

శా. సారాచార విచారు నుత్తమకులున్ సౌజన్యధన్యున్ కృపా
పారున్ శూరు వికారదూరు ననఘున్ గంభీరు ధీరున్ మహో
దారున్ భవ్యు సమస్తకార్యవిదు నాప్తప్రాప్తు సర్వేంగితా
కారజ్ఞున్ హితు మంత్రిఁ జేసి పతి సౌఖ్యంబందుచుండందగున్.

ఇది నందన చరిత్రయే కాని, నందనందన చరిత్ర కాదు. కవి చారిత్రము తెలిసికొనుట కాధారములు లభింపలేదు. నందన చరిత్ర మనఁగా నందనుఁ డను రాజు చరిత్రమేమో! యని మనుజవిభుఁ డను పదమును బట్టి తోఁచుచున్నది. ఇందలి పద్యములు శృంగార రసమును బోషించుచున్నవి. ఈకవి క్రీ. శ. ౧౫౬౦ కిఁ బూర్వుఁడనుటకంటె నేమియుఁ దెలియరాలేదు.

144 నారన సూరన

ఈకవి యింటిపేరేదియో తెలియదు. ఇతని తండ్రిపేరు నారన. తండ్రిపేరనుబట్టి నారన సూరన యని యాంధ్రకవుల చరిత్రమున వ్రాసియుండుటచే నేనును నట్లే వ్రాసితిని. ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; కౌండిన్యగోత్రుఁడు; తండ్రి నారన; తల్లి అక్కమ.

ఈకవి వనమాలీ విలాసము, ఉదయనోదయము అను రెండు చక్కని ప్రబంధములను రచించెను కాని యవిరెండునుగూడ ముద్రితములు కాలేదు. వనమాలీ విలాసముయొక్క యముద్రితప్రతి బ్ర. శ్రీ. కందుకూరి వీరేశలింగము పంతులుగారిదగ్గర నుండెడిదఁట. ఆయన యీకవినిగూర్చి ఆంధ్రకవుల చారిత్రమున వ్రాసినవాక్యముల నీక్రిందఁ బొందుపరచుచున్నాఁడను.

"ఇతఁడు వనమాలీవిలాసమను కావ్యమును జేసి కొండూరి యక్కదండనాథుని కంకితముచేసెను. నావద్దనున్న యీగ్రంథము యొక్క ప్రతి యసమగ్రమయినది. అవతారికలేదు. కృతిపతి మంత్రియు దండనాథుఁడునయి యజ్ఞముచేసిన నియోగిబ్రాహ్మణుఁడు. కవి నారనామాత్యుని కుమారుఁడైన నియోగి విప్రుఁడు. ఇతఁడాధునికుఁడని చెప్పుటదక్కఁ గవికాలనిర్ధారణము చేయుటకుఁ బుస్తకమునం దాధారమేదియుఁ జిక్కలేదు. ఈతనికవిత్వము సలక్షణమయి మృదువుగానున్నది." వనమాలియనఁగా శ్రీకృష్ణుఁడు. వనమాలీ విలాసమనఁగా శ్రీకృష్ణవిలాసమని యర్థము. మిత్రవిందలోఁ గృష్ణునకైన పరిణయకథ యిందువర్ణితము.

ఈకవి తన గృహనామము నెచ్చటను జెప్పియుండలేదు. ఆంధ్రపరిషత్కార్యాలయమున వనమాలీ విలాసముయొక్క వ్రాఁతప్రతి యొకటి కలదు. అందుఁగృత్యాదిలేదు. కృతిపతియైన యక్కయ దండనాథునితల్లి యెల్లమాంబికయైనట్లును భార్యపేరు ఐతమాంబయైన

ల్లను ఆశ్వాసాంతపద్యములనుబట్టి తెలియుచున్నది. ఇతఁడు సోమయాజికూడనైయున్నాఁడు.

"ఎల్లమాంబికాకుమార! హేమశైలధీర! సం
ఫుల్లవై భవత్కుబేరమానహార! విద్వదా
పల్లతావన కుఠార! పల్లవాధరామనో
హల్లకాస్త్రరూప! కొండురక్కదండనాయకా!
"కొండూరి యక్కాధ్వరీ!"
"ఐతమాంబాధవా! అబ్జగర్భాన్వయాఖ్యాత కొండూరియక్క
ప్రభుగ్రామణీ!" కొండూరక్కమహేంద్రా!"

ఈయక్కదండాధినాథుఁ డెవ్వరో యేప్రభువునొద్ద దండాధిపతిగనుండెనో తెలియలేదు. వనమాలీవిలాసమునుబట్టి కృతిపతి కృతికర్తలనివాసములును దెలియరాలేదు.

ఈకవి రచించిన రెండవగ్రంథమగు మదయనోదయ మైదాశ్వాసములుకలది. దీని యముద్రిత ప్రతియొకటి తంజావూరు సరస్వతీ మహాలునందును దీనిప్రతిక, యాంధ్రసాహిత్య పరిషత్తునందును గలదు.

ఈగ్రంథము ముడియము లోకయామాత్యుని కుమారుఁడైన భాస్కరమంత్రి కంకితమీయఁబడినది. కృతిపతి నందవరీక నియోగి బ్రాహ్మణుఁడు. శ్రీవత్సగోత్రుఁడు.

ఈగ్రంథమున సూరనకవి తనసుగూర్చి యిట్లు చెప్పుకొని యున్నాఁడు.

సీ. కౌండిన్యగోత్ర విఖ్యాతుండ సత్కవి
మాన్యుండ నరసనమంత్రి మణికి
వనిత యక్కాంబకు వరతనూజుఁ డంగి
గూనాఖ్యునకు గూననాహ్వయునకు
గారాపుసయిదోడ నారాయణ పదార
విందసంసేవనా విమలమతిని

గావ్యనిష్ణాతుఁడ గజరావు బిరుదాంకుఁ
డను రాచవారికిఁ దగు...

తే. సృష్టివాచీఘుర......వర్త
నాభిరాముఁడ బంధులోకానుభావ...
మానవిభవుండ నయకళామందిరుండ
సూరనాఖ్యుఁడ సత్యసంధాభికుండ.

సూరనకవి గ్రంథమును రచించి యెవ్వరికిఁ గృతియివ్వకుండఁ జనిపోయెనఁట! అతని కుమారుఁడైన నారయామాత్యుఁడు ముడియము భాస్కరామాత్యునకుఁ గృతియిచ్చిన ట్లీక్రిందిగద్యపద్యములవలనఁ దెలియుచున్నది.

“అని యీప్రకారంబున విద్యోతితాత్మ ప్రజ్ఞాధురంధరుండైన మాతండ్రి సూరనమంత్రి నిర్మించిన యుదయనోదయంబను మహాప్రబంధంబు తత్సూనుండగు నారనామాత్య శేఖరుం డుపలక్షించి యేతత్కావ్యకన్యకుం దగిన వరుండెవండు కలండో యని తలంచు సమయంబున—

తే. భానుసూనుండు ముడియము భాస్కరుండు.........

వ. లోకయప్రభుని బాబామాత్యుండున్నతి పేరోలగంబుండి నన్ను నారనామాత్యునిం బిలిపించి, బహుమానపురస్సరంబుగా నర్థాసనంబునఁ గూర్చుండ నిడికొని యిట్లనియె.

క. నీజనకుఁ డుదయనోదయ
మోజంగావించె సురుచిరోక్తుల నదె సం
యోజింపుము నాపేరిట
భూజననుత నారనాతిపుణ్యవిచారా!

కృతిపతి వంశవర్ణనమును గవి పెక్కుపద్యములలోఁ గావించియున్నాఁడు. కాని యాపద్యములున్న భాగము శిథిలమగుటచేఁ గాఁబోలు తంజాపురాంధ్ర గ్రంథవివరణమును బ్రకటించినవారు పద్యభాగములను మాత్రమే యుదాహరించియున్నారు. కృతిపతియైన భాస్కరమంత్రి రాయని భాస్కరుఁడేమో యని సంశయము కలుగవ

V.R NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No. 10602

చ్చును. ఈసంశయనివారణమునకై యాపద్యభాగములనుండి గ్రహించిన వంశవృక్షము నీక్రింద నుదాహరించుచున్నాఁడను. వీరు నందవరీకులగుటయు శ్రీవత్సగోత్రులగుటయు నిశ్చయము.

V.R NARLA D.P.R.I ACC. NO.

నరచురీంద్రుఁడు
- నారసింహామాత్యుఁడు
  - లక్కమంత్రి = పోచమాంబ
    - గోవిందమంత్రి = గంగమాంబ
      - లోకమంత్రి = కసువమాంబ
        - పెదతియన్న
        - భైరవుఁడు
        - చింతియన్న
        - నాగన్న
        - భాస్కరమంత్రి ఇతఁడే కృతిపతి
        - గోవిందయ్య
        - ఎల్లయ్య
        - పాంతియఘనుఁడు
        - పుత్రిమాదాంబ
        - పుత్రి గంగాంబ
      - నారదండాధినాథుఁడు
      - నాగవిభుఁడు
    - అన్నప్ప
    - బాచమంత్రి

తే........మంత్రిమాత్రుండె భాస్కరామాత్యవరుఁడు.

క. ఆభాస్కరార్యవర్యుఁడు
పాత్రిభవమునఁ గోనమాంబఁ బరిణయమయ్యెన్
శ్రీభామామణి నంబుజ
నాభుఁడు శంకరుఁడు శైలనందన వోలెన్.

సుప్రసిద్ధుఁడైన రాయనిభాస్కరుఁడు వసిష్ఠగోత్రుఁడు. కావున నీ రెండువంశములకును సంబంధము లేదు. నందవరీకులు పదుమూఁడుగోత్రములవారనియు, నైదువందలయిండ్లవారనియు నందు నూఱిండ్లవారు

శ్రీవత్సగోత్రులనియుఁ, గవి యీ క్రిందిపద్యములలోఁ జెప్పి యున్నాఁడు.

క. ఆనందపురవరంబున
నానందితబంధుమిత్రులై గుణధనులై
యేనూఱింట్లగృహస్థులు
ధీనిధు లుండుదురు భారతీపతినిభులై.

క. వీరు త్రయోదశగోత్రో
ద్ధారకు లన్యోన్యబంధుతావిస్రంభో
దారులు పారావారగ
భీరులు వెలయుదురు పాపభీతులు ఘనులై

క. వారలలో వసుధాస్థవి
బేరుం బెంపును వహించి పృథుసంబంధో
దారులు శ్రీవత్సముని
స్ఫారాన్వయజాత సదనశతం బమరున్.

కృతిపతి యైనముదియముభాస్కరుఁడు బయకారరామప్పదండ నాథునియొద్ద సైనికోద్యోగిగానుండిన ట్లీక్రిందిగద్యపద్యములవలనఁ దెలియుచున్నది.

"వ.........గర్ణాటకసింహాసన సామ్రాజ్యలక్ష్మీ సార్వభౌమ కారుణ్యలబ్ధకొండవీటిప్రముఖనిఖిల దురాధిపత్యారామ బయకారరామ ప్రధానసుత్రామ సర్వసర్వంసహాభారభరణ సంధుక్షణదక్షిణదక్షిణ భుజాస్తంభుండును......"

సీ. పాలించెఁ బ్రజలెల్లఁ బ్రస్తుతింపఁగ నబ్ధివేష్టితాశేషపృథ్వీతలంబు
నిలిపె నిశ్చలమనోనీరజాసనమునఁ బద్మలోచన పాదపద్మయుగళి
సదనము ల్గావించెశత్రుధాత్రీపాలికహింసింహశార్దూలసహితగుహలు
విడియించె సత్కీర్తివిమలేందుముఖి సప్తజలధిమద్వేష్టితవలయసీమ
నతఁడు బయకారరామదండాధినాథ
రాజ్యలక్ష్మీశుకీపద్మరాగరత్న

పంజిరాయిణిఫణిసార్వభౌమ ధీర్ఘ
బాహుపీఠుండు లోకైక ద్రిభాస్కరుండు.

ఈబయకారరామప్పయ్య కాలమును గనుగొంటిమేని, సూరన కవి కాలమును సులభముగాఁ దెలిసికొనఁ గల్గుదుము. ఇతనికి రామయ మంత్రియను నామాంతరము కలదు. ఇతఁడు అళియరామరాయల ప్రోత్సాహముపై స్వరమేళకళానిధియను సంగీతశాస్త్రమును రచించెను. ఇతనివంశీయులలోఁ బ్రతాపవంతులును గీర్తివంతులును పెక్కురున్నారు. కావున నీబయకారరామప్ప వంశవృక్షమును తిరుపతిదేవస్థానమువారి శాసనసంపుటమునుండి గైకొనియీక్రిందనిచ్చుచున్నాఁడను. ౧.

రామమంత్రి = తెలుగమ్మ.

- పెదతిమ్మయ్య భార్య లక్కాలిసమ్మ
  - బయకార రామప్పయ్య లేక రామయమంత్రి స్వరమేళనకళానిధికృతికర్త
    - లింగాలయ్య
    - కుమార్తె కామమ్మ
    - కుమార్తె అచ్యుతమ్మ.
- తిమ్మమంత్రి
- సూరమంత్రి
- భాస్కర లేక బాచరుసయ్య భార్య అమ్మాజమ్మ
  - కృష్ణప్పయ్య
- కుమార్తె చిన్నమ్మ భర్త ప్రతాప యెల్లరస

వీరు పరాశరగోత్రులు. యజుశ్శాఖీయులు. పాదిరికుప్పము గ్రామనివాసులు. ఆపస్తంబసూత్రులు. పాదిరికుప్ప మెచ్చటిదో తెలి

౧. సం ౬ భాగము౨పుట౭౬.

యుడు. కుప్పములు సామాన్యముగా చిత్తూరుమండలమున నుండును. పెరుమాళ్ళకుప్పము, పిళ్ళారికుప్పము అనుగ్రామము, లామండలమునందే యున్నవి.

భాస్కరశబ్దవాచ్యులు పెక్కురు రాయనిభాస్కరుని వంశములో నున్నారు. వారికిని వీరికిని ఎట్టిసంబంధమునులేదు. వారిదివశిష్ఠగోత్రము. ఋక్శాఖ ఆశ్వలాయనసూత్రము. నందవరీకులు, వీరిదిపరాశరగోత్రము. యజుశ్శాఖ వీరు నందవరీకులు కారు. ఆపస్తంబసూత్రులు.

ఈవంశములో రామమంత్రి నాల్గవకుమారుండైన భాస్కరుని రామయామాత్య భాస్కరుండందురు. వీరికాలములను శాసనసాహాయ్యమున ముందుగ నిర్ణయించి పిమ్మట వీరినిగూర్చి యాలోచింప వలసియున్నది.

రామయభాస్కరుని శాసనములు

౧. శా. శ. ౧౪౫౬ జయసం. కర్కాటకమాస శు ౧౦ సోమవారము అనూరాధ (క్రీ. శ. 20-7-1534) ౧
౨. శా. శ. ౧౪౫౮ దుర్ముఖి సం॥ మకర మాస శు ౨ సోమవారం శ్రవణము (క్రీ. శ. 12-1-1537). ౨
౩. కొండవీడు ప్రాంతముననున్న పర్వతము దిగువ గోపినాథ స్వామి యాలయమును నిర్మించెను. ఈశాసనకాలములేదు. ౩
౪. శా. శ. ౧౪౬౮ పరాభవ సం॥ జ్యేష్ఠ శు ౧౫ (క్రీ.శ.౧౫౪౭)౪
౫. గోపినాథస్వామి యాలయముఖద్వారమునందున్న పద్య శాసనము. ౫

పెదతిమ్మయశాసనము.

కడప మండలమున చినకొమర్లలో ఆపస్తంబ సూత్రుండును బరాశరగోత్రుండునైన తిమ్మరసు శాసనమొకటియున్నది. అది శా.శ.

---

౧. సం ౪ పుట ౬౭. ౪. ద. హిం. శా.సం.౪సంఖ్య ౬౮౮.
౨. సం ౪ పుట ౧౫౦. ౫. ఆంధ్రకవితరంగిణి సం ౪ పుట ౩౮
౩. A. R. 445 of 1915

౧౪౫౫ విజయ కార్తీక శు ౧౨ నాడు వ్రాయించినది ౧. అతఁడీ వంశ వృక్షములోని పెదతిమ్మయ యనినాయుద్దేశము.

బయకార రామప్పయ్యలేక రామయమంత్రి శాసనములు

౧. తండ్రిలోఁ గలిసి అయిదుగ్రామములను శ్రీవేంకటేశ్వరునకర్పించిన శాసనము (క్రీ. శ. 14–6–1544 ౨. క్రోధిసంవత్సర మిధున బ ౧౨ ఆదివారము) గుంటూరు మండలములోని చీరాల, పేరాల, అందుపల్లి, కొప్పోలి, యనుగ్రామము లీదానమునఁ జేరినవి. ఈశాసనములో రామమంత్రితనయుఁడైన బాచరుసయ్య పుణ్యమునకును అతనికుమారుఁడగుకృష్ణప్పయ్య పుణ్యమునకును కొంతయేర్పాటుచేసినట్లు కలదు. మఱియు, పరుచూరు, కారుమూడు, కుప్పాయినిగుంట అనుగ్రామములనుగూడ శ్రీవేంకటేశ్వరున కర్పించినట్లీశాసనమునసున్నది.

౨. శా. శ. ౧౪౬౧ వికారి సం. భాద్రపద శు౧౨. (25–8–1539) తన పినతండ్రియైన బాచరుసయ్యకును, నాతనిభార్యయైన అమ్మాజమ్మకును దనపినతండ్రి కుమారుఁడైన కృష్ణప్పయ్యకును బుణ్యమునకుగాను శివాలయములను నిర్మించి శాసనము వ్రాయించెను. తనతల్లిపేర లక్కసముద్రమను తటాకమును నిర్మించెను. ఈశాసనకాలము నాఁటికి బాచరుసయ్య జీవించియుండెననియు నాకుటుంబమునం దీరామమంత్రి కిఁగల గౌరవమును జూపుటకై వారి నామములతో బాచేశ్వర, అమ్మేశ్వర, కృష్ణేశ్వరాలయములను నిర్మించెననియుఁ దోఁచుచున్నది. ౩

౩. శా. శ. ౧౪౭౮ నల సం. వైశాఖ శు ౩. (క్రీ. శ. ౧౫౫౬) తనపుత్రియైన యచ్యుతమ్మకుఁ బుణ్యముకొరకు ఆమెపేరున అచ్యుతాపురమను గ్రామమును నిర్మించి యందు బాలకృష్ణాలయమును గట్టించెను.

ఈబయకార రామప్పయ్య శాసనములింకను గలవు.

---

౧. A. R. 357 of 1933.

౨. తి. దే. శా. సం ౫– సంఖ్య ౧౭.

౩. A. R. 302 of 1925. బళ్ళారిమండలము.

చిన్నమ్మి శాసనము

ఏయకార రామప్పయకుమేనత్తయు బాచరుసయ్యకు సోదరియు నగు చిన్నమ్మి ప్రతాప యల్లరుసు భార్యయని తిరుమల దేవస్థానము వారు పై వంశవృక్షములోఁ గనుపరచియున్నారు. ౧

తిరుపతి దేవస్థానమునందే చిన్నమ్మి శాసనమొకటియున్నది.౨. ఆశాసనమీచిన్నమ్మిదేయని వారుగుర్తించియున్నారు ౩. కానియాశాసనమున నీచిన్నమ్మి ప్రతాప యల్లరుసు కుమార్తెయనియున్నది. ఈభేదమును దేవస్థానపుశాసన ప్రకటనకర్తలు గమనింపలేదు. చిన్నమ్మి ప్రతాపయల్లరుసు కుమార్తె యైనచో నామె నీవంశవృక్షమునఁ జేర్చఁగూడదు. ఈమె రామమంత్రి కుమార్తె యైనట్లు పైని నుదాహరించిన బాచరుసయ్య శాసనములవలనఁగాని రామప్పయ్య శాసనమువలనఁ గాని ధ్రువపడుటలేదు. ఇందువలన నీవంశములో చిన్నమ్మి లేకపోయియుండవలయును లేదా పైశాసనములోని చిన్నమ్మియు నీచిన్నమ్మియు భిన్నవ్యక్తులై యుండవలయునని తోఁచును. ఇది యరవభాషలో వ్రాయఁబడినదగుటవలన భాషాంతరీకరణకర్తలు భార్యయనుటకు మారుగ కుమార్తెయని పొరపాటున వ్రాసియుండ వచ్చునని యీక్రింది శాసనమునుబట్టి తెలియుచున్నది. ౪.

ఈశాసనము చిన్నమ్మి వ్రాయించినదియే. గుంటూరు మండలమునందలి వంకాయలపాడులో సంబంధించినది. శాసనకాలము శా. శ. ౧౪౬౨ శార్వరి సం చైత్ర శు ౧౫ (క్రీ. శ. ౧౫౪౦) ఇందుఁ దాను రామయామాత్య భాస్కరుని సోదరిననియుఁ బ్రతాప యెల్లరుసు భార్యననియుఁ జెప్పుకొనియున్నది. మఱియుఁ బైనిఁజెప్పిన తిరుపతి శాసనములో వంకాయలపాడును దానొసంగినట్లుకూడఁ జెప్పియున్నది. కావున నీమె ప్రతాప యెల్లరుసునకు భార్యయనుట నిశ్చయము. రామయామాత్య భాస్కరుఁడు ఆపస్తంబసూత్రుఁడు. ప్రతాప యెల్లరుసు

---

౧. తి. దే. రిపోర్టు పుట ౨౩౬.

౨. తి. దే. శా. సం. ౫ సంఖ్య ౧౧౮ =8-7-1547 A. D

౩. తి. దే. రిపోర్టు పుట ౨౩౬ ౪. A. R. 422 of 1915

ఆశ్వలాయన సూత్రుఁడు. ఈ రెండుసూత్రములవారికిని సంబంధములు చేసికొను నాచారముకలదు. కావున చిన్నమ్మ రామమంత్రి కుమార్తె యనియే నిర్ణయింతము.

బయకార రామప్పయ శాసనములు క్రీ. శ. ౧౫౩౮–౧౫౫౬ నడుమఁ గాన్పించుచున్నవి. నారన సూరనకవి చనిపోయిన యెంత కాలమునకాతని తనయుఁడైన నారన ఈకావ్యమును దెచ్చి రామప్పయ్యకిచ్చెనో తెలిసికొనుట కాధారములులేవు. పూర్వకవి స్తుతిలో కవిత్రియమును భీమననుమాత్రమే స్మరించియున్నాఁడు. ఏదియెట్లు న్నను సూరనకవి పదునారవశతాబ్ది పూర్వార్ధమున నున్నవాఁడని చెప్పుట కభ్యంతరములేదు. వనమాలి విలాసమింతకుఁ బూర్వము రచి యించినదౌట నీతఁడు ౧౫౨౫ మొదలు కావ్యరచన మొనరించి యుండును.

కవినివాసగ్రామ మేదియో తెలియరాలేదు. ఇతఁడు గద్యయందు దాను 'ఇందీశ్వర వరప్రసాద లబ్ధకవితాసారుఁడ ననివ్రాసికొనియు న్నాఁడు. కడపమండలమునఁ గడపతాలూకాలోఁ జింతలపుట్టూరను గ్రామమున నిందీశ్వరాలయమున్నది. క్రీ.శ. పండ్రెండవశతాబ్దినాఁటి శాసనము లీయూరఁగలవు. కవినివాసమీగ్రామమని నిశ్చయింపవచ్చు ను. కృతిపతినివాసము కడపమండలములోని జమ్మలమడకతాలూకా ముడియము అగ్రహారము. దీనికిఁ బెద్దముడియమనియు బ్రాహ్మణ ముడియము అగ్రహారమనియు వాడుకపేరులు. ఈగ్రామమునుబట్టియే కృతిపతియైన భాస్కరునిగృహనామము ముడియమువారని వచ్చినది. కల్హాధరోపాఖ్యానమునురచించినముడియము వేంకటరమణకవి యీవంశీయుఁడే కావచ్చును. అతఁడు తననివాసము ముడియమగ్రహారమనియుఁ దానాయగ్రహారికుఁడ నేననియు వ్రాసికొని యున్నాఁడు. అతఁడు క్రీ. శ. ౧౬౦౦ ప్రాంతమువాఁడు.

ఇతనికవిత్వము ప్రౌఢమై సరసహృదయానురంజకముగనున్నది. శైలిచూపుటకై రెండుగ్రంథములనుండియుఁ గొన్నిపద్యముల నిట నుదాహరించుచున్నాఁడను.

ఉ. అప్పుడు కృష్ణుఁ డిందు కిరణావళిసోకున మేనఁ దాపముల్
కుప్పలుగూరిరాకఁ గని కుందుచుఁ గేలివనాంతరంబునం
దొప్పవిలాస కృత్రిమనగోపరివీథుల కేఁగి వెన్నెలం
జిప్పిలిజాలువాఱు మణిసీమములం గలచంద్రశాలికన్ ౧ ఆ.

ఉ. చూపిన నయ్యవంతినృపసూతి సురాసురకిన్నరావళిన్
భూపకుమారవర్యుల నపూర్వవయోగుణరూపధన్యులన్
చూపుల తీపులం గొసరఁ జూచి యొకానొకనిన్ నిజోల్లస
ద్రూపవిలాసలబ్ధి కనురూపముగాఁ గొనదయ్యె నాత్మలోన్ ౨ ఆ.

ఉ. ఆయెలదీఁగబోఁడి మెఱుఁగారెడి నున్ననియూరు యుగ్మముం
జేయుచునున్న యట్టిసరసీరుహగర్భుని చిత్త మే క్రియం
దోయజనాభ నిశ్చలతఁ దూఁకొనఁ జాలెనొ కాని యామటం
బోయిన జీరువాఱు మిముబోఁటులచిత్తము లేమిచెప్పుదున్ ౩ ఆ.

ఉ. నాదగుమే లెఱింగియు మనంబున నొల్లమి చేసెదేని దా
మోదర! మత్ప్రతిజ్ఞ విను ముగ్రిచిదగ్నికి దేహమాహుతిం
గా దరికొల్పి నిన్నె పతిగాఁగ వరించెద మీఁద నైనన
వ్వేదవతీవధూటిగతి వేమఱు మాటలతోటి దేటికిన్ ౪ ఆ.

ఉదయనోదయము:—

ఉ. భారపుఁబయ్యెదం జిగురుఁబయ్యెద మాటి మృణాళవల్లరీ
హారములన్ ఘటించి ధవళాయతలోచన యొర్తు రాజిబ్బం
దారకభర్తృపాదనలినంబుల మెల్లన యొత్తి పట్టి వి
స్ఫారనవప్రవాళములఁ బాణిపుటంబుల కెత్తుసేయుచున్ ౧ ఆ.

ఉ. ఆభుజగోత్తముండు సహజాకృతిఁ గైకొని నిల్చి నమ్రుఁడై
యోభువనైకపుణ్య! కరుణోల్లసితేక్షణ! నన్ను నిత్తరిం
బ్రాభవ మొప్ప నీయెఱుకుబారికిఁ దప్పఁగఁ ద్రోయునీకృపా
వైభవ మేమిచెప్ప! మఱువందగునయ్య! మహోపకారముల్. ౨ఆ.

ఉ. మానియనుజ్ఞచే ముదితమానసుఁడై పఱతెంచి పాదప
ద్మానతుఁ డైనవాని విపులాంసమహాభుజు నాత్మబింబమున్

బోనితనూజు నెత్తి పరిపూర్తిగఁ గౌఁగిటఁ జేర్చి తోఁచెనా
మానవవల్లభుం డతనిమస్తకమున్ బ్రమదాశ్రుధారలన్ ౩ ఆ.

ఉ. మానవతీలలామ! విను మద్వచనస్థితిఁ బంచచూడయై
మానితరక్తగంధకుసుమంబులు గైకొని నగ్నవృత్త్యను
ష్ఠానవిధిం భవజ్జనని బాలి నిశావ్రత మాచరించినన్
గాని చనంగరాదు మధుకైటభవైరిపురంబుఁ జేరఁగా
బోననువో దివంబునకు భోరనసుందరి బొందితోడుతన్ ౪ ఆ.

ఉ. చీరలెడల్చి కేళి కెడసేయక పైకొని రవ్వధూవరుల్
పేరుగ నిట్టివారి కెసపెట్టి మనంబుల మానవిత్తముల్
జూరఁగొనంగ లేచినప్రసూనశరుం డనుకొల్లకాఁడు దు
ర్వారుఁ డమూల్యమైనవలువల్ మునుమున్న హరింపకుండునే ౫ ఆ.

కృతిపతి మాధ్వమతాభిమానియైన ట్లీక్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది.

క. అతులితమధ్వాచార్యో
దితమతసిద్ధాంతపటుమతి వ్యాసమహా
యతిరాయగురుకృపాసం
తతవర్ధితవిష్ణుభక్తితాత్పర్యునకున్.

145 పలకలూరి గోపన

కాకునూరి యప్పకవికృతమగు నప్పకవీయమునం దీక్రింది పద్యము పలకలూరి గోపనదిగా నుదాహృత మైనది. కేవలము కొన్ని చాటుధారలను రచించినంతమాత్రమున నాతనిపద్యమును లక్ష్యముగా నప్పకవి యంగీకరించియుండఁడు. ఇతఁడు గ్రంథకర్తయై యుండును. ఈతని కావ్యమో కావ్యములో కాలగర్భమునఁ బడిపోయి యుండును.

ఆ. గోలకొండమలక గోవుల భక్షించుఁ
గొండవీటివిప్రకులము నెల్ల
బాచమరుసు చేరిభక్షించుచున్నాఁడు
మలక మేలో బాచమరుసు మేలో!

కొండవీటిసంబంధమునుబట్టి యీబాచమరుసు రామయామాత్య భాస్కరుఁడని నిశ్చయింపవలసియున్నది. బాచమరుసు దానముల నొసంగి ప్రఖ్యాతిఁ గాంచినవాఁడు. ఈతనినిగూర్చి నారనసూరనచారిత్రమున వ్రాసియుంటిని. అట్టియుత్తమపురుషుఁడు బ్రాహ్మణుల కపకార మొనర్చునా యనిసంశయము కలుగవచ్చును. కానియంతమాత్రముచే నీతఁడు వేఱొకబాచమరుసని నిర్ణయింపఁజాలము. ఏవేని ప్రత్యేక కారణములవలన నీగోపనవంటివారి కాతనివలన నపకారము జరిగి యుండవచ్చును. అందుపై నీతఁ డీపద్యమును జెప్పియుండవచ్చును.

పలకలూరను గ్రామమునుబట్టి యీకవి యింటిపేరు వచ్చి యుండును. పలకలూరు గుంటూరుమండలములోనిది.

రామయామాత్య భాస్కరునిశాసనములు క్రీ. శ. ౧౫౩౦-౫౦ నడుమ గన్పట్టుచున్నవి. కావున నీగోపనయు నాకాలమువాఁడు. ఇతఁడు బ్రాహ్మణుఁడు. పలకలూరీతని నివాసస్థానమై యుండును. ఇంతకంటె నీతనినిగూర్చి నధికమేమియుఁ దెలియరాలేదు.

---

146 పోతరాజు వీరయ్య

ఆంధ్రసాహిత్య పరిషత్తునందున్న యుదాహరణ గ్రంథములో "పోతరాజు వీరయ్య" రచించిన త్రిపురవిజయములోనివని యుదాహరింపఁబడిన యీక్రిందినాల్గు సీసపద్యములను ప్రబంధరత్నావళినుండి కైకొని యిట వ్రాయుచున్నాఁడను. ఈకవినిగూర్చి యేమియుఁ దెలియలేదు. గ్రంథనామమునుబట్టి యీశ్వరుఁడు త్రిపురాసురసంహారమొనర్చినకథ యిందుఁ జెప్పఁబడినట్లూహింపఁదగియున్నది.

సీ. కపిలజటాజూట గంగాసముత్తుంగ
వీచీఘటలు మిన్నువీఁక దాఁకఁ
బ్రబలబాహార్గళ పరికంపితస్ఫార
ఢక్కాధ్వనినిదిశల్ పిక్కటిల్ల
జ్వాలాకరాళభీషణశారదస్థూల
శూలయుక్ప్రభల్ సూర్యుఁ బొదువఁ
బ్రకటబంధురదీర్ఘపటువజ్రనిష్ఠుర
పదఘట్టనము లుర్వి యదర నాడవ
గీ. విమలశార్దూలచర్మాంచలములు దూల
మహితమండనఫణిఫణామణులు గ్రాల
నసమరౌద్రరసావేశ మావహింప
నారభటిభూరితాండవం బాచరించె.

సీ. తమ్ముల బెదరించు తళుకువెన్నెలపాప
గన్నెగేడఁగి కేఁకు గారవింపఁ
బదినూఱుపడగలఁ బరపైనపదకంబు
సవడిముత్తెపుబన్నసరముఁ బ్రోవ
మిసమిస మసమించు భసితాంగరాగంబు
పరఁగుచందనచర్చఁ బరిఢవింప
మెఱయు మువ్వన్నెల కఱలపుట్టము కొంగు
చెఱఁగుల నునుపట్టుచేలఁ బెనుప

గీ. మించి తలమీఁద నురముపై మేనఁ గట్టి
యీడుదోడుగ నువతోడఁ గూడిజగము
లెల్ల రక్షించు నిను భజియింతు మెపుడు
భయదదురితలతాదాత్ర! ఫాలనేత్ర!

సీ. తల్లిదండ్రులఁబొందు దప్పి యొండెడ నార్వు
రువిదల యొద్దువ నెదిగినతఁడు
కడువడిఁ బలుగొండఁ గాఁడి పాఱినమేటి
ఘనసాయకము కేలఁ గ్రాలునతఁడు
కమియారఁగాఁ బాపకవణంబుఁ దిని యాడు
ఱెక్కలతురగంబు నెక్కినతఁడు
భోగిపొన్నున నిద్ర భోగించుదేవునిఁ
దఱిమినరక్కసు నుఱిచినతఁడు.

గీ. సవడిమోములఁ జతురత సమకొనంగ
జోడుమాటలు సరివడ నాడునతఁడు
దంతిముఖు నూర్మితమ్ముఁడై తనరునతఁడు
కదలె బలముల నడిపింపఁ గ్రౌంచవైరి.

సీ. శూలికన్నులఁ గెంపుచూపినరౌద్రంబుపొదఁ **ముందరి** దెసఁబొడమినతని
భువనభయంకరస్ఫూర్తి పెంపెసలార । శరభావతారతఁ బరఁగినతని
జన్నంపుసిరికోనసాఁగఁజూచినతాతఁ । జేకొని తలవంపు చేసినతనిఁ
దళతళమనిమించుఁదులకించుకైదువుల్ ।కరములుపది రెంటఁగలిగినతని

గీ. సురలు నసురులుఁ బలువఱుఁ జూచిబెదర
బిరుదుపెండెంబుఁ డాకాలఁ బెట్టినతని
భద్రకాళి మహాశక్తిఁ బరమభక్తిఁ
బాయకుండెడు శ్రీవీరభద్రుఁ దలఁతు.

ఈపద్యముల నుదాహరించిన సంధాతలు క్రీ.శ. ౧౫౬౦ ప్రాంత ముదా రగుటచే నీకవి యంతకుఁ బూర్వుఁ డగుట నిశ్చయము. అంత కంటె నీకవినిగూర్చినవిషయము లేమియుఁ దెలియరాలేదు.

147 పచ్చకప్పురపు తిరువెంగళకవి

ఈకవి భట్టారకులజుఁడు; ఇతనితండ్రి తిప్పరాజు; తాత తిమ్మరాజు; పినతాత అయ్యలరాజు. ఈకవి చొక్కనాథచరిత్ర మనుద్విపద కావ్యమును రచించెను.

ఇతనితాత యైన తిమ్మరాజును, ఆతనితమ్ముఁ డైన అయ్యలరాజును ప్రౌఢదేవరాయలను మెప్పించి యాతనిచేత 'పచ్చకప్పురపురా' జని బిరుదువహించి నట్లీక్రింది ద్విపదలలోఁ జెప్పఁకొనియున్నాఁడు.

నిటలాక్షుపదభక్తి నియతిఁ బెంపొందు
భటవంశమున మెచ్చు పచ్చకప్పురము
తిప్పరాజసుతుండు తిరువెంగళుండు
చెప్పంగ నేర్చు ప్రసిద్ధంబు గాఁగ
నని విన్నవించిన నా చిన్నరాము
మనుజేంద్రుఁ డధికసమ్మతముతో సభను
ననుఁ బిలిపించి మన్నన గారవించి
వినుతించి కర్పూరవిడియంబు లిచ్చి
యనఘుండ మీతాత యగు తిమ్మరాజు
తనతమ్ముఁ డయ్యలుఁ దాను నిమ్మహిని
బ్రౌఢుఁడై చదువులఁ బరఁగ మెప్పించి
ప్రౌఢరాయలచేతఁ బచ్చకప్పురము
రాజనంగాఁ దిమ్మరాజుకుఁ దిప్ప
రాజుదయించె విరాజితమ్ముగను
రాజుల మెప్పించె రసికుఁడాతనిత
నూజుఁడ వాక్యసన్నుత కవీంద్రుఁడవు.

ఈకవి రచించిన చొక్కనాథచరిత్ర తొమ్మిది యాశ్వాసములు కలది. ఇందు దక్షిణమధురాపట్టణమున వెలసియున్నచొక్కనాథస్వామి యఱువదినాలుగులీలలు వర్ణితములైనవి. సంస్కృతమందలి హాలాస్య మాహాత్మ్యమే యీగ్రంథమునకు మూలము. మధురలో నున్నయాదేవు

నకు హాలాస్యనాథుఁడనియు, చొక్కనాథుఁ డనియు సుందరేశ్వరుఁ డనియు నామములు.

ఈకవి యీగ్రంథమును ఉపసూ (నూ?) రునందున్నకమ్మప్రభు వగు గోళ్ళ పెదరామభూపాలున కంకితమొసంగెను. ఈతనిసోదరుఁడు చినరామప్ప. ఇతఁడుకూడ మిగుల పరాక్రమశాలి. ఇతఁడే కవిని నీ కావ్యమును రచించి తనయన్న కంకితము సేయుమని ప్రోత్సహించిన వాఁడు. వీరిరువురును బసవభూపాలుని తనయులు. పిప్పలగోత్రులు. ఆవిషయ మీక్రిందిద్విపదలలోఁ గాన నగును.

"ప్రావీణ్యమతివి శోభనకవి వీవ
కావున నీవొక్కకావ్యంబు మాకు
ద్విపదభావంబునఁ దెలివొందిమిగుల
నుపమగా సత్కావ్య ల్లుంబు లలర
మధురవాక్యంబుల మదిఁ గొనియాడ
మధురాపురేశు నిర్మలపుణ్యచరిత
చెష్టితలీలావిలాసంబు లాంధ్ర
భాషను బెదరామపార్థివుపేర
సుచరిత్ర వైభవసుతాత్రముపేర
రచియించి విఖ్యాతి రాఁజేయు మర్వి
నని యానతిచ్చిన నామహారాజు
ననుపమమధురవాక్యములకు మెచ్చి

కృతిపతియైన పెదరామభూపాలుఁడు, అచ్యుతదేవరాయలవద్ద దండనాయకుఁడుగానున్నట్లీ క్రిందిద్విపదలలోఁ జెప్పఁబడినది.

చెలఁగుచు నుపసూరిసింహంబు పేరఁ
బురుషోత్తమధ్యాన పూర్ణాత్ము పేరఁ
దగు గోళ్లబసవేంద్రతనయుని పేర
సుగుణాఢ్య పరసతీసోదరు పేర
ఘనతస్వామిద్రోహగండని పేరఁ
జినరామవిభునికి జ్యేష్ఠునిపేర

దీపించు నచ్యుతదేవరాయ ప్రి
తాప దక్షిణబాహుదండాంకు పేరఁ
జతురత నీకావ్యసారంబునకును
బతి యైనపెదరామ పార్థివు పేర

ధరమించునన్న (?) నందవిప్రరాధ్యక్ష
ప్రియబంధు వనచైత్ర పిప్పలగోత్ర
దయసత్యదాక్షిణ్య సత్యస్వరూప
తగమించు వ్యాసతీర్థప్రియశిష్య
ఆయతోన్నత శౌర్యుఁ డచ్యుతదేవ
రాయప్రతాపకార్యధురంధరుండ
అంచిత కొండమనాయంకర గండ
మించివర్తించు స్వామిద్రోహరగండ
చేకొన్న నుపసూరి సింహధ్వజాంక
వాకిటి చిన్నభూవరసహితుండ
బసవభూవరతపఃఫలసత్కుమార
వసుధఁ గల్గిన కమ్మవంశవర్ధనుఁడ!
బాగొప్పఁ దిప్పమాంబాదేవిగర్భ
సాగరసంభవ సంపూర్ణచంద్ర
చిరకీర్తియుతుఁ డైనచిన్నరామప్ప
పురుషరత్నంబనఁ బొగడంగ మించి
లలితకీర్త్యభిరామ లావణ్యసోమ
నరనాథ శ్రీచొక్కనాథ సత్కృపను
ధరయేలు మాచంద్రతారార్కముగను.

కవికిఁ దాతయైన తిమ్మరాజు ప్రౌఢదేవరాయనిచే బిరుదము నందినవాఁ డగుటచేతను, నారాయలు క్రీ. శ. ౧౪౨౨ మొదలు ౧౪౪౫ వఱకును రాజ్యముచేసినవాఁ డగుటచేతను, తిమ్మరాజు మనుమఁ డైన తిరువేంగళకవి, ౧౫౦౦ సంవత్సరప్రాంతమున నున్నవాఁడని

చెప్పవలసివచ్చును. కాని దీనికొక యాటంకము గన్పట్టుచున్నది. కృతిపతి అచ్యుతదేవరాయల దండాధిపతి. అచ్యుతదేవరాయలు క్రీ. శ. ౧౫౩౦ మొదలు రాజ్యమునకు వచ్చినవాఁడు. దీనినిబట్టిచూడగా తాతకును మనుమనికిని మధ్యనూరుసంవత్సరములు అంతరాయము వచ్చుచున్నది. ఈభేదమును సమన్వయించుటకై ౧౪౪౦ ప్రాంతమునఁ దిమ్మరాజు ప్రౌఢరాయలచే బిరుదమునందియుండుననియు నప్పటికాతని కిరువది సంవత్సరముల వయసుండుననియు ౧౪౬౦ ప్రాంతమున నాతనికిఁ దిప్పరాజు జన్మించియుండుననియుఁ దిప్పరాజునకు నలువదియవయేట ననఁగా ౧౫౦౦ సంవత్సర ప్రాంతమున వెంగళకవి జన్మించియుండుననియు, క్రీ. శ. ౧౫౩౫ వ సంవత్సర ప్రాంతమున నీకృతిని రచించియుండుననియుఁ దలంపవలసియున్నది. ఈయూహలో నస్వాభావికమేమియును లేదు. గోల్ల పెదరామప్ప శాసనముకూడ నీకాలమును ధ్రువపర్చుచున్నది. ప్రౌఢదేవరాయల కుమారుఁడగు మల్లికార్జున రాయలనుగూడఁ బ్రౌఢదేవరాయలని వాడుచున్నారు. అతఁడు క్రీ. శ. ౧౪౬౫ వఱకు విజయనగర సింహాసనమందున్నాఁడు. తిమ్మరాజునకు బిరుదమునొసంగినది యాదేవరాయలైనఁ గావచ్చును. అట్లయినచోఁ బైనిజూపిన వ్యత్యాసమున కవకాశముండదు.

కృతిపతియైన గోల్ల పెదరామప్పయ్య నాయుఁడు అచ్యుతరాయలకుఁ బుణ్యమునకుగాను సంతమంగళమను గ్రామమును తిరుల్లపియండనాయనారు దేవునకొసంగి వ్రాయించిన శాసనము రామనాథపురమండలములోని తిరుక్కోయిలూరు తాలూకాయందలి తిరుపత్తూరు గ్రామమున నున్నది ౧. ఆశాసనకాలము శా. శ. ౧౪౬౦ విళంబి సంవత్సర దక్షిణాయన బ ౧౨. (క్రీ. శ. ౧౫౩౮).

ఈరామప్పయ్యనాయఁ డచ్యుతరామరాయల ప్రతినిధిగాఁ దిమండలములయందు బ్రపాలనాభారమునువహించియున్నట్లుకొన్ని శాసనములవలనఁ గన్పట్టుచున్నది ౨. ఈరామప్పయ్య సదాశివరాయల కా

౧. A. R. B. 179 of 1935–36.

౨. ద. హిం. శా. సం ౮ సంఖ్య 571; A. R 30 & 33 of 1929

ములోఁగూడ నున్నట్లు తిరునల్వేలిజిల్లా అంబాసముద్రము తాలూకా బ్రహ్మదేశమను గ్రామమును కైలాసనాథ నాయినారను దేవునకు సమర్పించి శా. శ. ౧౪౭౨ (క్రీ. శ. ౧౫౫౦) సాధారణ సం॥ కన్యామాస, బహుళనవమినాఁడు వ్రాయించిన శాసనమువలనఁ దెలియుచున్నది ౧.

ఈగోల్లవారు పరాక్రమవంతులును బరిపాలనా దక్షులునై యచ్యుతరాయల కాలమున విశేష ప్రసిద్ధిని గాంచియుండినట్లు స్పష్టమగుచున్నది. వీరి ప్రథమ నివాసమేదియో తెలియరాలేదు. పైపద్యములలో నుదాహృతములైన యుపనూరు, నన్నసందలి గ్రామము లెచ్చటివో తెలియరాలేదు. బళ్లారి మండలమందలి "నందహాలి" యే యీనన్నసందలి యేమోయని యనుకొనుచున్నాఁడను. కృతిపతి, వ్యాసతీర్థులవారి శిష్యుఁడని పైద్విపదలలోనున్నది. వ్యాసతీర్థులు మధ్వమతాధిపతి. శ్రీకృష్ణదేవరాయలీ వ్యాసతీర్థునకు దానమొసంగి గౌరవించినట్లొకానొక శాసనమునందున్నది.

గోల్ల రామప్పయ్యకాలము క్రీ. శ. ౧౫౦౦—౧౫౬౦ అని నిర్ణయింపవచ్చును. కవియు నాకాలమువాఁడే యగుట స్పష్టము. పైద్విపదలలో "వాకటి చిన్నభూవర సహితుండ" యను వాక్యమున కర్థమేమో తెలియలేదు. కృష్ణరాయల కాలములో వాకటివారు దుర్గపాలకులుగానుండి ప్రభువుచే మన్నన లందినట్లు గన్పట్టుచున్నది. ఈచిన్నభూవరుఁడట్టివాఁడై గోల్లవారికి స్నేహితుఁడేమో!

గోల్ల పెదరామభూపాలుఁడు "ఉపనూరిసింహ"మైనట్లు కవి వర్ణించియున్నాఁడు. ఉపనూ రెచ్చటిదో తెలియలేదు.

వెలుగోటివారి వంశావళిలో మాదయలింగ భూపతి "ఉపనూరి సింహము"నకు సహాయ్యమొసర్చిన ట్లీక్రింది పద్యపాదమునందున్నది.

"ఉర్విలోఁ బొగడొందు నుపనూరి సింహంబుఁ
జెనకినరిపుకోటిఁ జెండినాఁడు" (51పుట). ఈయుపనూరిసింహము గోల్ల రామప్పయ్యకాఁడు. మాదయలింగభూపతి పదునైదవశతాబ్ది పూర్వార్ధమువాఁడు. గోల్ల రామప్పయ్య పదునాఱవశతాబ్ది పూర్వార్ధమువాఁడు. ఉపనూరు రాయలసీమయందుండి యుండును.

---

౧. A. R. 373 of 1916.

148 తేళ్లపూఁడి కసవరాజు

ఇతఁడు కళావతీ శతకమును రచియించినట్లు రామాపెగ్గడ జగ్గనయు, ఆంధ్రసాహిత్య పరిషత్తునందున్న యుదాహరణ గ్రంథ సంధాతయు నుదాహరించిన పద్యములవలనఁ దెలియుచున్నది. ఇంత కంటె నీకవి వృత్తాంత మేమియుఁ దెలియలేదు. ప్రబంధ రత్నావళి నుండి గైకొని యాపద్యములనిటఁ బొందుపరచుచున్నాఁడను.

చ. గురుకుచకుంభము ల్గదలఁ గ్రొమ్ముడి వీడఁగ రాలఁ గ్రొవ్విరుల్
కరమణి కంకణక్వణన కాంచనగ (?) ధ్వనుల్లుల్లసిల్లఁగా
భరతపుఁ బిట్టకైవడిని బాదికిఁ జేరెడి వెల్చెలాగునన్ (?)
బరిపరి రీతులం జెలఁగు భంగులు మెత్తుఁగదే కళావతీ!

చ. ప్రకటిత లీలఁ గీలెడలి పాపటముత్తెపుఁజేరు మోముపైఁ
దకపికలాడఁ గ్రొక్కడలు దంతపుఁ గమ్మలకాంతి మొత్తమై
వికచకపోలభాగముల వెన్నెల గాయుచునుండ నీవునట
............లాగులు మెత్తుఁగదే కళావతీ!

ఈక్రిందిపద్యముకూడ కళావతీ శతకములోనిదేయని జగ్గన్న కవి యుదాహరించినట్లు ప్రబంధ రత్నావళిలో నుదాహృతమైనది.

క. ఆకంజానన యుపరతి
కాకాశము వడఁకెఁ దారలటునిటు వడియెన్
బోకైన గిరులు గదలెను
భీకరమగుతమము చంద్రబింబముఁ గప్పెన్

'కళావతీ'యనుమకుట మీపద్యమునందు లేకపోవుటచే నీగ్రంథ మొక మకుటములోఁ గూడిన శతకముగాక భిన్నవృత్తములలో శృంగార విషయవర్ణన మొనర్చిన యొక చిన్న పుస్తకమని యూహిం పఁదగియున్నది.

---

149 కోట శివరామకవి

ఇతఁడు శూద్రుఁడు; కౌశికగోత్రుఁడు; బాపనయ్య అలమేలు మంగలపుత్త్రుఁడు; అణ్ణాచ్చి కామాక్షమ్మలకుఁ బౌత్త్రుఁడు; పొట్టినాయఁడు సూరమాంబలకుఁ బ్రపౌత్త్రుఁడు; చెంగన్న కాళమలకుఁ బ్రపప్రౌత్త్రుఁడు.

ఇతఁడు సానందోపాఖ్యాన మను నైదాశ్వాసముల పద్యకావ్యమును రచించి కాళహస్తీశ్వరున కంకితము చేసెను. ఇతని పూర్వులు వంశపరంపరగా కోటయను గ్రామమునకుఁ గరిణీకమును జేసినట్లును గణకవిద్యయందుఁ బ్రవీణులైనట్లును వర్ణించియున్నాఁడు. ఈకవి కాళహస్తీశ్వర భక్తుఁడనని చెప్పుకొనుటచేతను; ధూర్జటికవికి శిష్యుఁడనని నుడివియుండుటవలనను, కాళహస్తిని వర్ణించియుండుట మూలమునను, నీతని నివాసము కాళహస్తియై యుండునని యూహించి కాఁబోలు బ్ర. శ్రీ వీరేశలింగము పంతులుగా రీతఁడు కాళహస్తి నివాసుఁడని వ్రాసియున్నారు. కాళహస్తి సమీపమున నీతనిపూర్వులు కరిణిక మొనరించిన కోట యుండియుండును. అది యీతని నివాస గ్రామమై యుండును. కవి తనగురువైన ధూర్జటి నీక్రిందిపద్యములలో స్తుతించుచు నాతఁడే సానందోపాఖ్యానమును రచింపుమని తన కానతిచ్చినట్లు చెప్పుకొని యున్నాఁడు.

సీ. ఏమహాత్ముఁడు దక్షిణామూర్తి గతి శిష్య
    తతికి బోధించు నద్వైతబోధ
మేరాజమాన్యుండు సారచిత్రకవిత్వ
    గరిమ ప్రబంధ సంఘములు చేసె
నే రమ్యగుణశాలి శ్రీరాజయోగ సం
    యోగ విజ్ఞానైకయుక్తి వెలసె
నే సంతతానందుఁ డీశ్వర చరణాబ్జ
    సేవామహాద్భుత సిద్ధిఁ గాంచె

తే. నట్టియభినవధూర్జటి యస్మదీయ
దేశికస్వామి కరుణా విధేయుఁడగుచు
వచ్చి నేఁజేయు పూజల కిచ్చమెచ్చి
పలికె నిట్లని మధురవాక్పటిమ మెఱయ

క. కృతిసేయఁ దలఁచితివిగా
సతతము శివభక్తి సారసంగ్రహలీలా
ద్భుత లోకోత్తర మగునాక
యితిహాసము గలదు దానినెరిఁగింతుఁ దగన్

క. సానందోపాఖ్యానముఁ
బూని వచింపంగఁ గల్గు పురుషార్థముపు
ణ్యానూనకీర్తి శుభముల
మానితముగ వెలసె దీవు మహిలో ననినన్.

ఈసీసపద్యములో ధూర్జటియని మాత్రమే చెప్పియుండెను. కాని యాతఁడు రచించినగ్రంథములను జేర్కొనియుండలేదు. ధూర్జటి నామధారులు పెక్కురు గలరు (ఆం. క. త. 7వ సం. 253). అయినను, యిందలి వర్ణనమునుబట్టి కాళహస్తి మాహాత్మ్యమును, కాళహస్తీశ్వర శతకమును రచించి, కృష్ణరాయలచే బహూకరింపఁబడిన ధూర్జటియే స్ఫురించుచున్నాఁడు. బ్ర. శ్రీ వీరేశలింగము పంతులుగారు నట్లే భావించి, యీశివరామకవిని పదునాఱవ శతాబ్దిలోనివానినిగా నెంచియున్నారు. "అభినవధూర్జటి" యనఁగా నపరశివుఁడని యనుకొనవచ్చును. ఈయర్థమునే గ్రంథాంత గద్యలో "సదాశివ స్వరూప సద్గురు చరణారుణ రాజీవ సేవాసమాసాదితాద్వైతానుభవ" అని తెలిపియున్నాఁడు. మఱియు నీకవి కాళికాదేవి భక్తుఁడైనట్లు గద్యయందలి "ఇది శ్రీమత్కాళికాంబా వరప్రసాదలబ్ధ సాహిత్య వైభవ" యను వాక్యమువలనఁ దెలియుచున్నది.

ఈశివరామకవికి సదాశివ గురుఁడను నింకొక గురువున్నాఁడు. ఆయన యీసానందోపాఖ్యానమును గాళహస్తీశ్వరున కంకితము సేయుమని ప్రోత్సహించిన ట్లీక్రిందిసీసపద్యములోఁ జెప్పియున్నాఁడు.

సీ. తత్క్షణంబున సర్వధర్మ స్వభావుండు
సమయ విశేష వాచాప్రవీణు
డుత్తమ గుణశాలి యోగైక విజ్ఞాని
యాగమతత్త్వ రహస్యవేది
శివపాద పంకజ సేవానురక్తుండు
చిన్మయాత్ముఁడు సదాశివగురుండు
వేదాచలస్థాన విహరణోన్నిద్రుండు
కరుణాకటాక్ష సంకలితుఁడగుచు

తే. రమ్మ శివరామ! నీకు యశమ్ము గలుగు
నిమ్మహాకృతి కాళహస్తీశు పేర
నంకితము సేయుమన్న దేహంబు వొంగి
యటులఁ జేసెద లెస్సాయె నని ప్రియమున.

బదరికా వనసీమయందు వేదవిద్యాసంపన్నుఁడగు పూర్ణచిత్తుఁ డను బ్రాహ్మణుఁడు భద్రదంతి యను భార్యఁగూడియుండి సంతానార్థియై యీశ్వరుంగూర్చి తపమొనర్చి యాయన వరప్రసాదమున శానందుఁడను గుమారునిఁగనియె. ఆతఁడొకనాఁడు ధర్మప్రసంగుఁ డను మునివలన భూలోకమునఁ బుణ్యపాపము లొనర్చువారి కొదవు స్వర్గనరకవాస ఫలంబులను విని స్వర్గవాసులనుగూర్చి సంతసించి, నరకవాసులనుగూర్చి దుఃఖించి వారలఁజూచుటకై నరకమునకేఁగి యమునిచేఁ బూజితుండై యాతనివలన సకలధర్మంబుల నెఱింగి నరకవాసులం దర్శించి వారు పడుచున్న యాతనలకుఁ జాలిఁజెంది యచ్చట నుచ్చైస్స్వరంబున శివనామ స్మరణ సేయుచు పంచాక్షరీ మహామంత్రజపంబు గావించి వారినందఱ నానరక బాధలనుండి తప్పించి యీశ్వర సాన్నిధ్యముఁ జేర్చినకథ కొన్ని యుపకథలలోఁ జేర్చి యిందుఁ జెప్పఁబడినది. ఇందలి యమయాతనలను చదివినవారి హృదయములు పాపకార్యముల నొనర్చుటకు జంకక మానవు. కొన్ని వ్యాకరణదోషము లచ్చటచ్చటనున్నను నీతని కవిత్వమనర్గళధారతో మృదువుగానున్నది. శైలిచూపుటకై నాలుగు పద్యముల నీక్రింద వ్రాయుచున్నాఁడను.

ఉ. చక్కని ముద్దుబాలకుని జక్కిలిగింతలు వెట్టి యేడ్పురాఁ
జెక్కిలి గొట్టి యెత్తికొని చక్కనిమక్కువ మాటిమాటికిం
బక్కున నవ్వఁ జేసి పయిపక్కఁ బడంగ వినోదవైఖరిం
జక్కగ ముద్దులాడవలదా కలదా యిటువంటి సౌఖ్యమున్ ౧ ఆ.

శా. జ్ఞాతిద్రోహము చిత్తమం దిడి సభాస్థానంబులం జేరి దు
ర్జాతుండై వసుధాధినాథులకు లంచా లిచ్చి సంసారసం
ఘాతంబుం జెడిపోవఁ జేసినమహాకష్టుండు వీఁ డగ్రసం
భూతక్షేత్రవినాశహేతుగణసంపూర్ణుండు వాఁ డర్కజా ౨ ఆ.

శా. ఓసూర్యాత్మజ! జంతుసంఘములు కుయ్యో యంచుఁ గుయ్యుంగ నీ
దాసశ్రేష్ఠులు నిల్వలేక బహుబాధ ల్వెట్టఁగాఁ జూచియుం
దోసం బంచుఁ దలంచి వద్దనవు నీతో మాటలాడంగరా
దీసామ్రాజ్యము నీకె గాక కలదే యేదేవతాశ్రేణికిన్ ౩ ఆ.

చ. విను మును జారకాంతకు నవీనసుమంబులు దెచ్చుచోటఁ గ్రి
న్నన నొకపువ్వు దప్పిపడినం గని లేమకుఁగా శివార్పితం
బనిన మహత్త్వ మీశ్వరకృపాతిశయంబున శ్వేతనాముఁడే
పున మహనీయవైభవముఁ బొందఁడె నిర్జరబృంద మెన్నఁగన్ ౪ ఆ.

నెల్లూరు మండలమున గూడూరు తాలూకాలో కోట యను గ్రామమున్నది. బళ్లారి మండలమున నొకటియున్నది. ఇంకను గోట గ్రామములుచాలగ నున్నవి. కోటగ్రామమునకు కరణిక మీకవికివంశానుగతముగా వచ్చుచున్న ట్లీక్రిందిపద్యములవలనఁ దెలియుచున్నది.

"క. ఆకాశికగోత్రాబ్ధిసు
ధాకరుఁ డఖిలైకదానధర్మకళాసు
శ్లోకుఁడు చెంగనయనం
గాకీర్తివహించెఁ గోటకరణం బగుచున్.

సీ. గీ. కోటసీమకుఁ గరణమై గురువిలాస
పరమసద్గుణమణిగణాభరణబిందు
భరణశరణాగతత్రాణకరుణయగుచుఁ
జెలఁగు కామాక్షమాంబను జెట్టపట్టె"

ఈకవి కౌశికగోత్రుఁడ నని చెప్పుకొనినను పైనివ్రాసిన చెంగన్న కుమారుఁడు పొట్టినాయఁడని యీక్రిందిపద్యములోఁ జెప్పుటచేఁ గవి శూద్రుఁ డనియనుకొనుట కాధారమైనది.

తే. అతఁడు కాళమువలనఁ గృతార్థుఁడైన
పొట్టినాయనిఁబడసె నప్పుణ్యశాలి
రూపరేఖాగుణశ్రీల రూఢిఁగన్న
పరమసాధ్విని సూరమాంబను వరించె.

ఈకవి తనవంశమును దాదాపుగ నిరువదిపద్యములలో వర్ణించి యున్నాఁడు. కానియందుఁజారిత్రాంశము లేమియు లేవు.

ఇతఁడు బమ్మెరపోతననుకరించి చాలపద్యములను వ్రాసియుండెను. మచ్చునకొక్క పద్యముసుదాహరించెదను.

సీ. శివు నపేక్షించినచిత్తంబు చిత్తంబు
భవుకథ లాలించుచెవులు చెవులు
కరకంఠుఁ బూజించుకరములు కరములు
శ్రీశంభువర్ణించుజిహ్వ జిహ్వ
గౌరీశుఁ బొడగనుకన్నులు కన్నులు
మదనవైరికి మ్రొక్కునుదురు నుదురు
హరుమందిరము మెట్టునడుగులు నడుగులు
సర్వేశు జపియించుజపము జపము
తే. భర్గుఁ గొనియాడ నేర్చినభక్తి భక్తి
చిన్మయాత్మని సేవించుసేవ సేవ
నీలకంఠధరుఁ దలపోయునేర్పు నేర్పు
శర్వమహిమంబు లెన్నినచదువు చదువు.

గంగానదీప్రవాహమువలె నీతనికవిత నిరాఘాటమై ప్రవహించుచుండును.

ఈకవిగురువు మొదటిధూర్జటిగాక కుమారధూర్జటియో మఱియొకధూర్జటియో యైనయెడల నీకవికాలము కొంత క్రిందకు దిగును.

150 చిత్రకవి పెద్దనకవి

ఇతఁడు ప్రథమశాఖాబ్రాహ్మణుఁడు; కాత్యాయనసూత్రుఁడు; భారద్వాజగోత్రుఁడు; కందాళయన్నగారి శిష్యుఁడు. నల్లగట్లమైలన్నకు గాహితుఁడు.

ఇతని నాలువేల నియోగిబ్రాహ్మణుఁడని శ్రీ వీరేశలింగము పంతులుగారు వ్రాసియున్నారు. ఇతఁడును, నీతని పుత్రపౌత్రులును రచించిన గ్రంథములనుబట్టి వీరేశాఖాబ్రాహ్మణు లైనదియుఁ దెలియ రాదు. కానియీతనివంశకర్త ను మంచిరాజని చెప్పుటచే వీరు ప్రథమ శాఖానియోగిబ్రాహ్మణులని నిశ్చయింపవచ్చును.

ఈకవి, హనుమంతునిపైనొక శతకమును లక్షణసారసంగ్రహ మనులక్షణగ్రంథమును రచించియున్నాఁడు. ఆశతక మిప్పు డెచ్చటను గన్పట్టుట లేదు. ఇతఁడు శతకకవుల చరిత్రమునం దుదాహృతుఁడు కాలేదు. ఆశతకమకుటమును దెలియరాలేదు. హనుమంతుఁడు గలలోఁ గవికిఁబ్రత్యక్షమై లక్షణగ్రంథమును రచించిన దన కంకిత మిమ్మని చెప్పినట్లీక్రిందిపద్యములలోఁ జెప్పుకొనియున్నాఁడు.

క. మున్నొకశతకము మాకుం
జిన్నపుడె సమర్పణంబు చేసితి విఁకనుꣳ
సన్నుతలక్షణకృతి య
స్మన్నామాంకితము సేయుమా యిపు డనినꣳ.

క. నీపేర నంకితంబుగ
దీపితమతి ఛందమొకటి తెనుఁగునఁ గడుసం
క్షేపమునఁ జేతు నీకృప
ప్రాపున నని విన్నవించి యట మేల్కాంటిꣳ.

ఇతఁడు తననుగూర్చి లక్షణసారసంగ్రహకృత్యాది నీక్రిందిపద్య మును వ్రాసికొని యున్నాఁడు.

సీ. శ్రీహనుమద్వర స్థిరసత్కవిత్వ ద
క్షుండ భారద్వాజ గోత్రజుండ

శుభకరశుక్లయజుశ్శాఖికాప్రభా
సురుఁడఁ గాత్యాయన సూత్రియుతుఁడ
వహిని బార్శ్వంచాల మంచి రాజేంద్రుని
కాచధీమణిచెన్నఘనుని పౌత్రుఁ
డను సర్వధీరునందనుఁడఁ గాశ్యపగోత్ర
కలితుఁడై తగు నల్లగట్ల నైల
యార్యదౌహిత్రుఁడను లక్కమాంచికాత్మ
గర్భజలధి చంద్రుఁడఁ జిత్రకావ్య ధనుఁడ
ధారుణీశ మాన్యుఁడను గందాళయణ్ణ
గారి శిష్యుఁడఁ బెద్దనకవి వరుండ.

ఈకవి యింటిపేరు పార్శ్వంచాలవారు. ఈకవి వంశమునకు మూలపురుషుఁడు మంచిరాజు. ఇతనిపుత్త్రుఁడు కాచన ఇతని తనూజుఁడు చెన్నయ. ఇతని కుమారుఁడు సర్వయ. ఇతనిభార్య లక్కమాంబ. ఈదంపతులు కవికిఁ దలిదండ్రులు. ఈకవి పూర్వులెవరును గవులుకారు. ఇతఁడు చిత్రకావ్య ధనుఁడగుటచే నీతనికే చిత్రకవి యని పేరువచ్చినదనియు నితని తరువాతివారికిఁ జిత్రకవి యింటిపేరైనదనియుఁ దలంపవలసియున్నది. పార్శ్వంచాలయను గ్రామము కర్నూలుమండలమున నందికొట్కూరు తాలూకాలోనున్నది. అదియిప్పుడు పారుమంచాలగా మారినది.

కవికాలమును నిర్ణయించుట కొకయాధారము పైపద్యములో నున్నది. కవికిఁగురువైన కందాళ యన్నగారు కందాళయప్ప పండితుని కుమారుఁడు. పాండురంగ విజయకృతిపతియైన విరూరి వేదాద్రికి గురువైన కందాళయప్ప పండితుఁడీయణ్ణ పండితుని తనయుఁడు. అణ్ణపండితుని శాసనములు రెండు తిరుపతి దేవస్థానమునందున్నవి. అవి వరుసగా క్రీ.శ. ౩-౧౦-౧౫౮౩, ౨౧-౧౨-౧౫౮౬ నాఁటివి. ఈయణ్ణపండితుని శిష్యుఁడైన పెద్దనకవి క్రీ. శ. ౧౬౧౦-౧౬౭౦ నడుమనుండెనని నిశ్చయింపవచ్చును. ౧౬౬౦ ప్రాంతమున నీతఁడు లక్షణసార సంగ్రహమును రచియించియుండును. ఈతనికుమారుఁడైన

యనంతకవి క్రీ. శ. ౧౫౪౦–౪౫ ప్రాంతమున జన్మించి, ౧౫౮౦ ప్రాంతమున రామరాజ భూషణునిచే రచితమైన హరిశ్చంద్ర నలోపాఖ్యానమునకు వ్యాఖ్యానమును తన యేఁబదేండ్ల వయసున ౧౬౦౦ సంవత్సరప్రాంతమున వ్రాసియుండును.

లింగమగుంట తిమ్మకవి యీపెద్దనార్యుని నుతించి యుండుటచే లక్షణసార సంగ్రహ కాలము ౧౫౫౦ దాటియీవలకురాదు. ఇంకను నొక్కింత వెనుకకుఁ బోయినఁబోవచ్చును.

షష్ఠ్యంతపద్యములలో:—

క. అతులితగుణవంతున కా
నతజన తరుతతివసంతునకు మాణవక
వ్రతజితకంతునకు ధరా
నుత వెలలూరీపురీ హనూమంతునకున్.

వెలలూరు కడపమండలమున గండికోట తాలూకాలోనున్నది. ఆగ్రామమున నాంజనేయస్వామి యాలయము కలదు ౧. వెల్లలూరి రామయ్య యను వర్తకునియొద్ద, శ్రీరామటంకములును, హనుమంత వరహాలును, వేంకటేశ్వర మాడలును గలవని స్యూయల్ పండితుఁడు వ్రాసియున్నాఁడు ౨.

వెల్లలూరు హనుమంతుని భక్తుఁడై యాదేవునిపైనొకశతకము నురచించి, లక్షణసారసంగ్రహము నాతనికే కృతియొసంగుటచే నీకవి వెల్లలూరు నివాసుఁడని నిశ్చయింపవచ్చును. ఈతని కుమారుఁడును, బౌత్రుఁడునుగూడ నీహనుమద్భక్తులే వారిచరిత్రముల నిందు వేఱుగ వ్రాయనున్నాఁడను.

ఇతఁడు ప్రాసములు పదునెనిమిది విధములనియు, యతు లిరువదేడు విధములనియుఁ జెప్పియున్నాఁడు.

---

౧. లక్షణసారసంగ్రహ పీఠిక. ని. వెంకటరావు పంతులు M. A. గారు పుట. ౪; స్యూయెల్. 2 వ సంపుటము. పుట 260.

౨. స్యూయల్ 1 వ సంపుటము పుట 132

క. పదునెనిమిది ప్రాశంబులు
విదితముగా నేర్పరింతు విను లాక్షణికుల్
మొదల నొనర్చిన క్రమమున
విదళితదైత్యేయకాయ వినయోపాయా! ౧-౬౩.

"సప్తవింశతి యతులుత్కృష్టులనిగొన్న
కరణి వర్ణనియుఁ గానరాఁగ
గీతి తారావళిగఁజేతుఁ గృతుల లాక్ష
ణికులు మెచ్చంగ నీకు నేర్పుమెఱసి...... ౧-౬౭.

ఈగ్రంథము మూఁడాశ్వాసములు కలది. ఈకవి లక్షణములకు లక్ష్యములను దానే రచియించి యుండెను. కాని యితరుల గ్రంథములనుండి లక్ష్యములను గైకొనలేదు.

ఈతని కవిత్వము చక్కని ధారకలిగి హృదయంగమముగా నుండును. లక్షణ గ్రంథమునందలి పద్యములను శైలి చూపుటకై యుదాహరింపఁ దగకపోయినను మూఁడు పద్యముల నుదాహరించెదను.

చ. కళలఁ బ్రవీణుఁడై మిగులఁ గావ్యములందుఁ బ్రియంబు గల్గి కో
ర్కులు సకలార్థికోటులకుఁ గూర్చి యొసంగుచు దానశూరుఁడై
పొలిచి సుకీర్తియై వినయభూషణుఁడై మహిమానుభావుఁడై
నిలిచినవాని నాయకుఁడని న్వచియింతురు సత్కవీశ్వరుల్.

ఉ. మానును రోగముల్వెతలు మానును లేములుమాను మీకు నో
మానవులార! యూరక భ్రమం గొననేటికి నన్యదేవతా
ధీనులుగాక యెప్పుడు నతిస్థిరభక్తి దలిర్పఁగొల్వుఁడీ
మానినుత ప్రసిద్ధమతిమంతుని మాహనుమంతుని న్మదిన్;

గీ. పృధివి జీవుఁడీశుఁడను నభేదవాది
వలెనె వాదించి కుకవి దుర్వాది సభల
దాను రేఫకు ఱాకు భేదమె యనునది
కృతులు చేపట్టుసుకవి సమ్మతముకాదు.

151 పోతరాజు

ఆంధ్రసాహిత్య పరిషత్తునందున్న యుదాహరణ గ్రంథములో పోతరాజు బేతాళ పంచవింశతి యందలివని యుదాహరింపబడిన యీక్రింది పద్యములను బ్రబంధరత్నావళినుండి గైకొంటిని. ఈకవి చారిత్రి మించుకంతయుఁ దెలియలేదు.

చ. అరయఁగఁ బూర్వదిగ్వనితయందనురక్తుఁడు ముంద రిప్డు భా
స్కరుఁడిటవచ్చి నాపెసఁ బ్రశాంతముతో ననురక్తుఁడయ్యె సు
స్థిరమిది యంచు నయ్యపరదిక్సతి రాగముఁ బొందె నాఁగ వి
స్తరముగ నిండఁబర్వె నెఱసంజ నభంబునఁ బశ్చిమంబునన్...

క. ఇంటింటం జింతామణు
లింటింటం బరుసవేది లింటింట నిధుల్
జంటగొనియుండు ధనపతి
యింటిక్రియన్ బురములోనియిండులు నెల్లన్.

ఉ. ఇందులనున్న నగ్నిభయమొందుఁ గల్గదటంచు మున్ సురా
నందనమైన ఖాండవవనం బమరావతి వాసి వచ్చి పొ
ల్పొందఁగ మర్త్యలోకమున నుత్సవలీల వహించెనొక్కొ నా
నందవనంబు లొప్పెఁ బురినాలుగు దిక్కుల నున్నతస్థితిన్.

క. సురధరము పెక్కురూపులు
ధరియించి పురంబులోనఁ దనరెననంగా
స్ఫురిత నవరత్న కాంచన
భరితములై వివిధదేవభవనము లొప్పున్.

క. ధర మిన్ను దఱిఁగివైచిన
కరణిఁ దటాకంబు లెల్లకాలమునందున్
బరిపూర్ణములై యుండును
బురికి నవగ్రహభయంబు పొరయక యుండన్.

రవిఁబొంది రాహుచేఁ బరి

క. భవములఁ బడనోడి తగ్గభస్తులు పురిను
వక్కమునఁ జొచ్చిన విధమున
నవిరళరుచి వెలిఁగె దివియలయ్యె యిండ్లన్.

ఉ. వ్యాళవిభూషణాళియు దిగంబరముఁ గదయుఁ ద్రిశూలముఁ
వ్రేలెడు కెంజడల్ గగనవీథికిఁ జాఁగిన యుగ్రరూప మా
భీలచతుర్భుజంబులు నభేద్యకరాసియుఁ జంద్రఖండమున్
ఫాలవిలోచనంబు గలభైరవుఁ గాంచె విభుండు ముందరన్.

క. పురివిభవముఁ జూడఁగన
త్కారమున (?) జలదేవి వెక్కు-కన్నులు వెలయన్
ధరియించినట్లు వికసిత
సరసిరుహాకరము లొప్పు సౌరభలీలన్.

సీ. పరిజ్వరిల్లుచునున్న పసిఁడి శాఖలతోడ
వెలసినవనముల చెలువుదానిఁ
గరిమకరిగ్రాహ కచ్ఛపంబులతోడఁ
బరిపూర్ణ జలముల పరిఘ దాని,
మరకత వైడూర్య మాణిక్యములతోడ
హాటకమయ మైనకోటదానిఁ
గమనీయ కాంచన కలశాంగకములతోడ
నమరిన దేవాలయములదానిఁ

గీ. గనకఖచిత మైనగంబంపు కట్లతో
వెండిమాడువిండ్లు వెలయుదాని
జనమహోత్సవ మనఁ దనరినయుజ్జయి
నీపురంబు సొచ్చె నృపవరుండు.

కవి క్రీ.శ. ౧౫౬౦ కిఁ బూర్వుఁడనుటకంటె నింక నేమియుఁ దెలియరాలేదు. అజ్ఞాతమునందున్న యీగ్రంథము నెవ్వారైన సంపాదింతురని ౧౦ పద్యముల నుదాహరించితిని.

152 సిద్ధరాజు తిమ్మరాజు

ఈతఁడు చంద్రవంశపు క్షత్రియుఁడు; హరితసగోత్రుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; యజుశ్శాఖీయుఁడు. ఔబలరాజునకును గోనమాంబకును దనయుఁడు; ఇతని యన్న రంగరాజు. ఈకవి కృష్ణదేవరాయల యల్లుఁడైన, యళియరామరాజునకును, వసుచరిత్రకృతినందిన తిరుమల రాయలకును మేనల్లుఁడు.

ఇతఁడు పరమయోగివిలాసమను నైదాశ్వాసముల పద్యకావ్యమును రచియించి, మంగళగిరి శ్రీనృసింహున కంకితము చేసెను. కవి తననుగూర్చియుఁ దన రచనమును గూర్చియు నీక్రిందిపద్యములలోఁ జెప్పుకొనియున్నాఁడు.

సీ. ఏరాజుముత్తాత భూరిసామ్రాజ్య ల
క్ష్మీధురీణభుజుండు సిద్ధనృపతి
యేనరాధిపుతాత నానార్థిసంతాన
సంతానశాఖి యనంతశౌరి
యేగుణాఢ్యునితండ్రి భోగవైభవసూత్ర
సుత్రాముఁ డౌభళక్షోణిభర్త
యేవిభుం డళిరామభూవరు తిరుమల
ప్రభువేంకటేంద్రుల భాగినేయుఁ
డట్టి తిమ్మనృపుం డాజిహతతురుష్క
రక్తశోణనదీకృత ప్రబలఁలిఁ
వితతకృష్ణానదీయశోర్జితుఁడు కోన
మాంబపుత్త్రుండు రంగరాజానుజుండు.

మ. సకలశ్రీయుత కొండవీటి నగరీ సామ్రాజ్య ధౌరేయతా
ధికతఁ మీఱుచు నొక్కనాఁ డచలభక్తిస్ఫూర్తి శ్రీవైష్ణవ
ప్రకరంబున్ భజియించుచుఁ హరికథా ప్రస్తావనన్ దివ్యయో
గికథల్ వించుఁ దద్ధకావ్యరచనాకేళీ సమాసక్తుఁడై.

గీ. తానొనర్చు కావ్యమునకుఁ దగినయట్టి
నాయకుఁడు మంగళాచల నాయకుఁడని

నిశ్చయముఁ జేసి దృఢముగ నెమ్మనమున
నధికతరమైన సద్భక్తి యావహిల్లు.

ఉ. ఉన్నతిమీరఁగాఁ బరమ యోగివిలాసము పేరికావ్యము
ద్యన్నవభావబంధుర రసాన్వయ సన్నుత శబ్దశుద్ధి సం
పన్నత నిల్వు సిద్ధరసపాలుని యాభళ తిమ్మభూవరుం
డెన్నికఁ జేయఁబూని వది నెంతయు సంతసమందె ధన్యతన్.

ఈతఁడు రచించిన పరమయోగి విలాసమునందు విష్ణుభక్తులైన పన్నిద్దరాళ్వారు చరిత్రములును వైష్ణవ మతోద్ధారకుఁడగు రామానుజాచార్యుని చారిత్రమును వర్ణితములైనవి. కవి వైష్ణవభక్తుఁడు, కృత్యాదియందు మంగళగిరి నృసింహుని, లక్ష్మిని విష్వక్సేనుని, గరుత్మంతుని, ఆదిశేషుని మాత్రమే స్తుతించెను. పూర్వకవిస్తుతి, కుకవినింద, గురుస్తుతి ఇత్యాదులులేవు. తాళ్లపాక తిరువెంగళనాథుఁడు పరమయోగివిలాసమును క్రీ. శ. ౧౫౪౭ ప్రాంతమున ద్విపదకావ్యముగా రచియించియుండెను. తిమ్మరాజును దిరువెంగళనాథుఁడును, ఇంచుమించుగా సమకాలికులు. వీరిరువురకును ఈయాళ్వారుల చరిత్రములను దెలుపు ద్రావిడ గ్రంథము లాధారములయి యుండును. తిమ్మరాజు కవిత్వము మృదువై ద్రాక్షాపాకమునఁ జక్కనిశైలిలో మనోహరముగానున్నది. అప్పకవి యీతని గ్రంథమునుండి లక్ష్యములను గైకొనియున్నాఁడు.

మచ్చుపద్యములు:—

శా. యోగీంద్రాగ్రణియైన భార్గవుని సంయోగంబునం జేసి స
ద్యోగర్భంబున నంత నచ్చరకుఁబుత్రుం డుద్భవించెన్ దప
శ్శ్రీగణ్యుండు సుదర్శనాంశజుఁడు లక్ష్మీవల్లభధ్యానము
ద్రాగర్భీకృత మానసుండు పితృతారన్ బౌషమాసంబునన్ ౧ ఆ

ఉ. ఎంతయు మేన నామములు నేర్పడఁగా ధరియించినట్టివాఁ
డింతకుమున్ను వచ్చెనతఁ డెవ్వఁడొ మేదరి బాగులో నతం
డెంతమహాత్ముఁడో యెఱుఁగ కేనవమానముచేసి యాతఁడ
త్యంతము దవ్వుగా నరుగునంతకు నధ్యయనంబు మాన్చితిన్. ౨ ఆ.

మ. మనలో నెవ్వరు నివ్వధూటి వినసమ్యగ్రూప లావణ్యశో
భను నెవ్వానిఁ బ్రశంస సేయరుగదా! పంచాస్త్రుఁ డత్యంత దు
ర్జనుఁ డెల్లప్పుడుఁ బొంచి యావనవయః ప్రారంభ శుంభద్వధూ
జనులన్ హేతువొకింత గల్గిన సవశ్యంబుం గలంచుం గదున్ ౩ ఆ.

చ. తగవులు నిల్పఁ బొల్పడిన దైవము వక్కట! నీవు మ్రుచ్చవై
మగువల మాత్రకుం బయిసి మాలిన నేరికిఁ జెప్పికొందు మి
జ్జగమున రాజు గొట్టమొగసాలకు మొట్టపవిత్రకీర్తియన్
బొగడిక గన్ననీవ తలపోసి యెఱుంగుట కాక యచ్యుతా! ౪ ఆ.

ఉ. వేడుక కేగుదెంచితిరొ వెఱ్ఱులొ మీరవుఁగాము లేమియుం
జూడక యేల యిట్లుడుకు జుట్టెద రిందును లాభమెద్ది మీ
యాడిననోళ్లు లేమియగు నవ్వల సామ్మొకచోట నుండనే
జాడ యొకింత దెల్పెదను సత్వరవాక్యము చెల్లదేరికిన్ ౫ ఆ.

ఆర్వీటి బుక్కరాయల పౌత్రుఁడైన సింగరాజున కీకవి దౌహిత్రుఁడు. ఆసింగరాజునకుఁ గోనరాజు, తిమ్మరాజు, అళియరామరాజు, తిరుమలదేవరాయలు, వెంకటాద్రి యను నైదుగురును దనయులు. వీరైదుగురకును సోదరియైన కోనమాంబ యీకవితల్లి.

కొండవీటిసీమ, కర్ణాటప్రభువులగు సంగమవంశజుల పరిపాలనములోఁ గొంతకాలమును దరువాత క్రీ.శ. ౧౪౬౦ మొదలు ౧౫౧౫ వఱకును గజపతులక్రిందను బిమ్మటఁ గృష్ణరాయలకాలములో సాళువ తిమ్మరుసు మంత్రిపక్షమున నాదెండ్ల గోపమంత్రి యధికారముక్రిందను నుండెడిది. అనంతరమీసీమను రాయసం కొండమరుసయ్యయు నచ్యుతరాయలకాలములో రామరాయ భాస్కరమంత్రియుఁ బరిపాలించిరి. సదాశివరాయని రాజ్యకాలములో నళియరామరాయల యాజ్ఞానుసారముగఁ దిరుమలరాయలును నాపిమ్మట వారిమేనల్లుఁడగు నీసిద్ధరాజు తిమ్మరాజును గొండవీడు సీమకుఁ బరిపాలకులైరి. తాను కొండవీడును బరిపాలించుచుండగనే యీకావ్యమును రచించితినని కృత్యాది ఖండలి మత్తేభవృత్తములోఁ గవి చెప్పియున్నాఁడు.

కవిముత్తాతను బట్టియో, అంతకుఁబూర్వుఁడైన సిద్ధరాజును బట్టియో యీవంశమునకు సిద్ధరాజువారని పేరువచ్చినది. కాని యంతకుఁబూర్వము వీరిగృహనామమేదియో తెలియరాలేదు. ఈకవి నివాసము కావ్యరచనా కాలమునాఁటికిఁ గొండవీడనుట నిశ్చయము. అంతకుఁబూర్వమెచ్చటనో తెలియదు. ఈకవి కాలనిర్ణయమునకై శ్రమపడనక్కరలేకపోయినది. ఇతని శాసనములు పెక్కులున్నవి ౧. ఈకవికి మంగళగిరి శ్రీనృసింహస్వామి యిష్టదైవము. ఈ కావ్యము నాస్వామికే కృతినిచ్చియుండెను. ఆస్వామికీతఁడు ధర్మములనొసంగి యొకశాసనము వ్రాయించెను ౨. ఆశాసనకాలము శా. శ. ౧౪౮౦ కాళయుక్తి సంవత్సర ఫాల్గుణ శు ౧౨ (క్రీ.శ. ౧౫౪౮) అదియే కావ్యరచనాకాలమని నిర్ణయింపవచ్చును.

ఈతని తుదిశాసనము శా. శ. ౧౪౮౬ రక్తాక్షి సంవత్సరాపౌష శు ౧౧ (క్రీ. శ. ౧౫౬౪) ఆనాఁడు మ. మం. రామరాజు తిరుమలదేవయ్య మహారాజులుంగారు కొండవీటి సీమలో అప్పాపండితునకు భూదానమొసంగి ఆదానమును బరిపాలించవలసినదని తిమ్మరాజునకాజ్ఞయీయఁగా నాతఁడాదానమును పాలించెను. ఈతనికుమారుఁడైన రంగపరాజు చదలువాడ శ్రీరఘునాయకస్వామికిఁ గొండవీటి రాజ్యమునందలి అద్దంకి అమ్మనబ్రోలు సీములోని చదలువాడ, మల్లవరము, అలవలపాడు మొదలయిన గ్రామములనుండి వచ్చెడి సుంకములు ధర్మమొసంగి శా.శ. ౧౪౮౮, క్రోధనసంవత్సర అపాఢశు ౧౧

౧. నె. శా. సం, పుటలు ౩౦౪; ౮౫౩;
A R 52 of 1917 శా.శ. ౧౪౮౨; 163 of 1917 శా.శ. ౧౪౮౨ 330 of 1935 శా.శ. ౧౪౭౦; 69 of 1917 శక ౧౪౬౬; 454 of 1915, 330 of 1915 శా. శ. ౧౪౭౦ A. R. 684 of 1920; ద. హిం. శా. సం 4 సంఖ్య 698 శా. శ. ౧౪౮౬; సంఖ్య 810 శా. శ. ౧౪౮౧.

౨. ద. హిం. శా. సం 4 సంఖ్య 709.

గురువారమునాఁడు శాసనము వ్రాయించెను ౧. అందుఁ దిరుమల రాజయ్య దేవమహారాజులుగా రీసీమపైఁ బరిపాలనాధికారము నాతని కొసంగినట్లు వ్రాయఁబడియున్నది. తిమ్మరాజకవికి మఱియొకకుమారుఁ డైన వేంకటరాజు తాళ్లపాక పెదతిరుమలయ్యంగారి కుమారుఁడు కోనేటి తిరువెంగళనాథయ్యగారికి భూదానమొసంగి, క్రోధనసంవత్సర చైత్రి బ ౩౦ నాఁడు వ్రాయించిన శాసనము గుంటూరుమండలమున తెనాలి తాలూకాలోని యీమని గ్రామముననున్నది ౨. దీనినిబట్టి తిమ్మరాజుకవి రక్తాక్షి సంవత్సర ఆషాఢ శు ౧౧ క్రోధనసంవత్సర చైత్రి బ ౩౦ నడుమఁ జనిపోయెననియుఁ దరువాత నాసీమలపైఁ బరి పాలనాధికార మాతని కుమారులకుఁ దిరుమలరాయలకుఁ బ్రసాదించె ననియు నళియరామరాయలు జీవించియుండగనే తిమ్మరాజు చనిపో యెననియు స్పష్టమగుచున్నది. మొత్తముమీఁద నీతిమ్మరాజు కొండ వీటి రాజ్యాధికారము నిరువది సంవత్సరములు వహించెను. చనిపోవు నాఁటి కీతని బరిపాలనాధికారము వహింపనర్హ తగల వయసులో నిరు వురుకొమరులుండుటచే నీతఁడు దాదాపు డెబ్బది వత్సరములు జీవించి యుండెననియు, నళియరామరాయలతో సమవయస్కుఁడనియు నీతని కాలము క్రీ.శ. ౧౫౦౦–౧౫౬౪ అనియు నిశ్చయింపవచ్చును.

ఈతిమ్మరాజునకు జగరాజను నింకనొక తనయుఁడున్నట్లును ఆతఁడు శా. శ. ౧౪౭౩ లో నొక శాసనము వ్రాయించినట్లును గన్పట్టు చున్నది ౩. శాసన పూర్తిపాఠము లభించినఁగాని యీవిషయమును గూర్చి చర్చింప నవకాశములేదు.

---

౧. నె. శా. సం పుట ౭౪౬

౨. A. R. 584 of 1920; 686 of 1920

౩. A. R. 541 of 1915; A. R. Part II of 1916-17

153 ఘణీధవు మాధవుఁడు

ఈకవినామ మిందుఁ జేర్చుట కాధారము రామాపెగ్గడ జగ్గకవి ప్రబంధ రత్నాకరములోనుండి యేర్చి ప్రకటించిన శ్రీప్రభాకర శాస్త్రులుగారి ప్రబంధరత్నావళియే. ఈకవి రచియించిన గ్రంథము ప్రద్యుమ్నవిజయము. అందలివే యీక్రిందిపద్యములు. ఈకవినిగూర్చి యింకనేమియుఁ దెలియదు.

గీ. అత్రిమునికంటి పసిబిడ్డఁ డాకసమున
నుడుగణము లాఁత కాడకు నొడ్డగిలిన
బాలభానుండు నలుగడఁ బర్వమీటు
వెండిగుం డన నుదయించె వేగుఁజుక్క.

గీ. గాఢతరకాంతికై మ్రింగు కాంతు నంత
రిక్షకాపాలికుఁడు సంతరించినట్టి
గొప్పయగు శుద్ధపారదఘుటిక యనఁగఁ
జొక్కమగు కాంతి వేగురుఁ జుక్కదనరె

గీ. మిక్కుటపుఁగాంతి వేగురుఁజుక్క వొడిచె
బారెఁ డెక్కిన యపుడు గన్పట్టియుండె
నినుఁడు నరుదెంచి ననురాగమెసఁగఁ బ్రాచి
మురువుగాఁ దాల్చు నాసికాభరణమనఁగ.

చ. నవకపుఁ దెల్లముగ్గు జతనంబునఁ గూర్చి వియద్గృహంబునన్
దివురుచు రంగవల్లికలు దేవగణంబులు చూచి మెచ్చఁగా
సవరఁగఁ దీర్చి కాలమను జక్కలముద్దుఁడు వేడ్కతో దివా
యవనికఁ జాయఁదట్టినన నంచితలీల వెలింగెఁ దామరల్.

ఉ. దలదపదాత కంజకళధౌతకనత్కల ధౌతమల్లికా
వలుల విశాసలీల శరవర్గమృణాళమనోజ్ఞ హారవ
ల్లుల రవణంబునన్ సకలలోకనుతోజ్జ్వల కందబృందకం
దళముల చాయఁ జంద్రికిరణంబులకుం దెలుపెక్క నంతటన్

చ. ఎడపక దివ్యవస్తువు లనేకము లుండుటఁ జేసి యేమిటం
గడమ యిడంగరాని నిజగర్భభరంబున దేవతాపురిం
దొడరుట కప్పురంబు బిరుదుల్ గగనంబున కెత్తెనో యనన్
బొడవున నాడుచుండు నృపపుంగవ! మారుతవైజయంతికల్.

గీ. తొలుత ముంగిళ్లఁ గర్పూరధూళిఁ దుడిచి
సహజ చందన జలములఁ జాఁపిచల్లి
చారుగృహములఁ గమ్మకస్తూరి నలికి
ముగ్గులిడుదురు పురసతుల్ ముత్తియముల.

సీ. గబ్బిజేడిసమీలు కన్నుల కెనవచ్చుఁ
బలుమాలు నవి మిట్టిపడకయున్న,
దొగల నెచ్చెలికాఁడు మొగమున కెనవచ్చు
నొకయింత మేనఁ గందుండకున్నఁ
గొప్పువ్వన జక్కవల్ గుచముల కెనవచ్చుఁ
బొద్దువోయినఁ బాసిపోకయున్న
మెఱుఁగులు మెత్తని మేనుల కెనవచ్చుఁ
దళతళఁ బొడకట్టి తలఁగకున్న

గీ. ననుచు సరసులు వర్ణింప నవయువాతి
విభ్రమవిలాస విస్ఫూర్తి వినుతి కెక్కి-
గణనమీఱిన మానినీ మణులుగలరు.

....

ఉ. చెంచెత గుబ్బచన్నుఁగవ శీఘ్రతరంబుగ నంతనంత వ
ర్తించిన యౌవనోపగమజృంభణ మెక్కిన నంతకంత శో
భించెను దాని నెన్నడుము జీవితనాథుఁడు వానివిల్లునున్
జెంచులరాజులున్ సవతి చేడియ పిండును బక్కణంబులన్.

ఉ. పొంకపు గుబ్బలం బసుఁగుఁ బూఁతయుఁ దుమ్మెదకప్పు మేనులున్
జంకెనచూపులున్ జఘనసైకతసీమలఁ బొరుటాకులున్
మంకెనచాయ మేనులును మానితహస్తధనుశ్శరంబులున్
కొంకకభిల్లకామినులకున్ దగియుండుఁ బసిండి గుబ్బలిన్

ఉ. పోలఁగ నందులంగలుగు పుష్పసుగంధుల రూపవైభవ
శ్రీలరయంగఁ గోరియటచేరిన ఖేచరయక్షదైవత
స్త్రీలని సంశయింపఁగఁ బురీజనులద్భుత దర్శనప్రియా
చాలనదూరతన్ నెఱయు సౌధహిరణ్మయ సాలభంజికల్.

క. మెత్తనిబంగరురవరవ
లొత్తెడు కరమూల రోచులొలయంగను దా
రెత్తులు గట్టెడు మిషమునఁ
జిత్తిణి తన మెల్ల బయలుసేయుదు రచటన్.

గీ. పట్టువడకది చపలతఁ బాఱుమనసు
సూరిజననుత! రూపలక్ష్మి సుడిసెగాలి
యండగొనె నారి గట్టెను యాశుగంబు
లప్పురము గుట్టములవేగ మరసిచూడ.

కవి క్రీ. శ. ౧౫౬౦ కిఁ బూర్వుఁడు. గుంటూరు మండలమున పణిదము అను గ్రామమున్నది. దానినిబట్టి యీకవి గృహనామమేర్పడిరెు నేమో! గ్రంథవిస్తరమైనను నముద్రితగ్రంథ మగుటచేఁ బైపద్యముల నుదాహరించితిని. కవిత్వము రసవంతమైనది.

154 బైచరాజు వేంకటనాథకవి.

——)O(——

ఈకవి పంచతంత్రమను నైదాశ్వాసముల పద్యకావ్యమును రచియించి, హరిహరనాథున కంకితము చేసెను. హరిహరనాథునకుఁ గృతినొసంగిన మువ్వురిలో తానొకఁడనని యీక్రిందిపద్యమునఁ జెప్పుకొనియున్నాఁడు.

క. ఏచనువుగలదు హరిహర
సాచివ్యము నొంద నన్యజనులకు మదినా
లోచింపఁ దిక్కయజ్వకు
నాచనసోమునకు మఱియు నాకుం గక్కాన్.

ఈతని కావ్యమును హరిహరనాథునకుఁ గృతియొసంగుటచేతను, గ్రంథమధ్యమున "విక్రమసింహపురనికటవటకాంతారమున" నని నెల్లూరును దలపెట్టియుండుటచేతను; నీతఁడు నెల్లూరు మండలమువాఁడని నిశ్చయింపవచ్చును. బైచరాజువారు నియోగులలో నున్నారు. కాని యితఁడు క్షత్రియుఁడు; పర్వతరాజునకు నన్నమాంబికకుఁ బుత్త్రుఁడు; లింగరాజలింగాంబలకుఁ బౌత్త్రుఁడు; తిరుమలరాజతిప్పాంబికలకుఁ బ్రపౌత్రుఁడు. ఈకవితాతకుఁ దాతయైన బైచరాజునుబట్టి వీరికి బైచరాజువారను నింటిపేరుగల్గినట్లు గన్పట్టుచున్నది. బైచరాజును గవి యీక్రింది పద్యములో వర్ణించి యున్నాఁడు.

ఉ. ధీరతగాజవంశ జలధిం బ్రభవించె మహావిరోధి సం
హారవిహారి సాళ్వబిరుదాంకుఁడు బైచనృపాలు ధద్ధరి
త్రీ రమణీమనోహరుని తీవ్రయశశ్శ్రుతికిన్ హరాద్రినీ
హారవసుంధరాధరములయ్యె సమగ్రవిహార శైలముల్.

ఈకవికిఁ దిరుమల శ్రియఃపతి గురువైన ట్లీక్రిందిపద్యములోఁ జెప్పియున్నాఁడు

క. వాచావీచీ ధీకృత
లోచన కర్ణాగ్రియాయి లోకసుధాంధో

నైచికిఁ దలఁతు న్మద్వం
శాచార్యుం దిరువలశ్రీయశఃపతి గురునిన్.

ఈకవి తన పూర్వులను భూనాథ, క్షోణిపాలాది శబ్దములతో వర్ణించినను, తాను వెంకట ధరావర ప్రభుఁడనని చెప్పుకొనినను గుటుంబరక్షణకై మూఢులగు భూపతులకుఁ గావ్యమునిచ్చుటకంటె భగవదర్పితము సేయుటయే మంచిదని యీక్రింది పద్యములోఁ జెప్పి యుండుటవలన నీతఁడు రాజ్యములేని సామాన్యక్షత్రియుఁడని తోఁచు చున్నది. ఈతని పూర్వులైన బైచరాజు తిరుమలరాజులేదేని చిన్న సంస్థానమునకుఁ బ్రభువులుగనో, గొప్ప ప్రభువులకడ దండనాయకు లుగనో యుండి గౌరవముగ జీవితము గడపియుందురు.

గీ. అతికుటుంబరక్షణాపేక్షఁ బ్రాల్మాలి
కృతులు మూఢభూమిపతులకిచ్చి
చచ్చి నిరయమునకుఁ జనుకంటె హరిహరా
ర్పణముఁ జేసి సుగతిఁ బడయరాదె.

ఇంతేకాదు యాచన యెట్టివానికైనను, గష్టదాయకమని కథాసందర్భమున బోధించు నవకాశమును గైకొని రాజులు సామాన్య ముగాఁ గవుల నాదరించు స్వభావము గలవారుగానుండరను నర్థమిచ్చు పద్యములను గొన్నిఁటిని రచియించి యున్నవాఁడు. ఈపంచతంత్రము సంస్కృత పంచతంత్రమున కాంధ్రీకరణము. సంస్కృతమున రాజు లను నిరసించు శ్లోకము లీకథపట్టున లేవు. ఇట్టిపద్యములను నారాయణ కవి రచియించియుండలేదు. దీనినిబట్టిచూడ నీకవి రాజాశ్రయము నపేక్షించి, విఫల మనోరథుఁడైనవాఁడేమోయని తోఁచుచున్నది. గ్రంథవిస్తరభీతి మనమున నున్నను నాపద్యముల నిట నుదాహరించు చున్నాఁడను.

ఆ. వెల్లివిరిసెఁ బెంటివిద్యలు మగవిద్య
లడుగువట్టెఁ గ్రిందువడిరి బుధులు
హీనజాతిపురుషు లెచ్చిరి యాచింపఁ
బోవుటెట్లు నేఁటి భూమిపతుల

శా. ఏల త్తుందనతాన లేవయిన లేవే యంచుఁ బోధించు నే
నూలంబెట్టగఁజాల మూఢనృపుఁడోహో నావహా సాహితీ
శూలంబుల్సెవుల్గాడ సొమ్మసిలు నొచ్చుం జచ్చుఁ దత్కల్మషం
జేలాయంజలిచేసి మ్రొక్కెదఁ బదార్థేచ్ఛానిశాచారికిన్.

క. అనుచిత భాషణముఖరా
ననులము విటగాయకులము నటులము గాథ
స్తనసంభరనమ్రవధూ
జనులము మమ్మేల రాజు సంభావించున్.

ఉ. కోరిన గద్యపద్యములఁ గూరిచి యిచ్చెద నంటినేని ని
స్సారములంచు విత్తమిడఁజాలక కేరడమాడు లోభి యా
నేరపు నేర్పుగాదు తనునిందలఁబెట్టు రసజ్ఞుఁడైన యు
ర్వీరమణుండు గల్గినఁ గవిత్వము సత్ఫలంబు లీదొకో.

చ. పలుకుల శబ్దసర్గ శతపత్రభవంబులు జాతవర్ణముల్
బలుకడఁపుల్ నిరుక్తికలు ప్రజ్ఞలనర్థకము ల్విచారముల్
వలవని రీవినవ్వఁ జెఱువారి నెఱుంగక తిట్టికూళ వే
పొలుపునఁ దప్పులొప్పులఁ బోదురొకో సుకవిప్రబంధముల్.

చ. మెఱసి బహుప్రబంధతను మెచ్చుట మెచ్చుట యొచ్చమంటి పా
డఱిమఱి నెన్న నెన్నుట నిరక్షరకుక్షు లధీశశిక్షకుల్
కఱటులు భూరుహోన్న పశుకల్పులు మత్కృతిఁ బ్రస్తుతించినం
గఱగఱఁబోవ నాడినను గల్గవు నామది మోద ఖేదముల్.

క. పరిహాసకులకు నటులకుఁ
దరుణీకును లంజెదారి తమ్ములకుం గా
పురుషులకు గాయకులకుం
బొరయింతురు రాజులీరుపో సరసులకున్.

ఉ. ఏపున సంచితార్థము పరేంగితభావమెఱింగి యీఁగి మే
లై పొగడొందనిచ్చి నెఱియన్నెఱచున్నెఱదాత యిట్టిచో
దాపయితృప్తిఁబొందవశతం బొరయించి యనంతరంబు సం
తాపమునొందువాఁడధమదాత వృథాలపితంబు లేటికిన్.

ఉ. దాతలు దాతలండ్రె యతథ్యము లోకమునందు లేఁడుపో
దాత యతండు గల్గినను పాత్రత దాసకలార్థులందు నే
లా తులతూఁగకుండు నచలస్థితి నింతయెఱింగి యే సహో
దాత ఋణానుబంధము గదాయని చిత్తమునం దలంచెదన్.

దూబగుంట నారాయణకవిసూడఁ బంచతంత్రమును రచించి యుండెను. నారాయణకవి పంచతంత్రమునకంటె నీతని పంచతంత్రమున వర్ణనాంశములును గథలును నెక్కువగాఁ గలవు. నారాయణకవి పంచతంత్రమున 1364 గద్యపద్యములున్నవి. వేంకటనాథకవి 2082 గద్యపద్యములను రచించెను. చతుర్థాశ్వాసముననే 474 పద్యములధికముగనున్నవి. వేంకటనాథకవి వర్ణనాంశములు నధికముగాఁ జేర్చి నారాయణకవి చెప్పనిపెద్దగాథయొకటి నాల్గవయాశ్వాసమునఁ జెప్పియున్నాఁడు. (బ్ర. శ్రీ వీరేశలింగము పంతులుగారు నారాయణకవి కవిత్వము వేంకటనాథకవి కవిత్వమంత రసపుష్టికలది కాదని యభిప్రాయపడినారు. మఱికొందఱు పండితులందులకు వ్యతిరేకాభిప్రాయ మిచ్చియున్నారు. కవితయందలి తారతమ్యముల నరయుటలోఁ బండితులు వివిధాభిప్రాయములను గలిగియుందురని వేంకటనాథకవియే తన పంచతంత్రమున నీక్రిందిపద్యములోఁ జెప్పియున్నాఁడు.

సీ. ఒకఁడలంకారంబునకు వేడుక వహించు
నొకఁడు వార్తాసమృద్ధికిఁ జెలంగు
నొకఁడు శబ్దస్ఫూర్తులకు మాయురే యను
నొకఁడర్థసృష్టికి నుత్సహించు
నొకఁడు రసాభోగతకు మస్తముఁ గదల్చు
నొకఁ డుపమానచర్చికకు నలరు
నొకఁడు పదప్రౌఢిమకు నిచ్చలో మెచ్చు
నొకఁడు జాతిశ్లాఘ కుబ్బుచుండు

తే. గామిచందానఁ దలవరి కరణి బధిరు
వలె దరిద్రునిగతి వాదిపగిదిఁ గనక

కారుచాఁపునఁ బంగు వైఖరిఁ గుజాతి
జాడనిండజిమ్ముకలింపఁ జాలుటెట్లు?

విమర్శకుని యభిరుచిననుసరించి కవిత్వగుణము స్ఫురించుచుండుననుట నిజమే. అయినను నారాయణకవి చారిత్రమున నుదాహరింపఁబడిన పద్యములయందలి భావమును దెలుపు పద్యములనే వేంకటనాథకవి కవిత్వశైలి తెలియుటకై యీక్రిందవ్రాసితిని. కావున నుభయకవుల తారతమ్యముల నెఱుంగఁగోరువారీయిరువురి పద్యములను జదివి తమ యిచ్చవచ్చిన యభిప్రాయమునకు రావచ్చును.

కవిత్వమతిగూఢము నతిపేలవముగాకుండ హృదయంగమముగా నుండవలయునని కవి యీక్రిందిపద్యములో సోదాహరణముగఁ జెప్పి యట్లేతన కావ్యమును రచియించి యున్నాఁడు.

చ. ఘనతర ఘూర్జరీ కుచయుగక్రియ గూఢముగాక ద్రావిడీ
స్తనగతిఁ దేఁటగాక యరచాటగు నాంధ్రవధూటి చొక్కపుం
జనుఁగవఁ బోలి గూఢతయుఁ జాటువనంబును గాకయుండఁ జె
ప్పినయదె పో కవిత్వ మనిపించు నగించటుగాకయుండినన్.

ఈతని కత్వమునందు వ్యాకరణ విరుద్ధములైన ప్రయోగములు స్వల్పముగఁ గాన్పించుచున్నను నవి లెక్కింపఁదగినవి కావు. అందును గురించి కవియే యిట్లు చెప్పుకొనియున్నాఁడు.

క. ఒప్పాలు గలకృతిలో నొక
తప్పున్నను గడముగాదు దానికిఁ గళలం
జొప్పడు శశికిఁ గళంకము
కప్పెప్పడి యేమినింకఁ గావించె నొకో!

ఈకవి తన కావ్యరచనాకాలమును గ్రంథమునఁ జెప్పియుండలేదు. కాని పూర్వకవిస్తుతిచేయుటలో నీక్రిందిపద్యమునఁ గ్రమాలంకారముగ శ్రీనాథుని స్తుతించియుండుటచే నీతఁడు పదునైదవశతాబ్దికిఁ బూర్వుఁడు కాఁడనుట స్పష్టము. బ్రౌనుపండితుఁడీకవి క్రీ. శ. 1500 సంవత్సర ప్రాంతమువాఁడని వ్రాసియుండెను.

వ. హృదయ శ్రీప్రమోరథం బతిపిప్రియతమం బెక్కింతు, జేతోవరు
త్పదనాస్థానికిం దెత్తు మానిసనభస్సంచారిగావింతు హృ
ద్విదిత క్షీరసముద్రి ఖేలనమున నేలింతు నుత్కృష్ట వ
స్తుదులం బ్రాజ్ఞులం దిక్కయజ్వ నమస్కృతు శ్రీనాథునిన్.

ఈకవి కాలమును నిర్ణయించుటకుం దిరుపతిలోనున్న శాసనము లొక్కింత తోడుపడుచున్నవి. బైచరాజు తిమ్మరాజు అనునాతఁడు తిరుపతి వేంకటేశ్వరస్వామికిని గోవిందరాజులకును ధర్మములనొసంగి మూఁడు శిలాశాసనములను వేయించియున్నాఁడు.

మొదటిది:— శాలివాహనశకము 1413 అగు విరోధికృతు సంవత్సర మిథునమాస బహుళపక్ష సప్తమీ సోమవారమునాఁటిది. (క్రీ. శ. 1491 సం. జూను 27) ఈశాసనములో బైచిరాజు తిమ్మయదేవమహారాజు అనియున్నది. భాష అరవము.

రెండవది:— శా. శ. 1414 పరీధావి సంవత్సర వృశ్చికమాస బహుళపక్ష విదియనాఁటిది. (క్రీ.శ. 1492 సం నవంబరు 6) ఇందులో అంతెంబరగండ ఉరగోల సురతాణిుఁడును, మహామండలేశ్వర ఉత్తమగండ ఉభయరగండ గండరగండ గండభేరుండ బిరుదాంకితుఁడు నగు కొమ్మరాజ సిరుతిమ్మరాజ కార్యనిర్వాహకుఁడు నగుబైచరాజు తిమ్మరాజు అనియున్నది. భాష అరవము.

మూఁడవది:— కాలముదాహృతముకాలేదు. ఆంధ్రమున "అంత్తెంపరగండ వురగోలసురథాణ బైచరాజ తిమ్మరాజ శిలాశాసనము" అనియున్నది.

పంచతంత్ర కర్తయగు వేంకటనాథకవికి తాతకుం దండ్రి తిరువలరాజయినట్లును నాతనితండ్రి బైచరాజయినట్లును, పంచతంత్రము నందున్నది. ఆతిరుమలరాజే దానశాసనకర్తయగు తిమ్మరాజని నిశ్చయింపవచ్చును. తిమ్మరాజు, తిరుమలరాజు నామము లొకవ్యక్తికే పలుతావులలోం గవులు వాడియున్నారు. కావునం బేరునందు భేద మున్నదని తలంపనక్కరలేదు. పైశాసనములలోం జెప్పంబడిన "ఉరగోల" నిజాము రాష్ట్రమునందలి వరంగల్లు అను పట్టణమే కాని వేఱు

కాదు. వేంకటనాథకవి దానశాసనకర్తకు మునిమనుమఁడగుటచే క్రీ. శ. పదునాఱవ శతాబ్ది నుత్తరార్ధమున నున్నవాఁడని నిశ్చయింప వచ్చును. వేంకటనాథకవి పంచతంత్రమునఁ దిరుమలరాజును వర్ణించిన పద్యము నీక్రింద వ్రాయుచున్నాఁడను.

క. అలబైచక్షితిపతికి
నలభిత్ప్రతిమాన భోగపరతంత్రునకున్
గలిగెఁ దిరుమలధరణీ
తలనాథుఁడు నిర్భర ప్రతాపోజ్జ్వలుఁడై.

డాక్టరు చిలుకూరి నారాయణరావు పంతులుగారు వేంకట నాథకవి మాతామహుని శాసనములనుబట్టి యాతఁడు క్రీ.శ. ౧౫౫౦-౧౫౮౦ సం॥ల నడుమ పంచతంత్రమును రచియించెనని నిర్ణయించి నారు. కావునఁ గవికాలము ౧౫౦౦-౧౫౭౦ అని నిశ్చయింతము.

ఈతఁడు తన గ్రంథమున సమయము వచ్చినప్పుడెల్ల వైద్య శాస్త్ర విషయములను తఱచుగాఁ జెప్పుచుండుటను బట్టియును, వైద్యులను:—

చ. ఫలిత చికిత్సరోగములఁ బాప శుభక్రియల న్మహోఘము
ల్పొలుపఱఁ జేయు నీతిధనము ల్బహుభంగులఁ గూడఁబెట్టి గే
వలపరతంత్రులై మెఱయు వైద్యవిపశ్చిదమాత్యులుం ధరా
తలపతిఁ బాసిపోవుదు రతండు కృతజ్ఞుఁడు గాకయుండినన్.

అను పద్యమునఁ గొనియాడుటను బట్టియు, నీకవి యాయుర్వేదమునఁ బ్రజ్ఞకలవాఁ డైనట్లు కన్పట్టుచున్నది.

ఈతనికవిత్వము మనోహరమై సహృదయాహ్లాద కరముగా నుండును. కవిత్వశైలి చూపుట కీతని గ్రంథమునుండి యాశ్వాసమున కొక్కొక పద్యము నుదాహరించుచున్నాఁడను.

చ. అనుచితవృత్తిఁ బరుషాంతరచింత వహింప నిన్ను నొ
క్కని గడవం బతివ్రతను గాని యొకప్పుడుఁ గాను బుంశ్చలిన్
వినుఁ డిదె లోకపాలకులు వేయును నేటికి సాధ్వినేని సం
జనిత కృపన్మదాననముఁ జక్కఁగఁ జేయుఁడు కీర్తి కెక్కఁగన్ అం

చ. తిమిరనివారణక్రియకు దీపము వారిధి నిస్తరింపఁ బో
తము చలిఁబాప వహ్ని రవితాపభరంబడఁగింప నాతప
త్రము కలుషంబులం జెఱుప ధర్మము వొల్పడియుండుఁ గాని య
క్కమలజుఁడున్నఖోద్యముఁడు గాఁడు దురాత్మునిఁ జక్కఁజేయఁగన్

చ. సముచిత భాషణంబులకుఁ జాతురి సాలకయున్న మానము
త్తమము పరాంగనాగమన తత్పరుఁడయ్యెడు దానికంటె షం
డమతము మేలు చాడికి నొడంబడియుండెడి వృత్తికన్నఁ జా
వు మిగుల లెస్స యన్యవసువు ల్గొనుకంటెను భిక్షమొప్పగున్. ఆ౨

సీ. ఘనరూపనిధి యనంగున కా? యనంగత్వ
ముచితమే బలికహిఁవ్యూహవసతి
పాండునందనుల కా? బహుకాల వనవాస
మిభపురాధిపున కా యేటిచోరవ
యదుకులాధ్యక్షున కా శాపమరణంబు
జాహ్నవీసుతున కా శస్త్రశయ్య
నలరాజు కా? మహానశపాక భజనంబు
నహుషున కా ఘోరనాగమూర్తి
తే. మరిత్రిశంకున కా? పచ్చిమాలతనము
ద్రుపద నందన కా? రాచతొత్తుపాటు
మనుజుఁడెవ్వఁడు? కర్మస్వతంత్రుఁ డరయ
నీశ్వరుఁడుగాక సమకూర్చు నిష్టపనులు. ఆ ౩.

చ. కడపట భార్యసిల్కడకుఁగాఁ జెలికానికి నెగ్గుసేఁత యు
క్కుడు దురితంబు కాఁపురము గూలఁగఁ జూచుట యున్మహాఘమి
ప్పుడతుకపట్టున న్సఖుని పట్టున నింతి విశేష మింతకై
చెడుపని యేనియుం దగిలి చేయక మానఁగరాదు గొబ్బునన్ ఆ౪

చ. పశిమన రేఖఁ బాదమునఁ బ్రామి యహో యవిశేషరోషసం
వశుఁడగుచున్ ధరాస్థలినవారణ నెవ్వఁడు వేగిరించి సం
భృశతర కార్యము ల్సలుపుఁ బెద్దయు వేయున నేల సర్వదు
ర్దశలు గలంచు వానిఁ దమ దాగుణాలుబ్ధులఁ బొందు సంపదల్ అ౫

155 సర్వదేవుఁడు

ఇతఁ డెవరో ఎప్పటివాఁడో ఎచ్చటివాఁడో ఏమియుఁ దెలియదు. ఈతనియాదిపురాణము లోనివని రెండుపద్యములును, విరాటము లోనిదని యొకపద్యమును ఆంధ్రసాహిత్యపరిషత్తునం దున్నయుదాహరణగ్రంథములో నున్నవి. "విరాటము" అనఁగా విరాటపర్వము అని యూహింపవచ్చును. ప్రబంధరత్నావళినుండి గైకొని యాపద్యముల నీక్రింద నుదాహరించుచున్నాఁడను.

ఆదిపురాణము :—

మ. సరసీజాతవిరాగకారి పురయోషావక్త్రపద్మద్యుతిసుం
దరకాంతిన్ దళిఁగించుఁబో యని మదిం దర్కించి దోషాకరున్
బుర ముద్దండకరంబు లెత్తి చలువం బొత్తైన యట్లొప్పు ను
ద్ధురసౌధాగ్రనిబద్ధకేతువు మహాడోలాభిరామంబుగన్.

క. హరినీలమణివిరాజిత
సురుచిరగోపురము పగిలి చూచి తమిస్రా
కరుఁడు విధుంతుదమండల
పరిశంకం జేసి పురముపైఁ జననోడున్.

విరాటము :—

సీ. ఇక్షురసాబ్ధి నీ కెట్టిదో యని మది
నూహించి యుబ్బిళ్లు లూరకుండ
విరసంపుముదిమికిఁ బరిహారం బగురసా
యనము మీఁదికిఁ జిత్త మరుగకుండ
దివిరి దేహమ్ము వేధించుసిద్ధరసంబు (?)
కందువ యచ్చోటి కందకుండ
నాయువుఁ జిరతరస్థాయిగాఁ జేయు సు
ధారసంబున వేడ్క దగులకుండ

గీ. నఖిలజనులకుఁ బంకేరుహాసనుండు
నేర్చియన్నింటిరుచు లొడఁగూర్చి తెచ్చి

సంచితంబులుగా సంగ్రహించెనన౯గ
భరితజలములై పురసరోవరము లొప్పు.

మల్హణ చరిత్రమును రచించిన పెదపాటి యెఱ్ఱనకవి, పూర్వ కవులను నుతించిన పద్యములో నీసర్వదేవుని జేర్చియున్నాఁడు. ఎఱ్ఱన కవి పదునాలవ శతాబ్ది బ్రథమపాదమువాఁడు. కావున నీతఁడంతకుఁ బూర్వుఁడనుట నిశ్చయము.

---

156 పొన్నతోట యౌబళకవి.

)O(

ఇతఁడు మార్కండేయ పురాణమును, వామన పురాణమును, రచించి రాణా జగదేవభూపతి కంకిత మొనర్చెను. కృతిపతి కవిని గూర్చి పలికినట్లు రచింపఁబడిన వామన పురాణమందలి యీక్రింది పద్యమువలనను గ్రంథాంత గద్యమువలనను గవిపేరును తండ్రిపేరును దెలియవచ్చుచున్నవి.

సీ. ఊహగావింపుచునున్నచో రాణవం
    శాగ్రణినై తేజమంది వెలయు
జగదేవరాయ భూజాని చంద్రుండు నన్నుఁ
    జేరంగఁ బిలిచి గంభీరఫణితి
నోపొన్నతోఁటాన్వయోజ్జ్వల......
    కవివర్య! నీవు మున్నడఁగి మాకు
నంకితంబుగఁ జేసినట్టి మార్కండేయ
    మనుపురాణంబు......
వెసఁగుచున్నవి గాన నీవిపుడొనర్చు
వామన పురాణమును జగద్వర్ణితముగ
మాకె యంకితమొనరింపు మధురరసని
గుంభజృంభిత కవన సంరంభమునను.

గద్య:- ఇది శ్రీమద్వేంకటరమణ పరిచరణ ధురంధర హృదయ నిఖిలకవిరాజ వర్ణనీయవ రాంధ్రకవితావిశేష సర్వంకష భాషానిరాఘాట పొన్నతోఁట కులాంపాథోనిధిరాకానిశారాజరాజ దొబళార్య తనూభవాబళకవిప్రణీతంబైన వామనపురాణంబునందు సర్వంబును దశమాశ్వాసము

దీనినిబట్టి కవితండ్రి నామముకూడ నొబళుఁడే యని తెలియుచున్నది. కాని యితఁ డేకులమువాఁడో తెలియుటలేదు. గోత్రముగాని సూత్రముగాని చెప్పలేదు. పైసీసపద్యములోని మూఁడవ పాదాంతమునఁ గొంతభాగము శిథిలమైనది. ఆభాగమున నింకనొక గ్రంథనామ ముండియుండినట్లు తోఁచుచున్నది. ఈతని గ్రంథములేవియు ముద్రింపఁబడలేదు. మదరాసునందలి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున వామన పురాణముయొక్క యముద్రిత ప్రతి యొకటియున్నది. మార్కండేయపురాణ మిప్పుడెచ్చటను గనపట్టుటలేదు.

కృతిపతియైన రాణా జగదేవభూపతి శూద్రుఁడైనట్లును; విష్ణువర్ధనగోత్రుఁడైనట్లును నీక్రిందిపద్యము వలన నెఱుంగనగును.

గీ. శౌరిపదమున నాలవజాతి వొడమి
యభినుతి వహించి విఖ్యాత మయ్యెనందు
విష్ణువర్ధనగోత్రంబు వెలసె మిగుల
సర్వసౌభాగ్య వైభవ స్థానమగుచు

ఈరాణావంశమువారు మైసూరురాష్ట్రమునసున్న చెన్నపట్టణమునకుఁ బాలకులుగానుండి, యుద్ధములలోఁ గర్ణాటక ప్రభువులకుఁ దోడుపడియున్నట్లు కన్పట్టుచున్నది. ఈవంశమునకు మూలపురుషుఁడు తిమ్మరాజు. ఇతనికొడుకు సింగరాజు. ఇతనికిఁ దిమ్మరాజు, మాదరాజు, చెన్నమరాజు, లక్ష్మిరాజు అని నలుగురు తనయులు. ఇందులో పెద్దవాఁడైన తిమ్మరాజు బరీదు మొదలగువారిని గెలిచి, జగదేవుఁడను పేరు వహించిన ట్లీక్రిందిపద్యములోఁ జెప్పియున్నాఁడు.

గీ. వారలలోఁ దిమ్మనృపతి గభీరచెన్న
మాంకుశేంద్రుండు లోడుగా నడరఁగడగి
యలబరీదబురాణ పురాధిపతుల
నణఁచి తాఁగాంచె జగదేవుఁడను సమాఖ్య.

ఈతనికిఁ బెదజగదేవుఁడు, ఇమ్మడి జగదేవుఁడు, చిన్నజగదేవుఁడు, అంకుశేంద్రుఁడు అను నల్గురు కుమాళ్లు.

సీ. వారిలో రణరంగధీరుఁడై యిమ్మడి
జగదేవరాయ భూజానిచంద్రుఁ
డసమబాహాశక్తి నలరారి మృత్యుజా
ఖానుచిత్తాఖాను కఠినభావ
ఖనినూనిఖానుని ఖండించి వేసఁదదీ
య్యానుచరాక్రమి.....
...డాడి సమన్వితముగ విక్రమ
క్రమలీల నెంతయుఁ గ్రమము మీఱ

గీ. నార రాజన్యమాత్రుఁడే యాత్మసీన
ధాటికాస్తంభజవసిరాఘాటఘోట
ఘోటఖురపుట సంభూతచటులభూప
రాగసంభృత దశదిశాభాగుఁడగుచు.

ఈపద్యమైనపిమ్మట ఆర్వీటి బుక్కరాయల వంశములోని శ్రీరంగరాయల కుమాళ్లను వర్ణించు నీక్రింది పద్యమొకటి యీగ్రంథ కృత్యాదియందుఁ జేర్పఁబడినది.

గీ. అళియరామావనీశుఁ దిమ్మలనృపాల
వరుల శ్రీరంగరాయల సరసుఁడైన
వీరవేంకట రాయని వెలయరాయ
పట్టభద్రుఁలఁ బడసె నప్పార్థివుండు.

ఈపద్యమునకిటఁ బ్రసక్తిలేదు. ఈపద్యము వేఱుగ్రంథములోనిదయి యుండును. విలేఖకుఁడిక్కడఁ జేర్చియుండును.

క. ఆయిమ్మడిజగదేవున
కాయతవైభవ మెసంగ నవరజుఁ డగుచున్
ధీయుక్తి వెలసె నంకుశ
రాయధరిత్రీవిభుండు రమ్యాకృతియై.

ఈయంకుశరాయలకు వెంగమాంబయనుభార్యయందు మాదయ, కుమార జగదేవుఁడు, అంకుశరాజు, వెంకటపతి యను నల్గురు తనయు లున్నట్లిందు తెలుపఁబడినది. ఈజగదేవుఁడే కృతిభర్త.

తిరుపతి దేవస్థానమువారు ప్రకటించిన వంశవృక్షములలో నీవంశవృక్షము చూపఁబడినది ౧. దానికిని వామనపురాణమునఁ బైపద్యములలో వర్ణింపఁబడిన దానికిని గొంచెము భేదమున్నది. అంకుశరాయలకు లింగాంబ, విఠలాంబ, లక్ష్మాంబ అను ముప్వురు భార్యలని తిరుపతివారి వంశవృక్షములోఁ జెప్పఁబడినది ఇందు వెంగళాంబ యని యున్నది. వెంగళాంబకు బదులుగా పొరపాటున లింగమాంబయని పడినదేమో! ఇంకను గొన్ని భేదములున్నవి కాని వానితో మనకంతగాఁ బ్రసక్తిలేదు. ఈగ్రంథ కృతిపతియైన జగదేవరాయని తమ్ముఁడైన రెండవ యంకుశరాయలకుఁ గొండవీడునందలి సుప్రసిద్ధ కవిశేఖరుఁడైన యేకామ్రనాథకవి సంస్కృతమున జాంబవతీ కళ్యాణమును గృతియొసంగెనఁట.

ఈకృతిపతియైన జగదేవరాయలు ఆంధ్రకవి యగుట నాతని చారిత్రమును వేఱుగ వ్రాసియున్నాఁడను.

ఈకవి కాలమును గనుఁగొనుటకు గ్రంథమున నొకయాధారము దొరకినది. ఈకవి కందాళభావనాచార్యుని తనయుఁడగు శ్రీరంగగురుని శిష్యుఁడైన ట్లీక్రింది పద్యములోఁ జెప్పియున్నాఁడు.

గీ. శ్రీనివాస పదాంభోజసేవనాని
రూఢమానసఘనజాతరూపకుధర
ధైర్యుఁ గందాళ భావనాచార్య తనయు
గురుశిఖామణి శ్రీరంగగురునిఁ దలఁతు.

---

౧. సంపుటము ౬ సంఖ్య ౧౬౦.

సుదక్షిణా పరిణయమును రచించిన తెనాలిఅన్నయయు, విష్ణుపురాణమును జేసిన కలిదిండి భావనారాయణయుఁ గూడ నీశ్రీరంగగురుని శిష్యులే. కావున నీయాబళకవి వారిలో సమకాలికుఁ డనుటకు సందియములేదు. కావున నీతఁడు క్రీ. శ. ౧౫౪౦ ప్రాంతమువాఁడని నిశ్చయింతము.

గ్రంథమునుబట్టి కవి నివాసమేదియో నిర్ణయింప వీలుకలుగలేదు. కృతిపతి మైసూరు వాస్తవ్యుఁడు. సహాధ్యాయి గుంటూరు మండల నివాసి. గురువు తిరుపతియందున్నవాఁడు. పొన్నతోట కడపమండలమున జమ్ములమడుగు తాలూకాలోనున్నది. ఆగ్రామమునుబట్టి యీకవి గృహనామ మేర్పడియుండును. ఈతఁడాయూరివాఁడేమో! పొన్నతోటలో నీగృహనామముగలవారెవ్వరును నిప్పుడు లేరని తెలియవచ్చినది.

ఈతని కవిత్వశైలి చూపుటకు వామన పురాణమందలి పద్యములు నాకు లభింపనందునఁ బైనివ్రాసిన మూఁడు నాలుగు పద్యములతోడనే తృప్తిపడవలసివచ్చినది.

పైసీసపద్యమునం దుదాహృతులైన మృత్యుజాఖాను, చితాఖాన్, నూనిఖాను లెవ్వరో తెలిసినదికాదు. చిత్తాఖాననఁగా చితాపఖాను కాఁడుకదా! ఈవిషయమింకను బరిశోధనీయము.

157 పొన్నాడ పెద్దిరాజు

—X—

ఈకవి ప్రద్యుమ్న చరిత్రమను ప్రబంధమును రచియించినట్లు రామాపెగ్గడ జగ్గవకవి ప్రబంధరత్నాకరమునఁ గొన్నిపద్యము లుదాహరించియుండుటనుబట్టి తెలియుచున్నది. అప్పకవి యీతని ప్రద్యుమ్నచరిత్రమునుండి లక్ష్యమును గైకొనియున్నాఁడు. ఈగ్రంథమిప్పుడు లభించుటలేదు.

ప్రబంధరత్నావళియం దీతని పద్యము లిరువదియాఱు నుదాహృతములయియున్నవి. అందుఁ గొన్నిటి నీక్రిందనిచ్చుచున్నాఁడను.

శా. అవ్యాయామపురారు లక్షుభిత పారావారు లక్ష్మీగావ
ణ్యావ్యాపారసురేంద్రు లగ్రహణ చంద్రాదిత్యు లస్థావర
ప్రవ్యక్తామర భూరుహంబు లచతుర్భావాననబ్రహ్మలా
దివ్యద్వారవతీపురిం గలుగుధాత్రీపాలు రెల్లప్పుడున్.

మ. బహువస్తుక్రియవిక్రియక్రియలు సంప్రత్యాప్తికై కాకయున్
విహితాచారము లైనచందముల వర్ణింపంగ నింతంత నా
మహిలో రాదని చెప్ప నొప్పుదురు ధీమంతుల్ కుబేరాధికుల్
మహిమోదాహరణంబు లప్పురము కోమట్లెల్ల లక్ష్మీస్థితిన్.

క. పురగోపురశిఖరంబులఁ
గర మరుదై పద్మరాగకలశము లమరున్
జరమాచరమాద్రిపై
సరిఁ బున్నమఁ దోఁచుసూర్యచంద్రులభంగిన్.

సీ. నెలఁతుకచూడ్కి వెన్నెలఁ గాసినఁ గుమారు
వీక్షణాంభోనిధి వెల్లివిరియఁ
బతిచూడ్కి తామరల్ పరువంబు నొందఁ దొ
య్యలిచూపు టలులు చిట్టాడుచుండ
సుదతిచూ పమృతంపుసోనన్లై కురిసిన
వరుదృష్టి యనిమిషత్వమున బొంద

నధిపుదృష్టి ప్రవాహంబు వెల్లవిరిన
నింతిదృఙ్మీనంబు లీఁతలాడ

గీ. వరుసఁ గౌతుకకల్లోలవలన మొలయ
రాగమకరందమత్తత ప్రజ్వరిల్ల
సంచితధ్యానమనుప్రకాశము తలిర్ప
జిలుతసిగ్గను వలలోనఁ జిక్కువడక.

సీ. గజయాన మెలఁగినగతి యైనఁ బైపడ
గద్దించి తర్కించి కలఁక నొందు
మానిని యల్గినమాడ్కిఁ దోఁచినఁ దేర్ప
నుంకించి భావించి యుమ్మలించుఁ
చపలాక్షి కెమ్మోవిఁ జవిగొన్నయట్లైనఁ
జెమరించి జర్భించి చిన్నవోవు
మదవతి కౌఁగిలి గదిసినయట్లైనఁ
బులకించి తేలి సంచలత నొందుఁ

గీ. దన్నునొఱసినఁ గోర్కులు తగులుగొలుపు
నోలిఁ దనలోన నన్నరపాలసుతుఁడు
మౌన మూఁటాడ గంభీరమహిమ సడల
లజ్జ గడివోవ ధైర్యంబు లావు డిగఁగ

సీ. బ్రాఁతిరేయి యుఁకఁ గల్గులేఁత వెన్నెల నిగ్గు
లుగ్గువెట్టెద నీకు నూరకుండు
మనుపుగా నీకిత్తు ముదురు వెన్నెలసోఁగు
సంతసంబున నుండు జాలిమాని
వేగిరింపకు నీకు వేఁడి వెన్నెలక్రొవ్వు
గుడిపింతుఁ జిన్నారికడుపునిండ
నిట్టిముచ్చటవాయ నీఁదింతుఁ బండువె
న్నెల వెల్లిఁ బలుమాఱు నిన్నుఁ జేరి

గీ. కూయుకుఁడు మీరు సంతుష్టిఁ గూరినపుడు
శీతలం బగు వెన్నెల చిగురుఁ బొన్పు
నందు నిడి నిద్రవుచ్చెద ననుచు నాద
రించె బిడ్డల నొకచకోరీపురంధ్రి

గీ. రాయుచున్న ఘనపయోధరములు గలిగి
నడుము లొకకొంత బయలయి బెడఁగు మిగిలి
చూపనొప్పారు రేఖల సొంపు మెఱసి
కోటకొమ్మలమరు వీటికొమ్మలట్లు

గీ. రత్నగర్భగర్భరత్నంబుల వీట
నర్థిఁ బుట్టుచుఁ గొనియాడ మరగి
వీథివీథి నెపుడు విలసిల్లు నానాప
ణముల వివిధరత్నసమితి వెలుఁగు

జగ్గనకవి క్రీ.శ. ౧౫౬౦ ప్రాంతమువాఁడగుటచే నీపెద్దిరాజు తనకుఁబూర్వుఁ డగుటనిశ్చయము. పొన్నాడయనుగ్రామము విశాఖపట్టణ మండలము లోనిది.

---

158 కొటికెలపూఁడి సోమనాథకవి

ఈకవి చరిత్రమును శ్రీకొణిదెన బాలకృష్ణయ్యగారు శ్రీముఖ సంవత్సరాదిసంచికలో నిట్లు వ్రాసియున్నారు.

"విస్మృతకవిసమాజమునకుఁ జేరినవారిలో సోమనాథుఁ డొక్కఁడై యున్నాఁడు. ఈతనిచరిత్రము కీ. శే. వీరేశలింగముపంతులుగారి కవిచరిత్రమున కెక్కియుండలేదు. కీ. శే. గుంటుపల్లి సోమయ్యగారు తమచేఁ బ్రకటింపఁబడిన "ప్రబంధకల్పవల్లరి" యనుమాసపత్రికయం దీతనికృతి నొకదానినిఁ బ్రకటించుదనుక నీతనివృత్త మాంధ్రలోక మెఱుంగదు. సమగ్ర మగునాంధ్రకవులచరిత్రమును రచింపఁదలంచు వారి కిది యుపకరించునను తలంపున సోమనాథకవివిషయము నిటవివ రించుచున్నాను.

సోమనాథుఁడు నియోగిబ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; ఆత్రేయసగోత్రుఁడు; సోమయామాత్యపౌత్రుఁడు; కోటీశ్వరభట్టారక పుత్రుఁడు. ఇతనికి "శారదాభరణాంక" యను బిరుద మున్నట్లు ఏతత్కవివిరచిత మగు విష్ణుమిత్రోపాఖ్యానపు గద్యమునందలి "నిఖిల విద్యానిరాంతక, శారదాభరణాంక, సకలవిద్వజ్జనవిధేయ" యనువాక్యమువల్లఁ దెల్లమగుచున్నది. నిజముగ నితఁ డిట్టి విద్వత్కవిసార్వభౌముఁడని యాతనిగ్రంథమువే మొగంబులఁ జాటసమర్థంబై యొప్పుచున్నయది. ఈతనియింటిపేరు నివాసగ్రామము ననుసరించి 'కొటికెలపూఁడి' యనిపెట్టఁబడియుండును. ఇది యాంధ్రదేశజుల సంప్రదాయమునకు వ్యతిరేకము గాదు. కొటికెలపూఁడి యనుగ్రామమొకటి గుంటూరుమండలమునందలి ఒంగోలుతాలూకాలోను, మరియొకటి కృష్ణామండలమునందలి నందిగామతాలూకాలోను నున్నవి. ఈ రెంట నెయ్యది సోమనాథుని నివాసగ్రామముగ నుండెనో తెలిసికొన నాధారము గానరాదు. ఇమ్మహాకవి విష్ణుమిత్రోపాఖ్యాన మను ప్రౌఢకావ్యము నొకదానిని రచించియున్నాఁడు.

ఈయుత్తమకావ్యమునకుఁ గారెపల్లి (గుంటుపల్లి) తిప్పమంత్రి కృతినాయకుఁడై యంకితముఁ గొనియున్నాఁడు. తనకీగ్రంథము నంకితమొనర్పఁ దిప్పన ప్రార్థించినవిషయము నీక్రిందిపద్యములవలనఁ గవి తనగ్రంథమునఁ దెలుపుడు సేసియున్నాఁడు;

మ. సరసాగ్రేసర! కోటనార్యనితనూజా! సోమ! విద్వత్పురం
దర! నీచాటునచోవిజృంభణము లుద్ఘాటించు నర్ధేందుశే
ఖరకోటీరకుటీరకోటరలుఠద్గంగోర్మిధారాశివం
కర ఘుంఘుంఘుమచక్రచంక్రమచమత్కారప్రగల్భార్భటిన్.

చ. కొటికెలపూఁడి సోమవిభుకోటయసోమ! సరస్వతీశిరః
కటకకిరీటరత్నఘటికామహనీయధగద్ధగప్రభా
పటలతిరస్క్రియాధిగతపాటవము ల్భవదీయవాక్యము
ల్కుటిలవిరోధియోధకవిలోకకఠోరవనీకుఠారముల్.

క. కావున నీవి త్తెలుఁగునఁ
గావింప నుపక్రమించు కావ్యము నాకుం
గావింపు మంకితముగాఁ
బ్రావీణ్యము మెఱసి కవిసుపర్వవరేణ్యా!

సోమనాథునికవితాప్రాగల్భ్యమున కీపద్యములునునిదర్శనములు

కవికాలము

సోమనాథుని కాలమును దెలిసికొనవలె నన్నచో విష్ణుమిత్రోపాఖ్యాన కృతిభర్తయగు గుంటుపల్లి తిప్పనామాత్యుని చరిత్రమును బరిశీలించినఁగాని తెలియఁబడదు. కావునఁ దిప్పమంత్రిని గుఱించి యించుక విమర్శింతము. ఈతిప్పమంత్రి యింటిపేరు తొలుతఁ "గాజే పల్లి"యనియుండి కాలక్రమమున నది "గుంటుపల్లి"గా మారినది. వీరునందవరవంశజులు. గుంటూరుమండలమునం దీగుంటుపల్లివారు సుప్రసిద్ధులై, విద్యావితరణాది సుగుణవిరాజమానులై కీర్తి నార్జించియున్నారు. వారిలో వినుకొండ దండనాథపదవి నలంకరించి యాసీమను బరిపాలించిన ముత్తమంత్రియు, నాంధ్రదేశమున నాబాలగోపాలమునకు విప్రవినోదులచే జ్ఞప్తికిఁ దేఁబడుచున్న గుంటుపల్లి భాస్కరుఁడును, విద్యల భాస్కరుఁడునుపేరెన్నికఁ గన్నవారు. తిప్పనతండ్రి తాతలందఱును నాకాలమున గుంటుపల్లి నగ్రహారముగాఁ బరిపాలన సేయుచుండిరి. ఈగుంటుపల్లి వినుకొండకుఁ బూర్వదిగ్భాగమున నున్నది. క్రమముగా వీరికి ముత్తమంత్రి కాలమున వినుకొండ పరగణాకు దండనాథ పదవి లభించినది. క్రీ. శ. పదునాఱవ శతాబ్దమున మల్కిభరాము పాదుషా గోలకొండఁ బాలించుచుండెను. ఈమల్కిభరామునిఁ బొన్నిగంటితెలగనార్యుఁ డీక్రిందిపద్యమున వర్ణించియున్నాఁడు.

సీ. తెలివి సింగంపు గద్దియల రాతెఱఁగంటి
దొరలెల్ల మోడ్పుఁ జేతులనె కొల్వఁ
బూని యేఁబడియాఱు మానిసినెలవుల
పుడమిఱేండ్లాడిగంబులకుఁ జొరఁగ

తీవి మున్నీటిలో దీవులన్నియు నేలు
మన్నీలు మెట్టుఁ దామరల కెరఁగఁ
దన తేజుసుడిగట్టు వెనుక చీఁకటి నెల్ల
విరియించుతమ్ముల విందుగాఁగ
గీ. వెలయు మలికిభరామునిఁ గొలిచి''......

యయాతి చరిత్రము.

ఈయిబ్రహీము పాదుశాహి క్రీ. శ. ౧౫౫౦–౧౫౮౧ వఱకు రాజ్యముచేసి యున్నాఁడు. (ఆం.క.చ.ద్వి.భా. పుట ౨౫౬) ఈతనికి సామంతుఁడై వినుకొండపరగణాను పాలించుచున్న రామలింగభాస్కరుఁడను నాతఁడు పైఁ బేర్కొనఁబడిన ముత్తమంత్రిని దత్తుడుగ స్వీకరించెను. క్రీ. శ. ౧౫౭౮–౧౫౮౯ (శా.శ. ౧౫౦౦–౧౫౧౧) వఱకుఁ బరిపాలన కార్యమునందు ముత్తన తనదత్తుతండ్రికి సాయపడుచుండెను. (చూ. గుంటుపల్లి ముత్తమంత్రి చరిత్రము.) దీనినిబట్టి యాకాలమునకు ముత్తమంత్రి దాదాపు ఇరువదేండ్ల ప్రాయముగలవాఁడని యూహింప నవకాశముగలదు. ఈముత్తనపై ననేకులగు కవులు రచించిన చాటువులు గలవు. వాటిలో నొకటిరెండు మాత్రమిక్రింద నుదాహరించుచున్నాను.

మ. శతమన్యుం డమరావతేలఁగ సురల్సత్ప్రాలపాలైరి, సం
గతి బాతాళము శేషుఁడేలఁగ ఫణుల్గ్రాలే వటించేది, యీ
క్షితి నీవేలఁగ వీరముత్త! మనుజుల్ప్రీగంథము న్ముప్పూలం
చితరాశాన్నములు స్సుధకూలచసుము లైకొందు రెల్లప్పుడున్.

శా. నావిద్వత్కవితా విశృంఖల వచోనైపుణ్య ధారాళధా
రావష్టంభ విజృంభణంబునకు నోగా! వీరముత్తప్రధా
నావిర్భూత వితీర్ణి గల్గవలె, లేదా యన్యుల న్వేడనా?
ఛీ! వాచాస్ఫుటి! ఛీ! కవిత్వమ! చిఛీఛీయర్థకాంక్షారతుల్.

ఉ. అంగ కళింగ వంగ మగధాదులు నెవ్వనివ్రాఁత కమ్మరీ
వింగనుపట్టి గుంటుపలి వీరయముత్తని వ్రాలు జూచితా

ఱుంగిలి ముచ్చుమంత్రు లిఁకనేటికి సిగ్గుమొగానఁ జేర్పరో
బంగరువంటి యాకులను బల్మిరుగోరుదు రాత్మనామముల్.

ఈవదాన్య శిరోమణి, మహావీరుఁడు, దాశార్హ చరిత్రమను కృతికి నాయకుఁడు, దాతయునై కవులపొగడ్తల నజరామరంబగు యశశ్శరీరముచే నాంధ్రలోకమునఁ బ్రకాశించుచున్నాఁడు.

విష్ణుమిత్రోపాఖ్యానకృతిపతి తిప్పన కీముత్తన అన్నకుమారుఁడు. తిప్పమంత్రి యన్నయగు పెదవీరంరాజునకు గల నల్గురు పుత్రులలో ముత్తన మూఁడవవాఁడు క్రీ. శ. ౧౫౭౮ వ సంవత్సరము నాఁటికి ముత్తన కిరువదేండ్లప్రాయము కలిగియుండునని పైనసూచించినదానిని బట్టి జనకస్థానమునసీతనికిఁగల యిరువురన్నలయొక్కయు, నీతనితండ్రి పినతండ్రి (తిప్పమంత్రి) యొక్కయు వయఃపరిమితిని ఒక్కొక్కరిమధ్య మూఁడేండ్ల వ్యత్యాసములో లెక్కించి తండ్రికిఁ గుమారునకు నడుమ నిరువదేండ్ల కాలముండునని నిశ్చయించినచోఁ బెదవీరంరాజు తమ్ముఁ డగు తిప్పామాత్యుఁడు క్రీ. శ. ౧౫౩౫ వ సంవత్సరపు ప్రాంతమున నున్నాఁడని స్పష్టమగుచున్నది. కావున విష్ణుమిత్రోపాఖ్యాన కృతికర్త యగు సోమనాథుఁడును క్రీ.శ. ౧౫౩౫ వ సంవత్సరపు ప్రాంతమున నున్నాఁడని నిశ్చయింపనగును. ఒకవేళఁ బైఁజెప్పఁబడిన కాలనిర్ణయము సరియైనది కాదనితలంచినను విష్ణుమిత్రోపాఖ్యానము ౧౫౩౦ సంవత్సరమునకుఁ బిమ్మట ననఁగా మనుచరిత్రమున కించుక తరువాతను వసుచరిత్రమునకుఁ బూర్వమునను రచింపఁబడెననునది నిర్వివాదాంశము.

సోమనాథుఁడు గీర్వాణకవుల నుతించి, పిదపఁ గవిత్రయమును నాచనసోమునిఁ దనతండ్రియగు కోట సచివునిమాత్రము స్తవమొనర్చి యున్నాఁడు. చూడుఁడు:—

గీ. సాహితీధుర్యు నన్నపాచార్యవర్యు
నుభయకవిమిత్రు సుమనఃపయోజమిత్రు
శబ్దగుంభాధి కోల్లాసు శంభుదాసు
సుకవి కువలయ గుణసోము సోముఁదలఁతు.

క. ప్రతిభట విద్వత్కవి సం
హతికరటి ఘటామృగేంద్రు నస్మద్గురు నూ
ర్జిత నిర్జిత ఫణిపతి గీ
ష్పతి కోటికలపూఁడి కోటసచివునిఁ దలఁతున్.

సోమనాథుని తండ్రి కోటసచివుఁడును గొప్పపండితుఁడనియుఁ గుకవికుంజర ఘటాపంచాననుఁ డనియు దీనినిబట్టి విశదమగుచున్నది.

గ్రంథరచనము.

విష్ణుమిత్రోపాఖ్యాన మైదాశ్వాసములు గల ప్రౌఢకావ్యము. ఇందలియితివృత్త మొకపురాణగాథకు సంబంధించినది. ఇందుఁ గథాభాగమున కెక్కువ ప్రాధాన్యము నిచ్చి సముచిత వర్ణనా సమంచితముగ సోమనాథుఁడు రచించియున్నాఁడు రచనాపద్ధతి చాలదనుక మనుచరిత్రమునకుఁ బూర్వమునఁగల శ్రీనాథ పినవీరనాదులఫక్కి ననుసరించియున్నది. ఇతని కవనధాటి నిజమున "నిందుశేఖర కోటీరకుటీర కోటరలుఠద్గంగోర్మి ధారాప్రగల్భార్భటికిఁ" దీసిపోని రీతిని మిగులఁ బ్రౌఢమైయున్నది. శైలికఠినమని వేఱుగఁ జెప్పబనియుండదు. కావ్యమంతయు నారభటీవృత్తి ప్రాముఖ్యము వహించియున్నది. గ్రంథమంతయుఁ జాలదనుక సంస్కృతపద బంధురమై పెద్దనార్యుని మృదంగ నిస్స్వన సాదృశ్యమును దలపింపఁజేయుచున్నది. ఇందు నుపమాది ప్రశస్తాలంకారములు చిత్రింపఁబడియున్నవి. సోమనాథుని రచనాకౌశలము నెఱిఁగింపఁగల కొన్నిపద్యముల నాతని విష్ణుమిత్రోపాఖ్యానమునుండి యిటనుదాహరించి దీనిని ముగించుచున్నాను.

శా. ధరణీశాగ్రణి తారకాతరళ ముక్తారత్న చిత్రాతప
త్రరుచివ్రాతము దిగ్దరీవలదసూర్యంపశ్య గాఢాంధ సు
స్మరమై సర్వశశాంకమండల సహస్ర శ్రీసముల్లాస త
స్కరమై పర్వఁగ నొప్పె సర్వజనదృగ్వ్యాపారపర్వంబుగన్ ౧౮.

సీ. సమరట్ట ఘోట్టాణ సంఘట్టితక్రోడ
ఖురపుటీపక్ష సంక్షుభితమగుచు

పృథివీధర స్పర్ధివృథు రథప్రథితప్ర
దారాభిఘాతమేదస్వి యగుచు
పటుతరోద్భట వీరభట చక్రవాళ
నిష్ఠురపదాస్ఫోటనస్ఫురిత మగుచు
గాఢకంధర సదృక్ష స్కంధ గంధ సిం
ధురకర్ణతాళవర్తులిత మగుచుఁ
గీ. దరుణదాశరకంఠ కందళకడార
మేదురాకార రణరంగ మేదినీప
రాగ నికురుంబ కంబంబరమున కెగసి
యర్కుఁ గబళించె రాహుగ్రహంబుఁ బోలె. ఆ ౨.
ఉ. చందనశైలవాతకులిశక్షితిచే నతిచిత్ర చైత్రసం
క్రందనుఁ డల్కమై నగ నగచ్ఛదగుచ్ఛము లుత్తరింప నం
దందసముచ్ఛవిల్లు రుధిరావలిఁ బోలె వనంబులందు నా
నందము సంఘటించె నయనంబులకు న్దరుణప్రవాళముల్ ఆ ౩.
మ. చటులాస్ఫోట తరాట్టహాస లహరీఝంపానిరాఘాట ప
ర్యట నాడంబర భిన్నదిక్తటకటాహక్రోడ వాటంబుగా
నటనక్రీడ యొనర్చు కాలగళుకంఠస్థూలకాకోలరు
ఘుటికాజాలము బర్విన ట్లు నిగిడెన్ ఘోరాంధకారచ్ఛటల్ ఆ ౪.
చ. తనమది విష్ణుగుప్తుఁడు పదంపడి యచ్చెరువంద నందివా
హన, సరసీరుహాసన, బలాసురశాసన పావకేనసం
దన, దనుజాబ్ధినాయక, సదాగతి వైశ్రవణాది దేవతా
జనసహితంబుగా నిసురశత్రుఁ డదృశ్యత నొందె నంతటన్. ఆ ౫

మచ్చునకుఁగా సోమనాథుఁ డాంధ్రశబ్దబాహుళ్యముగ రచిం
చిన సీసపద్యము నొకదాని నీదిగువ నుదాహరించుచున్నాను.

సీ. జిగిమీఱు నడుగు లేఁజిగురు నిబ్బరఁపుడా
లెరసంజ కెంజాయ కెదురుసూప
క్రొక్కారుమెఱుఁగు నిగ్గులకు సిగ్గులుగుల్క
మెయితళ్కు లపరంజి మిసిమి జిల్క

నవయవంబులతావు లచ్చుంపు పచ్చక
 ప్పురపు వాసనలకు బిరుదుగట్ట
సొలపుటల్లార్పుచూపుః దువాళ్లములు చూ
 పులవింటిజోదు తూపులనదల్ప
గీ. వివిధభూషణ భూషణ భవదగణ్య
పుణ్యలావణ్యరూప నైపుణ్యలగుచు
కౌశికద్వారవేదికాంగణము లందు
నిర్జరాంగన లేతెంచి నిలచిరపుడు.

ఈతని వేలోకకృతి ప్రబంధవల్లరియందే ప్రకటిత మైనదని విని యున్నాఁడను. కాని నాకది లభింపలేదు. లభించినప్పు డనుబంధ ముగా నందలివిషయములఁ బ్రకటించెదను.

గుంటుపల్లి ముత్తమంత్రి శాసనములు శా. శ. ౧౫౨౮–౧౫౩౦ (క్రీ. శ. ౧౬౦౬–౧౬౦౮) సంవత్సరములలో గుంటూరుమండలమునఁ గన్పట్టుచున్నవి. ఇందు మొదటిశాసనములో ముత్తమంత్రి మల్లిఖార్జున పండితారాధ్యుని వంశములోనివాఁడైన రామలింగగురుని శిష్యుఁడని యున్నది. రెండవ శాసనములో గుంటుపల్లి భాస్కరయ్య పేర క్రోసూరునందు బజారును నిర్మించుటకు బెహరా నాగన్నకు కౌలునకిచ్చినట్లున్నది. ఈభాస్కరయ్య ముత్తమంత్రి కుమారుఁ డనుటకు సంశయింపఁ బనిలేదు. ఈశాసనమునందు రాజాధిరాజ మహారాజశ్రీ గుంటుపల్లి ముత్తమంత్రి అనియున్నది.

ఈగుంటుపల్లివారినిగూర్చి చింతగుంట కోదండరామకవి చారిత్రమున మఱికొన్ని విషయములు వ్రాయఁదలచి యిటవదలితిని. ముత్తమంత్రికిఁ గ్రీ. శ. ౧౬౦౮ నాఁటికి ౬౦ వత్సరముల వయసుండునని తలఁపవచ్చును. అయిన నాతని జననము ౧౫౬౦ ప్రాంతము గుడు. ఆతనికి జనకపితయైన తిప్పరాజు ౧౫౧౦ ప్రాంతమున జన్మించి తనముప్పదియవయేటననఁగా ౧౫౪౦ ప్రాంతమున విష్ణుమిత్రోపాఖ్యానమును గృతినొందియుండు ననుటకు సంశయములేదు. ఈగ్రంథము

నాకు లభింపలేదు. తిప్పరాజు కుమారుల నందు వర్ణించెనో లేదో ముత్తమంత్రి దత్తస్వీకార మందుదాహృతమయ్యెనో లేదో చెప్పఁజాలను.

ఆగ్రంథమును జదివి యందేమేని విశేషాంశములు గనుపట్టిన ముమ్ముందు ఆనుబంధమునఁ బ్రకటించెదను.

---

159 తులసి బసువయ్య

—X—

ఇతఁడు సావిత్రి కథను బ్రబంధముగా రచియించెనఁట! గామా పెగ్గడ జగ్గనకవి యాగ్రంథమందలి యిరువదియైదు పద్యములను తన ప్రబంధరత్నాకరమున సమకూర్చెనఁట శ్రీప్రభాకర శాస్త్రిలుగారా పద్యములను ప్రబంధ రత్నావళిలోఁ జేర్చినారు. అందలి పదిపద్యముల నీక్రిందఁ బొందుపఱచుచున్నాఁడను. ఇంతకంటె కవినిగూర్చి లేశమును తెలియలేదు.

సీ. సంతతి లేని సంసారంబు నిస్సార
మొగి నర్చకులు లేనియొప్పుతప్పు,
కొడుకులోఁగూడలి కూడు కీడుతనూజు
లెపుడు క్రీడింపని యిల్లుపాల్లు,
పుత్రరత్నములేని భోగంబు రోగంబు,
తనయుఁగానవిదాని తగవు నగవు
పిన్నబిడ్డలులేని పెక్కువ తక్కువ,
సూనుమై సోఁకనిమేను మ్రాను
గీ. కానయెబ్బంగినైన సంతానలబ్ధి
కాననగు త్రోవఁబరికించి కానవలయుఁ

గాని యూరకయునికి యుక్తంబు కాదు.
జగతిసంతతిలేకున్న జన్మహాని.

ఉ. పోకులఁబోయి యన్యసతిఁ బొందినవాఁడు సదాకళంకి; దో
షాకరుఁ డుగ్రమూర్తి సముదగ్ర విషాగ్ని సహోదరుండు ప
ద్మైకవిరోధి సంతత జినాత్ముఁడు మాసరిగాఁ డటంచు ను
త్సేకముతోడ రాజు నిరసింతురు రాజకుమారు లప్పురిన్.

చ. పనివడి పాకశాసను నెపంబునఁ బంకజ సంభవుండు నీ
తనువుఁ దొఱంగఁజేసె నతిదారుణశాంభవరోష వహ్నిచే
మనమున నాఁటియాగ్రహము మానకనీవును సంఘటించితా
ఘనునిశిరంబుఁ ద్రుంచుతమకం బితరుల్ దెలియంగ నేర్తురే.

గీ. గగనలక్ష్మీవధూటికిఁ గలశవార్ధి
యెలమితోడ నుపాయనం బిచ్చినట్టి
క్రొత్తకట్టాణి ముంగఱముత్తె మనఁగఁ
జూడనొప్పారి వేగురుఁజుక్క వొడిచె.

ఉ. మాయఁపుఁదుంటవిల్తు వెడమాయల మానినులార ప్రాణముల్
వోయెడు నాఁడునాఁటి కిఁకఁబోవిడుఁ డీయలుకల్ నిజేశులన్
బాయకుఁడీ యటంచుఁ బరిభాషలఁ జాటెడుభంగిఁ గొక్కొరో
కోయని కూఁతవేసెఁ దొలికోడి పురాంతర గేహదేహళిన్.

ఉ. అన్నగరంబు హర్మ్యములయందు ఘటించిన పద్మరాగర
త్నోన్నత కాంతిమండలము లొక్కమొగిన్ జదలేటఁ బర్వనన్
కిన్నరకాంత లాత్మఁ దలకింతురు జంబునదీప్రవాహ మి
ట్లెన్నఁడు వచ్చె నింగికని యెత్తినసంశయ సంభ్రమమ్ములన్.

క. హరితురగము నరుణాంశుని
హరులుం గవగూడనేని యగు సరి లేదా
సరిగావని యితర హయో
త్కరముల నగు నప్పురమునఁ గలహరులెల్లన్.

చ. ఉరగవధూజనంబులు పయోధర సంభృత కుంకుమాంకముల్
గరఁగ నిరంతరంబు నవగాహన మర్థి నొనర్చుచుండఁగా

నరుణారుచిం గనుంగొనంగ నందమగుం బరిఖాంబుతోయ మ
ప్పురి దనఘోరవీరరసముం బ్రకటించుచు నున్న కైవడిన్

చ. కరుణదలిర్ప నీ గుటీలుఁగా మదిఁ జూడక జూటకోటిలో
నిరుపమలీలఁ జేర్చికొని నెమ్మది నున్నపురారిఁ బాండురు
గ్భరితశరీరుఁ జేసితివి కంతునివైరముఁ బట్టియక్కటా!
సరసిజవైరి! యీవిసపుజాలికిఁ బాంధవధంబు పెద్దయే!

ఈకవి కాలము క్రీ. శ. ౧౫౬౦ ప్రాంతమునకుఁ బూర్వమనుట
కంటె. నిఁక నేమియుఁ దెలియదు.

---

160 కలిదిండి భావనారాయణకవి.

—)O(—

ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; సాలం
కాయనగోత్రుఁడు; ఇతనితండ్రి వెంకటాద్రి; తల్లిసూరమాంబ; తాత
మంత్రి రాజు. ముత్తాత రాచయమంత్రి.

ఈతఁడు విష్ణుపురాణమందలి నాలుగంశలను నాలుగాశ్వాసము
లుగా నాంధ్రీకరించి, జగన్నాథస్వామి కంకితముచేసెను. తననుగూర్చి
కవి యాగ్రంథమునందిట్లు చెప్పుకొనియున్నాఁడు.

సీ. సమధికస్ఫూర్తిఁ గృష్ణాగౌతమీమధ్య
దేశంబునకు భవ్యతిలకమగుచుఁ
బొగడొందు కలిదిండి పురమునకధిపతి
సుగుణుఁ డాపస్తంబసూత్రుఁ డధికుఁ
డనవ సాలంకాయనసగోత్రుఁ డడఁ రా
చయమంత్రి వెలయు నయ్యలఘుమతికిఁ
దనయుండు మంత్రిరాజనఘుఁ డాతఁడు గాంచె
విమలచారిత్రుని వేంకటాద్రి,

సమ్మహాత్మునకును సూరమాంబికకును
నందనుఁడఁ బూరుషోత్తమ నాథపాద
వందనానంద మహితజీవాతుజీవ
నాథ్యుఁడను భావనారాయణాభిధుండను.

ఈపద్యమునుబట్టి యీకవివంశమువారు కలిదిండి గ్రామమునకుఁ గరణములనియు, నందుచే నీతఁడు గలిదిండిభావనారాయణ యని పిలువఁబడుచుండెననియు, వీరిగృహనామము, అడవివారనియుఁ దెలియుచున్నది. అడవివారు నియోగిబ్రాహ్మణులలోనున్నారు. వారును సాలంకాయన గోత్రులే.

కలిదిండియను గ్రామము కృష్ణామండలములోఁ గైకలూరు తాలూకాలోనున్నది. ఇది బందరు పట్టణమునకు సుమా రిరువదిమైళ్ళ దూరమునఁ గలదని విష్ణుపురాణ పీఠికాకారులు వ్రాసియున్నారు. గుడివాడ కీశాన్యమూల 21 మైళ్ల దూరములోఁ గలిదిండి యున్నదనియు నచ్చట మహమ్మదీయులచేఁ గట్టఁబడిన మట్టికోట గలదనియు స్యూయెల్ పండితుఁడు వ్రాసియుండెను. (సం ౧ పుట ౫౨)

ఈకవి వైష్ణవమతాభిమానము కలవాఁడని యీక్రింది సీసపద్యములో, వైష్ణవాచార్యులను భక్తులను గొనియాడుటచేఁ దలంపనగుచున్నది.

సీ. పూర్ణభక్తి భజింతుఁ బొయిగపూదత్త పే
యాళ్వారుల చరణాంబుజములు
సేవింతుమదిలోన శ్రీభక్తిసార భ
ట్టాధిప కులశేఖరార్యవరులఁ
బ్రణుతింతు మునివాహభక్తాంఘ్రిరేణుద్వి
షద్దండధరుల నిశ్చలమనీష
వరిపస్యగూర్తు మధురకవి శఠగోప
భాష్యకర్తలకు సౌభాగ్యరేఖ
గీ. నాథయామున మునిసూరనాథపుండరీక
దృగ్రామ మిశ్రాది లోకవిశ్రు

తాద్యగురు సంఘములకు సాష్టాంగనతులు
సేయుదు మదీయకృతికి మేల్సేయుకొఱకు

ఈకవికి వాధూలస గోత్రుఁడైన కందాళ భావనారాయణ కుమారుఁడగు శ్రీరంగగురుఁడు, గురువైన ట్లీక్రిందిపద్యములో వర్ణించి యున్నాఁడు.

సీ. తనకు మ్రొక్కినమ్రొక్కు జనురనోకహావిని
రర్థన ప్రచండ పరశ్వథంబు
తనసేవ పాతకోదక గభీరత్వ దు
స్తర సంసరణ వార్ధితరణ తరణి
తనశ్రీమదంఘ్రితీర్థము ముక్తి సామ్రాజ్య
పట్టాభిషేక సంభారజలము
తనసంశ్రియణము సౌధాయిత మహనీయ
కైవల్య నిశ్రేణి కాశ్రియంబు
గీ. గాఁగ వాధూలగోత్రి సాగర శశాంక
భావనాచార్య తనయుఁడై ప్రబలు నపర
హరిని కందాళ శ్రీరంగగురుని
సద్గురుని భజింతు నభీష్టార్థసిద్ధికొఱకు

ఈకందాళ శ్రీరంగగురుఁడే, సుదక్షిణా పరిణయ కృతికర్త యగు తెనాలి యన్నయకును, హరిభట్ట కృత నరసింహపురాణ కృతిపతియగు రంగన మంత్రికిని గురువైయున్నాఁడు. కావున నీకవి వారిలో సమకాలికుఁడు ఈశ్రీరంగగురుఁడు. తిరుపతి దేవస్థానమునం దాచార్య పురుషుఁడై శ్రీవేంకటేశ్వర స్వామికి ౧౫౦౦ పణము లర్పించి క్రీ. శ. ౧౫౮౫ సంవత్సరము జూలై నెల 5 వ తేదీని శిలాశాసనము వేయించినాఁడు. కావున భావనారాయణకవి యాకాలము వాఁడనుటకు సంశయములేదు.

ఇతఁడు జగన్నాథమందలి సుభద్రాదేవీ కరుణాకటాక్ష వీక్షణా లబ్ధ కవితాధార కలవాఁడనని గద్యయందుఁ జెప్పుకొని యున్నాఁడు. సంస్కృతమున నాలుంశములుగల విష్ణుపురాణములోని నాలుగంశల

నీతఁడాంధ్రీకరించెను. వెన్నెలకంటి సూరన్న యెనిమిదాశ్వాసము లలో నాలుశలను దెనుఁగుచేసెను. భావనారాయణ కవిత్వము సర్వవిధముల నుత్తమమయినదే. కాని సూరనార్యుని కవిత్వముతో తులతూగదు. భావనారాయణ కవిత్వమునందచ్చటచ్చట వ్యాకరణ దోషములు గన్పట్టుచున్నవి. కాని యవి యనేకుల కవిత్వమునందును గన్పట్టుచుండుటచే నజ్ఞానకృతములు గావనియు. మాధుర్య రసాధిక్యము లను తలంపున నట్టివి కవి ప్రయోగించియుండుననియుఁ దలంపవలసి యున్నది.

ఈగ్రంథమును మదరాసు విశ్వవిద్యాలయమువారు తమ విద్వాంల యమందలి పండితులు రచించిన విపులమగు పీఠికతో ముద్రింపించి యున్నారు.

ఈకవి పురుషోత్తమఖండమునుగూడ నాంధ్రీకరించి యున్న ట్లీక్రిందిపద్యములో నుడివియున్నాఁడు.

గీ. ఘనతశ్రీపురుషోత్తమఖండ మాంధ్ర
నవ్యపదబంధములఁ బ్రబంధంబు చేసి
యొన్నఁగల దైవమైయున్న వెన్నముద్ద
ముద్దుకృష్ణున కంకితంబుగ నొనర్చి.

ఈగ్రంథమున జగన్నాథక్షేత్ర మాహాత్మ్యము వర్ణితమైనట్లు కనుపట్టుచున్నది. ఇది నామావశేషమయినది. ఈకవి విష్ణుపురాణము నందు, జగన్నాథక్షేత్రముననుండు నొక గోసాయి నీక్రింది పద్యమున సంస్మరించియున్నాఁడు.

మ. దినమున్ శ్రీపురుషోత్తమాధి పతికిం దేదీప్యమాన ప్రసూ
ననవోద్యద్వనమాలికా ఫలవిమానంబుల్ సమగ్రింబులై
తనరన్ దోటలు క్షేత్రరాజమునఁ జెంతన్నిల్పి యప్పుడ్మలో
చనుఁడే తానగు రామకృష్ణభటుగోసాయిం బ్రశంసించెదన్.

నరకృతిసేయుటకంటెఁ బరమేశ్వరునకే కృతి నర్పించుట శ్రేష్ఠ మనియుఁ దప్పులను విడచి యొప్పులను గైకొనుటయే సత్కవి లక్షణ మనియు రెండు పద్యములను జెప్పియున్నాఁడు.

చ. సరసతయుఁ మృదుత్వమును జక్కదనంబు నలంక్రియాపరి
స్ఫురణముగల్గి శ్రీవిభునిఁ బొందినచోఁ గృతి సాధ్వియందు రా
సరసతయుఁ మృదుత్వమును జక్కదనంబు నలంక్రియాపరి
స్ఫురణముగల్గియుం బరులఁ బొందిన దుష్కృతియందు రెందునన్

ఉ. లాలిత కావ్యసీమ నొకలక్షణ మొప్పకయున్న సత్కవుల్
మేలుగ్రహింపఁ గోరుదురు మించిన సత్కృపఁ గాకవుల్ గడున్
గ్రేలుదురింతెగాక సవరింపఁగ నేర్తురె యంచకైవడిన్
బాలును నీరునేర్పఱచు పాకము కాకము పొందనేర్చునే.

ఈతని కవిత్వశైలి తెలియుటకై విష్ణుపురాణమునుండి నాలుగు పద్యముల నుదాహరించుచున్నాఁడను.

చ. అనిశము నిత్యకర్మపరులై విజితేంద్రియులై వినిష్టవ
ర్తన. ఋతుకాలదార నిరతత్వము నొంది దయార్ద్రులై మనం
బున పరహింసమాని జనపూజ్యతనొందు గృహస్థులొందువా
రనుపమమైన బ్రహ్మనిలయంబు వినిర్మల ధర్మవిత్తమా ౧ ఆ.

శా. భాతిం దూర్పునుండి దక్షిణదిశాప్రత్యగ్దిశోదగ్దిశా
స్ఫీతద్యోత వితానుఁడై పటుధనుఃక్షిప్తాశుగాశుక్రియల్
చేలోమోదముగాఁ బ్రదక్షిణముగాఁ జిత్రస్థితిం ద్రిమ్మరున్
జ్యోతిశ్చక్ర సమేతుఁడై యెపుడు ఖద్యోతుండు విప్రోత్తమా! ౨ ఆ.

మ. జననాథోత్తమ! చెప్పెద న్వినుసదాచారంబు నిత్యంబు స
జ్జను లత్యుద్యద్వృత్తి నాచరించుట సదాచారం బనంజెల్లు స
జ్జనసంజ్ఞల్ మనువుల్ ప్రజాపతులు నాసప్తర్షులుం జువ్వె త
ద్వినుతాచార పరాయణుండు గను తీవిన్ రెండులోకంబులున్ ౩ ఆ.

ఉ. తాపసుఁడై యకాలము గదాయని యెంచక మించినీదుమా
తాపహుఁడల్గి యిచ్చె నతిదారుణశాపము నీవు నాజరా
భూమికపూని నాకొసఁగు భోగ్యభవన్నవయౌవనంబు ని
త్యామిత భోగముల్గని సహస్రసమాప్తిగ నిత్తుఁ గ్రమ్మఱన్ ౪ ఆ.

ఈకవికాలము క్రీ. శ. ౧౫౨౦–౧౫౮౦ అని 'గుఱకిబారెడు' న్యాయమున నిర్ణయింపవచ్చును. ఇతఁడు జగన్నాథస్వామి భక్తుఁడు.

ప్పిన పాటిగ లీలావతి
నొనర్తుఁ దెనుఁగున......

సీ. నరస నరేంద్ర నందనుఁడైన యచ్యుత
దేవరాయల కృపాదృష్టిఁ జేసి
ఆందోళికారూఢుఁ డగుచును......బొమ్మ
లాట కాళ్లఁడు వేడ్క నర్థరాశి
లో నాత్మగురునాథుఁడైన కుమార తా
తాచార్య వర్యున కర్థమిచ్చె
ద్విజులకు శేషతృతీయముల్ రెండిడి
శేషపాదము కవిశ్రేణికొసఁగె

గీ. స్నేహమునఁ దన చెలులకు శేషనవమ
భాగపంచక మంతయుఁ బంచిపెట్టెఁ
గవి మహేంద్రున కర్పించె మిగిలినట్టి
వేయునూటపదా రెంతవిత్తరాశి.

గృహనామమునుబట్టి యీకాళ్లఁడు తోలుబొమ్మల నాడించు వాఁడేమో యని స్ఫురించుచున్నది. కాని యీసీసపద్యమునందు ఆందోళికారూఢుఁడనియు విద్యానిధి యనియు నుండుటచే నీతఁడేదియో యున్నతోద్యోగమునందుఁడినవాఁ డని స్పష్టమగుచున్నది. బొమ్మలాట సాంబయ్య (శంబరధరుఁడు) కిరాతార్జునీయమను యక్షగానమును రచియించి యున్నాఁడు. ఆతఁడీవంశమువాఁడే యైయుండును.

ఈకవి నివాసము విజయనగర ప్రాంతమైయుండును. అచ్యుత దేవరాయల కాలమునం దీగ్రంథము రచియింపఁబడినట్లు పైపద్యము వలన స్పష్టమగుచున్నది. కావున క్రీ. శ. ౧౫౩౫ ప్రాంతమున నీగ్రంథమును గవి రచియించెనని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును. కృతి ప్రేరకుఁడైన కాళయ్య వేయి నూటపదాఱు రూపాయలను గవికొసంగినట్లు పైపద్యమువలనఁ దెలియుచున్నది.

స్కాందపురాణమందలి శంకరసంహితను రచించిన కోడూరి

వెంకటాచల కవికిని యీవల్లభసూరికిని సంబంధములేదు. ఇతఁడు హరితసగోత్రుఁడు. వేంకటాచలకవి కాశ్యపగోత్రుఁడు.

'కోడూరు' అనుగ్రామములు పెక్కులుండుటచేఁ గవి గృహనామము గ్రామమునుబట్టి వచ్చియుండునని నిశ్చయించినను, ఆకోడూరేదియో నిర్ణయింపఁజాలము. అనంతపురము మండలములో హిందూపురము తాలూకాలో నొకటియుఁ గడపమండలములో జమ్మలమడుగు, రాజంపేట, చిద్వేల తాలూకాలలోఁ దలయొకటియుఁ గోడూరులున్నవి. ఇంకను నితర మండలములలోఁగూడ నున్నవి.

కడపమండలమందలి కమలాపురము తాలూకా చిడిపిరాల గ్రామమును చంద్రమయ్య యనునతఁడును (ఇతనిని బొమ్మలాటరయితు అని యందురు.) బొమ్మలాట యమృతకవి యనునతఁడును తెరనాటకములాడుటకై పెదచిట్టయ్యయనునతనికిచ్చినట్లొక శాసనమున్నది ౧. బొమ్మలాటవారిలో సాంబయ్య కవియై యక్షగానమును రచియించినవాఁడగుటను అమృతకవి తెరనాటకమాడుటకై గ్రామము నిచ్చియుండుటవలనను కాళయ్య విద్యానిధియై గణితగ్రంథ రచనముకుఁ బ్రేరకుఁడగుటమూలముననను వీరిదాంధ్రభాషాభిమానముఁ గల కుటుంబమనియు విశేషించి బొమ్మలాటయందెక్కువ యభిరుచి కలవారై యాకళను బ్రోత్సహించుచుండుటచే అదివఱకు వారి గృహనామ మేదియైనను బొమ్మలాటవారని మారిపోయినదనియు నిశ్చయింపవచ్చును. తెరనాటకమనఁగా తెరపై బొమ్మలనెక్కించి యాడించు నాటకమని యర్థము చెప్పవచ్చును.

చిడిపిరాల గ్రామమును దానమొసంగుటచే నాకాలమున నీబొమ్మలాటవారున్నత పదవులయందుండి రాజసన్మానముల నందుచున్నారని యూహింపఁ దగియున్నది. కృతికర్తకృతిభర్తలనివాసము కడప మండలమని యూహింపవచ్చును. బొమ్మలాటవారి కులమేదియో తెలియదు.

(౧ A. R. 316 of 1928.)

ప్పిన పాటిగ లీలావతి
నానర్థుఁ డెనుఁగున......

సీ. నరస నరేంద్ర నందనుఁడైన యచ్యుత
దేవరాయల కృపాదృష్టిఁ జేసి
ఆందోళికారూఢుఁ డగుచును......బొమ్మ
లాట కాళ్ళఁడు వేడ్క నర్థరాశి
లో నాత్మగురునాథుఁడైన కుమార తా
తాచార్య వర్యున కర్థమిచ్చె
ద్విజులకు శేషతృతీయముల్ రెండిడి
శేషపాదము కవిశ్రేణికొసఁగె

గీ. స్నేహమునఁ దన చెలులకు శేషనవమ
భాగపంచక మంతయుఁ బంచిపెట్టెఁ
గవి మహేంద్రున కర్పించె మిగిలినట్టి
వేయునూటపదా ఱెంతవిత్తరాశి.

గృహనామమునుబట్టి యీ కాళ్ళఁడు తోలుబొమ్మల నాడించు వాఁడేమో యని స్ఫురించుచున్నది. కాని యీసీసపద్యమునందు ఆందోళికారూఢుఁడనియు విద్యానిధి యనియు నుండుటచే నీతఁడేదియో యున్నతోద్యోగమునందుఁడినవాఁ డని స్పష్టమగుచున్నది. బొమ్మలాట సాంబయ్య (శంబరధరుఁడు) కిరాతార్జునీయమను యక్షగానమును రచియించి యున్నాఁడు. ఆతఁడీవంశమువాఁడే యైయుండును.

ఈకవి నివాసము విజయనగర ప్రాంతమైయుండును. అచ్యుత దేవరాయల కాలమునం దీగ్రంథము రచియింపఁబడినట్లు పైపద్యము వలన స్పష్టమగుచున్నది. కావున క్రీ. శ. ౧౫౩౫ ప్రాంతమున నీగ్రంథమును గవి రచియించెనని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును. కృతి ప్రేరకుఁడైన కాళ్ళయ్య వేయి నూటపదాఱు రూపాయలను గవికొసంగినట్లు పైపద్యమువలనఁ దెలియుచున్నది.

స్కాందపురాణమందలి శంకరసంహితను రచించిన కోడూరి

వెంకటాచల కవికిని యీవల్లభసూరికిని సంబంధములేదు. ఇతఁడు హరితసగోత్రుఁడు. వేంకటాచలకవి కాశ్యపగోత్రుఁడు.

'కోడూరు' అనుగ్రామములు పెక్కులుండుటచేఁ గవి గృహనామము గ్రామమునుబట్టి వచ్చియుండునని నిశ్చయించినను, ఆకోడూరేదియో నిర్ణయింపఁజాలము. అనంతపురము మండలములో హిందూపురము తాలూకాలో నొకటియుఁ గడపమండలములో జమ్మలమడుగు, రాజింపేట, చిద్వేల తాలూకాలలోఁ దలయొకటియుఁ గోడూరులున్నవి. ఇంకను నితర మండలములలోఁగూడ నున్నవి.

కడపమండలమందలి కమలాపురము తాలూకా చిడిపిరాల గ్రామమును చంద్రమయ్య యనునతఁడును (ఇతనిని బొమ్మలాటరయితు అని యందురు.) బొమ్మలాట యమృతకవి యనునతఁడును తెరనాటకములాడుటకై పెదచిట్టయ్యయనునతనికిచ్చినట్లొక శాసనమున్నది ౧. బొమ్మలాటవారిలో సాంబయ్య కవియై యక్షగానమును రచియించినవాఁడగుటను అమృతకవి తెరనాటకమాడుటకై గ్రామము నిచ్చియుండుటవలనను కాళయ్య విద్యానిధియై గణితగ్రంథ రచనముచేఁ బేరుకొఁడగుటమూలమునను వీరిదాంధ్రభాషాభిమానముఁ గల కుటుంబమనియు విశేషించి బొమ్మలాటయందెక్కువ యభిరుచి కలవారై యాకళను బ్రోత్సహించుచుండుటచే అదివఱకు వారి గృహనామ మేదియైనను బొమ్మలాటవారని మారిపోయినదనియు నిశ్చయింపవచ్చును. తెర నాటకమనఁగా తెరపై బొమ్మలనెక్కించి యాడించు నాటకమని యర్థము చెప్పవచ్చును.

చిడిపిరాల గ్రామమును దానమొసంగుటచే నాకాలమున నీబొమ్మలాటవారున్నత పదవులయందుండి రాజసన్మానముల నందుచున్నారని యూహింపఁ దగియున్నది. కృతికర్తకృతిభర్తలనివాసము కడప మండలమని యూహింపవచ్చును. బొమ్మలాటవారి కులమేదియో తెలియదు.

(౧ A. R. 316 of 1928.)

య్యాహోదుల్ విని సత్కవీంద్రుఁ డితరుండొచ్చెం బపేక్షించు సం
దేహించుం దనసొమ్ము పోయినగతిన్ దీనత్వముం బొందుచున్.

చ. అమృతమువంటి తల్లి కమలాసను పట్టపుదేవి వేదశా
స్త్రముల విహారభూమి కలప్రాణుల కెల్లను పల్కుఁదోడు వి
శ్వమున సమస్తవిద్యల విశారద శారద నాదువక్త్రప
ద్మమున వసించి సత్కృతిఁ జనుత్కృతి పట్టుగఁ జేయుఁ గావుతన్.

చ. తమకముతోడఁ దల్లియును దండ్రియు నొక్కట ముద్దువేఁడ సం
భ్రమమున వచ్చి తల్లిముఖపద్మముఁ దండ్రిముఖంబు లైదు వే
గమ తన యాఱుమోములను గైకొని ముద్దిడు మేటివేలుపుం
గొమరుఁడు నాదువాణికి నకుంఠిత శబ్దము లిచ్చుఁగావుతన్.

ఉ. పూర్వకవీంద్రులం గొలుచు పూనికి నిప్పటివారిఁ గొల్తు ని
గ్గర్వత నిక్కవీంద్రులు పురాణ కవీంద్రులకంటెఁ దక్కువే?
యుర్విని నేఁటివారగుట యొచ్చెమె? నేఁడను దామ్రపర్ణిలోఁ
బూర్వపు ముత్తియంబులను బోలినమౌక్తికరాజి లేదొకో?

క. సుతుఁడుఁ దటాకము దేవా
యతనము నల్లిల్లు నిధియు నారామము స
త్కృతియు ననుసంతతులయం
దతిశయము ప్రబంధమెప్పుడు నక్షయమగుటన్.

సీ. చనుఁగవఁ బయ్యెద జాఱంగ జాఱంగఁ
గరమూలముననంటఁ గదిమి కదిమి
వేసలి వెడవెడ వీడంగ వీడంగ
నెలమిమూఁపునఁ జాల నిఱికి యిఱికి
నుదుటిపై నలకలు సెదరంగఁ జెదరంగ
నల్లన ముంజేత నదిమి యదిమి
పొడతెంచు చెమటలు పొదలంగఁ బొదలంగ
నడరు నూర్పులచేత నడఁచి యడఁచి

గీ. చన్నులును జేతికలశంబు సరసమాడ
నవ్వు నమృతంబుఁ దమలోన నవ్వులాడ

సిగ్గుతమకంబు వినయంబుఁ జెంగలింప
వెలఁది యమృతంబు వడ్డించె విబుధతతికి.

సీ. ఉత్తుంగ కర్కశవృత్తస్తనంబుల
నద్వైతభావన యతిశయిల్ల
నత్యంత శూన్యతాయత్తమధ్యంబున
నాస్తికతత్త్వంబు విస్తరిల్ల
స్నిగ్ధారుణారుణ ముగ్ధాధరంబున
ప్రాభాకరాపూర్వశోభ దొలఁక
విటమనోవిదళనస్ఫుట కటాక్షంబుల
భేనసిద్ధాంతంబు పెంపుమిగుల

గీ. మేనవైశేషికప్రభ గానఁబడఁగ
నొప్పుదురు వారకామిను లిప్పురమునఁ
దలఁపఁ గేవల కామశాస్త్రంబె కాదు
నిఖిలశాస్త్రంబులును నిందు నెగడుననఁగ.

సీ. లపదురస్స్థలమునఁ బసనైన గళమున
వీసితలీల శ్రీ నిలిపినారు,
చరణంబుపట్టున జడలో చుట్టిన
ననువొంకఁ గాగంగ ననిచినారు,
భవ్యగుణంబున దివ్యదేహంబున
నొఱపుమీఱఁగ భూతి మెఱసినారు
తిరముగా మూఁపున గరిమొప్పురూపునఁ
బొలుపొందఁగా ధాత్రిఁ బూనినారు,

గీ. తెల్లగలయిండ్ల నిలిచి వర్తిల్లినారు
ఇరువు రిరువుర భార్యల నేలినారు
పెక్కుమొగముల కొడుకులఁ బెనిచినారు
హరిహరులు వీరు సర్వలోకాధిపతులు.

163 చెందలూరి చిక్కయ్య

ఈతఁడే కాలమువాఁడో, ఏకులమువాఁడో, ఎచ్చటివాఁడో ఏమి యుఁ దెలియదు. ప్రబంధరత్నాకర కర్తయగు రామా పెద్దగడ జగ్గన సేక రించినవానిలో చెందలూరి చిక్కయ నాసికేతోపాఖ్యానము లోనివని యీక్రింది పద్యములు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే ప్రబంధ రత్నావళియం దుదాహరింపఁడినవి.

సీ. అవ్వృతోపమానంబు లగునన్నములతోడఁ
బహువిధశాకసూపములతోడఁ
బాయసాపూప జాంబాలికంబులతోడ
విమల హయ్యంగ వీనములతోడ
పాడబంబులతో రసావళ్లతోడను
ఘనశర్కరా పానకములతోడఁ
గదలికాద్రాక్షాది వృదుఫలంబులతోడ
వడియాలతోడఁ బచ్చడులతోడఁ

గీ. బ్రకటముగ దుగ్ధమధితతక్రములతోడఁ
బ్రియము తళుకొత్త షడ్రసోపేతము గను
భాసురంబుగ నారగింపంగఁ జేసె
నారఘుక్షోణివిభుఁడు బ్రాహ్మణుల నెల్ల.

సీ. ప్రాలేయకిరణ బింబస్ఫూర్తిఁ దలపించు
విశదంపుఁదనుకాంతి దిశలు ప్రాఁక
జిగినిండఁ దొలఁకెడు చిగురుటాకుల సొంపు
వాటించు ఘనజటాభరము మెఱయఁ
గాంచనమౌంజీవికాసంబు గెడగూడి
చెలువుసూపుచు మృగాజినము దనరఁ
గమనీయ కోమల కరపయోరుహమునఁ
బ్రకటితంబగు విపంచిక చెలిరఁ

గీ. హరికథాలాప శోభితమైనయట్టి
యాననమ్ముఁ బ్రసన్నత నలరుచుండ
గగనముననుండి సమవర్తి కడకు వచ్చె
నమరసంయమి వరుండు విద్యాగురుండు.

సీ. బహువిధ పరిమళ భరితోదకంబులఁ
కెలువంబు శోభిల్ల జలకమార్చి
నిండారు పండు వెన్నెల సోయగమునవ్వు
పసిఁడి కమ్మల వెల్లపట్టుఁ గట్టి
కబరిభారంబునఁ గన్నె చెంగలువలు
పసమీఱఁ గొనలు దోఁపఁగఁ జెరివి
తీండ్రించు పసిఁడిదీధితులచే నమరెడు
నవరత్నమయ భూషణములు దొడిగి

గీ. మృగమదము గుంకుమంబును మేళవించి
గంధసారంబు మైదీగెఁ గలయనలఁది
శ్రీలు మెఱయంగఁ బరిణయోచితముగాఁగ
సఖులు కైసేసి తెచ్చిరి చంద్రముఖిని.

సీ. రాజితరత్న దర్పణతోరణంబులఁ
గడుశోభితములైన కలువడముల
మానితకనకరంభాస్తంభ పంక్తుల
భాసురోజ్జ్వల పతాకాసమృద్ధి
నిర్మలస్ఫురిత మాణిక్యకుంభంబుల
మెండైన చిత్రింపు మేలుకట్లఁ
బ్రకటితనూత్న మౌక్తిక రంగవల్లుల
రవణీయ పరిమళ ద్రవ్యసమితిఁ

గీ. దనరు నగరంబునుతనిరంతర విభూతి
నతిశయంబుగఁ దగనలంకృతులొనర్చి
బహుపదార్థంబు లొడఁగూర్చి పరిణయమున
కాయితము సేసిరంత వారనుపమముగ.

సీ. లక్ష్మిఁ గొల్లాపురిలంక శాంకరివిశా
లాక్షిఁ గాశికను వింధ్యమున దుర్గఁ
గన్యఁ గన్యాకుబ్జఁ గామరూపంబునఁ
గామాక్షిఁ గాంచిని గామకోటి
మంగళిఁ బుండ్రక మాణిక్యదత్తవా
టమున నార్యావర్తకమునఁ ద్రిపుర
జాలంధరంబున జ్వాలహైమచ్ఛత్ర
పురిమహాయోగ శ్రీగిరిని భ్రమర
గీ. విరజ విరజపాలంకృతిపీఠ (?) సింహ
ళమున నరసింహికను గాశ్మీరమున వాణి
నుజ్జయిని మహాకాళిని నున్నతముగఁ
జూచువారలు జముపురిఁ జూడ రెందు.
సీ. వర్ణితప్రాకార వప్రరత్నప్రభా
వ్యూహకిమ్మీరిత వ్యోమతలము
వివిధవాదిత్ర భైరవ రావపూరిత
ప్రవిమాన తరదిశా భాగసమితి
బహుళ దంతావళ ప్రాలంబ ఘంటికా
టంకృతోల్లాసి ఘంటాపథంబు
కమనీయరూపరేఖా కళావిభ్రమ
ప్రకటితాబ్జాననారత్నపేటి
గీ. సహజధర్మార్థ కామమోక్షప్రసిద్ధి
సన్నుతౌదార్య శీలనాజన్మభూమి
సకల సంపద్విలాస విస్తారహసిత
రాజరాజ పురంబు వారణపురంబు.

దగ్గుబల్లి దుగ్గన రచియించిన నాసికేతోపాఖ్యానమొండుగలదు. అది చెందలూరి గంగనామాత్యున కంకితమీయఁబడినది. ఈకవి యింటిపేరుకూడ చెందలూరివారగుటచే, ప్రబంధరత్నావళిలో నేసీపద్యములను మొదటఁ జూచినప్పుడు చిక్కయ చెందలూరివారి వంశీ

యుఁడగు నొకలేఖరి యయియుండుననియు, నీపద్యములు దుగ్గన ప్రణీతములై యుండుననియు ననుకొంటిని కాని దుగ్గన నాసికేతో పాఖ్యానమును జూడఁగా నందీపద్యములులేవు. పైనివ్రాసిన పద్యము లలో మొదటిపద్యమువంటి పద్యమొకటి యున్నది. తక్కిన పద్యము లనుబోలిన పద్యములైనను నందు లేవు. రెండు గ్రంథములయందలి యితివృత్తము నొకటియే. కాని చిక్కయ నాసికేతోపాఖ్యానమున వర్ణనాంశము లధికముగానుండునని తోఁచుచున్నది.

ఇంతకంటె కవినిగూర్చిగాని గ్రంథమునుగూర్చిగాని నాకే మియుఁ దెలియలేదు. ఉదాహృత పద్యములనుబట్టి ఈతని కవిత్వము ప్రాచీనకవుల కవిత్వమువలె హృద్యమై నిర్దుష్టమై యుండునని తోఁచు చున్నది.

ఇతనికాలమునుగూర్చి యేమియుఁ దెలియనందున నావిమర్శనా భారమును భావిపరిశోధకులపైఁబెట్టి ప్రస్తుతమీతనిని పదునైదవ శతా బ్దియందున్న వానినిగా నెంచుచున్నాఁడను.

---

164 భద్రకవి లింగకవి

సానంద చరిత్రమను మూఁడాశ్వాసముల ద్విపద కావ్యమొ కటియు, దేవాంగపురాణమను నేడాశ్వాసములద్విపద కావ్యమొకటియు నీతని రచనములు. ఈ రెండు గ్రంథములుకూడ ముద్రితములు కాలేదు. దేవాంగ పురాణమున కొకప్రతియు, సానందచరిత్రమునకుఁ దొమ్మి దిప్రతులును మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము నందును సానంద చరిత్రమునకే నాల్గుప్రతులు తంజావూరు పుస్తకభాండాగా రమునందును గలవు. శివపంచాక్షరీ మాహాత్మ్యమున సానందుఁడను ఋషి యమలోకవాసులను నరకబాధలనుండి తప్పించినకథ సానంద చరి త్రమునఁ జెప్పఁబడినది. కోట శివరామయ్యయు మఱియొకకవియు

నీకథను పద్యకావ్యములుగా రచించియున్నారు. దేవాంగపురాణము నందు మనువంశముననొకమహర్షి జనించి, దేవతలకువస్త్రములనేయుట మొదలుగా దేవాంగుల పుట్టుక పూర్వోత్తరములు వర్ణింపఁబడినవి.

ఈకవి జంగమ కులజుఁడయినట్లును, రామయకును, అమలాంబకును బుత్త్రుఁడైనట్లును, కాళహస్తియందలి సంగమేశ్వర గురుని శిష్యుఁడైనట్లును, నీక్రింది ద్విపదలవలనఁ దెలియుచున్నది.

జంగమకులవార్ధి చందోద్రిదయుండు
లింగైక నిష్ఠావిలీన మానసుఁడు
వాసనగల పుణ్యావర్తనుం డనఁగ
భాసిల్లు రామయ ప్రభువరేణ్యుండు
తనదు పాతివ్రత్య ధర్మమార్గమున
ననసూయకెనయైన యమలాంబవలనఁ
గనిన పుత్త్రుఁడు భద్రకవి లింగవిభుఁడు
వినుతభాసుర కావ్య విద్యాధికుండు

* * *

చిరపుణ్యశోభిత శ్రీకాళహస్తి
గురుసంగమేశ్వర కోమలచరణ
జలజాత గంధపుష్పంధయమాన
కలితమానస భద్రకవి లింగధీర
విరచిత సానంద విమలచారిత్రి
మరుదైన భవలతాయతలవిత్రంబు.

సానంద చరిత్రమును నరణాచలమున కుత్తరముననున్న యరుణాద్రి మంగళపుర వాస్తవ్యుఁడును, సంగయదేవర కుమారుఁడునగు వీరభద్రయ్యయను జంగమదేవర కంకితముచేసిన ట్లీక్రింది ద్విపదలలోఁ గానవచ్చుచున్నది.

అరుణశోణాద్రికట నుత్తరమున
నరుణాద్రిమంగళం బనుపురంబునను

శ్రీరుద్రగణమూర్తి శివయోగి చెన్న
వీరభద్రేశ్వర విమలసద్గురుఁడు
వన్నింప నిజశిష్య మండలిలోన
సన్నుతి కెక్కిన సత్యసంధుండు
అంగగుణాతీతుఁడగు శివయోగి
సంగయదేవర సత్కుమారుండు
కలఁడు జంగమరూప కనకశైలంబు
విలసిల్లు శివయోగి వీరభద్రయ్య

* * *

అనినఁ దమ్మునిమాట లంగీకరించి
విని వమ్మరప్పించి వేడ్క నిట్లనియె
అనఘాత్మ సానందుఁడను మహామౌని
ఘనపుణ్యచరితంబు కవులు గీర్తింప
వావిరి ద్విపదకావ్య ప్రబంధంబు
గావింపు మాపేరఁ గరమర్థిననుచు
శివయోగిరాయఁ డాశ్రితరక్షకుండు
ప్రవిమలభూతి మత్ఫాలభాగమున
ధరియించి కనకరత్న ప్రభాకలిత
వరభూషణాదులు వరుసతో నొసఁగి
ఘనసార తాంబూల గంధాంక్షతములు
మునుకొని పాలించి ముదముతో ననుప
మనమున సంతోష మహిమ శోభిల్ల
ఘనపుణ్య కృతి సేయఁ గడఁగితి నేను.

ఈ గ్రంథమును కాళహస్తి నివాసుఁడైన గుల్లపల్లి లింగార్యుఁడు వ్రాసినట్లీక్రింది ద్విపదలలోఁ జెప్పియున్నాఁడు.

జ్ఞానప్రసూన విజ్ఞానప్రదీప
శ్రీనిధియగుస్వస్తి శ్రీకాళహస్తి
పురవాసుఁడైనట్టి భూతేశుపాద

సరసిజమకరంద సచ్చిదానంద
భ్రిమర్త్యుఁడై తగు గుళ్ళపల్లిలింగార్యుఁ
డమరఁ బ్రాయింపఁ జెల్వలరినయట్టి
యీపుణ్యచారిత్ర మెవ్వరు వినిన

గ్రంథవిలేఖకుఁడును గవియొక్క గురువును గాళహస్తి నివాసు లగుటచేఁ గవి నివాసముకూడఁ గాళహస్తియని యూహింపఁ దగి యున్నది.

ఈకవి రచించిన దేవాంగపురాణము ముదునూరునందలి రామేశ్వరస్వామికంకితమైనది. ఈపురాణమున మనుమహర్షి యీశ్వరునకు దేవాంగఋషిగా జన్మించి దేవతావస్త్ర నిర్మాణములను చేయుటయు, నాతఁడే విద్యాధర, పుష్పదంత, భేతాళ, వరరుచి, దివసాళి, దేవర దాసి యను నామములతో నాలవతారముల నెత్తుటయు, దేవరదాసి యవతారము దేవాంగకులమం దగుటయు, నాతఁడు జైనమతమును ఖండించి శైవమతము నభివృద్ధిచేయుటయు మొదలు గాఁగలకథ లిందు వర్ణితములు. ఈగ్రంథములోఁ గవి తాను దేవరదాసమయ్య కులములోని వాఁడనని చెప్పుకొని యున్నాఁడు.

వరయశోధనుఁడు దేవరదాసమయ్య
కులపయోరాశి కుముదబాంధవుఁడు
తెలుఁగుకు నెరవాది ద్విపదకు రాజు
గుణగణాభరణుండు గూడలిర్ధలిని
గణుతింపఁదగు భద్రకవి లింగవిభుఁడు
కడునర్ధి నతని నిక్కడకు రప్పించి
యెడపక చెప్పింపు డీప్రబంధంబు.

అని పడవీడు పట్టణమందున్న దేవాంగు లనుకొనిరఁట. ఈదేవర దాసమయ్య దేవాంగులకు మూలపురుషుఁడు. దేవాంగులలో దాసమ గోత్రులున్నారు. దీనినిబట్టి యీకవి దేవాంగకులజుఁడని స్పష్టమగు చున్నది. కాని పైనివ్రాసిన ద్విపదలలో జంగమకులజుఁడనియున్నది. వీరశైవమును గైకొనినవారేకులమువారైనను జంగముల మనియే

చెప్పుకొనుచుందురు. కావున నాసూత్రము ననుసరించి యీతఁడుఁ జంగముండనని చెప్పుకొనియుండును. పడవీటినగరము నీకవి యీక్రింది ద్విపదలలో నిట్లువర్ణించియున్నాఁడు.

భూనారికిని శిరోభూషణంబైన
మానిత ద్రావిడ మధ్యదేశమున
నడరు మర్త్యస్వర్గమగు మధురరస
పడవీడు సకలసంపదలకు వీడు

* * *

ఇరవొప్పఁ గాళహస్తీశ్వరుఁ డనెడి
పురుషాగ్రగణ్యుఁ డప్పురి కధీశ్వరుఁడు

* * *

పరగిన కశ్యపబ్రహ్మగోత్రజులు
స్థిరవీలఁ బడవీటి దేవాంగఘనులు
పరమసమ్మదముతోఁ బదివేలకులము

* * *

బనివడి పిలిపించి బహుమాన మొసఁగి
పలికిరి కొల్వులోపల నొక్కనాఁడు
నెలకొని బుధులెల్ల నీకావ్యమహిమ
గొనియాడుచున్నారు కుంభినిమీఁద
ననఘాత్మ సంతోషమయ్యెడిమాకు
మాకులమునకు నీమహనీయచరిత
శ్రీకరాభరణమై చెలువు దీపించు
కావున దేవాంగఘనచరిత్రంబు
వావిరి ద్విపదకావ్యంబు గావింపు.

గ్రంథాంతమున కొమరేంద్రుఁడను దేవాంగుని వంశమును గవి వర్ణించియున్నాఁడు.

ఉదాహృతద్విపదలనుబట్టి యీతనికవిత్వము సరసమై హృదయంగమముగా నుండునని గన్పట్టుచున్నది. ఈకవి కాలమును నిర్ణయించుచు

శ్రీ నిడదవోలు వెంకటరావు పంతులుగారొక వ్యాసమును వ్రాసియున్నారు. (భారతి - విరోధి - ఆషాఢము - పుట ౨౨-౨౩) కవికాలమునుగూర్చి శ్రీపంతులుగారి వాక్యములందలివి యీక్రిందఁ బొందుపరచుచున్నాఁడను.

"కాలము - లింగకవి తన దేవాంగపురాణమును రచియించువాఁడు పడవీడున కధిపతియగు శ్రీకాళహస్తీశుఁడను మహాపురుషుఁడధీశ్వరుఁడుగా నున్నట్లుగా నిట్లు చెప్పినాడు.

ఇరవొప్ప కాళహస్తీశ్వరుడనెడి
పురుషాగ్రగణ్యుఁ డప్పురి కధీశ్వరుఁడు
పట్టణంబులకెల్ల బరగినతల్లి
పట్టణంబయినట్టి పడవీటియందు.

పై నిపేర్కొనఁబడిన కాళహస్తీశ్వరుఁడు కృష్ణదేవరాయని వెనుక విజయనగరరాజ్యమును పరిపాలించిన యచ్యుతదేవరాయల కాలమువాడు (క్రీ.శ. ౧౫౩౦-౧౫౪౨) ఈతఁడా కాలమున పడవీడును పాలించుచున్నట్లీక్రింది శాసనములు కన్పట్టుచున్నవి.

ఉత్తరార్కాడుజిల్లా దేవకీపురమున బృహదంబాదేవియాలయమున శాసనములు.

శా. శ. ౧౪౫౨ క్రీ. శ. ౧౫౩౦ పడవీడు తిరుమలేశ్వరుని వసంత మండపనిమిత్తము భూదానము.

౧౪౫౨-౧౫౩౦ దేవకీపురము దేవాలయము ధర్మకర్తృత్వము (శ్రీకాళహస్తినాయకుడు).

౧౪౫౪-౧౫౩౨ ఇందులో స్పష్టముగా కొండమనాయకుడను వాడా కాలమున గొల్లలను దేవాలయమునకు సేవకై వినియోగించుటకు పడవీడును పాలించుచున్న కాళహస్తీశ్వరనాయకుని యనుమతిని బొందెనని కలదు.

౧౪౫౪-౧౫౩౨ దేవాలయమునకు ప్రతిమగ్గముపైని ౧౨ పణములు పన్నుకట్టుటకు శాసనము. ఇందు కాళహస్తీశ్వరుడు పేర్కొనబడినాడు.

(EP. Reports 1913 Page 44-45 Nos 364, 374, 373, 377).

ఇతఁడు తన కవిత్వమునుగూర్చి:-

"తెనుగుకు నెఱవాది ద్విపదకు రాజు
వినుతశబ్ద బ్రహ్మవిద్యా నిరూఢి
ఘనతమించిన భద్రకవిలింగ విభుడ
రమణీయ శివకవి రాజన్యహృదయ
కమలమిత్రుఁడు భద్రికవిలింగ విభుఁడు
నెఱయ నాతనికంటె నేర్పరి కలడె"

అని తెలుపుకొనినాఁడు.

---

165 పెమ్మన బావన

ఈతఁడు రచించిన "అనిరుద్ధచరిత్ర" మిప్పుడెచ్చటను గన్పిం చుటలేదు. కాని యీతనినామమును స్మరించుటకు మనకు, రామా పెగ్గడ జగ్గన తనప్రబంధరత్నాకరమునం దుదాహరించిన పద్యములే యాధారములైనవి. ప్రబంధ రత్నావళియం దీతని పద్యములఱువది పలుకుఁ బ్రకటితములయినవి. గ్రంథవిస్తరభీతిచే వానినన్నిఁటి నిందు దాహరింపఁజాలక పది పద్యములను మాత్రమీదిగువ వ్రాయుచున్నాఁ డను. ఈకవులచరిత్ర వ్రాయుసందర్భమున నేగ్రంథమునందో 'బావన కవి' నామమును జూచియున్నట్లు నాహృదయమునకుఁ దట్టుచున్నది. కాని యాగ్రంథనామమును జెప్పలేకున్నాఁడను. ఇంతకంటె నీకవినిఁ గూర్చి యేమియుఁ దెలియరాలేదు. ఉషాపరిణయకథ యిందు వర్ణిత మైనది. యుద్ధమున జయింపఁబడిన పిమ్మట బాణుఁడుషాకన్యను గన్యాదానమొనర్చిన ట్లిందుఁ గవి గల్పించినాఁడు.

సీ. కుసుమకోదండుండు గుణవంతుఁ డగుటెల్ల
యళులారా! మీప్రాపుకలిమిఁ గాదె!

మరుని యెక్కుడుపెంపు మహిమీఁదఁ జెప్పుట
కీరంబులార మీపేరఁగాదె
సంకల్పజన్మునందు సప్రాణుఁడగుటెల్ల
మలయానిలంబ నీమహిమఁగాదె
మీనకేతనుకీర్తి మిన్నందుకొనుటెల్ల
శీతమయూఖ! నీచెలిమిఁగాదె

గీ. బాలఁ గారింపఁ దగదని పలుకఁదగదె!
యేడుగడయును మీరకాదెంతద్రవ్వు
మాకుఁ బుష్పాస్త్రుఁడంచు ననేకగతుల
మధుపశుకమందపవమాన విధులఁ దలఁచి.

గీ. గురులపంపున వక్షోజభరము గదలఁ
జెలువు వీక్షించి యొక్కింత సిగ్గువడుచుఁ
గంకణంబులుఝణఝణత్కార మెసఁగ
నతివలాజలువోసె సప్తార్చియందు.

చ. చెలువములొప్పు రాజనపుఁజేలకుఁ గావలియున్న కాఁపుఁగూఁ
తుల నిడివాలుగన్నులును దోరపుఁజన్నులుఁ జూచి ధైర్యము
ల్వలపల నైన మందగతులన్ జనుచుండుదు రంగజాస్త్రముల్
దలముగఁ దాఁక నధ్వగులు దన్నగరాంతిక మార్గభూములన్.

సీ. ధూర్జటి కోపాగ్ని ధూళిగాఁ గ్రాఁగిన
నాఁడేల నీయమ్మె వాఁడి లేదు!
వాఁడికోరలరాహు వడిఁదోలి కబళించిన
నాఁడేల నీరశ్మి వేఁడిలేదు?
శాపంబు శ్రీరామభూపాలుఁడిచ్చిన
నాఁడేల కూయమో పోఁడిగాను?
చనుపకములకర్గి కనుకని ఢుల్లిన
నాఁడేల మ్రోయరో? నేఁడుమీరు

గీ. వగువఁ బాయు కెలఁగి మగటిమి వాటించి
యేయఁగాయఁగూయ మ్రోయనగునె?

మదన! చంద్ర! పికమ! కొదమతుమ్మెదలార!
నాఁడు నాఁడు నాఁడు నాఁడులేరె?

శా. ధన్యంబై పితృదేవతానివహ ముద్యత్ప్రీతి నర్తింపఁ బ
ర్జన్యాచార్యుఁడు భార్గవుండు శ్రుతిమంత్రంబుల్ పఠింపంగఁ బ్రా
ధాన్యం బొప్పఁగ శైలరాజసుత యత్యాసక్తి వీక్షింపఁగాఁ
గన్యాదానమొనర్చె బాణుఁడనురాగస్ఫూర్తిఁ బ్రాద్యుమ్నికిన్.

మ. తెరయెత్తించిరి దేవదానవగురుల్దీక్షాకళాకోవిదుల్
తరుణీరాజతనూభవాంతరమునన్ దట్టంపుఁ గౌశేయమున్
తెరయెత్తించెను వారలిద్దఱ మనోదేశంబులన్ గాముఁడున్
సరి నన్యోన్యముఖేందుమండల దిదృక్షా కౌతుకాంభోనిధిన్.

సీ. వరుణుండు కానిక పురుహూతునకుఁ దెచ్చి
పోవిడ్డనవరత్నపుంజ మనఁగ
నుదయాద్రి తటములో నున్నాళమై మున్న
వికసించు రక్తారవింద మనఁగఁ
గాశ్మీరరసపూర కమనీయమగు శచీ
సఖిచేసికల్యాణ చషకమనఁగఁ
బ్రాచికందుకకేళి పరతమింటికి వైవఁ
బొల్పారు మందారపుష్పమనఁగ

గీ. నడరు కెంజాయమండలం బతిశయిల్ల
నఖిలభూసురదత్త సంధ్యార్ఘ్యతోయ
దళితమందేహుఁడై జగంబులు వెలుంగ
భానుఁడుదయించె దేదీప్యమానుఁడగుచు.

ఉ. "వేగుచువచ్చెఁ బాసె నిదె వెన్నెల యిన్నెలవింక నుండఁగా
వేగు నెమాకు నీక్షణమ వేఁడి వెలుంగుదయించు నంచు న
ద్వేగమునం దదీయ పదవీపరివర్తన ముజ్జగింపవే
వేగమునం దొలంగుగతి విచ్చె నుడువ్రజ మంబరంబునన్.

గీ. వారుణీస్పర్శమున నాదువాఁడి దఱిగె
సకలతీర్థనిదాన మీజలవిధాన
మేనొనర్చెదఁ బావనస్నానమనుచు
మునుఁగుగతిఁ బశ్చిమాంబుధి మునిఁగె నినుఁడు.

గీ. ప్రియముఁగూర్చి ముత్తైదువ పేరఁటాలు
నలువపట్టంపుదేవి లేనగవు నగుచు
నగసుతాపద్మ లీక్షింప బిగియముడిచె
దంపతులయుత్తరీయవస్త్రములతుదలు.

ఈకవి క్రీ. శ. ౧౫౬౦ కిఁ బూర్వుఁడు.

166 కుంటముక్కుల తిరుమలనాథకవి

ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; పరాశరగోత్రుఁడు; అహోబలామాత్యపుత్త్రుఁడు; కుంటముక్కుల గ్రామవాస్తవ్యుఁడు. దుర్గాంబికావరప్రసాదాసాదిత కవితావిలాస భాసురుఁడు.

ఈకవి శైవాచార సంగ్రహ మను మూఁడాశ్వాసముల పద్యకావ్యమును రచియించి, పిల్లలమఱ్ఱి గన్నయామాత్యున కంకితము చేసెను. ఈగ్రంథము మదాసు గవర్నమెంటువారి ప్రాచ్య గ్రంథావళిలో ముద్రితమైనది. దీనికాంధ్రవిశ్వవిద్యాలయ పండితాగ్రేసరులగు శ్రీగంటి జోగిసోమయాజులు M. A. L. T. గారాంగ్లాంధ్రములలో విపులములగు పీఠికలను వ్రాసియున్నారు.

ఈకవినిగూర్చి పైనివ్రాసినవిషయము లీగ్రంథమందలి యీక్రింది పద్యగద్యములవలనఁ దెలియుచున్నవి.

క. అనుపమచరిత్రుఁ బరాశర
మునిగోత్రజు నన్ను గుంటముక్కుల నిలయున్
ఘనుని నహోబలమంత్రిం
ద్రుని నందనుఁ దిమ్మనార్యు నుతగాంభీర్యున్.

గద్య. "ఇది శ్రీదుర్గాంబికా వరప్రసాదాసాదిత కవితావిలాస భాసుర శ్రీమదహోబలామాత్యపుత్త్ర సుకవి జనమిత్ర సకల విద్యానిధాన తిరుమలనాథాభిధాన ప్రణీతంబైన శైవాచార సంగ్రహంబనుకృతి..."

గ్రంథమందెచ్చటను కవి యింటిపేరును దెలిసికొనుట కాధారములేదు. మదరాసు విశ్వవిద్యాలయ పండితవర్యులగు శ్రీనిడదవోలు వేంకటరావుపంతులు M. A. గారు ఆంధ్రపత్రిక రజతోత్సవసంచిక ౧౬-౧౭ పుటలలో, "శివాగమముల ననుసరించి తెనుఁగున శివపూజావిధానాదికమును దెల్పు నీకృతి కుంటముక్కల తిరుమలనాథకవి విరచితము' అనియు, నీకవి ఎఱ్ఱనకవికృత "కొక్కోకమునకు గృతిపతియగు భైరవమంత్రి యన్నయగు సోబళమంత్రి కుమారుడు" అనియు వ్రాసియున్నారు. కొక్కోక కృతిపతి కుంటముక్కుల మల్లమంత్రి కాని భైరవమంత్రి కాఁడు. భైరవమంత్రి మల్లమంత్రికి, అన్నకుమారుఁడు.

ఈభైరవమంత్రికిఁబైని చెప్పినయెల్లనకవి యేసకలనీతికథానిధియను గ్రంథము సంకితము చేసియుండెను. ఈవిషయ మీక్రింది పద్య పాదములవలన స్పష్టమగుచున్నది.

"మాపినతండ్రియైన మల్లమంత్రికినిఁ గా
కోకకంబు చెప్పిన కోవిదుఁడవు."

వీరిసంబంధము సులభముగాఁ దెలియుటకై కుంటముక్కల వారి వంశవృక్షము నీక్రింద నిచ్చుచున్నాఁడను.

- పెరుమాళ్ళరాజు
  - కొమ్మరాజు
    - మనుమయ్య
      - ఓబళమంత్రి
        - తెలగయ్య
          - ఓబళుడు
            - తిరుమలనాథ కవి శైవాచార సంగ్రహకర్త
          - భైరవామాత్యుఁడు = అక్కమాంబ
            - గంగన
              - పినభైరవ మంత్రి సకలనీతికథానిధి కృతిభర్త
                - మల్లనమంత్రి
            - పెదమల్లన
            - మల్లన కాకోక కృతిభర్త
            - భైరవుడు
          - పోచన
          - సోమన
          - కాళహస్తి మంత్రి
          - గోపన
          - సింగన

ఈవంశవృక్షమునకు శైవాచార సంగ్రహపీఠికలో, నుదాహృతములైన తంజావూరు తాళపత్ర ప్రతియందలి పద్యములును, కొక్కోకముద్రిత ప్రతియందలి పద్యములును నాధారములు. ఈముద్రిత ప్రతికిని ఆతాళపత్ర ప్రతికిని భేదము కనబడుచున్నది. దానినీక్రింద నిచ్చెదను.

ముద్రిత ప్రతి.

గీ. ఘనులు నాచన సోమన కాళహస్తి
మంత్రి గోపన సింగనామాత్యవరులు
తమ్ములుగ రూపకీర్తి ప్రతాపములను
బ్రబలెనిలఁగుంటముక్కల భైరవుండు.

తంజావూరుపాఠము.

గీ. ఔబళుఁడు తోడఁబుట్టిన యన్నగాఁగ
మంత్రిగోపయ సింగయామాత్యవరులు
తమ్ములుగ రూపకీర్తి ప్రతాపములను.
బ్రబలె నిలఁ గుంటముక్కల భైరవుండు.

ఈగీతపద్యమందలి తుది రెండు పాదములు రెండు పాఠముల యందును సమానమే. మొదటి రెండు పాదములయందే పాఠభేదమున్నది.

ముద్రితప్రతిపాఠము నంగీకరించితిమేని, పై వంశవృక్షములో భైరవామాత్యుని యన్నయగు "ఔబళుని, పిఠ కా కారులూహించిన యాతని కుమారుఁడగు తిరుమలనాథకవిని తీసివేయవలసియుండును తంజావూరు పాఠము నంగీకరించితిమేని పైయిరువురను నందుంచి, నాచన, సోమన, కాళహస్తి మంత్రులను ముప్పురను దీసివేయవలసి యుండును. అపక్షములో శైవాచార సంగ్రహకర్తయగు తిరుమలనాథకవి, కొక్కోక కృతిపతియైన మల్లమంత్రికిఁ బెదతండ్రి కుమారుఁడును, సకలనీతికథాన కృతిభర్తయైన పినభైరవమంత్రికిఁ బెదతాతకుమారుఁడు నగును.

ఈకవి కాలనిర్ణయము చేయ వలసివచ్చినప్పు డుపకరించు నేమోయనుటకంటె నీబాంధవ్య చర్చకుఁ బ్రయోజనములేదు. ఈవంశ వృక్షములోని మల్లమంత్రినిగూర్చి కాని పినభైరవమంత్రినిగూర్చి కాని మఱి యెవరినిగూర్చి కాని, శైవాచార గ్రంథమించుకంతయును దెలుపుటలేదు. ఎఱ్ఱన కవికృతగ్రంథము లీశైవాచార సంగ్రహమును గుఱించియుఁ దత్కర్తనుగూర్చియు మూకీభావము వహించినవి. తుదకీతిరుమలనాథకవి తండ్రియైన యహోబలమంత్రి పైవంశవృక్షములోని భైరవామాత్యునికగ్రసోదరుఁడగు నోబళమంత్రియని నిశ్చయముగాఁ జెప్పుటకు గ్రంథస్థ నిదర్శనములు లభింపలేదు. అందుచే నీపాఠద్వయ చర్చయు, నీబాంధవ్య విమర్శనమును నిష్ప్రయోజనములు. కావున వదలివేయుదము.

కవి యింటిపేరు కుంటముక్కలవారని నిర్ణయించుటకుఁ గుంటముక్కలనిలయుఁడనియుఁ బరాశరగోత్రజుండనియు, గవి చెప్పుకొనిన పైకందపద్యమే చాలును. కుంటముక్కలవారిది పరాశర గోత్రమని కొక్కోకాది గ్రంథములు నుడువుచునే యున్నవి.

ఈకవి శైవాచార సంగ్రహమును బిల్లలమఱ్ఱి గన్నమంత్రికిఁ గృతియిచ్చెను. ఇతనితండ్రి విస్సామాత్యుఁడనియుఁ దాత గన్న సైన్యపతియనియు నితఁడు యాజ్ఞవల్క్యుఁడును భారద్వాజ గోత్రుఁడు ననియు నీక్రింది పద్యములోఁ జెప్పియున్నాఁడు.

శా. భారద్వాజ పవిత్రగోత్రుఁడు జగత్ప్రఖ్యాతుఁడు ద్యద్యశః
ప్రారంభుండగు గన్నసైన్యపతి సత్పౌత్రుండు శ్రీయాజ్ఞవ
ల్క్యారూఢాన్వయ దీపకుం డయిన విస్సామాత్య పుత్రుండు వి
ద్వారాజీపభవుండు గన్నయ మహోదారుండు ధీరుండిలన్.

కృతిపతినివర్ణించుచు కవిరచించిన పద్యములింకను గొన్ని కలవు. కాని వానియందుఁ జరిత్రకుపయోగించు నంశములు లేవు. కృతిపతి తాతయైన గన్నసైన్యపతియే రాజుసైన్యమున కధిపతిగా నుండెనో చెప్పలేదు. జైమిని భారతమును రచించిన పిల్లలమఱ్ఱి పిన

వీరనయు, నీగన్నమంత్రియు సగోత్రీయులే. పినవీరనకృత గ్రంథములలోఁగాని, ఆతని వంశీయుఁడనని చెప్పకొనిన పెనుమల్ల సోమమంత్రి చేసిన వంశవర్ణనములోఁగాని, యీగన్నమంత్రి, విశ్వామాత్య, గన్న సైన్యపతి నామములు కన్పింపలేదు. పినవీరన్న చరిత్రమును వ్రాయునప్పుడు నాకాతఁడు యాజ్ఞవల్క్య నియోగిబ్రాహ్మణుఁడని వ్రాయుటకుఁ దగిన యాధారములు లభింపలేదు.

ఈగన్నమంత్రికి వీరభద్రుఁడను నొక స్నేహితుఁడు గలఁడట! ఈవిషయమిాక్రింది రెండు పద్యములలోఁ జెప్పియున్నాఁడు.

సీ. అఖిల జగత్కర్తయగు
శ్రీనగాధిపునకు సిద్ధిలింగ
తనునకు మల్లికార్జున మహాదేవున
కపరావతారమై యఖిలదిశలఁ
జెలఁగి వారాణసీసిద్ధ భిక్షావృత్తి
యతినాథునాత్మజుఁడై ధరిత్రి
వీరశైవాచార విభవంబు విశదంబు
గాఁ బ్రతిష్ఠించి యక్కజముగాఁగ
గీ. సకల ధర్మంబులును సప్తసంతతులును
భూతదయయును నాశ్రిత పోషణంబుఁ
బ్రణుతి కెక్కిన శేమయ ప్రభునిసుతుఁడు
వీరభద్రుండు పెంపొందు విమలకీర్తి.

క. ఆవీరభద్రునకు హితుఁడై వెలసినయట్టిపుణ్యుఁ డనవరతంబున్
శైవార్చన సంపన్నుఁడు భూవినుతుఁడుగన్నమంత్రిపుంగవుఁడొప్పున్.

ఉ. నిత్యయశోవిశాలుఁ డురునీతియుగంధరుఁ డద్రిధీరుఁడా
దిత్యసమానతేజుఁడు సుధీనుతుఁ డున్నత ధర్మశీలుఁడున్
సత్యవివేక భూరి గుణసాంద్రుఁడు పిల్లలమఱ్ఱిగన్ననా
మాత్యుఁడు చెప్పనొప్పు మహిమన్విలసిల్లుచు నెల్లదిక్కులన్.

శై. సం. కృత్యాది.

ఈకవికాలమును నిర్ణయించుటకై పీఠికాకారులగు శ్రీసోమయాజిపండితులు మిగుల శ్రమపడి కృతికర్త బంధువులగు కుంటముక్కల మల్లమంత్రి, పినభైరవమంత్రుల కాలమును శ్రీశైల భిక్షావృత్తి మఠాధిపతులగు శాంతభిక్షావృత్తి, సిద్ధభిక్షావృత్తి మొదలగువారి శాసనములనుబట్టియును "మొత్తముమీఁద దిమ్మకవి కృష్ణరాయలకాలమువాఁడై యుండియుండవచ్చునని తోఁచుచున్నది. క్రీ. శ. 1510 సం॥ర సమీపమున నీగ్రంథము రచియింపఁబడినట్లు తోఁచుచున్నది." అని నిర్ణయించినారు. శ్రీనిడదవోలు వెంకటరావుపంతులు M. A. గారు "సిద్ధభిక్షావృత్తి శ్రీశైల శాసనమువలన క్రీ. శ. ౧౪౬౫ ప్రాంతమువాఁడు. అతని మనుమనికాలమున క్రీ. శ. ౧౪౮౦ ప్రాంతమున గన్నమంత్రియు, కుంటముక్కల తిమ్మకవియు నుండురని చెప్పవచ్చును." ఈకాలమునుబట్టి చూచినను కృతికర్త కృతిభర్త లిరువురు కృష్ణదేవరాయలకించుక పూర్వులగుదురు.

ఇంతకంటె నీకవికాలమును సునిశ్చితముగా నిర్ణయించుటకు నాకుఁ గ్రొత్తయాధారములేమియు లభింపలేదు. కృతిభర్తకు హితుఁడైన వీరభద్రుని తాత వారాణసీసిద్ధ భిక్షావృత్తి. పైనీసపద్యములోఁ జెప్పిన యాతని వర్ణనమునుబట్టి యాతఁడు శ్రీశైలమునందున్న భిక్షావృత్తి మఠ పరిపాలకుఁడని చెప్పవచ్చును. సిద్ధభిక్షావృత్తి వీరశైవసిద్ధ భిక్షావృత్తి, అజాతివీరశైవ సిద్ధభిక్షావృత్తి అనువారల శాసనములు గన్పట్టుచున్నవి. ఈశాసనకాలములు పీఠికలో నీయఁబడినవి. కాని వారాణసీ సిద్ధభిక్షావృత్తి శాసనములు గన్పింపలేదు. ఈసిద్ధభిక్షావృత్తి శ్రీశైల మఠపాలనమునకై కాశీనుండి వచ్చియుండునని తోఁచుచున్నది. అందుచే నాతనిని ప్రజలు వారాణసీ సిద్ధభిక్షావృత్తియని పిలుచుచు వచ్చిరేమో! శాసనములలో నీవారాణసీపదము విడువఁబడి యుండవచ్చునని యూహకలుగుచున్నది. ఇది సత్యమయ్యేనేని సిద్ధభిక్షావృత్తి శాసనములు శా. శ. ౧౪౭౦–౧౪౭౫లోనున్నవి. కావున నాతని మనుమనికి హితుఁడైన కృతిపతి క్రీ. శ. ౧౫౫౦–౧౫౬౦ ప్రాంతమున నుండెనని నిశ్చయింపవచ్చును. కాని

యిది యూహామాత్రమే.

శైవాచార సంగ్రహ ద్వితీయాశ్వాసాంతమునః—

క. లింగావధానసంతత
సాంగత్య పవిత్రమానసస్ఫుటలీలా
జంగమమహాశయయుతలింగా!
అంగీకృత వినయ విశ్రుతౌదార్యనిధీ!

అనుపద్యములోఁ గృతిపతియైన గన్నామాత్యుఁడు లింగావధానుఁడను నాతని సంతత సాంగత్యముచేఁ బవిత్ర మానసుఁడైనట్లు చెప్పి యున్నాఁడు. దీనినిబట్టి లింగావధానులు పవిత్రహృదయుఁడైన గొప్ప పుణ్యపురుషుఁడై యుండునని మనమనుకొనవచ్చును. ఇతఁడు ఎన్నిక పురుషులలో నొకఁడై యుండనిచోఁ బ్రత్యేక మాతనిని జేర్కొనుట సంభవింపదు. కావున నీలింగావధాను లెవరో యాతనినిబట్టి కవికాలము నిర్ణయించుటకేమయిన యాధారము లభించునేమో తెలిసికొనవలసియున్నది.

శ్రీరామస్తవరాజము, తత్త్వ చంద్రోదయము నను గ్రంథములను రచియించిన ముమ్మడి మల్లనకవికిని, ఆంధ్ర భగవద్గీతను రచించిన కంభంపాటి నారపామాత్యునకును గురువైన ధేనువుకొండ తిమ్మయాచార్యునకును, ఆత్మైక్య బోధాది గ్రంథకర్తయగు యోగానందావధూతకును గురువర్యుఁడైన చింతల లింగావధాను లొకఁడు కలఁడు. సుప్రసిద్ధ యోగిపుంగవుఁడైన దత్తాత్రేయ యోగీంద్రునకు శిష్యుఁడై యనేక వేదాంత గ్రంథములను పరమానంద శతకాదులను రచించిన పరమానంద యతీంద్రుఁడీ లింగావధానులకు గురువు. ఈగురుశిష్య సంబంధమునుబట్టి లింగావధానులు నుతిపాత్రుఁడగు మహాపురుషుఁడని స్పష్టమగుచున్నది. కావున నీతఁడే శైవాచార సంగ్రహమునఁ జెప్పఁబడిన లింగావధానులని నాయూహ.

తిరుమలనాథకవి కాలనిర్ణయమునకు లభించిన యాధారములన్నియు మొత్తముమీఁద సంశయగ్రస్తములేయైనవి. పైనివ్రాసిన పద్యమునందలి లింగావధానులు, చింతల లింగావధానులే యైనను,

ఆతని కాలముగాని ఆతని శిష్యప్రశిష్యుల కాలముగాని సునిశ్చితము కాలేదు. ముమ్మడి వల్లన కంభముపాటి నారపామాత్యుల కాలములు తెలియరాలేదు. లింగావధానుల గురువైన పరమానంద యతీంద్రుని కాలమును దెలిసినది కాదు.

చంద్రభాను చరిత్రమును రచించిన తరిగొప్పుల మల్లన తనగురువు దత్తాత్రేయ యోగిపుంగవుఁడని చెప్పుకొని యున్నాఁడు. ఈమల్లన క్రీ. శ. ౧౫౮౫–౧౬౧౪ నడుమ రాజ్యముచేసిన వెంకటపతిరాయల యాస్థానకవి. ఈతనిగురువగు దత్తాత్రేయ యోగియుఁ బైనిచెప్పిన దత్తాత్రేయయోగియు నేకవ్యక్తియేయని తలంచితిమేనియుఁ జంద్రభాను చరిత్ర రచనాకాలమునకు మల్లన వయసు ౫౦–౬౦ సంవత్సరములుండునని యూహించితిమేనియు దత్తాత్రేయ యోగిపుంగవుని కాలము క్రీ. శ. ౧౫౩౦–౧౫౪౦ అని నిశ్చయింపవచ్చును. ఈకాలములోనే పరమానంద యతీంద్రుఁడును జింతల లింగావధానులు నుండియుందురు. దీనినిబట్టిచూచినను శైవాచార సంగ్రహ కృతికర్త కృతిభర్తలిరువురును పదునాఱవశతాబ్ది పూర్వార్ధమున నుండిరనియు నాకాలముననే శైవాచార సంగ్రహము పుట్టియుండుననియు గుఱికిబారెడు న్యాయమున నిర్ణయింపవచ్చును.

ఈగ్రంథమున భస్మధారణవిధి, రుద్రాక్షధారణవిధి, ముగ్గుల విధానము, పూజాపుష్ప నిర్ణయము, నైవేద్యవిధి, జపవిధానము మొదలుగా శైవులాచరింపవలసిన యనేకాచారములను శ్రుతిస్మృతి పురాణేతిహాసాది బహుగ్రంథములనుండి సేకరించి దాదాపు 350 పద్యములలోఁ జక్కని శైలిలోఁ జెప్పియున్నాఁడు. శివపూజాతత్పరులగు భక్తులకిది మిగుల నుపయోగించును.

వీరశైవాచార సంగ్రహమనుపేర నిట్టిదే ద్విపదకావ్యమొకటి కలదు.

తిరుమలనాథకవి కవిత్వము సలక్షణమై సరసముగానున్నది. శైలి చూపుటకై మూఁడాశ్వాసములనుండియు మూఁడు పద్యముల

నీక్రింద నిచ్చుచున్నాఁడను.

ఉ. ఆయతభక్తియుక్తిఁ ద్రిపురాంతకు శంకరు నల్లగల్వలన్
వేయును నూట నెన్మిదిట విశ్రుతభంగి భజింప మానవుం
డాయభవుండు తానయయి యద్భుతవైభవసంపదున్నతిం
బాయక శంభుసన్నిధి నపారసుఖంబుల నొందు నెప్పుడున్.

క. రుద్రాక్ష దోఁకకున్నను
రుద్రాక్షను వంటిదైన రోయకదాల్పన్
విద్రితదుష్కృతుఁ డగుచును
రుద్రునిలోకంబు వడయు రూఢి దలిర్పన్.

చ. కరము వినీతి నీశునకుఁ గార్తికమాసము దీపమాలికల్
పరగు ఘృతంబు నించి తగుపాత్రల నెన్నిట నెత్తు నన్ని వేల్
వేయుగముల్ వసించుఁ దనవంశమువారును దానుఁగూడి శం
కరుపురిఁ గోటిసూర్యుల యఖండరుచిన్ మనుజుండు పెంపుసన్.

---

167 కంచిరాజు సూరయ్య

ఈకవిపేరు మనకుఁ దెలియుటకు పెదపాటి జగ్గన కృతప్రబంధరత్నాకరమే కారణము. ఈతఁడు కన్నప్పచరిత మనుప్రబంధమును రచియించెనఁట! అందలిపద్యములను ప్రబంధరత్నావళినుండి తీసి యిట బొందుపఱచుచున్నాఁడను. కవిచరిత్రము దెలియదు. కన్నప చరిత్రమును దెలియదు.

ఈక్రిందిపద్యములను జదివి యానందించుటయు, నీగ్రంథమును సంపాదించుటకై ప్రయత్నించుటయు పాఠకుల కర్తవ్యము.

ఉ. కారణమేమి? రక్కసు నఖంబుల వ్రచ్చితినాఁడు నీకుఁ బెం
పారఁ గుఠార వబ్బదో పురారి విరించులు చేరి వేటికిం

గోరునఁబోవు సేఁతలకు గొడ్డలియన్నఁ దొలంగిలో? వినం
గోరెద నన్నయిందిరకుఁ గోర్కులనిచ్చుముకుందుఁ గొల్చెదన్.
ఉ. కొమ్మను దొండమున్ కఠినకుంభయుగంబును నయ్యుమాకపో
లమ్ములచారు కాంతిఁ దొడలన్ వలిపన్నులఁ బోలెఁ బుత్త్రికుం
డిమ్ములఁ దల్లిఁబోలి జనియించిన నంచిత భాగ్యవంతుఁడౌ
నమ్మ! యటంచు సిద్ధసతు లక్కునఁజేర్చు గజాస్యుఁ గొల్చెదన్.
మ. తమసౌభాగ్యము లంగసంభవుని భద్రశ్రీల సేవింపఁగాఁ
దమదృగ్జాలము లాలతాంత శరకుంత శ్రేణిఁ బాలింపఁగాఁ
దమవృత్త స్తనభారముల్ మరుని చిత్తస్ఫూర్తి సూచింపఁగాఁ
దమకం బారఁగఁ జేరి చూచిరి పుళిందగ్రామణిన్ బ్రేముడిన్.
సీ. శ్రుతిసుధాక్ష్మా భక్త సురజన నీవధూ
మల్లశంకర ధర్మమహితబుద్ధిఁ
గగకూర్మకిటినర మృగకుబ్జరామ రా
మానంతబుద్ధకల్క్యాహ్వయముల
నముచి మందర కుదానవబలార్జునపంక్తి
ముఖముష్టిక స్త్రీవిముక్తఖలుల
దత్పుచ్ఛకర్పర దంష్ట్రాగ్ర నఖపద
పరశుబాణహలాంగ ఖరపుటములఁ
గీ. జెరివి తాల్చియెత్తి చీరి బంధించి ని
ర్జించి యేసి యేర్చి బెఱిచి వట్టఁ
గాడంగుచున్న శౌరి కరుణావిధేయుఁడై
మనలఁ గోర్కులిచ్చి మనుచుఁగాత.

ఇందలి మొదటిపద్యమును, కూచిమంచి తిమ్మకవి తనలక్షణసారసంగ్రహమున నుదాహరించియున్నాఁడు. కవిచరిత్రమును దెలిసికొనుట కీపద్యములలో సూచనలేమియు లేవు. కన్నపచరిత్రమందలి కథావివరమును దెలియలేదు. కన్నప చరిత్రమును రచించినకవి వేఱొకఁడు కలఁడని జ్ఞాపకముగనున్నది. కాని యాకవి నామమిప్పుడు స్ఫురించుటలేదు.

168 లింగమకుంట రామకవి

ఇతఁడు ప్రథమశాఖా నియోగిబ్రాహ్మణుఁడు; కాత్యాయన సూత్రుఁడు; కాశ్యపసగోత్రుఁడు; సర్వకవి సార్వభౌమపౌత్త్రుఁడు; లక్ష్మయామాత్య తిరుమలాంబల పుత్త్రుఁడు; సులక్షణసారమును రచియించిన లింగమగుంట తిమ్మకవి కగ్రజుఁడు. తెనాలి రామకృష్ణునకు జామాత.

ఈకవి ఆనందకానన మాహాత్మ్యము, చతుర్వాటి కామాహాత్మ్యము, వేంకట మాహాత్మ్యము, మత్స్యపురాణము, వామనపురాణము అను గ్రంథములను రచించెను. ఇతఁడు తనపితామహుఁడైన సర్వకవి నీక్రిందిపద్యములో స్తుతించియున్నాఁడు.

సీ. శ్రీవల్లభోపేంద్ర దేవేంద్ర జనక క
శ్యపఋషిగోత్రాబ్ధి చంద్రుఁడగుచు
వృద్ధకుండికపొంత వెలయులింగమకుంట
నేకభోగముగాఁగ నేలినట్టి
చెన్నయామాత్యుని శ్రీరామమంత్రినం
దనుఁ డన్నపకును దద్ధర్మపత్ని
కమలమ్మకును సుతుఁడును సంభవుండును ది
మ్మనకుఁ గాదనకుఁ గస్వనకుఁ బెద్ద

గీ. భవ్యభాగీరథీసతీ పాణివిభుఁడు
ఘనుఁడు బస్వన రామలక్ష్మణులతండ్రి
మహితవిద్యుఁడు మత్పితామహుఁడునైన
సర్వకవి సార్వభౌముని సన్నుతింతు.

ఈకవిసార్వభౌముఁడు రచించిన గ్రంథము లేవియో నిందుఁ జెప్పలేదు. ఈకవి లక్ష్మయామాత్యునకుఁ బుత్త్రుఁడయినను నితనికి రామమంత్రి పాలకపితయైన ట్లీక్రింది పద్యములోఁ జెప్పియున్నాఁడు. ఈరామమంత్రి కవికిఁ బెదతండ్రి. లింగమకుంట గ్రామమునుబట్టి వీరి గృహనామ మేర్పడియుండును.

సీ. శ్రీకృష్ణమంత్రిప్రసిద్ధుండు సర్వాస
    త్కవిసార్వభౌమనందనుఁడు ఘనుఁడు
కలిత భాగీరథీగర్భ సంభూతుఁడ
    త్యనఘుండు బస్వన కవరజుండు
లక్ష్మణాగ్రజుఁడు సలక్షణ నాగమా
    పాత్రిణావల్లభుఁడు విరాజి చరితుఁ
డనుపమదీప సమారాధనప్రీత
    రమ్యచతుర్వాటి రామవిభుఁడు
గీ. మంత్రరాజ రామమంత్రోపదేష్ట యూ
గురుఁడు పాలకపితృవరుఁడు ప్రేమ
రామమంత్రి కరుణరంజిల్ల స్వప్నంబు
నందుఁ గానుపించి యంచితముగ.

కవి తనను గూర్చి యీక్రిందిపద్యములోఁ జెప్పుకొనియున్నాఁడు.

సీ. శ్రీరామసేవాప్రసిద్ధుఁ గాస్యపగోత్రు
    శుభదకాత్యాయన సూత్రపాత్రు
లలితచారిత్రుఁ గాళయమంత్రికిని గోన
    మకును దౌహిత్రు సర్వకవి పౌత్రుఁ
దిరుమలాంబాగర్భ వరవార్ధి పూర్ణేందు
    ధన్యాత్మ లక్ష్మీప్రధానపుత్రు
నిజపాలక జనక నిష్ఠాగరిష్ఠ గా
    మసచివలబ్ధ రామజపధుర్య
గీ. రామకృష్ణాఖ్యజామాతఁ బ్రకటవిభవు
శుక్లయజురధ్యయనుఁ బేరసూరిమాచ
యానుజునిఁ దిమ్మధీనిధి కగ్రజాతు
ననఘులింగమకుంట రామార్యునన్ను.

ఈకవి రామకృష్ణున కల్లుఁడైనట్లు పైపద్యములో నున్నది. ఈరామకృష్ణుఁడు పాండురంగ విజయాది ప్రబంధకర్తయైన తెనాలి రామకృష్ణుఁడే. అతఁడు భట్టురు చిక్కాచార్యుల శిష్యుఁడైనట్లాతని

చారిత్రమున వ్రాసియుంటిని. లింగమకుంటరామకవియును దాను భట్టరు చిక్కాచార్యుల శిష్యుఁడనని యీక్రింది పద్యములోఁ జెప్పి యున్నాఁడు.

క. గురురాయ పట్టభద్రుని
నరహరు శ్రీరంగనాయకాంశభవున్ భ
ట్టరు చిక్కాచార్యుల మ
ద్గురుఁ దలఁచుచు నడుగులకు నతుల్గావింతున్.

చిక్కాచార్యులకు యౌవనదశలోఁ దెనాలి రామకృష్ణుఁడును వయసుమీఱిన పిమ్మట రామకవియు, శిష్యులై యుందురని తలంపవచ్చును. రామకృష్ణ రామకవులిరువురును యాజ్ఞవల్క్య నియోగిబ్రాహ్మణులే.

ఈకవి రచించిన చతుర్వాటికా మాహాత్మ్య మైదాశ్వాసములు కలది. ఇందు వర్ణింపఁబడిన చతుర్వాటికయే చెదలువాడ. ఎఱ్ఱాప్రెగడ వంశీయులకు నివాసమయినదికూడ నీచెదలువాడయే. ఈ చెదలువాడయు, లింగమగుంటయుకూడ నెల్లూరు మండలములోనివి. వృద్ధకుండికయని పైసీసపద్యములో వర్ణితమైనది· దానినిప్పుడు గుండ్లకమ్మ యందురు. చెదలువాడలోనున్న శ్రీరామచంద్రు నీక్రింది పద్యములోఁ గవి నుతించియున్నాఁడు.

చ. కలశభవుండు పంకరుహ గర్భునిచేఁ గొనితెచ్చి వేడ్కఁ సర
ధిలభువనంబులౌననఁ బ్రతిష్ఠితుఁ జేసిన లీల నొప్పు స
న్మలయజకీర్తి శోభితుని మత్కులదేవత నాదిదేవుఁ గే
వల కరుణాంబుధిన్ జదలువాడ రఘూద్వహుఁ బ్రస్తుతించెదన్.

చెదలువాడ నివాసియుఁ బండితుఁడు నగు ననంతాచార్యుఁడను వైఖానసుఁడీకవిని, చతుర్వాటికా మాహాత్మ్యమును రచియింపుమని ప్రోత్సహించిన ట్లీక్రిందిపద్యములలోఁ గవి చెప్పియున్నాఁడు.

సీ. ఏకముఖంబున నిందిరావల్లభు
నర్చించుటకుఁ దానయవతరించి

విఘనసబ్రహ్మనా వెలసిన బ్రహ్మవం
శంబున జనియించి జపితయగుచు
సమయత్రియజ్ఞాన చతురుఁడై దూరశ్ర
వణదూరదృష్టి భావజ్ఞుఁడగుచుఁ
గలియుగ వ్యాసుని కరణి మించిసయనం
తాచార్యవర్యుఁ డుదారయశుఁడు

గీ. సర్వవైఘానసకులాబ్ధి చంద్రుఁడగుచుఁ
జడలువాడ స్థలంబున నుదయభాను
చండముననుండి యొకనాఁడు సముచితాతి
శయములోఁ నన్నుఁ బిలిపించి సరణి ననియె.

ఆ. రమణఁ జడలువాడ రామునకిల్లడ
వారు మీరు నీదుపేరివాఁడు
రామసుకవి! కవితచే మెచ్చుఁగను నతం
డఖిలబుధజనంబు నౌననంగ.

ఈతఁడురచించిన, వేంకటమాహాత్మ్య, మత్స్యపురాణ, వామన పురాణము లిపుడెచ్చటను గాన్పించుటలేదు. లభించిన రెండుగ్రంథము లును సముద్రితములు. వానితాళపత్రప్రతులు మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునందున్నవి.

ఆనంద కానన మాహాత్మ్యము కోనమంత్రి ప్రేరణముచే రచించి శ్రీ వెంకటేశ్వరునకంకితముచేసెను. ఆనంద కాననమనఁగా కాశీ. కాశీ క్షేత్రమహిమ మిందువర్ణితమయినది. ఈకోనమంత్రి శుక్లయజుశ్శాఖీయుఁడు విశ్వామిత్రగోత్రుఁడు; కలువకూరు వాస్తవ్యుఁడు. ఈతఁడు కవినీక్రింది వాక్యములతోఁ బ్రోత్సాహపరిచెను. కలువకూరు చిత్తూరు మండల మునఁ గాళహస్తి తాలూకాలోనున్నది.

"గీ. వినుము మత్స్యపురాణ వామనపురాణ
ములును వేంకటమహాత్మ్యమును ఫలప్ర
దము చతుర్వాటికా మహాత్మ్యమును దెనుఁగు
చేసి వెలసితి వవనిఁ బ్రసిద్ధి దనర.

వ. కావున నీవ పురాణంబులు తెలుంగు సేయ సమర్థుండవు. వాయు పురాణంబునందలి లక్ష్మీసంహితోక్తానంద కానన మాహాత్మ్యం బాంధ్రభాషావిశేషంబున రచియించి వేంకటేశ్వర పూజాంతికం బు సేయుమని యానతిచ్చిన నియ్యకొని..."

ఈతఁడు తెనాలిరామకృష్ణుని కల్లుఁడు. కావునఁ బదునాఱవ శతాబ్ధి మధ్యభాగమున నుండున్నవాఁడని చెప్పుటకు సంశయింపన క్కఱలేదు. ఈతనికవిత్వము సలక్షణమై సరసముగాను మనోహరముగా నునున్నది. శైలితెలియుటకై కొన్నిపద్యముల నుదాహరించున్నాఁడను.

శా. శంకాటంకములేక తారసిలి యాశాచిత్తులల్లాడఁగా
లంకానాథుఁడు వీరవిక్రమ కళాలంకారుఁడై శింజినీ
టంకారధ్వను లుల్లసిల్ల శరపీఠంబుల్ పదింటన్ వహో
హంకారంబులు సేసె బాణనికరం బాభీలమై కప్పఁగాన్. ౧ ఆ.

చ. కడువడి నెవ్వఁడేని, శుచిగాకయు నూరక బ్రహ్మకుండి లో
నడుగులు దోఁచినంతనె వియన్నది పాదమునందుఁ గల్గుమేన్
దడుపుచు రామచంద్రునకుఁ దండముపెట్టినవాని పుణ్యముల్
నుడువఁగ శక్యమానె పదినూఱుదలల్ గలపాఁపకేనికిన్. ౧ ఆ.

ఉ. పాదములంటి భూలలన భాగ్యమునొందఁగఁ ద్రోవఁద్రొచుచున్
బాదరజఃకణంబుననె పాపము శాపమునూడ్చి పుణ్యకృ
త్పాదుఁడవై మునీశ్వరునిపైదలిఁ బావని జేసినట్టి నీ
పాదమె దిక్కుగా బ్రదుకు బ్రాహ్మణునన్ దిగనాడఁ జెల్లునే ౨ఆ.

ఉ. రాముఁడు పోవునప్పటికి రామునికన్నను మున్నుపోయి నే
రాముని వాసయోగ్య కుధరంబగుచుండెద నంచు వచ్చి యీ
భూమిధరాకృతిన్ నిలిచి పొల్చెనదో వెలిదీవినాగ ని
త్యామిత శుభ్రకాంతి యుతమైన సితాగముఁగాంచెనంతటన్. ౪ఆ.

మ. కనియెన్ నారదమాని సింహము లసత్కల్పద్రుమానీకమున్
ఘనసౌధాగ్ర పతాకమున్ సురనదీకల్లోల వారీకమున్
జనితశ్రీకము దైత్యభీకర మహోజ శ్శ్యారతాద్రేకమా
త్మనఘానంద రసప్రవాహ సురసంఘాస్తోకమున్ నాకమున్. ౪ ఆ.

ఉ. కోమల పారిజాతములు కొప్పుననున్నవి వానికంటెఁ నీ
భూమిరుహప్రసూనములు బుద్ధిఁ దలంప నతిప్రియంబులో
కోమలిరమ్మటంచు నొకకుంజమునీడకుఁ దార్చి నొక్కసు
త్రామభటుండు వేగనొకతన్వి ననంగవిహారకేళికిన్.

సీ. వదరు తొయ్యలి తలవాకిట నెమ్మితో
నుండవాగ్వల్లభుం డొక్కవంక
వలిఱెంకిపట్టి డాపలివంకఁ గనుపట్టి
యుండ సదాశివుం డొక్కవంక
పౌలోమి వామాంకభాగ మధ్యంబున
నుండ పురంధరుం డొక్కవంక
తమతమ చిన్నెలెంతయు విభ్రమింపుచు
నుండ సురాసురు లొక్కవంక

గీ. నురగ లోకాధినాయకు లొక్కవంక
చుక్కలును జందమామయు నొక్కవంక
నూష్మరశ్మియు గ్రహములు నొక్కవంక
సంగముల నుండ నుండె నాభంగయశుఁడు.

ఉ. ఆగమశాఖలేర్పరచి యాగమతత్త్వ రహస్యముల్ మహా
భాగుఁడనన్ జనుల్దెలియ భారతసంహితయందుఁ బల్కియున్
వేగమెచిత్తశాంతి యొదవింపక యున్నఁ బరాశరాత్మజుఁ
భాగవతంబు సేయుమని పల్కికృతార్థునిఁ జేయవే దయన్.

ఈకవికాలము క్రీ. శ. ౧౫౨౦–౧౫౮౦ అయియుండుననియు
నీతని గ్రంథములు ౧౫౫౦–౧౫౬౦ నడుమ రచియింపఁబడియుండు
ననియుఁ దలంచుచున్నాఁడను. ఆనందకానన మహాత్మ్యకృతి పేర్క
కుఁదైన కోనమంత్రినిగూర్చి వ్రాయుట కాతాళపత్రప్రతి శిథిలమైయుం
డుటచే నేనియుఁ దెలిసినదికాదు.

169 చిరుమూరి గంగరాజు

ఈకవినిగూర్చి యేమియుఁ దెలియరాలేదు. ఈతఁడు కుశలవోపాఖ్యానమును రచియించినట్లందులోనివని రెండు పద్యములు రామాప్రెగ్గడ జగ్గనయు, ఆంధ్రసాహిత్య పరిషత్తునందున్న యుదాహరణగ్రంథ సంధాతయు నుదాహరించియుండుటచే నీకవినామమును గ్రంథనామము నెఱుంగఁగలిగితిమి. ఆపద్యముల నిటనుదాహరించుచున్నాఁడను.

క. హరిదాసుని వనవాసుని
బరిచితపరమోపవాసు భాసురహాసున్
సురుచిరనిగమాభ్యాసున్
విరచితకాశీనివాసు వేదవ్యాసున్.

సీ. పదపద్మరజమునఁ బాషాణపుత్రికఁ
బూఁబోఁడిఁ జేసిన పుణ్యుఁ డితఁడు
బాలుఁడై హరధనుర్భంగంబు సీతకు
నుంకువ సేయు నిశ్శంకుఁ డితఁడు
మణిమయంబై యున్న మాయాకురంగంబుఁ
గడఁగి చంపిన వేఁటకాఁ డితండు
కట్టాణిముత్యంబు కైవడి మున్నీరు
బాణాగ్రమున నిల్పు ప్రౌఢుఁ డితఁడు

గీ. ప్రబలదశకంఠపటుకంఠనిబిడవిపిన
దహనకీలాయమానదోర్దండచండ
చటులకోదండనిర్ముక్తశరనికాయుఁ
డితఁడు గాకుత్స్థవంశాబ్ధిహిమకరుండు.

ఈకవి క్రీ. శ. ౧౫౬౦ వ సంవత్సరముకంటె బూర్వుఁడు. ఇంతకంటె కవినిగూర్చినవివరము లేమియుఁ దెలియరాలేదు.

170 లింగమకుంట తిమ్మకవి

ఈతఁడు ప్రథమశాఖానియోగి బ్రాహ్మణుఁడు; కాత్యాయనసూత్రుఁడు; కాశ్యపగోత్రుఁడు; సర్వకవిపౌత్రుఁడు; లక్ష్మణామాత్య తిమ్మాంబలకుఁ బుత్రుఁడు; మత్స్యపురాణ వామనపురాణాది గ్రంథకర్త యగు లింగమకుంటరామకవికిఁ దమ్ముఁడు; ఆపురాణ గ్రంథలేఖకుఁడు చిక్కయభట్టరు శిష్యుఁడు.

ఈకవి సులక్షణసార మనులక్షణగ్రంథమును రచించెను. లక్షణగ్రంథము లనేకము లున్నను, ఈతనిలక్షణసారము విద్యార్థిలోకమున నెక్కువప్రచారముఁ గాంచినది. కవి తననుగూర్చియు తాను రచింపఁబోవు లక్షణగ్రంథమును గూర్చియు నీక్రిందిపద్యములను రచించి యున్నాఁడు.

సీ. శ్రీవైష్ణవహితుండఁ జిక్కయభట్టరు
శిష్యుండఁ గవితావిశేషశేష
తులితసర్వార్యపౌత్రుండ లక్ష్మయకుఁ ది
మ్మాంబికు సుతుఁడఁ బేరనకు మాచ
నకు రామకవివరునకు ననుజన్ముఁడ
నారామకవి చెప్పినట్టిమహిత
మత్స్యపురాణ వామనపురాణాది స
త్కవితల కెల్ల లేఖకుఁడ వృద్ధ
కుండికాతీరలింగమకుంటనామ
పట్టణస్థితకుండ సౌభాగ్యయుతుఁడ
నాదిశాఖాప్రవర్తన మమరువాఁడఁ
గాశ్యపగోత్రుఁడను దిమ్మకవిని నేను

క. లక్షణశాస్త్రము లెల్లఁ బ
రీక్షించుటఁ గొంతకొంత యెఱిఁగినవాఁడన్
లాక్షణికాదులు మెచ్చను
లక్షణసారం బొనర్తు లక్ష్యము లమరన్.

తే. కొందఱెంచు లక్షణములఁ గొందఱెంచ
రందఱును నెంచునవి గొన్ని యవియు నవియుఁ
దొరయఁగాఁ గూర్చి కవిసమ్మతులను వ్రాయు
దొకటి కొకటికి సంస్కృతాంధ్రోక్తు లెనయ

తే. గ్రంథసామగ్రి గలుగుటఁ బ్రతిపదమున
కన్ని లక్షణములు వ్రాయు దనిన నందు
గ్రంథవిస్తారమగుఁ గానఁ గవితసూత్ర
మెన్నిటను దేఁటపడు నన్ని యే లిఖింతు.

ఈకవినివాసము నెల్లూరుమండలములోనిలింగమగుంట గ్రామము. గుండ్లకమ్మనదీతీరమున నున్నది. దీనినే వృద్ధకుండిక యనెదరు. ఈ కవియు సోదరునివలెనే తనగ్రంథమును చెదలువాడయందలి శ్రీరామ చంద్రున కంకితము చేసెను.

తెనాలిరామకృష్ణకవియు నీతఁడును చిక్కభట్టరు శిష్యులు. కావున నీకవులిరువురును సమకాలికులును బంధువులునై యున్నారు. ఈవిషయమున రామకవిచారిత్రమునఁ గొంతవ్రాసియున్నాఁడను. ఈ కవి పదునాఱవ శతాబ్ధియందు మధ్యకాలమున నున్నవాఁడని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును.

ఈకవికాలమునుగూర్చి శ్రీవీరేశలింగముపంతులుగారు "రామకృష్ణునితోడి సమకాలీనుఁడగుటచేత లింగమకుంట తిమ్మకవి ౧౬౨౦ సంవత్సర ప్రాంతములయందున్నవాఁడు. ఇతఁడు వృద్ధదశలోఁ గాకునూరి యప్పకవి కాలములో సహిత ముండియుండవచ్చును" అనివ్రాసియున్నారు. ఈయభిప్రాయముతో నేనేకీభవింపఁజాలను. అనేక కారణములను జూపుచు రామకృష్ణకవి క్రీ. శ. ౧౫౦౦-౧౫౬౦ నడుమ నున్నవాఁడనియాతనిచారిత్రమున వ్రాసియుంటిని. (ఆ. క. త 8 సం. పుట 17) కావున నీతిమ్మకవియు నీతనియగ్రజుఁ డగురామకవియు రామకృష్ణకవికంటె 20-25 సంవత్సరములు వయసున చిన్నవారై రామకృష్ణకవితో సమకాలికులై ౧౫౫౦ ప్రాంతమునందమ తమ గ్రంథములను రచియించియుండురని నిర్ణయింపవచ్చును.

ఇప్పుడు మనకు లభించుచున్న సులక్షణ సారముద్రితప్రతి సరి యైనదికాదు. ఈవిషయమున శ్రీపంతులు గారాంధ్రకవులచరిత్రమున "ఇప్పుడు ముద్రితమై యున్న సులక్షణసారమునకును నాయొద్దనున్న యముద్రితపుస్తకమునకును మిక్కిలి వ్యత్యాసము కనబడుచున్నది" అని వ్రాసియున్నారు. తిమ్మకవివి కాని పద్యము లనేకము లిందుఁ జేరినవి. తాళపత్రప్రతులు పరిశోధించి, తిమ్మకవి సులక్షణసారమును నిర్దుష్టముగ బ్రకటించుట మిగుల నావశ్యకమై యున్నది.

ఈగ్రంథమున కముద్రితప్రతియొకటి మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునం దున్నది.

ఆప్రతిలో గ్రంథాంతమునను్న:— (R. No. 11)

గీ. భీమనయు, ననంతయయును బెద్దనయును
దాతనయుఁ జెప్పినట్టి ఛందములుగూర్చి
ప్రకరణము లొప్పఁ జేసెను బ్రహ్మసంఖ్య
నొనర లింగమకుంట తిమ్మసుకవియు

అనుపద్యమునుబట్టి యీకవి సులక్షణసారమును దొమ్మిదిప్రకరణములుగా రచియించినట్లు గన్పట్టుచున్నది. ముద్రితప్రతిలో ప్రకరణ విభాగమే కాన్పింపదు. ఈపద్యమందలి పెద్దన చిత్రకవి పెద్దనయై యుండును. ఆపెద్దన తిమ్మకవితో సమకాలికుఁడు. ఆతనిలక్షణగ్రంథము నీతఁడు చూచి యందలి లక్షణములను గొన్నిటిని జేకొనియుండును. ఈతనికవిత్వశైలి చూపుటకై శ్రీవీరేశలింగముపంతులుగా రుదాహరించిన రెండు పద్యముల నీక్రింద నిచ్చుచున్నాఁడను.

మ. విను మీరీతియటంచుఁ గావ్యకరుఁడై వెల్లంకితాతప్ప చె
ప్పిన సూత్రంబులు కల్లఁగాఁ గనఁబడెన్ వీక్షింపనెట్లన్నచో
మును దీర్ఘంబులపై ఱకారములకే పూర్ణస్థితప్రజ్ఞ గా
దనియెన్ లింగమగుంట తిమ్మకవి నేఁ దర్కింతు నిప్పట్టునన్.

చ. అనుచు నదేమొకో మును రయుంబున లక్షణసారసంగ్రహం
బెనయ వచించెఁ జిత్రకవిపెద్దన లెస్సవు వోఁధు వోఁధుప్రశ

బ్ధనయత గానరో వినరో తద్ఘను నెంతయు ధన్యులయ్యమే
ల్గన భ్రమగాంతు రాత్మల నొకానొకచోటఁ బరాకుగ్రమ్మఁగన్.

ఈపద్యములు ముద్రితప్రతిలోఁ గానగాలేదు.

ఈతిమ్మకవి బాలురకు సుబోధకముగా నుండుటకై బాలబోధ ఛందస్సు అనుపేర వేఱొక ఛందోగ్రంథమును రచియించినట్లు కన్పట్టుచున్నది. ఈవిషయమున శ్రీ నిడదవోలు వేంకటరావు పంతులు M. A. గారిట్లు వ్రాసియున్నారు. (భారతి, యువసంవత్సర మాఘమాసము. పుట 165.)

“లింగమకుంట తిమ్మన బాలబోధచ్ఛందస్సును వ్రాసినట్లు పాకనాటియందుఁ గల కౌలూరి యాంజనేయకవి తన సుకవికర్ణామృతమను లక్షణగ్రంథమున వ్రాసియున్నాఁడు.

సులక్షణ సారముగాక బాలబోధచ్ఛందస్సుగూడ తిమ్మనకవి రచియించి యుండవచ్చును. ఇందపూర్వ గ్రంథములనుండి పద్యము లుద్ధరింపఁబడినవి. శ్రీ రామకృష్ణకవిగారు దీనికి బాలబోధమనియుఁ గవిసంజీవని యనియు సందిగ్ధనామములు గలవని వ్రాసియున్నారు. ప్రభాకరశాస్త్రిలవారు క్రీడాభిరామ గ్రంథపీఠికలో నీఛంధస్సునుగూర్చి యిట్లు వ్రాసియున్నారు.

బాలబోధచ్ఛందస్సుకర్త పేరెఱుఁగరాదు. అందు బహుప్రాచీనములైన గ్రంథము లుదాహృతములయ్యెను. అప్పకవికంటెఁ దత్కర్త ప్రాచీనుఁడు గాఁదగును. అది ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోఁ గొంత కలదు. బ్రహ్మశ్రీ మా. రామకృష్ణకవిగారి దగ్గఱఁ గొంతగలదు. వారు దఱచుగా నక్కడక్కడ నుదాహరించుచువచ్చిన ప్రాచీన పద్యరత్నములనేకములందలివి. రత్నఖనియగు నాగ్రంథమును గూర్చి వేరుగా నొకవ్యాసమును వ్రాయుదును.

పైయుద్ధృతాంశములఁబట్టి ఈఛందస్సు ప్రాశస్త్య మెఱుఁగఁదగును. లింగమకుంటతిమ్మన యప్పకవికిఁ బూర్వుఁడగుటచేతను, నాంజనేయకవి తిమ్మన దీనిని రచించినట్లు చెప్పియుండుటచేతను తిమ్మనయే యీగ్రంథము రచియించియుండునని తలంపవచ్చును.”

171 నెల్లూరి ముత్తరాజు

రామాప్రెగ్గడ జగ్గనకవి తన ప్రబంధరత్నాకరమున నెల్లూరి ముత్తరాజు పద్మావతీ కళ్యాణములోనిదని యీక్రిందిపద్యము నుదాహరించియున్నాఁడు. ఇప్పుడాగ్రంథ మెచ్చటను లభ్యమగుటలేదు. అందుచేఁ గవిచారిత్రమేమియుఁ దెలియరాలేదు.

క. నీవెంతవేఁడుకొన్నను
గేవల పాతకుల కేలగృపపుట్టు మదిన్
దేవుఁడు 'నహి' గురువున్ 'నహి'
భావజచంద్రులకు వికచపద్మదళాక్షీ.

జగ్గనకవి క్రీ. శ. ౧౭౬౦ ప్రాంతమువాఁడు. కావున నీకవి యంతకుఁ బూర్వుఁడని యనుటకంటె నితని విషయమున నేమియుఁ వ్రాయఁజాలను. నెల్లూరి వీరరాఘవకవి, నెల్లూరి శివరామకవి యను నిరువురు కవులున్నారు. వారి చారిత్రముల నీకవితరంగిణియందు వ్రాయుదును. ఈకవి వారివంశములోని పూర్వుఁడేమో తెలియదు. ఈపద్మావతి ఎవ్వరో తెలియదు. పైపద్యము నాయికా విరహవర్ణనములోనిది. నూతనభావముతో నొప్పారుచున్నది.

—

172 కాసె సర్వప్ప

ఇతఁడు మల్లనమంత్రి కుమారుఁడు; వరంగల్లు ప్రాంతనివాసుఁడు. ఇంతకంటె నితనిచారిత్రమేమియుఁ దెలియదు.

"ఈకవి సిద్ధేశ్వర చరిత్రమను నామాంతరముగల ప్రతాప చరిత్ర మును ద్విపద కావ్యముగా రచించెను." అని కవుల చరిత్రకారులు వ్రాసియున్నారు. గోలకొండకవుల సంచికనుబట్టి యీ రెండును వేఱు వేఱు కావ్యములని తోఁచుచున్నది. ఈగ్రంథములేక గ్రంథములు ముద్రితములు కాలేదు. తాళపత్రప్రతులును గన్పించుటలేదు. అందుచే నీవిషయమును నిర్ణయింపఁజాలము. ఈగ్రంథమునఁ గాకతీయ ప్రభువుల చారిత్రము వర్ణితమైనదని తోఁచుచున్నది. ప్రతాపచరిత్ర మునకు సిద్ధేశ్వర చరిత్రమని నామాంతరమెట్లువచ్చెనో తెలియదు. ఈగ్రంథమందలి కొన్ని ద్విపదల నుదాహరించియుండుటచే శ్రీవీరేశలింగము పంతులుగారీగ్రంథమును జూచియుండుకనియు రెండుపేరులుగల యాగ్రంథమొకటియే యనియుఁ దలంపవలసియున్నది. శ్రీపంతులుగా రుదాహరించిన యీక్రింది ద్విపదలవలన నీకవిపేరును దండ్రిపేరును దెలియుచున్నవి.

ఇది శ్రీసకల విద్వదిభ పాదకమల
సదమల సేవన సభ్య సంస్మరణ
భాసుర సాధుభావనగుణానూన
భూసురాశీర్వాద పూజనీయుండు
కాసె మల్లనమంత్రి ఘనకుమారుండు
వాసిగాఁజెప్పె సర్వప్పునతఁడు.

ఈతని గ్రంథమునుండియే కూచిమంచి జగ్గకవి తన సోమదేవ రాజీయమునందు విశేషభాగము గ్రహించియున్నాఁడు.

ఈకవి కాలమునుగూర్చి శ్రీ వీరేశలింగము పంతులుగారు "ఈక వికాలమెప్పుడో నిశ్చయముగాఁ దెలియదు. కాని యితని గ్రంథము

మిక్కిలి పురాతనమైనదనుటకు సందేహములేదు. ఇతఁడు ప్రతాపరుద్రుని యనంతరమునఁ గొంతకాలమయినతరువాత నుండినవాఁడు" అని వ్రాసియుండిరి. గోలకొండకవుల సంచికలో ఇతని కాలము క్రీ. శ. ౧౪౦౦ ప్రాంతమనియుఁ "కవితావిషయముఁగాంచెఁ జరిత్రాంశమున నితనివి ప్రమాణగ్రంథములనియు, వరంగల్లు ప్రాంతవాసి యగుట నిచటి ప్రవాదములను గ్రంథస్థముగావించె" ననియు వ్రాసియున్నారు. ఈకవి వ్రాసియుంచిన చారిత్రాంశము లీగ్రంథప్రతి లభింపక పోవుటచే నాకీగ్రంథము వ్రాయునప్పుడుపయోగింపలేదు.

ఈకవికాలమును నిర్ణయించుటకుఁ దగిన యాధారములు నాకేమియు దొరకకపోవుటచే నేమియుఁ జెప్పఁజాలను.

ఈతని కవితయందు లక్షణవిరుద్ధములైన ప్రయోగముల నేకములు గానఁబడుచున్నవని శ్రీ వీరేశలింగము పంతులుగారు వ్రాసియున్నారు. శ్రీ పంతులుగారుదాహరించిన కొన్నిపంక్తుల నీతనిశైలి చూపుటకై క్రిందఁ బొందుపరచుచున్నాఁడను.

సారెసారెకుఁ గేరి సన్నుతుల్ సేయ
సారపారావార సరసగంభీర
సారుఁడై కీర్తివిస్తారుఁడై యలరు
నారీతి గణపతి నటుచూచు వేడ్కఁ
దిక్కన సోమయాజక్కడ నొకట
దిక్కుదిక్కులనుండి తెరలి విద్యార్థు
లక్కడక్కడను గావ్యముల శ్లోకార్థ
మొక్కొక్క విధమున నొగివినిపింప.

173 పెద్దిరాజు-రామరాజు

కాకు నూర్యప్పకవి తనయప్పకవీయమున ఈవని పెద్దిరాజు రామరాజు చాటుధారలని యీ క్రింది రెండుపద్యముల నుదాహరించి యున్నాఁడు.

క. "ఇమ్మహిలో మహనీయగు
ణమ్ముల నీసాటిగలరె నానావిధ దే
శమ్ముల శ్రీరాముని సీ
తమ్మా మాయమ్మ నిత్యహర్షములిమ్మా!

క. ఇమ్మా మదభీష్టంబులు
కొమ్మా మా మ్రొక్కులెల్ల గురుమతిలో మా
యమ్మా రఘునందను సీ
తమ్మా సౌభాగ్యసిద్ధి దాయని వమ్మా!"

ఈవని పెద్దిరాజనుటచే నీతఁడు గుంటూరు మండలములోని ఈవని గ్రామవాస్తవ్యుఁడేమోయని యూహ కలుగుచున్నది. అప్పకవికంటె నీతఁడు పూర్వుఁడు. కావునఁ బదునాఱవ శతాబ్దివాఁడని తలంపవచ్చును. ఈతఁడు రచించిన గ్రంథములేవియో తెలియదు. ఈపద్యములు చాటుధారలనుటచే నొకగ్రంథములోనివి కావనితోఁచుచున్నది. ఇంతకంటె నీతనిఁగూర్చి యేమియుఁ దెలియదు.

---

174 శంకరకవి

ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; ఆపస్తంబసూత్రుఁడు; కౌండిన్యగోత్రుఁడు; దేవనామాత్య పుత్త్రుఁడు. ఈతని గృహనామ మేదియో తెలిసినది కాదు.

ఈకవి హరిశ్చంద్రోపాఖ్యానము నయిదాశ్వాసముల ప్రబంధముగా రచియించి, ఈడూరి యెల్లయామాత్యున కంకితముచేసెను. కృతిపతి యీగ్రంథమును దన కంకితము చేయుమని కోరినట్లు కవి యీక్రిందిపద్యములలోఁ జెప్పియున్నాఁడు.

మ. ననుఁ గౌండిన్యమునీంద్ర గోత్రజు సుధాంధస్సింధుకల్లోల తు
ల్యనిరాఘాటవబోధుసంధరుని దేచామాత్య సత్పుత్త్రుఁ బావన
చారిత్రు శశాంకమౌళి పదసేవాలబ్ధ సాహిత్య స
ద్ధనునిన్ బంధువిధేయు శంకరకవిన్ దాక్షిణ్యపుణ్యాధికున్.

తే. మమత రావించి యగ్రాసనమున నునిచి
తత్పరతమీఱ గంధాక్షతంబు లాది
గాఁగఁ గర్పూర తాంబూల కనకభూష
ణాంబరంబులు దనియ నందంద యొసఁగి.

తే. సప్తసంతానములలో యశస్కరంబు
కృతియె కావున నీవొనరించునట్టి
నిరుపమాన హరిశ్చంద్ర నృపచరిత్ర
మంకితముసేయు నాపేర ననఘచరిత.

కవి యాశ్వాసాంతములయందు వ్రాసికొనిన గద్యయిట్లున్నది.

"ఇది శ్రీమదాపస్తంబసూత్ర పవిత్ర కౌండిన్య మునిచక్రవర్తి గోత్రి సకల సుకవి జనానీకమిత్ర దేచనామాత్యకుమార నవియశివేక విద్యాలంకార శంకరకవి నామధేయ ప్రణీతంబయిన హరిశ్చంద్రోపాఖ్యానంబను మహాప్రబంధంబు.

ఈగ్రంథమునుబట్టి కవినిగూర్చిన విశేషము లింక నేమియుఁ దెలియరాలేదు. కవినివాసమును దెలియదు.

కృతిపతియైన యీడూరి యెల్లయామాత్యుఁడు ఈడూరునకుఁ గరణమైనట్లును, గోదావరి నదీప్రాంతమైన కారుకొలను గ్రామనివాసుఁడైనట్లును, కేదారగురుని శిష్యుఁడైనట్లును, నీక్రింది పద్యముల వలనఁ దెలియుచున్నది.

సీ. ఆగ్న్యనుకూల కృత్యంబు శంభునియందుఁ
దనయందుఁ గలుగంగఁ దనరినాఁడు
భూరి సుదర్శనస్ఫూర్తి కృష్ణునియందుఁ
దనయందుఁ గలుగంగఁ దనరినాఁడు
చతురాననప్రౌఢి జలజాసనునియందుఁ
దనయందుఁ గలుగంగఁ దనరినాఁడు
ప్రబల భోగోన్నతి ఫణివల్లభునియందుఁ
దనయందుఁ గలుగంగఁ దనరినాఁడు

తే. మతి వితర్కింపఁ గేవలమంత్రిమాత్రుఁ
డే ధనంజయ బాహుశౌర్యాధికుండు
సత్యవర్తనుఁ డీడూరి శాసనుండు
హితవచోహారి బాచయయెల్లశౌరి.

వ. అమ్మంత్రి నిధానంబునకు నిజస్థానంబు.

మ. అరవిందాసన వాసవాద్యమర లోకారాధ్య కర్కోటకే
శ్వర కారుణ్య పదాభిరక్షితము భాస్వద్దీప్తి మద్భాసురో
త్కర నిత్యశ్రుతి పాఠనిస్వనముదాత్తశ్రీ నజస్రంబు లి
ద్ధరణిం బేర్కొననొప్పుఁ గార్కొలను గోదావర్యు ప్రాంతంబునన్.

శా. వేదార్థప్రతిపాదన ప్రకటచిద్విద్యాధురీణుండు సా
ధూదర్కేందు కళావతంసుఁడు సమగ్ర ప్రాభవాఢ్యుండు నై
కేదారేశ గురుండు సత్కృపఁ గటాక్షింపంగ వర్ధిల్లు ని
త్యోదార ప్రతిభాగుణాభరణుఁ డీడూరెల్ల నార్యుండిలన్.

ఈకృతిపతి కుతుబనమల్కుని యనుగ్రహము బడసినవాఁడై జల సీమారక్షణమున నియోగింపఁబడిన ట్లీక్రింది పద్యమున పంచమాశ్వాసాంతమునఁ జెప్పబడినది.

క. అలఘు ప్రతాపకుతుబన
మలకేంద్ర కృపాసమగ్ర మహిమాన్విత కో
ర్కొలని గ్రామని కేతన!
జలసీమారక్షణైక చాతుర్యనిధీ!

ఈకుతుబనమల్కు గోలకొండ నవాబుగా నున్నట్టియు, యిబ్రహీమ్ కుతుబ్‌షాహా కుమారుఁడైనట్టియు, మహమ్మదు కుతుబ్‌షాహా యని యభిప్రాయపడి బ్ర. శ్రీ. వీరేశలింగము పంతులుగారు "ఇతఁడు క్రీ. శ. ౧౫౮౧ వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౧ వ సంవత్సరము వఱకును గోలకొండలో రాజ్యముచేసినందున కవియు నప్పుడేయుండి పదునాఱవ శతాబ్దాంతముననో పదునేడవ శతాబ్దాదియందో యీపుస్తకమును చేసియుండును." అని వ్రాసియున్నారు. పైపద్యములోని కుతుబనమల్కును మహమ్మదు కుతుబ్‌షాహాయని యెంచుటకు పంతులుగారి కెట్టియాధారము లభించినదో చెప్పఁజాలను. కుతుబనమల్కు అను పేరు కులీకుతుబ్‌షాహాకు మాత్రమే అన్వయించునని నాయభిప్రాయము. ఇతని కొడుకులును మనమలునుగూడ కుతుబ్‌షాహాలనియే పిలువఁబడుదురు. కాని యాశబ్దమునకుముందు వారిపేరులను జేర్చి జంసద్ కుతుబ్‌షాహా, ఇభరామ్ కుతుబ్‌షాహా, మహమద్ కుతుబ్‌షాహా అని యనుచుందురు. నేను తలంచినట్లు కృతిపతి కాశ్రయుఁడైన కుతుబనమల్కు కులీకుతుబ్‌షాహా అయినయెడల, నతఁడు క్రీ. శ. ౧౫౧౧ మొదలు ౧౫౪౩ వఱకును రాజ్యముచేసినవాఁడు. కావున, కృతిపతియుఁ గవియుఁగూడ నాకాలమున నున్నవారనియుఁ హరిశ్చంద్రోపాఖ్యాన మాకాలమున రచితమయినదనియుఁ జెప్పవచ్చును. కృతిపతి కేదారగురుని శిష్యుఁడని పైని వ్రాసిన పద్యములలోనున్నది. ఇబ్రహీమ్ (మల్కిభరామ్) కుతుబ్‌షాహాకు తపతీసంవరణోపాఖ్యానమును గృతినిచ్చిన అద్దంకి గంగాధరకవి యును గేదారగురునిశిష్యుఁడే.

ఈయిరువురి గురువులు నొకేవ్యక్తియని నాయభిప్రాయము. గంగాధరకవికంటె కేగారగురువు వయసునఁ బెద్దవాఁడై యుండునుకదా! అందుచే నతనిని మహమ్మదు కుతుబ్‌షాహా కాలములో నున్నాఁడనుటకంటె అతని తాతయైన కులీకుతుబ్‌షాహా కాలములో నున్నాఁడని తలంచుటయే యుక్తము.

కులీకుతుబ్‌షాహాతో సమకాలికుఁడగు అద్దంకి గంగాధరకవి తన తపతీసంవరణోపాఖ్యానకృత్యాది యందీ మహమ్మదీయ ప్రభువుసు శంకరకవివలెనే "గుతుబనమలక" యనియే చెప్పియున్నాఁడు.

"నితర ధరణీతలాధీశులెవ్వరీడు
పృథివిఁ గుతుపనమలుక చక్రేశ్వరునకు."

కావునఁ గవియుఁ గృతిపతియుఁ బదునాఱవ శతాబ్దియందుఁ బ్రథమార్ధమున నున్నారని నిశ్చయింతము.

కృతిపతి నివాసము కొర్కొలను అని యొకపద్యములోను కోర్కొలను అనియొక పద్యములోనునున్నది. గోదావరి మండలమందలి భీమవరము తాలూకాలో 'కొరుకొల్లు' అనుగ్రామమున్నది. అదియే కృతిపతి నివాసము. 'గోదావర్యా ప్రాంతంబునన్' అని పైని వ్రాసిన వాక్యము నాయూహను బలపర్చుచున్నది. భీమవరము తాలూకా ప్రదేశముల నిప్పుడు "జల్లిసీను"యని వాడుచున్నారు. పైని వ్రాసిన కందపద్యములోని "జలసీమ"యే యిప్పుడు జల్లిసీమయైనది. భీమవరము తాలూకాలోని కొల్లేరు సరస్సునుబట్టి యాప్రాంతమునకు జలసీమయని పేరు వచ్చియుండను. కృతిపతిని ఈడూరి పురశాసనుఁడనఁగా ఈడూరునకుఁ గరణమని పైనివ్రాసియున్నాఁడను. ఈయీడూ రెచ్చటనున్నదో తెలిసికొనవలసియున్నది. నెల్లూరు మండలములో నొక ఈడూరున్నది. కాని యది గోదావరీనదీప్రాంతము కాదు. కావున నాయీడూరు కానేరదు. తూర్పుగోదావరీ మండలమునఁ డణుకుతాలూకాలో నొకఈడూరున్నది. అదియే యిందు చెప్పిన యీడూరు. కృతిపతి వంశమునకు మూలపురుషుఁడైన లింగామాత్యుఁడు బల్లికురువపురాంకుఁడైనట్లీక్రిందిపద్యములోనున్నది.

తే. ఆమనీశ్వరు వంశదుగ్ధాంబునిధికిఁ
బూర్ణనీహారకిరణుఁడై వర్ణనీయ
మహిమ విలసిల్లె లింగనామాత్యవర్యుఁ
డనఘమతి బల్లికురువ పురాంకుఁడగుచు.

ఈబల్లికురువపురము కమ్మనాటిలోనున్నది ౧. ఈలింగనామాత్యుఁడో యీతని పూర్వులో యీడూరునకువచ్చి కొంతకాలము తమపూర్వగ్రామముపేర 'బల్లికురువ'వారని పిలువఁబడుచుఁ దరువాత నీడూరు నివాసనిమిత్తముగ నీడూరివా రైరని తలంపవలసియున్నది.

లింగనామాత్యుని తనయుఁడైన ప్రెగడయ్య ఉండికరణమైన వీరనమంత్రి పుత్రికఁ దిప్పమాంబికను బరిణయమైన ట్లీక్రిందిపద్యము వలనఁ దెలియుచున్నది.

చ. ప్రెగడనమంత్రి బంధుజనబృందము పేర్కొన నుండిశాసనుం
డగుమతిశాలి వీరసచివాగ్రణి పుత్రికఁ దిబ్బమాంబికం
దగుమహిమన్ వివాహమయి ధన్యచరిత్రులఁ గాంచెఁ బుత్రులన్
జగదభివర్ణనీయుల విశాలయశోవిభవాభికాములన్.

ఈపద్యమునఁ జెప్పఁబడిన ఉండియనుగ్రామముకూడ భీమవరము తాలూకాలోనే యున్నది. కృతిపతిభార్య యైనభవాని, సత్తిరాజు లింగయామాత్యునిపుత్రి యైన ట్లీక్రిందిపద్యములోఁ జెప్పియున్నాఁడు,

గీ. సరస సారస దినరాజు సత్తిరాజు
లింగయామాత్యపుత్త్రి నాళీకనేత్రి
రూపగుణశీల నుతభవానీపురంధ్రి
నెలమి వరియించె నీడూరియెల్లమంత్రి.

సత్తిరాజు లింగయామాత్యుని దేగ్రామమో చెప్పలేదు. కాని సత్తిరాజువారు తణుకు భీమవరము తాలూకాలలో నున్నారు. వీనినన్నిటినిబట్టిచూడఁగాఁ గృతిపతినివాసము గోదావరిమండలమనియే నిశ్చయింపఁదగియున్నది.

---

౧. ద. హిం. శా. సం. ౬ సంఖ్య ౬౨౪.

కృతిపతి కేవలము కరణముమాత్రమే కాక దండనాథుఁడై యుండెననియు, కృతిపతితండ్రియైన బాచయామాత్యుఁడుకూడ, దండనాథుఁడనియుఁ గవి యీక్రిందిపద్యములలో వ్రాసియున్నాఁడు

తే. విందు వీడూరియెల్లపృథ్వీకళత్ర
దండనాథయశః కాంతిమండలములు
దిక్సరోజాతలోచనాదీర్ఘకర్ణ
కోణముక్తాఫలభ్రాజితకుండలములు.

కొలను గణపతిదేవకవి రచించిన శివయోగసార కృతిపతియగు "ఈదూరినూకనారాధ్యుఁ" డీవంశమునకుఁ జెందినపూర్వుఁ డని తోఁచుచున్నది. ఈనూకనారాధ్యుఁడో యాతనిపూర్వులో ,బల్లికురువనుండి యీమండలమునకు వచ్చియుందురు. వారినిబట్టి యీలింగనామాత్యుఁడును యీదూరునకు వచ్చి యీదూరివారిలోఁ గలిసిపోయియుండును.

ఈశంకరకవి నెల్లూరిమండలమువాఁ డనిబ్రౌనుపండితుఁడువ్రాసియున్నాఁడు. కవిచరిత్రకారు "లీకవి నెల్లూరుమండలమువాఁడు కాఁడనియు, నెల్లూరుమంలడమునుండి వెదకికొనుచు వచ్చి గోదావరిమండలములోనియొకకరణమునకుఁ గృతియిచ్చినాఁడని తలంచుట సమంజసము కాదనియు వ్రాసియున్నారు. అద్దంకిగంగాధరకవియు నీతఁడును సహాధ్యాయులు. కేదారగురు వేగ్రామనివాసుఁడో తెలియలేదు. ఈవిషయమింకను విచారణీయమై యున్నది. కృతిపతితండ్రియైనబాచయామాత్యున కిరువురు భార్యలు. అందొకయామె పెండెకట్ల కరణము కుమార్తె యైన ట్లీదిగువపద్యమువలనఁ దెలియుచున్నది.

చ. అనఘుఁడు మల్లెపూడికొమరాధిపుకూరిమిపుత్త్రి నద్రినం
దన కెన యైనపద్మనయనం బెదలింగమఁ బెండెకట్లశా
సనుఁ డగుపర్వతయ్యసుతఁ జంద్రముఖిం బినలింగమాంబ నిం
పెనయ వివాహ మయ్యె విభవేంద్రుఁడు బాచయమంత్రియున్నతిన్.

ఈపెండెకట్లయే యిప్పుడు పెండ్యాల యనివాడఁబడుచున్నదని స్యూయెల్ పండితుఁడు (సంపుటము 1 పుట 37) వ్రాసియున్నాఁడు.

పెండికట్లవారిప్పు డాప్రాంతములయందున్నారు. ఈగ్రంథమునఁ జెప్పఁబడినకథ సుప్రసిద్ధమైనది. హరిశ్చంద్రకథ మార్కండేయపురాణమునఁ గొంత విపులముగానే యున్నది. ఈకథ ఋగ్వేదమునందుఁగూడ నున్నదఁట. ఈకథను గౌరనమంత్రిద్విపదకావ్యముగా రచియించియున్నాఁడు. దానినిబట్టియీశంకరకవియు కంచివీరశరభకవియుఁ బద్యకావ్యములను జేసియున్నారు. శంకరవీరశరభకవులిరువురును సమకాలికు లని శ్రీవీరేశలింగముపంతులుగారు వ్రాసియున్నారు. కాని యదిసత్యమనుట కాధారములు దొరకలేదు. శంకరకవికంటె వీరశరభకవి యర్వాచీనుఁడు.

కృతిపతి గోదావరిమండలమువాఁ డనినిశ్చయమైనది. శంకరకవి బ్రానుపండితుఁ డనినట్లు నెల్లూరుమండలమువాఁడు కాకపోయినను కమ్మనాఁటిలోని బల్లికురువ ప్రాంతమువాఁడేమో యనియు కృతిపతి వంశమువారుబల్లికురువనుండి గోదావరిమండలమునకు వచ్చియుండుటచే నాపరిచయమునుబట్టి, కవియు నిచ్చటకు వచ్చి యెల్లయార్యునకుఁ గృతి నిచ్చియుండునని తలంపవచ్చును.

కవితండ్రి దేచయామాత్యుఁ డని గద్యవలనఁ దెలియుచున్నది. తెనాలి రామకృష్ణకవి కృతఉద్భటారాధ్యచరిత్రకృతిపతి దేచనామాత్యుఁడు. అతఁడును గౌండిన్యగోత్రుఁడే. ఆదేచనామాత్యుడు సర్వదా శంకరకథావ్యాసంగముగలవాడని యుద్భటారాధ్యచరిత్రమునందున్నది. ఆతనికుమారుఁ డీశంకరకవియనియు శంకరపదధ్యానతత్పరుఁడగుటచేతను ఇంద్రశేఖరమానిశిష్యుఁడగుటచేతను దేచయామాత్యుఁడు తన కుమారునకు శంకరనామముంచియుండుననియు నూహకలుగుచున్నది. కాల మిందుల కాటంకము కలుగచేయదు. ఉద్భటారాధ్యచరిత్రరచనాకాలము క్రీ. శ. ౧౫౭౫ ప్రాంతమని తెనాలి రామకృష్ణచారిత్రమునవ్రాసియుంటిని. అప్పటికీశంకరకవికిఁ బది, పదునైదేండ్లుండ నేని, కులీకుతుబ్షాకాలములోఁ దనయిరువదియైదు, ముప్పదేండ్లప్రాయమున ననఁగా క్రీ.శ. ౧౫౩౫-౧౫౪౦ ప్రాంతమున నీకావ్యమును రచియించియుండును. ఈయనుమానమును సత్యమని ధ్రువపర్చుట కాధారము

లిప్పటికి నాకు లభింపలేదు. ఇందునుగూర్చి యింకను బరిశోధనము జరు
గవలసియున్నది.

కవిచరిత్రకారులనినట్లు యీకవికవిత్వము మృదుమధురపాకము గలదయిరసవంతమయిసహృదయహృదయాహ్లాదకరముగానున్నది. ఇందలిపద్యములను గొన్నిఁటిని గౌరనచారిత్రమున నుదాహరించియున్నాఁడను. మఱికొన్నిపద్యముల నిటవ్రాయుచున్నాఁడను.

ఉ. పౌరనితంబినీజనుల పయ్యెద లొయ్యనఁ దూఱి పీనవ
క్షోరుహాలి ప్రసక్తమదకుంకుమచందనపంకవిస్ఫుర
త్సౌరభము ల్మనోజ్ఞగతి సారెకుఁ గ్రోలి పటీరభూమిభృ ౧ ఆ.
న్మారుత మప్పురి న్మెలఁగు మాంద్యముఁ జల్లదనంబుఁ జూపుచున్.

చ. మలయజశైత్యయుక్తములు మానసము ల్విలయోష్ణభానుమం
డలకిరణాతితీక్ష్ణములు నాలుక లెప్పుడు మానికోటికిం
దలఁప ననుగ్రహించినఁ బితామహుఁ జేయుదు రల్పు నైనఁ బే
రలుక వహించిరేని, కడునల్పునిఁ జేయుదు రప్పితామహుల్. ౨ ఆ.

శా. ఎట్టెట్టో! మిము నొక్కమానవుఁడు దా నెంతే నహంకారియై
బిట్టుల్కం దెగి యింత చేసెనె కడుల్ భీభత్సరూపంబుగాఁ
గట్టా యేగతి నింక వాఁడు నిలువంగా నేర్చు నాముందటల్
జట్టల్చి తొడఁ బొట్టవ్రచ్చెద భుజాశౌర్యం బవార్యంబుగల్. 3 ఆ.

చ. హరిహరపూజకుం దొలఁగి యంత్యజుఁ గొల్చి కులాభిమానముల్
సరగున వెచ్చపెట్టి హరిచందనకీర్తులు వీటిఁబుచ్చి దు
ష్కర మగువల్లకాటి కధికారమువచ్చిన దుష్టబుద్ధికిం
గరుణ దలంప నెక్కడిది గంధగజేంద్రసమానగామినీ.

హరిశ్చంద్రునిభార్య చంద్రమతి, కుమారుని మృతకళేబరమును దీసికొని దహనముగావించుటకై శ్మశానమునకు రాఁగా శ్మశానసుంకమునక్రింద నొకమాడ యిచ్చినఁగాని శవమును దహింపనీయనని హరిశ్చంద్రుఁ డామె నాటంకపరచెను. అప్పుడామె తనయావస్థనుగూర్చి దుఃఖింపుచుండ నాతఁడామెతో.

చ. కుదురు మెఱుంగు నిబ్బరపుగుబ్బలపై నయనాంబుపూరముల్
సెదరఁగ నేలయేడ్చెదవు చెల్వ! దురంతవిషాదవేదనా
విదళితమానసాబ్జ వయి, వేమఱు నాయువుశాశ్వతంబె పం
పదలు స్థిరంబులే విధివిపాకము దాఁటఁ దరంబె యేరికిన్.

అనిపలికినట్లు శంకరకవి గ్రంథమునందున్నది. ఈపద్యము రామరాజభూషణుఁడు రచించిన హరిశ్చంద్ర నలోపాఖ్యానమునందును గలదు. రామరాజభూషణునికంటెఁ శంకరకవి పూర్వుఁడు. కావున నాతనిపై గ్రంథచౌర్యదోషమారోపింప వీలులేదు. రామరాజభూషణుఁడు మహాకవి. వసుచరిత్రాది మహాకావ్యకర్త. ద్వ్యర్థికావ్యరచయిత. శంకరకవిపద్యమును తన గ్రంథమునవేసికొనెనని తలంపరాదు. విలేఖరు లెవరో యీపనిని జేసియుందురనుటకు సంశయములేదు.

అందువలన నీపద్యకర్త యెవ్వరో నిర్ణయించుభారము మనపైఁ బడినది. ఈపద్యకర్తృత్వమునుగూర్చి శంకరకవిచారిత్రమునఁ జర్చించెదనని చంద్రిమౌళికవిచారిత్రమున వ్రాసియున్నాఁడను. (ఆ. క. త. సం. 8. పుట. 77) పద్యమందలిస్వారస్యమునుబట్టి కవిని నిర్ణయించుట దుస్సాధ్యము. రామరాజభూషణుఁడు శంకరకవికంటెఁ బండితుఁ డను మాట నిశ్చయమేకాని యిట్టిపద్యమును శంకరకవి రచియింపఁ జాలఁ డని యనలేము. ఇట్టిధారకలిగినపద్యము లనేకములు హరిశ్చంద్రోపాఖ్యానమున నున్నవి. రామరాజభూషణుఁడు కవితాప్రావీణ్య మధికముగఁగలవాఁడే యైనను యాతని రచనము ద్వ్యర్థికావ్యమగుట నచ్చటచ్చటఁ బద్యముల నడకకుంటువడుచుండును. కాని యీపద్యము రెండర్థములు కలదికాకపోవుటచే నామాట యీపద్యమున కన్వయింపదు.

ఇఁకఁ బూర్వోత్తర సందర్భములననుసరించి యీపద్యకర్తను నిర్ణయింపవలసియున్నది. ఈపద్యభావమును వెల్లడించునప్పటికి శంకరకవి హరిశ్చంద్రుఁడు చంద్రమతిని దనభార్యయని గుర్తింపలేదు. సుంకమడిగినవాఁడు హరిశ్చంద్రుఁడని చంద్రమతియు నెఱుంగదు. చంద్రమతి కంఠముననున్న మంగళసూత్రి మమ్మి సుంకమును దెచ్చియిమ్మని యప్పటికింకను హరిశ్చంద్రుఁ డామెతో ననలేదు.

ఇఁక రామరాజభూషణుని చంద్రమతీహరిశ్చంద్రు లీపద్యమునకుఁబూర్వము పరస్పరము తెలిసికొనియుండిరి. నలుఁడు దమయంతి నదివఱ కెఱింగియున్నవాఁడే. కాని మాఱురూపముననుండుటచే దమయంతి నలు నెఱుంగదు. ఎఱుంగకపోయినను దాసివలననాతనియుదంతము నెఱింగియాతఁడు నలుఁడని నిశ్చయించుకొనినది.

ఈపద్యము హరిశ్చంద్రుఁడు చంద్రమతినిగూర్చి పలికినది. రెండవయర్ధములో నలుఁడు దమయంతినిగూర్చి నుడివినది. దహించుటకై పుత్రునిమృతకళేబరమును శ్మశానమునకు దీసికొనివచ్చి శ్మశానపాలకుఁడు సుంకమిమ్మనియడుగగా నిర్ధనయై చేయునదిలేక మహాదుఃఖములోఁ గన్నీరుగార్చుచున్నచంద్రమతి నోదార్చుటకై యామె నెఱుంగని హరిశ్చంద్రుఁ డాపల్కులను పల్కెనని చెప్పినవాఁడు శంకరకవి. రామరాజభూషణుని కావ్యమందలిచంద్రమతియవస్థకూడ నదియే. కాని యామెను హరిశ్చంద్రుఁ డెఱిఁగియుండెను.

కుమారునిజూచినచో నలునిహృదయము కఱగి నిజరూపమును బయల్పరచికొని యాదరించు ననునుద్దేశములోఁ గుమారు నెదుటనుంచి యాతనివికృతరూపమును జూచియు ఋతుపర్ణునికడ సేవకుఁడుగనుండుటను దలంచియు శోకగ్రస్తయైనది దమయంతి.

రామరాజభూషణుఁ డీపాత్రల నేకపదజాలముచే నీక్రిందిపద్యములలోఁ బ్రదర్శించినాఁడు. వ్యాఖ్యాత యీపద్యములకు వేఱువేఱుగ నర్థములను వ్రాయక రెంటనుసమానమని వ్రాసి యూరకుండెను. దమయంతీ చంద్రమతులశోక కారణములును వారియవస్థలును భిన్నములు. అట్టిపాత్రల నేకవాక్యజాలముచేఁ బ్రదర్శించుట చాలకష్టము. అందు రామరాజభూషణకవి యెంతవఱకుఁ గృతకృత్యుఁ డయ్యెనని చర్చించుట ప్రస్తుతాంశము కాదు. వివాదాంశమైనపద్యము నీతఁడు రచియించెనా? యనిచర్చించుటయే ప్రస్తుతాంశము. ఈసందర్భమున రామరాజభూషణుఁడు రచించినపద్యము లివి.

౧. చ. అడుగుల వ్రాలి శోకకలితాకులతాచలితాత్మవీథినై
నడుకుచుఁ బ్రాణనాథ! కరుణాభరణాభరణాంతరంగ! నీ
కొడుకుతెఱంగుఁ గోమలి నెగుల్ దిలకింపఁగదయ్య! నేఁడు నిన్
బొడఁగనఁ గల్గెఁ జాలుఁ దలఁపుల్జరితార్థము లయ్యె నెంతయున్.

౨. క. అన నాజననాథాగ్రిణి
మననాధికశోకశిఖల మానస మార్తిం
గన నాచ్ఛాదించి కులాం
గన నాత్మకథావిబోధకారణిఁ బలికెన్.

౩. చ. కుదురు మెఱుంగు నిబ్బరపుగుబ్బలపై నయనాంబుపూరముల్
సెదరఁగ నేలయేడ్చెదవు చెల్వ! దురంతవిషాదవేదనా
విదళితమానసాబ్జ వయి వేమఱు నాయువు శాశ్వతంబె సం
పదలు స్థిరంబులే విధివిపాకము దాఁటఁ దరంబె యేరికిన్.

౪. గీ. అఖిలదేశంబులు సదాసహాయవృత్తి
నెఱపితి విలాసవతి! యిట్టినిన్ను నమ్మి
కనుఁగొనుట యెట్లు? నిర్విశంకతఁ దలిర్ప
నిపు డెదుట నిల్చి మాటాడు టెట్లటన్న.

ఇందు మూఁడవపద్యము వివాదాస్పదమైనది. మొదటిమూఁడు పద్యములకును వ్యాఖ్యాత యర్థము వ్రాయలేదు. అందుచే చంద్రమతీ దమయంతులశోకనిమిత్తములును సవర్థలును సమానములే యని కావ్య కర్తయు వ్యాఖ్యాతయుఁగూడ భావించియుండి రనుట స్పష్టము.

(౧) మూఁడవపద్యము. నాయకులు వారిభార్యలయెడల సాను భూతిగనుపరచి, వారినూఱడించుటకై యుద్దేశింపఁబడినది. రామరాజ భూషణకవి యీపద్యమును రచియించియున్నచో దమయంతివిషయ మున నాయువుశాశ్వతంబె? "అనుపదముల నిటఁ బ్రయోగించియుండఁ డు. చంద్రమతి పుత్రశోకముచేఁ గ్రుంగుచున్నది కావున నామె నాశ్వాసించుటకై యాపదముల నుపయోగింపవచ్చును. కాని యందరు సుఖజీవులై యున్నదమయంతిపట్ల యాపదము లనువర్తింపవు. "సంప

దలుస్థిరంబులే" యనువాక్య మిరువురుపట్లనువర్తించును. ఉచితానుచిత జ్ఞుఁడగురామరాజభూషణుఁడు ఇట్టికావ్యమున ననాలోచితముగా సామాన్యజనునివలె "ఆయువుశాశ్వతమా?" అనియూరకప్రయోగించె నని తలంపరాదు.

(౨) ఈమూఁడవపద్యమును గ్రంథమునుండి తొలఁగించిచూడుఁడు. ఇరువురివిషయమునసుగూడఁ గథకులోపము రాలేదు.

(3) నాల్గవపద్యమునుబట్టి చూచినచో దమయంతిపట్ల నలునకు సానుభూతిలేదు సరికదా! ఆమెవిషయమున విశ్వాసరాహిత్యమునుగను పరచినాఁడు.

ఈనాల్గవపద్యమందు హరిశ్చంద్రుఁడు చంద్రమతితో "ఓవిలాస వతీ! నీవు సర్వదా నాకు సహాయముచేయుచు సమస్త దేశములు నాతో సంచరించితివి. అట్టి నిన్ను (దయాశూన్యుఁడనై) విక్రయించిన నేను నీమొగమెట్లుచూడఁగలను? నీయెదుటనిలిచి యెట్లుమాటలాడఁగలను" అని వాపోయినాఁడు.

నలుఁడు దమయంతితో "విలాసవతీ! నీవు ఒంటరిగా సకల దేశములు తిరిగినదానవు. ఇట్టి నీయెడ నెట్లువిశ్వాసము చూపగలను, నీయెదుటనిలిచి మాటలాడు టెట్లు?" అనిపలికి యామెపాతివ్రత్యమును శంకించినాఁడు.

ఇట్టి యనుమాన హృదయుఁడగు నలుఁడు పైమూఁడవపద్యము నందలియనునయ వాక్యములను బలికెననుట కవకాశములేదు. పాత్రౌచిత్యమును జక్కగానెఱింగిన రామరాజ భూషణుఁడు పై పద్యము నీసందర్భమున రచియించి యుండఁడు.

ఈకారణములనుబట్టి యీపద్యకర్త రామరాజ భూషణుఁడు కాఁడని నావిశ్వాసము. ఆపక్షములో శంకరకవియే యీపద్యమును రచియించెనని తేలుచున్నది. అయినను శంకరవి పద్యములయందుఁ బూర్వోత్తర సందర్భములెట్లున్నవో పరికింతము. రామరాజభూషణు నకున్నంతకష్టము శంకరకవికిలేదు. గ్రంథవిస్తరభీతి యున్నను నీసంద

ర్ఘమున శంకరకవి రచించిన పది పద్యముల నీక్రింద నుదాహరించు చున్నాఁడను.

సీ. ఆడుదానవు గాననను కంప జనియింపఁ
బరుషోక్తులను నేమిఁ బలుకనోడి
యూరకయుంటిఁ ద క్కొరుని నెవ్వనినైన
శిరము ఖండింతుఁ గౌక్షేయకమున
సాదనేర్పఁ దగునంతచోటికి నొకమాడ
తెచ్చి నాకిత్తురు మచ్చెకంటి
యీచొప్పు దప్పక యియ్యంగ వలయును
దొరకకయుండినఁ దొలఁగి పొమ్ము.

తే. మాటలింకేల యిచ్చోట మసలితేని,
యంత్యజాగ్రణి మత్స్వామియైన వీర
బాహుపదముల యాన యోభామ యనిన
మిగుల శోకంబు నిగుడ నమ్మగువ పలికె 82

చ. పరహిత మార్గవర్తన! శుభంకర! నన్నొకకొంత నీదయా
సరణిఁ గనుంగొనన్వలయు సంపదగల్గిన దానిఁబోలె ని
ష్ఠురగతి మాడ వేఁడెదవు చూడఁగ నేనిరుపేదగాల నె
వ్వరు మఱిదిక్కులేరు తగవానను శోకపయోధి ముంపగన్. 83

క. శ్రీలున్ దైవారిజలధి, వేలాయి తధరిత్రి విమల యశుండై
యేలు నృపసూతి యడుగెడు, నేలకుఁ బాత్రుండుగాఁడె నీకిటు తగునే. 84

వ. అని మఱియు. 85.

మ. అకటా షేరెడు నేలకుం దగఁడె సప్తాంబోధి వేష్టిభవ
త్సకలద్వీపకలాపభూప మకుటాంచత్పద్మ రాగోజ్జ్వల
ప్రకటానర్గళ నిర్గళత్కిరణశుంభత్పాదుఁ డైనట్టి రా
జకుమారుండని యేడ్చె కన్నుగవ నశ్రుల్కాల్వలై పారగన్. 86

చ. కుదురుమెఱుంగు నిబ్బరపు గుబ్బలపై నయనాంబు పూరముల్
చెదరగ నేలయేడ్చెదవు చెల్వ! దురంత విషాద వేదనా

విదళిత మానసంబునను వేమఱు నాయువు శాశ్వతంబె సం
పదలు స్థిరంబులే విధివిపాకము దాఁటఁ దరంబె యేగికిన్. 87

వ. అనినఁ జంద్రమతి యిట్లనియె...... 88

ఆ. సుజనవినుత! గోరుచుట్టుపై రోఁకటి
పోటు దాఁకినట్ల పోతలంప
మొదల శోకజలధి మునుగంగ నందుపై
నీవుపల్కినట్టి నిష్ఠురోక్తి. 89

మత్త. ఓమహాత్మక! మిమ్మదూఱఁగ యుక్తమే వివరింప మీ
రేమిచేయుదురయ్యా! మాటికి హెచ్చి కౌశికమౌని మా
యామయంబయి వెంటవెంట నహర్నిశంబులు బాయకు
ద్దామశక్తిని నాదుకర్మము దాయ్యకైవడి నుండఁగాఁ. 90

శంకరకవి గ్రంథమున విలేఖకులు చాలమార్పులు గావించి యుండిరనియు, "అకటా! చేరెడు నేలకుందగఁడె" యనుపద్యము శంకరకవి రచించినది కాదనియుఁ జంద్రమౌళికవి చారిత్రమున వ్రాసి యున్నాఁడను. ఆపద్యమును దీసివేసి పైపద్యములను జదువుఁడు. ఆప ద్యము చంద్రమతి పల్కినది. దానితరువాతి "కుదురుమెఱుంగు" అను పద్యము హరిశ్చంద్రుడు చెప్పినది. ఈ రెంటికి నడుమ నొకచిన్న వచనమో పద్యమో యుండితీరవలయును. లేకున్న నీ"కుదురు" పద్య ముకూడఁ జంద్రమతి పల్కినట్లే యగును. 'అకటా చేరెడు' అనుపద్య మును దీసివేయక యచ్చటనుంచినను నీయన్వయ దోషముపోదు. కావుననీ 'అకటా చేరెడు' అనుపద్యమును గ్రంథమునుండి తొలఁ గింపుఁడు.

ఆపద్యములోపాటు 'కుదురమెఱుంగు' ఇత్యాది పద్యమును 88 వచనమునుగూడ తీసివేయుఁడు. వివాదాస్పదమైన యీ'కుదురు మెఱుంగు' అను పద్యముకూడఁ జంద్రమౌళికవి రచించిన హరిశ్చంద్రో పాఖ్యానములోనిదని నాయభిప్రాయము.

ఈపద్యము శంకరకవి రచనమా? రామరాజభూషణరచనమా? యను ప్రశ్నకు ఈయిరువురి రచనమునుకూడఁగాదు. చంద్రమౌళికవి

దని ప్రత్యుత్తరమిచ్చుట, 'ఆసత్యేన తపసా? వపసా?' అనుప్రశ్నకు రెండునుగాదు. 'ఆసత్యేనరజసా' యని యుత్తరమిచ్చినట్లున్నది.

వివాదాస్పదమైన యీపద్యమును దీసివైచినచో హరిశ్చంద్రుఁడు చంద్రమతికేమి చెప్పెనో తెలుపు పద్యముండవలదా? యనుప్రశ్న రావచ్చును. శంకరకవి యట్టిపద్యమును వ్రాసియుంచినాడు. చూడుఁడు.

చ. సరసిజనేత్ర! జీవితము సత్యముగాదు శరీరధారికిన్
మరణము నిశ్చయంబు పలుమాఱుఁ గుమారునిఁజూచియేడ్చినన్
మరలునె వీనిప్రాణములు మంగళసూత్రసువర్ణమిచ్చి నీ
వరసుతునిం దహించు మగువా యనమూర్ఛిలిశోకమగ్నయై... 96

ఈపద్యములోని భావమే 'కుదురుమెఱుంగు' పద్యములోఁ జెప్పఁబడినది. ఒకేభావమును బునరుక్తిగా రెండుపద్యములలో శంకరకవి చెప్పినాఁడనుటకంటె 'కుదురు...' పద్యము చంద్రమౌళిదని నిర్ణయించుట సమంజసము. ఆపద్యమును గ్రంథమునుండి తీసివేసినను కథకు లోపమురాకుండ నన్వయదోషములేకుండ సరిపోవుచున్నది.

పాఠకమహాశయు లీసందర్భమున శంకరకవి పద్యములను రామరాజభూషణుని పద్యములను పూర్వోత్తరములయందున్నవానిని మరికొన్నిటిని చదువవలయును.

హరిశ్చంద్ర నలోపాఖ్యాన పీఠికాకారులు, వివాదగ్రస్థమైన యీపద్యమును రచించిన యాతఁడు రామరాజ భూషణుఁడే యని నిర్ణయించుచు హరిశ్చంద్రుఁడు తనభార్యయని తెలియకపూర్వము 'కుదురుమెఱుంగు' అను పద్యముచేఁ దనభావమును వెల్లడించె ననుట నుచితమనియు, నట్టిభావమును వ్యక్తపరచినాఁడని శంకరకవిపై నింద మోపుటకంటె తనభార్యయని యెఱింగినపిదప నట్లుమాటలాడెనని రచించిన గామరాజభూషణుఁడే యాపద్యకర్తయని నిర్ణయించిన మేలని యందులకొకహేతువునిచ్చియున్నారు. నేనీపీఠికాకారుల యభిప్రాయముతో నేకీభవింపఁజాలను. చనిపోయినవాఁడు తనపుత్త్రుఁడనియు, దుఃఖాంబుధిలో మునిఁగియున్నది తనభార్యయనియుఁ దెలిసినమీఁదట నట్టి పదములతో హరిశ్చంద్రుఁడు భార్యనోదార్చినట్లు

రామరాజభూషణుఁడు రచించియుండఁడనియు కావున నాపద్యమాత నిది; కాదనియు నాయభిప్రాయము. ఇట్టి పద్యములనుబట్టి యీకర్తృత్వమును నిర్ణయింప వలనుపడదు. స్వస్త్రీ, పరస్త్రీ భేదమిచ్చటలేదు. స్వస్త్రీయని యెఱింగినను బరస్త్రీయని భావించినను నాయవస్థలో నున్న యబలాకుచవర్ణన మనుచితమనుట సత్యమే. కాని కవులు ప్రాయికముగా స్త్రీలరోదనమును వర్ణించునప్పు డౌచిత్యము చ్యుతమైనను కండ్ల నశ్రువులు కాలువలై స్తనములమీద బడుచున్నట్లు వర్ణించుచుందురు.

"కాటుకకంటినీరు చనుకట్టుపయింబడ నేల యేడ్చెదో" (పోతన) ఇట్టివింకనుగలవు. కొందఱిట్టిపద్యములలో శబ్దాడంబరముకొఱకు కొన్ని పదములను స్తనములకు విశేషణములుగాఁ జేర్చుచుండుటయుఁ గలదు. ప్రతిపదార్థమును గైకొనినచో నిందౌచిత్యము లేదని చెప్పకతప్పదు. కాని చదువరుల హృదయముల కాపద్యపఠనమువలన నాదీనవదనము దుఃఖాశ్రువులు హృదయ విదారకమైన యామెదైన్యావస్థయునే గోచరించునుగాని యన్యము గాన్పింపదు. అట్టి పద్యరచనాకాలమునఁ గవులును దన్మయావస్థలోనుండి తమ కవితయందెట్టి పదములు పడుచున్నవో తెలిసికొనెడి స్థితిలోనుండరని భావించి వారిని కఠిన విమర్శకుఁ బాలుచేయకుండుట పాఠకుల ధర్మము.

టీకాకారులు, తాము చూచిన తాళపత్రప్రతులయం దీపద్యమున్నదనియు, వ్యాఖ్యాత రామరాజభూషణునకుఁ దరువాత సమీప కాలములోనున్నవాఁడనియు, నందుచే రామరాజభూషణుఁడే యీపద్యమును రచియించెనని నిర్ణయింపవలయునని వ్రాసియున్నారు. ఈపద్యకర్తృత్వమును నిర్ణయించుట కిదియొకసాధనము కాఁజాలదు. అనంతకవిస్వహస్తలిఖిత తాళపత్రప్రతి లభించినను, ఈపద్యముదాహృతము కాని హరిశ్చంద్రోపాఖ్యాన ప్రతులు లభించినను గొంతవరకవి సాక్ష్యములుగా గ్రహింప నర్హములై యుండును.

ఈపద్యకర్తృత్వ విషయికచర్చలో నీకవి చారిత్రము పెద్దదై నది. ఈపద్యము చంద్రమౌళిదే యనునాయభిప్రాయమును దెలుపుచు నీచరిత్రమును ముగించుచున్నాఁడను.

---

175 భాస్కరాచార్యులు

ఈకవి వైశ్యపురాణ మనునెనిమిదాశ్వాసముల పద్యకావ్య మునురచించి పెనుగొండయందలి వైశ్యయువకుల కంకితముచేసెను.

ఆంధ్రకవి చరిత్రకారు లీకవినామమును భాస్కర పంతులని పేర్కొనియున్నారు. (221వపుట. 1899 ముద్రణము.) కాని వైశ్య పురాణ ముద్రితప్రతియందలి గ్రంథాంత గద్యలో "ఇది శ్రీసరస్వతీ విలాస చరణసరసీరుహ నిష్యంద మకరందబిందు సందోహమాధురీ మధు కరాయమాన మానస సరస కవితావిలాస బొల్లనార్య తనూజవర్య శ్రీగురుభాస్కరాచార్య ప్రణీతంబైన వైశ్యపురాణం"బని వ్రాసికొని యుండుటచే నేనీతనిని భాస్కరాచార్యుఁడని పేర్కొంటిని.

ఈకవి తననుగూర్చి వ్రాసికొనిన యీక్రిందిపద్యములనుబట్టి యాతఁడు గౌతమగోత్రుఁడైన బ్రాహ్మణుఁడనియు, బొల్లన కుమా రుఁడనియుఁ బెనుగొండ నివాసియనియుఁ దెలియుచున్నది.

శా. ఆపస్తంబ మునీశ్వర జగద్వ్యాఖ్యైకసూత్రుండ వి
ద్యాపాథోనిధి గౌతమాఖ్యముని గోత్రాధిక్యుడం బ్రోల్లన
చ్ఛాపానుగ్రహ వాక్యమర్థిత నృపశ్లాఘ్యుండఁబెన్గొండపూఃఁయఁశ
శ్రీపుణ్యాన్వయధివాస భారతుఁడ ధాత్రీ దేవతామాన్యుఁడన్.

క. సల్లలిత లక్షణోక్తుల
నుల్లసిత కవిత్వ తత్త్వయుక్తుఁడ సుమనః
పల్లవితకీర్తి లతికో
ద్వేల్లితహారిదంతరుఁడ ధృతి భాస్కరుఁడన్.

ఈకవి కాలమునుగూర్చి యాంధ్రకవుల చారిత్రములో "గ్రంథ సామగ్రి తక్కువగుటచేత నీతనికాల మిదియని నాకిప్పుడు నిశ్చయ ముగాఁ దెలియకపోయినను, ఇతఁడు పదునాఱవ శతాబ్దమునకుఁ బూర్వుఁడని తెలియవచ్చుచున్నది." అని వ్రాసియున్నారు. వైశ్య పురాణ కృత్యాదియందు:—

ఉ. భారతరామ సత్కథలు భాగవతంబుఁ దెనుంగుసేయఁగా
నేరరె సత్కవీశ్వరులు నేర్చిరచించిన సత్కవిత్వముల్
మీఱుఁ దెనుంగుబాస నిల మెచ్చుగనొక్క తెనుంగు గ్రంథమిం
పారఁ బ్రసిద్ధిసేయు మహిమండలి నొప్పుఁగఁ బండితాగ్రణీ!

అను పద్యములో నాంధ్రభాగవతకర్తను సంస్మరించియుండుటచే నీతఁడు బమ్మెర పోతనామాత్యునికంటెఁ దరువాతివాఁడనుట స్పష్టమైన విషయము. ఈవైశ్యపురాణమునకుఁ గన్యకాపురాణమనియు, వాసవీ మాహాత్మ్యమనియు నామాంతరములు. ఈగ్రంథము ముద్రితమైనది. దీని యముద్రిత ప్రతులు మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున నాలున్నవి. (R 91, 185 A D 316 to 320) ఇందు నాల్గుప్రతులకు విలేఖకులు తమకాలముల నిచ్చియున్నారు. ఆకాలములను అందలి తిథివారములనుబట్టి స్వామికన్ను పిళ్లగారి పంచాంగమునసరించి యేర్ప డిన యింగ్లీషు తేదీలను నీక్రింద నిచ్చుచున్నాఁడను.

R 91	సాధారణసం, పుష్యబ ౧౦ భానువారం —	26-1-1851
D 317	ప్లవంగనామ సం చైత్ర శు ౧౩ శనివారం	31-3-1787
D 318	తారణ సం ఆశ్వీజ శు ౨ బుధవారం	20-9-1704
D 319	ప్రమోదూత సం జ్యేష్ట బ ౫ గురువారం	21-6-1810

దీనినిబట్టి యీగ్రంథము క్రీ. శ. ౧౫౦౦-౧౬౦౦ నడుమ రచితమైనదని స్పష్టమగుచున్నది. కావున నీకవి పదునాఱవ శతాబ్ది పూర్వార్థమువాఁడని ప్రస్తుతమున నిర్ణయింతము.

ఈకవి నివాసమైన పెనుగొండ అనంతపుర మండలములోనిదని ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునందలి గ్రంథముల క్యాటలాగులో వ్రాసియున్నారు. కాని యది సత్యముకాదు. (R. No 91) అనంత

పుర మండలమునఁ బెనుగొండ నగరమున్నమాట సత్యమే కాని, యీ వైశ్యపురాణమున వర్ణితమైన పెనుగొండ యది కాదు. ప్రస్తుతమున పశ్చిమగోదావరియని పిలువబడుచున్న మండలములోఁ దణుకుతాలూకాయందొక పెనుగొండయున్నది. అదియే యిందు వర్ణితమైనదని యీక్రింది పద్యములవలన స్పష్టమగుచున్నది.

సీ. ఏపురంబుననుండు మూలస్థాన
మల్లిఖార్జునుఁడు శ్రీమండితుండు
ఏపట్టణంబున గోపికాపతి దైత్య
మర్దనుఁడుండు జనార్దనుండు
ప్రవహించునే వీటి ప్రాగ్భాగమున బెట్టు
కడలిరాయనికొమ్మ గౌతమమ్మ
ఏవీటఁజెలువొందు నేప్రొద్దుఁ గరుణాలో
విశ్వనాథుని దేవి వింధ్యనిలయ
విప్రబాహుజ విట్శూద్రవిమలహర్మ్య
కూట సంస్థాపిత స్వర్ణ కుంభదీప
జాలభాసిత బ్రహ్మాండ గోళకంబు
ధరణి స్వర్గంబు పెనుగొండ పురవరంబు.

సీ. ప్రవహించు నేవీటి ప్రాగ్భాగమునమించి
శ్రీమత్తరంగ వాసిష్ఠగంగ
దర్శించు నేవీట దక్షిణంబున దుగ్ధ
కాసారపుర మేలుఘనుఁడు శివుఁడు
పాలించునే వీడు పశ్చిమంబునను గౌ
రీశ్వరుండైన రామేశ్వరుండు
యోజించు నేవీటికుత్తరంబున నుండి
యంబుజాక్షుండు జనార్దనుండు
అట్టిపురవర మఖిల విద్యాధురీణ
వైశ్యవంశపరాక్రమ వర్ణనీయ

సముచితాక్షర సంపూర్ణ శాసనాగ్ర
కీర్తనీయంబు అమ్మహా గిరివరంబు.

ఈపద్యములలో నుదాహృతములైన వసిష్ట, గౌతమియనునదులు గోదావరి మండలమునందలి పెనుగొండ సమీపముననున్నవి. కాని యనంతపుర మండలమున లేవు. దుగ్ధకాసారపురమనఁగా పాలకొలను. ఇది పాలకొల్లు అనుపేరఁ బరగుచు పశ్చిమగోదావరి మండలముననే యున్నది. పైపద్యములోని రామేశ్వరుఁడీ పెనుగొండ సమీపమునం దున్న ఆచంటయందున్నాఁడు. పైపద్యములలో నుదాహృతములైన దేవాలయములన్నియు నీపెనుగొండయందున్నవి. పెక్కు వైశ్యకుటుంబము లైశ్వర్యములతోఁదులదూగుచు నీపెనుగొండయందున్నవి. కావున భాస్కరాచార్యకృత వైశ్యపురాణమునఁ జెప్పఁబడిన పెనుగొండ, పశ్చిమగోదావరి మండలమునందలి పెనుగొండయే కాని యనంతపుర మండలమందలి పెనుగొండ కాదు.

ఈవైశ్యపురాణములో మొదటినాలుగాశ్వాసములును వైశ్యుల జన్మవృత్తాంతమును వారు కైలాసమునుండి భూమియందవతరించుట మొదలుగాఁ బురాణగాథలతో నిండియున్నది. మిగిలిన నాలుగాశ్వాసములును వాసవీ కన్యతో సంబంధించినకథ. పెనుగొండ పట్టణమునఁ గుసుమసెట్టి యను ధనవంతుఁడగు వైశ్యుఁడొకండు కలఁడు. అతఁడు సంతానమునుగోరి భార్యతోఁగూడి పుత్రకామేష్టిచేయ విరూపాక్షుఁడను తనయుఁడును నొకకుమార్తెయుఁ గలిగిరి. ఆమెపేరు వాసవి. తలిదండ్రులామె నతిగారాబముతోఁ బెంచిరి. యుక్తవయసు వచ్చినప్పటికామె యత్యంత రూపవతియై సర్వాంగసుందరియయ్యెను. ఆ కాలమున రాజమహేంద్రవరమున రాజ్యముచేయుచున్న చాళుక్య వంశజుండగు విష్ణువర్ధనుఁడనురాజు దిగ్విజయము చేయుటకై దేశమునఁ దిరుగుచు మార్గవశమునఁ బెనుగొండకు విచ్చేసెను. ఆనగరమప్పుడు వైశ్యుల పరిపాలనములో నుండెను. వారు రాజునుచిత మర్యాదలతో నెదుర్కొని పూజించితెచ్చి యొకసౌధమున విడియించిరి. రాజునకు నివాళులనిచ్చుటకై యరుదెంచిన వైశ్యయువతులలోనున్న వాసవి

కన్యనుజూచి కామించి విష్ణువర్ధనుఁడాకన్యను దనకిచ్చి పరిణయము సేయుమని కుసుమసెట్టికి వర్తమానించెను. నగరవైశ్యులందఱితో నాలోచించికాని యేమియుఁ జెప్పఁజాలనని యాసెట్టి బదులుచెప్పెను. విష్ణువర్ధనుఁడు బలవంతముగా నాకన్యను రాజమహేంద్రవరమునకుఁ దెమ్మని తనసేనానాయకునితోఁగూడ సైన్యమునిచ్చి పంపించెను.

వైశ్యులొకచో సమావేశమై ప్రాణములను త్యజించియైనను మతాచారములను గాపాడుకొనుట ధర్మము కావున రాజునకుఁ గన్య నీవలదని తీర్మానించుకొనిరి. బలవంతుఁడైన రాజుతోఁ బోరాటము వలన లాభములేదని తలంచి సతీపుత్ర బాంధవసహితముగా నగ్నిగుండములబడి యగ్నికాహుతులై తమధర్మమును గాపాడుకొన నిశ్చయించుకొనిరి.

వైశ్యులీనిశ్చయమునకు వచ్చుటకై ప్రోత్సహించి తోడుపడినయాతఁడు వైశ్యుల పురోహితుఁడగు భాస్కరాచార్యులను బ్రాహ్మణుఁడు. ఆపటిదినమున నీదారుణ కార్యము జరుగుననఁగాఁ దొలినాటిరాత్రి యీభాస్కరాచార్యుఁడు అగ్నికాహుతియగుటకు సిద్ధపడిన వైశ్యులకు వీరతాంబూలంబు లిప్పించెను. ఆనాఁటి సమావేశమునకు 714 గోత్రములవారు వచ్చిరి. కాని యందు వీరతాంబూలములను గైకొనినవారు 102 గోత్రములవారు మాత్రమే. మిగిలిన 612 గోత్రములవారున్ను అగ్నికాహుతులగుటకు సాహసింపలేక పారిపోయిరి.

మఱునాఁడగ్నికుండములు 103 సిద్ధముచేయబడినవి. వాసవీకన్య తలిదండ్రులకు ధైర్యముచెప్పి తనతోఁగూడ నగ్నిం బడుటకు సిద్ధులైన 102 గోత్రములవారివంశీయులును నైశ్వర్యములతోఁదులదూగుచు కీర్తికాములై యిహపరసౌఖ్యముల నందుచుండునట్లును వారు తమగురువైన భాస్కరాచార్యుని యందును వారివంశీయులయందును భక్తికలిగి పూజింపుచు వారి యాశీర్వాదములను బొందుచుండునట్లును మిగిలిన 612 గోత్రములవారును వర్ణభ్రష్టులై చెడిపోవుదురనియును శాసించి, తన్నభిలషించిన విష్ణువర్ధనుఁడు తానగ్నిహోత్రమునం బడినవార్తను వినినయాక్షణముననే శిరసు బ్రద్దలయి మరణించునని శాపమొసంగి

పార్వతీ పరమేశ్వరుల మనంబునందిడి యగ్నికుండమునంబడి ప్రాణంబు లంబాసెను. ఆమెతోఁగూడ నూటరెండుగోత్రములవారు నగ్నికాహుతులైరఁట. ఈవార్త రాజమహేంద్రవరమునందున్న విష్ణువర్ధనునకుఁ దెలిసిన క్షణముననే యాతని తల వ్రక్కలై మరణించెనఁట.

ఈకథ వైశ్యపురాణమున తుది నాల్గాశ్వాసములలోను వర్ణితమైనది. ఈ వైశ్యపురాణము ద్విపదకావ్యమొకటి కలదు. దానివ్రాఁత ప్రతియొకటి మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునన్నది. (R. No. 1011) పద్యకావ్యము ముద్రితమైనది. ద్విపదకావ్యము ముద్రితమైనట్లు కనబ్బడు. ద్విపదకావ్యమునుగూడ నీభాస్కరాచార్య విరచితమే యైనట్లు క్రింది ద్విపదలవలనఁ దెలియుచున్నది.

అనుచు ధీనిధి భాస్కరాచార్యగురుఁడ
వినుత నానాశాస్త్ర వేదపాలితుఁడ
గురువైన గౌతమగోత్ర పవిత్ర
చరితుండ భారతీ జీవితేశ్వరుని
కులసంభవుఁడ నీతిగుణ విశారదుఁడఁ
గవిత శబ్దార్థ సంగతుల తోడుతను
వలనొప్ప మించు గీర్వాణపురాణ
మలవడ రచియించి తంధ్రభాషణను
రసిక డింభకనగరావళిపేర
నసమాననీతి విఖ్యాతులపేర.

ఈ వైశ్యపురాణమందలి వాసవీకన్యకథ కేవలపురాణగాథగనే భావింపవలయునా? చారిత్రాత్మకముగా నెంచి సత్యాన్వేషణకు గడంగవచ్చునా? అని యోచింపవలసియున్నది. చరిత్రాత్మకమనుచో నీసంఘటన మేకాలమున జరిగినది? ఈవిష్ణువర్ధనుఁడెవ్వరు? భాస్కరాచార్యులెవ్వరు? వాసవీకన్య దేహత్యాగముచేసినది పశ్చిమగోదావరి మండలమందలి పెనుగొండయా? అనంతపురమండలమందలి పెనుగొండయా? ఇత్యాది విషయములనుగూర్చి యోచింపవలసియున్నది. చారిత్రక చతురానన బిరుదాంచితులగు శ్రీ చిలుకూరి వీరభద్రరావు పంతు

లుగారు ఆంధ్రుల చరిత్రములో నీకథ కల్పితమనియు నీసంఘటనము జరుగనేలేదనియు నభిప్రాయమిచ్చియున్నారు.

వాసవీకన్య యగ్నిగుండమునఁ బడినప్పుడు దచ్చటనున్న భాస్కరాచార్యులును నీగ్రంథకర్త భాస్కరాచార్యులును నొక్కరు కారు. పూర్వమెప్పుడో జరిగినకథను తెనుఁగునఁ బ్రబంధముగా జేయుమని పెనుగొండయందలి వైశ్యయువకు లర్థింప నీభాస్కరాచార్యుఁడీగ్రంథమునురచియించిన ట్లీక్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది.

క. మనుమాపెద్దల చరితము
మని సాలంకాయనుండు మదమునఁ జెప్పెన్
ఘనమునఁ దత్కృతి పొందుగ
నను గుణముగఁ జేసి చెప్పుఁ డాంధ్రోక్తిఁదగన్.

వాసవీకన్యయును వైశ్యులును నగ్నిగుండంబులం బడునప్పుడు వైశ్యులు భాస్కరాచార్యులకొక తామ్రశాసనమును వ్రాయించియిచ్చి తామరవాడ యను గ్రామము నగ్రహారముగ నిచ్చిరట! ఆశాసనము నీగ్రంథకర్త యీవైశ్యపురాణమున నుదాహరించెను. అందవరసమైన భాగము నిట వ్రాయుదును.

"భాస్కరాచార్యులకు జాహ్నవీతీరంబునఁ దామరవాడయను గ్రామంబగ్రహారంబుగా నిచ్చుండని చెప్పి పెనుగొండలో నర్ధాంశంబు తత్పుర దేవతా మహోత్సవంబున కొసంగి మిగిలిన యర్ధంబు కులగురువులైన పండితవర్గంబులకిమ్మని పురమధ్యంబున శాసన స్తంభంబు నిలిపి భాస్కరాచార్యులకుఁ దామ్ర శాసన పత్రిక లిఖియింపంజేసిరి. తత్క్రమం బెట్టిదనిన:

శ్లో. స్వస్తి శ్రీనగరేశ కోనకమలా శ్రీవింధ్యవాసీ జయా
౧. శ్రీవత్సాంకజనార్దనశ్చ సువిశో విఘ్నేశ్వరః శ్రీనిధిః
సూర్యేందూ్వరబుధేజ్యశుక్రరవిజస్వర్భానవః కేతవః
సాన్నిధ్యం పెనుగొండపట్టనవరే కుర్వంతు దీర్ఘాయుషః॥

శ్లో. కల్యాద్యబ్దగణేఽష్టనేత్రరసదృక్సంఖ్యాగతేవత్సరే
౨. ప్రాప్తేబ్దే ప్రభవే తపస్యసి సితే పక్షేద్వితీయా గురౌ
ఆర్యా భాస్కరపండితాదిధరణీబృందారకేభ్య స్సదా
ప్రీత్యాష్టాదశపట్టనాధిపతిభిః దత్తం శుభం శాసనమ్.
శ్లో. గృహే గృహే విశాం వర్షే వర్షే ద్వాదశగోత్రిణామ్
౩. వివాహేచ వివాహేచ శ్రీమ త్సీమంతకర్మణి
పుత్రే పుత్రే సముత్పన్నే కన్యాయా జన్మజన్మని
గద్యాణికం తదర్థంచ గద్యపద్యాదిసత్క్రియా
శాంతికే పౌష్టికే చైవ పైతృకే వృద్ధకర్మణి.

* * *

పెనుగొండకునాతిదూరమున తామరాడయున్నది. భాస్కరాచార్యవంశీయు లగుదురో కారో చెప్పఁజాలముకాని, ఆగ్రామ మిప్పుడును బ్రాహ్మణుల కగ్రహారముగా జరుగుచున్నది.

ఈశాసనమునం దుదాహృతమైనకాలము కల్యాదినుండి 2628 అగు ప్రభవసంవత్సరమాఘశుద్ధవిదియాగురువారము. వర్తమానకలి యుగాబ్దములు 5053. అనఁగా నిప్పటికి 2425 వత్సరములక్రితఁ మీశాసనము పుట్టినదన్నమాట! ఆప్రాంతముననో, ఆనాడో వాసవీకన్య యగ్నికాహుతియయ్యెనని దీనినిబట్టి తెలియుచున్నది. ఆమెను గామించినవాఁడు రాజమహేంద్రపురమును బరిపాలించుచున్నచాళుక్యవంశజుఁడగువిష్ణువర్ధనమహారాజని వైశ్యపురాణమునం దీక్రిందిపద్యములలోఁ జెప్పఁబడినది.

క. (శ్రీ) మార్కండేయముని
స్వామికి నిలయం బనంగ జగతీదివిష
ద్ధామము రాజమహేంద్రిని
నామంబున నొప్పుఁ బురము రమ్యస్ఫూర్తిన్.

సీ. (శ్రీ) గౌతమీదివ్యసింధుపావనలోయ
కణవిమగ్నతపౌరకల్మషంబు

ప్రకటమార్కండేయ పరమేశకారుణ్య
సంభూతశాశ్వతైశ్వర్యయుతము
దానధారాసారదంతావళోదార
ఘీంకారవైఖరీసంకులంబు
జనవిక్రమక్రియాజనితపౌరుషఘన
ఘనతురంగమవీరకలకలంబు
రత్నధనధాన్యవస్త్రహిరణ్యరజిత
సారఘనసార మృగనాభిచందనాది
రమ్యతరపణ్యవీథికారాజితంబు
సాంద్రవిభవంబు రాజమహేంద్రపురము.

వ. ఆపట్టణంబున కధీశ్వరుండు.

ఉ. ధూర్జటిపాదభక్తుఁ డరిదుర్గవిభేదనశౌర్యశాలి న్యా
యార్జితవైభవుండు విబుధావనకల్పకుఁ డార్యసమ్మతుం
డర్జునవంశవర్ధనుఁ డహర్పతితేజుఁడు విష్ణువర్ధనుం
డూర్జితసర్వసంపదల నొప్పును రాజమహేంద్రనాథుఁడై.

క. రాజకళాధరభక్తుఁడు
రాజకులోత్తంసుఁ డన్యరాజయశస్తే
జోజయశాలి గఁబరగును
రాజితచాళుక్యవంశరక్షకుఁ డెలమిన్.

రాజమహేంద్రవరమును చాళుక్యరాజులు పరిపాలించినమాట సత్యమే. ఆచాళుక్యులలో విష్ణువర్ధననామధారులు పెక్కురున్నారు. మొదటి విష్ణువర్ధనునికాలము క్రీ.శ. 500 ప్రాంతము. అంతకుఁ బూర్వము చాళుక్యరాజులతో నాంధ్రదేశమునకు సంబంధము లేదు. క్రీస్తుశకము, కలియుగము 3100 సంవత్సరములు గతించినపిమ్మటఁ బ్రారంభమైనది. అనఁగాఁ గలియుగమున 3600 సంవత్సరములు గడచినపిమ్మటఁ గాని చాళుక్యసంబంధ మీప్రాంతమునకు లేదు. పైనివ్రాసిన రెండవశ్లోకములోనికాలమునకును దీనికిని దాదాపుగా వేయిసంవత్సర

ములు భేదమున్నది. కావున వైశ్యపురాణమందలి శాసనకాలము సరియై నదని చారిత్రాత్మకదృష్టితో భావింపఁజాలము.

చాళుక్యరాజులలో రాజమహేంద్రవరమును రాజధానిగా నేర్ప అచుకొని వేగిదేశమును పరిపాలనము చేసినవాఁడు అమ్మరాజవిష్ణువర్ధనుఁడు. ఇతఁడు విష్ణువర్ధననామధారులలో నాలవవాఁడగుటచే నీతని నాలవవిష్ణువర్ధనుఁ డందురు. ఇతనికి రాజమహేంద్రుఁ డనుబిరుదము కలదు. వేగిదేశమునకు రాజమహేంద్రవరమును రాజధానినిగాఁ జేసి పరిపాలించినవారిలో మొదటివాఁడగుటచే నీతనికాబిరుదము వచ్చెనని యందురు. ఇతనిరాజ్యకాలముక్రీ.శ.౮౧౮-౮౨౫. (ఏడుసంవత్సరములు) వైశ్యపురాణమునుండి పైనినుదాహరించిన పద్యములలోని రాజమహేంద్ర, విష్ణువర్ధన నామములనుబట్టి యీతనికాలముననే యీకథ జరిగినదనియు పైరెండవశ్లోకములోనిచ్చిన కాలమును త్యజింపవలసి యుండుననియుఁ గొందఱనవచ్చును. కాని యది సత్యమని నిర్ణయించుటకుఁ దగిన యాధారములు నాకింకను లభింపలేదు. ఈకాలమునకుఁ దరువాత రాజమహేంద్రవరము రాజధానిగాఁ బరిపాలించిన విష్ణువర్ధను లొకరిద్దరున్నారు.

ఈకథ చారిత్రమున శ్రీవీరేశలింగము పంతులుగారు "రాజరాజనరేంద్రుని తండ్రియైన విష్ణువర్ధనమహారాజు గోదావరి మండలములోని పెనుగొండలోనుండిన కుసుమసెట్టి యనుకోమటియొక్క కొమార్తెను కామించి యామెను తనకిమ్మని యడుగఁగా తండ్రి యియ్యకున్నట్టును అందుమీఁద విష్ణువర్ధనుఁడాకన్యను బలాత్కారముచేత గ్రహించుటకుఁ బ్రయత్నింపఁగా కుసుమసెట్టియును కూఁతురును నూటరెండు గోత్రముల యితరవైశ్యులును నగ్నిహోత్రములోఁబడి మృతులైనట్టును...కన్యకాశాపముచేత విష్ణువర్ధనుఁడు శిరస్సువ్రక్కలయిచావఁగా నాతని పుత్రుఁడయిన రాజనరేంద్రుఁడు వైశ్యులను శాంతపఱిచి కుసుమశెట్టి కొడుకయిన విరూపాక్షుని పదునెనిమిది పట్టణముల కధికారిని జేసి మిగిలిన కోమట్లను పెనుగొండలో నుండునట్లు చేసినట్టును ఇందుఁ

జెప్పబడినది. ఇప్పటికిని పెనుగొండ కోమట్లకు ముఖ్యస్థలము. అక్కడ కన్యకాపరమేశ్వరిపేర దేవాలయము కట్టఁబడి వైశ్యులచే మిక్కిలి గౌరవముతో చూడఁబడుచున్నది.

గ్రంథకర్తయైన భాస్కరపంతులను బ్రాహ్మణుఁడు పెనుగొండ కొండవీడు రాజమహేంద్రవరము మొదలయిన ప్రదేశములయందుండిన కోమట్లకు గురువయియుండి కన్యకాపురాణమును రచించి, వైశ్యుల విషయమయి కొన్నికట్టుబాట్లను జేసినూట రెండుగోత్రములవారి నాకట్టు బాట్లకు లోఁబఱచి, తనకట్టుబాటులను మీఱినవారిని వర్ణభ్రష్టులనుగా బహిష్కరించి, తనకు వశ్యులయిన వారికిఁ దానాచార్యుఁడును బురోహితుఁడునయ్యెను. గ్రంథసామగ్రి తక్కువగుటచేత నీతనికాలమిది యని నాకిపుడు నిశ్చయముగాఁ దెలియకపోయినను, ఇతఁడు పదునాఱవ శతాబ్దమునకుఁ బూర్వుఁడని తెలియవచ్చుచున్నది." అని వ్రాసియున్నారు.

వైశ్యులగ్నికాహుతియైనప్పుడున్న భాస్కరాచార్యులును గ్రంథకర్తయైన భాస్కరపంతులును భిన్నులగుదురా? కారా? యనువిషయమును శ్రీపంతులుగారు స్పష్టముగాఁ జెప్పకపోయినను గ్రంథకర్తను పదునాఱవ శతాబ్దమునకుఁ బూర్వుఁడని చెప్పుటచే వారిరువురును భిన్నులనియే శ్రీపంతులుగారు తలంచిరనుట స్పష్టము. రాజరాజు తండ్రి కాలము పదియవ శతాబ్ది. ఆకాలమున నాంధ్రమునఁ గావ్యరచనములేదు. గ్రంథకర్తయైన భాస్కరపంతులు వైశ్యులకు గురువై పురోహితుఁడై కార్యోపదేష్టయై వారిని ఋజుమార్గమునఁ బూర్వాచార సమ్మతముగ నడిపించి యుండవచ్చును.

రాజరాజనరేంద్రుని తండ్రి విమలాదిత్యుఁడుగాని విష్ణువర్ధనుఁడు కాఁడు. రాజరాజనరేంద్రుని విష్ణువర్ధనుఁడని భారతకృత్యాదియందు నన్నయభట్టు క్రిందిపద్యములో వాడియున్నాఁడు.

ఆ. జారుతర మహాగ్రహారంబు లిచ్చుచు
దేవభోగముల మహావిభూతిఁ

ఁదనరఁజేయు చిట్లు మనుమార్గుఁడగు విష్ణు
వర్ధనుండు వంశవర్ధనుండు.

కాని, విమలాదిత్యునకు విష్ణువర్ధనుఁడను నామాంతరమున్నట్లు కన్పట్టదు.

ఇప్పటికి లభించిన యాధారములనుబట్టి వైశ్యపురాణమునందలి కథను జారిత్రకాంశములలో సమన్వయము చేయుటకు సాధ్యము కాలేదు. ఈవిషయమున నింకను బరిశోధనము చేయవలసియున్నది. శ్రీపంతులుగారే ప్రతిచూచి పైవాక్యములు వ్రాసిరో కాని రాజరాజు నామముగాని యాతఁడు తండ్రియనంతరమున వైశ్యులను శాంతపరచె ననుటకాని, ముద్రిత ప్రతియందు నేఁజూచినంతవఱకుఁ గానరాలేదు.

కర్నూలు మండలమునందలి దిగువతిరుపతిలో అహోబలేశ్వరుని యాలయపు గోడపైనున్న యొకశాసనము (A. R. 67 of 1915) లో వాసవీ కన్యకనుగూర్చియు, భాస్కరాచార్యుని గూర్చియుఁ గొన్ని వివరములు లిఖింపఁబడియున్నవఁట! ఆశాసనము క్రీ. శ. 1609 వ సంవత్సరము జూను నెల 16వ తేదీనాఁటిది. పాలకొల్లునందు విష్ణువర్ధన మహారాజు శాసనమొండు కలదు. అది శా. శ. ౧౫౧౮ దుర్ముఖి సంవత్సరమునాఁటిది. (A R. 526–1893.) విష్ణువర్ధన మహారాజు నామముదాహృతములైన శాసనములు పెక్కులున్నవి. వాసవీకన్యను మోహించినవాఁడీతఁడని నిర్ణయించుటకుఁ దగిన యాధారములు లభింపలేదు. భావిపరిశోధనమువలన నేమేని విశేషాంశములు బయలు పడునేమో చూడవలసియున్నది.

భాస్కరాచార్యుని కవిత్వము సరసమై మనోహరముగానున్నది. వైశ్యులగ్నిగుండములలోఁబడిన కథపట్టున వ్రాసినపద్యములు వీరభయానక రసములను జూపుచున్నవి. శైలిచూపుటకై కొన్ని మచ్చుపద్యముల నీక్రిందనిచ్చెదను.

చ. పరహితధర్మవర్తనులు పండితభాస్కరవర్గ రక్షకుల్
గురునయనీతికోవిదులు గుంభితవాక్యనిరంతరోన్నత

స్థిరతర కౌతుకాగ్ర గుణశీలురు శీలవతీ సతీమనో
హరులు పురారిపాద జలజాగ్రమదాళులు వైశ్యులిమ్మహిన్.

ఉ. శ్రావ్యముగా వినుండు నృపరాజ శిఖామణి యైనయట్టి కా
రవ్యుఁడు విష్ణువర్ధనుఁడు రాజకళాధరు భక్తుఁడట్ల శ్రో
తవ్యుఁడు నయ్యె నచ్చటఁ జిదంబర పూర్వరహస్యమెల్ల సూ
రవ్యవరేణ్యులార! రిపురాజవిఘాలు బలంబు లన్నియున్.

ఉ. రాజకులైక భూషణుఁడు రమ్యచరిత్రుఁడు విష్ణువర్ధనుం
డీజగమెల్ల గెల్చి ధరణీపతులిచ్చిన రాజకన్యలం
దేజముతోడఁ గైకొనుట ధీరగుణంబటుగాక యున్న దు
ర్వ్యాజము వైశ్యకన్యక వివాహమనర్హము శాస్త్రవేదికిన్.

ఉ. ఎప్పుడు గన్యయున్నతులు నీవణి గన్యయ సత్యసంధులున్
విప్పగు నగ్నిజాలముఁ బ్రవేశముసేయుట విన్నమాత్రనే
తప్పక రాజుమస్తకము ధాత్రితలంబునఁ బెక్కువ్రయ్యలై
చెప్పవిచిత్రమై పడుట సిద్ధమటంచు శపించె నుగ్రతన్. ౧ ఆ.

చ. స్ఫుటకఠినోగ్రవార్త చెవిసోకిన యంతన ఘోరభంగిగాఁ
బటపటఁ బాసి మస్తకము భంజితమై కడుఁబెక్కువ్రయ్యలై
పటుగతి నుగ్గులై పడఁగఁ బల్మెయిఁ గన్యకశాపఘాతిచేఁ
గుటిలుఁడు విష్ణువర్ధనుఁడు గూలె ధరిత్రి విచిత్రరూపతన్.

176 పద్మకవి.

ఆంధ్రసాహిత్య పరిషత్తునందున్న యుదాహరణ గ్రంథములో పద్మకవి జినేంద్రపురాణములోనిదని యీక్రిందిపద్య మొక్కటియు నుదాహృతమైయున్నది. ఈపద్మకవినిగూర్చి యేమియుఁ దెలియరాలేదు. ఈజినేంద్రపురాణమున జైనులకథలు చెప్పఁబడియున్నవను కొందును. ఈగ్రంథమిప్పుడెచ్చటను లభించుటలేదు.

సీ. హరినిలయంబును హరినిలయంబును
విషధరాధ్యంబును విషధరాధ్య,
మప్సరోమయము నప్సరోమయము
వనవిలాసమును బావనవిలాస
మున్నత కరిశృంగ మున్నతకరిశృంగ
మిందుకాంతస్రవ మిందుకాంత
మురుకలనకులంబు మురుకలనకులంబు
నంశుకాంతద్యోతితాంశుకాంత

గీ. మొనర నవశతసాహస్రయోజనోన్న
తమును బదివేలు యోజనాల మరువలము
గలిగి కనకాద్రికి న్నూటఁగలిగి తనరి
ప్రథితమై యొప్పు మందరపర్వతంబు.

ఈకవి క్రీ. శ. ౧౫౬౦ కంటెఁ బూర్వుఁడు. ఇంకనేమియు నీతనినిగూర్చి తెలియదు.

177 మొల్ల

ఈకవయిత్రి రామాయణము నాలుకాండములను బద్యకావ్యముగా రచయించి, శ్రీరామచంద్రున కంకితము చేసినది. యుద్ధకాండమును మూఁడుభాగములుగాఁ జేసివాని కాశ్వాసములని పేరుపెట్టినది. ఈరామాయణము నీమెపేరులోఁగూడఁ జేర్చి "మొల్లరామాయణము" అని వాడుచున్నారు. ఈమె యేకులమునకుఁ జెందినదియు గ్రంథమువలనఁ దెలియదు. కాని చిరకాలమునుండి యీమె కుమ్మరకులజురాలని ప్రతీతియున్నది. అందుచే నీమెను కుమ్మరమొల్లయని యనుచుందురు. ఈమెభర్త పేరెవ్వరో భర్తయింటిపేరేదియో గ్రంథమునఁ జెప్పలేదు. ఈదేశమునందు స్త్రీలు వివాహము చేసికొనకుండ కన్యకగానుండు నాచారములేదు. కావున నీమె కన్యకాదనియుఁ జిన్నతనముననే భర్త పోవుటచే మరల బరిణయమాడక భగవద్భక్తియందుఁ గాలమును వినియోగించుచుఁ బాండిత్యమును సంపాదించి గ్రంథరచనముచేసెననియుఁ దలంపవలసియున్నది. ఈమె కులటయై వ్యభిచారవృత్తిచేఁ గాలముగడపెనని కొందఱనుచున్నారు. శ్రీకృష్ణదేవరాయని యంతఃపురముననే యాతని యుంపుడుకత్తెగా నుండెనని కూడ వదంతికలదు. కాని యివియన్నియుఁ గల్పనలు. గ్రంథమున కచకుచాద్యవయవవర్ణన ముండుటయు నీమెకు మొల్లయని సామాన్యముగాఁ గులటలకుండు నామముండుటయు నీమెను గులటయని తలంచుటకుఁ గారణములని యనెదరు. కాని యవి ప్రత్యుత్తరమీయఁదగినంత యవసరమున్ననిమిత్తములుకావు. కావున నావిషయమునింతలో వదలివైచితిని.

ఈకవయిత్రి నామము మల్లికాని మొల్లకాదనియు, ఈమెనివాసగ్రామమందలి యీశ్వరుఁడు మల్లేశ్వరుఁ డనియు, నాదేవునిపేర మల్లమ్మయని తలిదండ్రులీమెకు నామకరణము చేసియుందురనియు, నుత్తర హిందూస్థానమున నీమెకు మల్లియను పేరే వాడుకలోనున్నదనియు కనుపర్తి వరలక్ష్మమ్మగారు భారతిపత్రికలో వ్రాసియున్నారు అది సత్యమేకావచ్చును. కాని తాళపత్రప్రతులలోను ముద్రిత గ్రంథ

ములలోను నీమెపేరు మొల్లయనియే కన్పట్టుచున్నది. చిరకాలానుగ తమైన నామమగుటచే నీచరిత్రమున నేనును మొల్లయనియే వ్రాసి యుంటిని.

ఈమెనివాసము వడుగుపాడనియు, నీమెయుఁ దిక్కనసోమ యాజి భారతమును తెలిగించినప్పుడు లేఖకుఁడుగా నుండిన కుమ్మర గురునాథుఁడును సోమయాజుల తండ్రియైన కొమ్మనకు రంగప్పయను కుంభకారుని పుత్రికవలన జన్మించిరనియు కొందఱు వ్రాసిరి. కాని తిక్కన సోమయాజికిఁ దరువాత నూఱు సంవత్సరములలోనున్న శ్రీనాథుని, బూర్వకవులలోఁ జేర్చి మొల్ల తన రామాయణమున స్తుతించియుండుటచే నావ్రాఁత నిరాధారమైనదని శ్రీ వీరేశలింగము పంతులు గారాంధ్రకవుల చరిత్రములో వ్రాసియుండిరి. కవులవిషయమునఁ బండితులపట్ల, రాజులనుగూర్చి యిట్టియద్భుతకథలు పుట్టుచుండుట క్రొత్తకాదు.

ఈమె తనతండ్రి శైవాచార సంపన్నుఁడును గురులింగ జంగమార్చనపరుఁడునైన యాతుకూరి కేసనశెట్టియని యీక్రింది గద్యపద్యములలోఁ జెప్పినది.

క. గురులింగ జంగమార్చన
వరుఁడును శివభక్తిరతుఁడు బాంధవహితుఁడున్
ధరనాతుకూరి కేసయ
వరపుత్రిని మొల్లనాఁగ వర్ధిలుదానన్.

గద్య: ఇది శ్రీమద్గౌరీశ్వర వరప్రసాద కవిత్వచమత్కార నారీ గుణోత్తమ విచక్షణ నిత్యశైవాచార సంపన్న గురులింగ జంగమార్చన వినోద సూరిజన వినుతాతుకూరి కేసనశెట్టి తనయ మొల్లవిరచితంబైన రామాయణకావ్యంబు."

ఈమెకవిత నల్లుటలోఁ దనకు నైపుణ్యము మిక్కిలి లేదనియు, భగవదనుగ్రహముచే నీగ్రంథమును రచించితిననియు, దప్పులెన్నవలదనియుఁ నీక్రింది పద్యములలోఁ బండితులను బ్రార్థించినది.

సీ. దేశీయపదములు దెనుఁగులు సాంస్కృతుల్
సంధులు ప్రాఙ్ఞులశబ్దవితతి
శయ్యలు రీతులుఁ జాటుప్రబంధంబు
లాయాసమాసంబు లర్థములును
భావార్థములుఁ గావ్యపరిపాకములు రస
భావచమత్కృతుల్ పలుకుసరవి
బహువర్ణములును విభక్తులు ధాతుల
లంకృతిచ్ఛందో విలక్షణములుఁ
తే. గావ్యసంపద క్రియలు నిఘంటువులును
గ్రమములేవియు నెఱుఁగ విఖ్యాతగోప
వరపు శ్రీకంఠ మల్లేసు వరముచేత
నెఱిఁ గవిత్వంబుఁ జెప్పఁగా నేర్చికొంటి.
క. చెప్పుమని రామచంద్రుఁడు
సెప్పించిన పలుకు మీఁదఁ జెప్పెద నేనె
ల్లప్పుడు నిహపరసాధన
మిప్పుణ్యచరిత్ర తప్పులెంచకుఁడు కవుల్.

ఆంధ్రదేశమున గోపవరములు చాలఁగలవు. ఈమెనివాసము నెల్లూరి మండలములోని గోపవరమని కవి చరిత్రకారులు వ్రాసి యున్నారు.

ఈకవయిత్రి యాంధ్ర కవిత్వమెట్లుండవలయునో యీక్రింది మూఁడు పద్యములలోఁ జెప్పి యందుకనుగుణముగఁ దనగ్రంథమును రచియించినది.

క. మునుసంస్కృతంబు తేటగఁ
దెనిఁగించెడిచోట నేమి తెలియకయుండక్
దనవిద్య మెఱయఁ గ్రమ్మఱ
ఘనమగు సంస్కృతముఁ జెప్పఁగా రుచియగునే.
ఆ. తేనె సోక నోరు తియ్యనయగురీతిఁ
దోన యర్థమెల్లఁ దోఁపకున్న

గూఢశబ్దవితతి కొల్లాట పసియెల్ల
మూఁగ చెవుడు నాడు ముచ్చటగును.

క. కందువమాటలు సామెత
లందముగాఁ గూర్చి చెప్ప నది తెనుఁగునకుఁ
బొందౌ రుచియై వీనుల
విందై మఱి కానిపించు విబుధుల కెల్లన్.

రామాయణము ననేకులు రచియించియుండఁగాఁ దాను మరల రచించు టేల యని యెవ్వారైన నందురేమోయని శంకించుకొని యాప్రశ్నకీ క్రిందిపద్యములలో నీమె ప్రత్యుత్తరమొసంగినది.

ఉ. రాజితకీర్తి మున్నె రఘురాము చరిత్రము సత్కవీశ్వరుల్
తేజమెలర్పఁ జెప్పుటది తెల్సియుఁ గ్రమ్మఱఁ జెప్ప నేలనన్
భూజన కల్పకంబనుచు భుక్తికి ముక్తికి మూలమంచు నా
రాజును నెవ్వారైన రఘురాము నుతించినఁ దప్పుగల్గునే?

క. నేరిచి పొగడినవారిని
నేరక కొనియాడువారి నిజకృప మనుపన్
గారణమగుటకు భక్తియె
కారణమగుఁగాక చదువు కారణమగునే

తన గ్రంథమును నరకృతి సేయక శ్రీరామునకర్పించుటకుఁ గల కారణము నీక్రింది పద్యములో సూచించినది.

ఉ. సల్లలిత ప్రతాపగుణ సాగరుఁడై విలసిల్లి ధాత్రిపై
బల్లిదుఁడైన రామనరపాలకు సన్నుతి సేయు జిహ్వకున్
జిల్లర రాజలోకములఁ జేకొని యాడఁగ నిచ్చపుట్టునే
యల్లము బెల్లమందినుచు నప్పటి కప్పటి కాససేతురే?...

ఈకవయిత్రి కావ్యరచనాకాలమును గ్రంథమునఁ జెప్పలేదు. సంస్కృతాంధ్ర కవులను నుతించు నీక్రింది పద్యములో శ్రీనాథునిఁ బేర్కొనినది.

సీ. సురసన్నుతజ్ఞాను సువివేకి వాల్మీకి
నఖిల వేదాగమాభ్యాసు వ్యాసు

ఘోరాంధకార ప్రభారవి భారవి
సత్కాంతి హిమకరశ్లాఘు మాఘు
వివిధకళాన్వీత విఖ్యాతి భవభూతిఁ
బ్రకట కార్యధురీణు భట్టబాణు
మానినీ లోకసమ్మదముద్రు శివభద్రుఁ
గవితారసోల్లాసుఁ గాళిదాసు
తే. స్తుతగుణోద్దాము నాచనసోము భీము
నవ్యమంజుల వాగ్ధుర్యు నన్నపార్యు
రసికుఁడైనట్టి శ్రీనాథు రంగనాథుఁ
దిక్కకవిరాజును నుతించి ధీనిమించి.

పదునైదవ శతాబ్దినున్న శ్రీనాథును బూర్వకవిగానుతించుటచే తను, పదునాఱవ శతాబ్దియందున్న కవుల నెవ్వరిఁ బేరుపెట్టి దలపెట్టక

క. తొల్లిఁటి యిప్పటి సత్కవి
వల్లభులను రసికవినుత వాగ్విభవకళా
మల్లులఁ గవితారచనల
బల్లిదులైనట్టి ఘనుల భక్తిఁ దలంతున్.

అని చెప్పియుండుటచేతను నీమె పదునాఱవ శతాబ్దియందుఁ బూర్వార్థమున నున్నట్లూహింపవచ్చును. పోతన ననుకరించి "చెప్పు మని రామచంద్రుఁడు" అను పద్యమును జెప్పియుండుటచే నీమె పోతన కంటె నర్వాచీనురాలు.

అక్కడక్కడఁ గొన్ని వ్యాకరణదోషములున్నను మొత్తము మీఁద నీమె కవిత్వము మిక్కిలి మృదువయి మధురమయి రసవంత ముగా నున్నదనియు, నిది పురుషులు చెప్పిన గ్రంథములలో ననేకములు కంటె మనోజ్ఞమై ప్రౌఢమై యున్నదనియు కవుల చరిత్రకారులు వ్రాసియున్నారు. విశ్వవిద్యాలయ పరీక్షకేగు విద్యార్థుల కీపొత్తమును గొన్నిమాఱులు పాఠ్య గ్రంథముగా నిర్ణయించియున్నారు.

ఈమె కవిత్వశైలి తెలియుటకై కొన్నిపద్యముల నిట నుదాహ రించుచున్నాఁడను.

ఉ. రాజులు కాంతియందు రతిరాజులు రూపమునందు వాహినీ
రాజులు దానమందు మృగరాజులు విక్రమకేళియందు గో
రాజులు భోగమందు దినరాజులు సంతతతేజమందు రా
రాజులు మానమందు నగరమ్మున రాజకుమారులందఱున్. బా. కా.

ఉ. నారదులైరి సన్మునులు నాకమహీజములయ్యె భూజముల్
శారదలైరి భామినులు శంకరశైలములయ్యె గోత్రముల్
పారదమయ్యె నీరధులు పన్నగనాయకులయ్యె నాగముల్
వారిదవర్గమెల్ల సితవర్ణములయ్యెను బండువెన్నెలన్. అ. కా.

చ. సుడిగొని రామపాదములు సోకినధూళి వహించి ఱాయి యే
ర్పడ నొక కాంతయయ్యెనఁట పన్నుగ నీతని పాదరేణు వి
య్యెడవడి నోడ సోఁక నిది యేమగునో యని సంశయాత్ముఁడై
కడిగె గుహుండు రామపదకంజయుగంబు భయమ్ము పెంపునన్.

మ. వినుమో రాఘవ! పంక్తికంధరుఁడు దోర్వీర్యంబు సంధిల్లఁగా
జనకక్ష్మాపతినందనన్ గొనుచు స్వేచ్ఛావృత్తితో నేఁగుచో
వనితారత్నము దీనయై పలుకు తద్వాక్యంబు లేర్పాటుగా [ఆ. కా.
విని పోరాడఁగఁ బ్రాప్తమయ్యె మఱి యీ వేషంబు భూమీశ్వరా.

ఉ. కూరలు నోటికిన్ రుచులు గూడుట దప్పెను దుంపతూడులుం
గారము లోఁచె జిహ్వకును గమ్మని తేనెలు చేఁదులయ్యెఁ గం
గారమొఁ జిత్తమంతయును గంటికి నిద్ర వహింపదయ్యె శృం
గారమెలర్ప సీతఁ బొడగానమి రామనృపాల మౌళికిన్. కి. కా.

ఉ. ఎవ్వఁడవోరి నీకుఁ బ్రభుఁ డెవ్వఁడు చెప్పుము నీవిటొంటివై
నివ్వనరాశి దాఁటి యిట కేగతి వచ్చితి నావ మేమి నీ
వెవ్వని ప్రాపునం బెఱికి తీవన మంతయు శంకలేక యిం
కెవ్వని ప్రాపునం దునిమి తీసురవైరుల నెల్ల నుగ్రతన్. సుం. కా.

మ. పరుషోద్యత్కులిశాకృతిన్ బొమలు చూపట్టంగ శోణప్రభో
త్కరరేఖల్ గనుఁగొల్కులన్ నిగుడఁ గోదండంబు చేఁదాల్చి భూ
వర వంశాగ్రణి రాముఁ డద్భుతముగా వారాశిమీఁదన్ వడిన్
శరజాలంబులు పేర్చి వేయుటయు నిచ్చన్ బ్రాణభీతిన్ వడిన్.

చ. నరవర! నాదుచిత్తము మనంబున నీవె యెఱింగియుండియున్
బరుషములాడ నేమిటికిఁ బాపము నాయెడ లేదు కాదు పో
సురలు నుతింప మేటిసాదఁ జొచ్చెద మెచ్చుఁడటన్న రామభూ
వరుని మనం బొడంబడిన వారిజలోచన సీత యాతలిన్. య.కా.

---

178 రాపరది దేచిరాజు

ఈకవి నామమాత్రమే తెలిసినది. కాని యీతఁడు రచించిన గ్రంథముపేరైనను దెలియలేదు. ఆంధ్రసాహిత్య పరిషత్తునందున్న యుదాహరణ గ్రంథసంధాత గ్రంథముపేరు చెప్పకుండ నీతనిదొక్క పద్యముదాహరించినాఁడు. ఈపద్యమునుబట్టి గ్రంథనామమూహింపనను వైనది కాదు. ఆపద్యము నీక్రింద వ్రాయుచున్నాఁడను.

మ. ఘనవప్రోపరిచాగకేతుకషణాగ్గంజారి బింబంబు కం
దినదంచున్ బురిముగ్ధభామినులు ప్రీతిన్ గందువోఁ దోమఁ జం
దన మద్దింగొని లీల నీలరుచిమత్కాంతోరు హర్మ్యంబు గె
క్కిన నంభోదతటిల్లతావితతిమాడ్కిం బొల్తు రుద్యద్గతిన్.

ఈకవి క్రీ. శ. 1560 కంటెఁ బూర్వుఁడు ఇతనినిగూర్చి యింక నేమియుఁ దెలియదు.

---

179 పోశెట్టి లింగకవి

నవచోళ చరిత్రము, మలహణ చరిత్రము, శంకరదాసమయ్యా చరిత్రము, వీరసంగయ్యాదేవచరితము, శిష్యప్రబోధము అను ద్విపదకావ్యము లీతనిరచనములు. నవచోళచరిత్రము శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిల వారిపీఠికతో ముద్రితమయినది. తక్కిన గ్రంథములు గన్పట్టుటలేదు.

నవచోళ చరిత్రమునఁ గవితననుగూర్చి యిట్లుచెప్పుకొనినాఁడు.

విమలశివాచార విభవసంప్రీతి
విమలమా నవచోడ విభవంబులెల్ల
నిర్ణయంబుగఁజేసి నిపుణత మెఱసి
వర్ణించునట్టి నావంశమెట్లనిన,
క్షితిని "మాతా - హిమగిరిసుతా" యనఁగ
నతిశయరీతి "పితా - రుద్ర" యనఁగ
బాంధవుల్ శైవులు భక్తులౌననఁగ
శంకరదాసయ్య - శరణవంశజుఁడ
శంకరదాసయ్య - శరణగోత్రజుఁడ
మూలమా శ్రీగురు పూజించుశ్రీల
లీలఘను పోశెట్టి లింగమునాఁగఁ
బరఁగినవాఁడ సద్భక్తుల కరుణ
స్థిరభక్తి మహిమలఁ జెలగినవాఁడ.

వీరశైవులు తమకులగోత్రములఁ జెప్పుకొనరు. ఈకవియునట్లే శంకరదాసయ్య వంశమనియు, నదియే గోత్రమనియుఁ జెప్పి యూరకుండెను. శంకరదాసయ్య గొప్పశివభక్తుఁడు. అందుచే నతనిగోత్రజుఁడననియు, నతనివంశజుఁడననియుఁ జెప్పుకొనినాఁడు. ఆదాసయయాకవికి దీక్షాగురువేమో!

ఈక్రింది ద్విపదలవలన నీతఁడు రచించిన గ్రంథనామములును చకిలాల లింగప్ప యనునతఁ డీనవచోళ చరిత్రమును రచియింపుమని కవిని బ్రోత్సహించినట్లును దెలియవచ్చుచున్నది.

భక్తులసద్గోష్ఠిఁ బాయనివాఁడు
భక్తి మనస్సున ఫలియించువాఁడు
ధర్మార్థపరుఁడు నిర్ధంబగుభక్తి
నిర్మలచిత్తుండు నీతివర్తనుఁడు
పరమాత్ముఁ డుద్దామబగిరాముపల్లి
గురుపదధ్యానుండు గురుపూజితుండు
సంగీత భక్తిభాషణుఁడు చకిలాల
లింగప్ప సద్భావలీలల నొప్ప
నన్ను రావించి మన్నన గారవించి
మున్నుగా భూతితాంబూలంబు లొసఁగి
వెరవొప్ప నీవుల వేడ్కతో నొసఁగి
హర్షంబు తోడుత నప్పుడిట్లనియె.
"ఇరవొందఁ మునుముక్తి నీశు రామేశు
వరలాభమున భక్తవరులగుననఁగ
కరమర్థి వెలయు శంకరదాసమయ్య
చరితంబు నవ్వీరసంగయ్యదేవు
చరితంబు మల్హణచరితంబు వఱియు
హర్షంబుఁ దనర శిష్యప్రబోధనము
నచలితరీతిఁ బరమాను రాగమున
రచియించితివి భక్తిరచన నింపొందఁ
గావున నట్టి సంస్కారివి గాన
భావజ్ఞు లగు భక్తిపరులు గారణులు
రసికులు నవచోడరాజులు మున్న
నసలారఁ బూజించి యాథ్యత నుంచి
వలనొప్ప మోక్షంబు వడసిన మహిమ

నలగన్నడముఁ జేసి రాద్యులు మున్ను
వెలయఁగా నీవును విజ్ఞానమునను
దెలుఁగున నద్దాని ద్విపదఁ గావించి
స్థిరగురుమూర్తి దేశికచక్రవర్తిఁ
బరమాత్మ శ్రీరామపల్లి నివాసి
దృఢయశస్కరుఁడు మృత్యుంజయేశ్వరుఁడు
నవిరళభక్తి సామ్రాజ్య పూజ్యుండు
సద్గుణగణనిధి సత్యసంధుండు
మద్గురునాథుండు మన్మనోహరుఁడు
అనురక్తి నట్టిమహాత్మునిపేరఁ
దనరారఁగా సంకితము సేయవలయుఁ"

కవి యీగ్రంథమును బగిరామ పల్లెయందలి మృత్యుంజయేశ్వర స్వామికిఁ గృతియిచ్చెనని శ్రీ ఆదినారాయణశాస్త్రిలవారు పీఠికలో వ్రాసియున్నారు. పైని వ్రాసిన ద్విపదలనుబట్టి కృతిపతి దేవుఁడు కాఁడనియు, బగిరాముపల్లె నివాసియగు మృత్యుంజయ నామముగల మానవుఁడనియు కృతిప్రేరకుఁడైన చకిలాల లింగప్పకును మరికొందఱు శివభక్తులకును గురువనియు నేనూహించుచున్నాఁడను. ఈబగిరామ పల్లెను శ్రీరామపల్లెయనియు రామపల్లె యనియు నీగ్రంథముననే కవి వాడియున్నాఁడు. ఈగ్రామమెచ్చటనున్నదో తెలియలేదు. బళ్లారి మండలముననో, మైసూరు రాష్ట్రముననో ఉండియుండును. నవచోళ చరిత్రము మొదటఁ గన్నడభాషలో నుండెనఁట! దాని నీతఁడాంధ్రీకరించెనఁట! కవి రెండుభాషలయందును బండితుఁడై యుండవలయును గ్రంథమునందలి మఱికొన్ని ద్విపదలను జదివినను మృత్యుంజయుఁడు మానవుఁడే కాని దేవుఁడు కాఁడని తోఁచినది. ఆశ్వాసాద్యంతముల యందుఁ జకిలాల లింగప్పయే సంబోధింపఁబడియెను.

గాల్లపాటి లక్ష్మణుఁ డీపోశెట్టి లింగకవికి గురువనియు, నాతఁడు వీరభద్రేశ్వర విజయమును రచియించెననియు నీకవి నవచోళ

చరిత్ర కృత్యాది ద్విపదలలోఁ జెప్పియున్నాఁడు. వాని నాలుక్కుఁ కవి చారిత్రమునం దుదాహరించెదను.

శ్రీ ఆదినారాయణ శాస్త్రిలవారు పీఠికలో నీక్రిందివాక్యములను వ్రాసి యీకవి కుమ్మర కులజుఁడని నిర్ణయించినారు.

"సాధారణముగా తక్కిన కవులందఱును పేర్కొన్నట్లుగా గాక ప్రతిచోటునను శరణవంశజుఁడ శరణగోత్రజుఁడ అని యిట్లు ప్రపత్తి సూచకముగా ప్రయోగించిన పదములు ఈయనయొక్క వీరశైవోత్తమత్వమును వెల్లడిసేయుచున్నవి. లింగకవి, కులగోత్రముల కతీతమగు వీరశైవ కుటుంబమువాఁడైనను ఇంటిపేరగు పోశెట్టి యనుపదము 'ఇతఁడు ఆంధ్రదేశమునందలి కుమ్మరుల వంశమునకు జెందినవాఁడని' సూచించుచున్నది. శెట్టిపదమిప్పటికిని కుమ్మరులలో అనూచానముగ వాడబడుచు వచ్చుచున్నది. పైగా పోశెట్టివారు కుమ్మరులలో తప్ప మాయెఱిఁగినంతదనుక నితరవర్ణములలో లేరు. ఇందుకు ఈయన గ్రంథమునందే వారియొక్క చిన్నయాధారమును గలదు. గ్రంథారంభమున భక్తగణస్తుతిని జేయుచు పురాతనులును ఆదియుగములకు జెందినవారు నగు నందీశ్వరుని భృంగీశ్వరుని పేర్కొన్నతరువాత- వీరశైవులలో మిక్కిలి ప్రసిద్ధిని గడించినవారు - అన్నివిధముల రెండవ ఈశ్వరమూర్తులని పేర్కొనఁదగినవారు - అగు బసవేశ్వరుఁడు, పండితారాధ్యుఁడు మున్నగువార లెందఱోయున్నను తొలుదొల్త భక్తగణస్తుతిని కుమ్మర గుండయ్యతో ఆరంభించుచున్నాఁడు చూడుఁడు.

శ్రీనందినాథుని శ్రీభృంగినాథు
మానకంజారు కుమ్మరగుండవిభుని
శంకరదాసయ్య శమనారిమరుళు - ఇత్యాది.

ఎంతవారికిని స్వకులప్రశంస అవశ్యకార్యముకదా! కాగా పైనివివరించినదానివలన లింగకవి కుమ్మరకులమునందు జనించినవాఁడనియును శంకరదాసునివంశమునందుజన్మించినవాడనియును తేలుచున్నచున్నయది.

"ఈవాక్యమునుబట్టి కృతికర్తయగు లింగకవియునుకృతిప్రేరకుడగులింగప్పయును ఇద్దరునుగూడ కుమ్మరకులమువారే యని దృఢమగుచున్నది."

ఈకవి విషయమున శ్రీశాస్త్రులుగారియూహ సత్యమే కావచ్చును.

ఈకవి కాలమును నిర్ణయించుట కెట్టియాధారములును గ్రంథమున లేవు. శ్రీశాస్త్రిలవారు పీఠికలో "ఈగ్రంథమును రచించిన పోశెట్టి లింగకవి పదునైదవశతాబ్ది చివరవాఁడు" అని వ్రాసియున్నారు. కాని యందుల కాధారములనీయలేదు. ఇతరాధారములేవి యైన లభించువఱకిదియే యనుసరణీయము.

ఈగ్రంథమునఁ గరికాలచోళుఁడు, విక్రమచోళుఁడు, ఉత్తుంగ చోళుఁడు, అహివరచోళుఁడు, వరధర్మచోళుఁడు, సత్యేంద్రచోళుఁడు, మనుజేంద్రచోళుఁడు, ఉత్తమచోళుఁడు, వీరచోళుఁడు అను తొమ్మండ్రుచోళుల చారిత్రములు చెప్పఁబడినవి. ఈకథలు పండితారాధ్యుల వారు భైరవరాజునకు చెప్పినట్లిందుఁ జెప్పఁబడినది. ఈభైరవరాజు పశ్చిమ సముద్రతీరమందున్న సాసలాపురమున కధిపతియఁట. ఈసాసలాపుర మెచ్చటిదో భైరవరాజెవ్వరో తెలియలేదు. పండితారాధ్య చరిత్రమునం దీభైరవరాజు వృత్తాంత మేమియు నుదాహృతము కాలేదు.

ఈచోళులు తొమ్మండ్రును గొప్ప శివభక్తులు. ఈశ్వరానుగ్రహమువలన మానవాతీతములగు నద్భుతకార్యములనొనర్చి తుదకు కైలాసమున కేఁగిన వృత్తాంతములే యిందువర్ణితములైనవి. కరికాల చోళుఁడు దక్క తక్కిన చోళులు చారిత్రిక పురుషులవలెఁ గన్పట్టరు. భైరవరాజును జారిత్రిక పురుషుఁడు కాఁడు. ఇదిచారిత్రముకదాయని చారిత్రక దృష్టితోఁ జూచినవారి కిందుఁ జారిత్రకాంశములు లభింపవు. పండితారాధ్యులు కవి పండితుఁడు. నిరుపమాన శివభక్తుఁడు. ఈతని చారిత్రమును ఆంధ్రకవితరంగిణియందు (2 వ సం. పుట 26) వ్రాసి యున్నాఁడను. బసవనారాధ్యుఁ డీతనినిగూర్చి యొకపెద్ద ద్విపదకావ్యమును, శ్రీనాథుఁడు పద్యకావ్యమును వ్రాసియుండిరి.

ఈగ్రంథమునఁ బ్రథమాశ్వాసమంతయుఁ గరికాల చోళునికథయే. ఇతనిని తిక్కనసోమయాజి తన నిర్వచనోత్తర రామాయణమున:

శా. చేసేతన్ బృథివీశు లందుకొనఁగా గాశీసింధు తోయంబులన్
జేసె న్మజ్జన ముంగుటంబున హరించె న్బల్లవోర్వీశును
ల్లాసంబొందఁగ ఫాలలోచనము లీలంగట్టెఁ గావేరిహే
లాసాధ్యాఖిలదిఙ్ముఖుండుకరి కాలక్ష్మావిభుం డల్పుఁడే?

అని కీర్తించియున్నాఁడు ఈతఁడొనర్చిన ఘనకార్యములలోఁ గావేరినదికిఁ గట్టకట్టించుటమాత్రమే. నవచోళ చారిత్రమునవర్ణితమైనది. ఈకవి ప్రసక్తానుప్రసక్తముగ నీనవచోళులకథలలో భాస్కరచోళుఁడు, ముక్కంటిచోళుఁడు, పిట్టవ్వ, చెన్నయ్య, నయనారు, మితవచనుఁడు గణపాలుఁడు మొదలగు శివభక్తుల కథల నుగ్గడించినాఁడు. ఐదవ యాశ్వాసమంతయు, భైరవరాజుతో సంబంధించిన కథలను వర్ణించెను. మఱియు, నీశ్వరపూజాద్రవ్య మహిమము, ఆరాధనవిధి, నైవేద్య విధానము మొదలగు శైవాచారములను, వేదాంత విషయములను జెప్పియున్నాఁడు.

ఇతని కవిత్వము సరసమై మనోహరముగా నున్నది. మచ్చునకుఁ గొన్ని ద్విపదలనిట వ్రాసెదను.

జననుతంబుగఁ బూర్వజన్మంబునందు
మనుజుండనై బహుమన్ననల్ బడసి
వెలయ నువ్వుల ననుభవించుటఁజేసి
బలువేగ వానింటఁ బశువుగూపమున
జనియించి యష్టకష్టంబులఁ బడుచు
పనిచేసిపెట్టితి బహుమార్గములను
అట్టిచందంబున నాఋణశేష
మెట్టునుఁదీఱక యీగతి నేను
యీచేనికావలి నిట్లున్నదాన
ఈచంద మెఱుఁగక యీతిలలునీవు
అపహరించియు నేమియార్జింపఁగలవు.
ఉపమెఱుంగవు నీవు ఊరకపోవు

చెనసి నువ్వులబుణము చెడ్డది యనుచు
వినియు నెఱుంగవు వేడుఱుగావు
చనుమన్న నువ్వులు జల్లునవిడిచి
చనియె నచ్చటనుండి సారమార్గమున

180 గార్లపాటి లక్ష్మణకవి

ఈకవినిగూర్చిన విశేషములేమియుఁ దెలియవు. పోశెట్టి లింగన కవి రచించిన నవచోళ చరిత్రమను ద్విపద కావ్యములో నీలక్ష్మణకవి వీరభద్ర చరిత్రమును రచియించిన ట్లీక్రింది ద్విపదలలోఁ జెప్పి యున్నాఁడు.

వీరభద్రేశ్వరు విజయ సాహసము
వీరరసమున విరచించితానె
దాతయై కవులకు ధాత్రిలో నుతవి
ధాతయై మఱి నెఱదాతయైమిగులఁ
బాటల సద్భక్తిపరులు నుతిసేయఁ
బాటికెక్కిన గార్లపాటి లక్ష్మణుని
వెలయఁగా వినుతించి విజ్ఞానమునను

తెనాలి రామకృష్ణకవికి, తెనాలివారను యింటిపేరు రాకపూర్వము గార్లపాటివారను గృహనామమును గలిగియుండెడివారని విన వచ్చుచున్నది. ఇతని కాలమును దెలియదు. పదునాఱవ శతాబ్ధి వాఁడని యనుకొందము. తెనాలి రామకృష్ణుని తండ్రియైన గార్లపాటి రామమంత్రి కీతఁడు సోదరుఁడేమోయని యొకయూహ కలుగు చున్నది.

వీరభద్ర చారిత్ర మిప్పుడెచ్చటను గన్పట్టుటలేదు. అది ద్విపద కావ్యమో పద్యకావ్యమో తెలియుటలేదు.

181 తాళ్లపాక తిరువెంగళనాథుఁడు

ఇతఁడు నందవరీక బ్రాహ్మణుఁడు; ఋక్శాఖీయుఁడు; ఆశ్వలాయన సూత్రుఁడు; భారద్వాజ గోత్రుఁడు; తాళ్లపాక యన్నయాచార్యునకుఁ బ్రపౌత్రుఁడు; పెదతిరుమలాచార్యునకుఁ బౌత్రుఁడు; చిన్నన్నకుఁ దమ్మని కుమారుఁడు. ఈముప్వురును గవులు. వీరిచారిత్రముల నీయాంధ్రకవితరంగిణి (6; 8సం.)యందు వ్రాసియున్నాఁడను.

ఈతిరువెంగళనాథుని తండ్రి వేంకటేశదీక్షితుఁడు. ఈకవినివాసము తిరుపతి.

ఇతఁడు అమరుకకవిచే సంస్కృతమునరచితమైన యమరుకమను శృంగారశతకము నాంధ్రీకరించి శ్రీవేంకటేశ్వరున కంకితముచేసెను. ఈగ్రంథము ముద్రితముకాలేదు. ప్రతిపద్యమునకును ముందాపద్యమునందలి భావమును వచనములోఁ దెలిపియున్నాఁడు. శ్రీవెంకటేశ్వరుని నుతించుచు వ్రాసిన మొదటిపద్యమిది:—

ఉ. "శ్రీరుచిరాంగ నాశ్రిమ విచిత్రవిభూషణ సూనచందనో
దారవిలాసదీపితమునై యసితోత్పలకాంతి మించి శృం
గారరసంబు దోఁచెననఁ గన్నులపండువునైన మేనియొ
య్యారముఁ జూపు వేంకటనగాధిపుఁ డీవుత మాకుఁ గోరికల్."

మొదటి పద్యమునకు ముందు వ్రాసినవచనము:—

వ. "శృంగార రసప్రధాన మమరుకకావ్యము శృంగారము—సంభోగము, విప్రలంభము నని రెండు విధములు. అందులో సంభోగ శృంగారము మొదలుగా నుద్యోగించి శృంగార రసానకు ఆలంబన విభావమైన నాయికాస్వరూపమునే దేవతగా భావించి తృతీయపురుషార్థమునుగూర్చి ఆశీర్వచిస్తున్నాఁడు."

చ. చెదరిచలించు ముంగురులు, స్వేదకణంబుల నింతజారు బొ
ట్టొదవు రతాంతకాంతిమెయి నొయ్యనసోలెడుకన్నుఁదామరల్
కదలెడు కుండలంబులును గల్గిన పౌరుషభాసమానయా
ముదితముఖారవింద మతిమోదము మీకు నొసంగుగావుతన్.

దీనికి సంస్కృతశ్లోకమిది:—

శ్లో. ఆలోలామలకావళిం విలులితాం బిభ్రచ్చలత్కుండలం
కించిన్మృష్ట విశేషకం తనుతరై స్స్వేదాంభసాం జాలకైః
తన్వ్యా యత్సురతాంతతాంతనయనం వక్త్రం రతివ్యత్యయే
తత్త్వాం పాతుచిరాయ కిం హరిహర బ్రహ్మాదిభి ర్దైవతైః

తుదిపద్యమునకు ముందున్న వచనము:

వ. "నాయికా పాదతాడితుఁడైన నాయకుఁడు మదనదేవునకుఁ బ్రియుఁడని కావ్యాంతమందుఁ గవీశ్వరుఁడు మంగళాచరణమును జేస్తున్నాఁడు.

ఉ. యావరసార్ద్రిముగ్ధ కిసలయారుణకోమలముగ్ధ విస్ఫురద్
రత్నావళి నూపురంబును మదాలసభావము సొపదంబుచే
నేవరపూరుషుండు ప్రణయేర్ష్యఁ బరాంగనచేతఁ దాడితుం
డై విలసిల్లువాఁడు కుసుమాయుధ దేవునకుం బ్రియుండగుఁన్.

ఈపద్యమున కమరుకుని శ్లోకమిది:—

శ్లో. సాలక్తకేన నవపల్లవ కోమలేన
పాదేననూపురవతా మదలాలసేన
యస్తాడ్యతే దయితయా ప్రణయాపరాధా
దంగీకృతో భగవతా మకరధ్వజేన.

గ్రంథాంతమునఁ గృతికర్త తననుగూర్చి యీరెండు పద్యములను జెప్పుకొని యున్నాఁడు.

క. ఇలఁ దాళ్లపాక సత్కుల
తిలక శ్రీవేంకటేశ దీక్షితసుతుఁ డు
జ్జ్వలకవితానిధి తిరువేం
గళయప్ప యమరుకము తెనుఁగుగా విరచించెన్.

క. క్షితిపై నాచంద్రార్క
స్థితిమించఁగఁ దాళ్లపాక తిరువేంగళ దీ
క్షితుఁ డమరుకము వేంకట
పతికి సమర్పణముగాఁగఁ బరువడిఁ జేసెన్.

ఈతనిపెదతండ్రియైన చిన్నన్న కాలము క్రీ.శ. ౧౪౭౮-౧౫౬౧ అని యాతని చారిత్రమున వ్రాసియుంటిని. ఈతనితండ్రి జననము క్రీ. శ. ౧౫౦౦ ప్రాంతమైనచో నీకవి జననము ౧౫౩౦ ప్రాంతమై ౧౫౬౦ వ సంవత్సరమునకుఁ బిమ్మట నీగ్రంథమును రచియించెనని చెప్పఁదగియున్నది.

---

182 నైషధము తిమ్మయమంత్రి

ఇతఁడు లక్షణమంజరి యను నేకాశ్వాసముగల లక్షణగ్రంథమును రచియించి గరళపురీశ్వరున కంకితముచేసెను. ఇతని చరిత్రమును దెలిసికొనుటకు గ్రంథాంతగద్య దక్క వేఱాధారములు లేవు. గద్య యిట్లున్నది.

"ఇది శ్రీమదుదయాద్రీశ్వర కృపాకటాక్షసమాస్వాదిత
సంస్కృతాంధ్ర భాషాధౌరేయ శివపూజా విధేయ నైషధాన్వ
యరత్నాకర సుధాకర మహితచరిత్ర పాపయామాత్యపుత్ర
సకల విద్వత్కవిజనాధార.........సోదర సరసగుణాభరణ
సావిత్రీ మనోరమణ మదనసౌందర్య తిమ్మయమంత్రివర్య ప్రణీ
తంబైన లక్షణమంజరి యను ఛందంబు సర్వంబు నేకాశ్వాసము"

దీనినిబట్టి యీకవి నియోగి బ్రాహ్మణుఁడనియు, పాపయామాత్య పుత్రుఁడనియు, శివారాధన తత్పరుఁడనియు, ఉదయాద్రీశ్వరుని పేర్కొనుటచే నెల్లూరు మండలమందలి యుదయగిరియో, తత్ప్రాంతమో యీతని నివాసమనియుఁ దెలియుచున్నది. ఈతని భార్యపేరు సావిత్రి. ఈతని గోత్రసూత్రములు తెలియలేదు.

ఈకవియతులేఁబది విధములని యీక్రిందిపద్యమునఁ జెప్పి వాని పేరుల నుదాహరించి, లక్షణములను వ్రాసియున్నాఁడు.

క. కొండలు యతులై దండురు
కొండలు పదియందు రవియుఁ గొనకొనక మదిం
బొందుగఁ బంచాశద్వళు
లందముగ ఘటింతు సుకవులౌనని పొగడన్.

ప్రాసము లిరువదియాఱు విధములని నుడివి వానిపేరులను లక్షణములను వివరించియున్నాఁడు.

ఆంధ్రభాషామర్మములు, వర్ణఫలములు, సంధివిశేషములు, గణలక్షణములు, గణఫలములు, గణకూటములు, తత్ఫలములు మొదలగు ననేకవిషయములిందుఁ గలవు.

ఇతఁడు లక్ష్యములను దానే రచించెను. కాని యితరకవుల గ్రంథములనుండి గైకొనలేదు.

సీ. గీ. దీనమందార! కపిలాన దీపిహార!
ఘనదయాకాంత! గరళపట్టణనిశాంత.

ఈకవికాలమును దెలిసికొనుటకుఁ దగినయాధారము లెవ్వియును గ్రంథమునలేవు. కృతిపతి గరళపురీశ్వరుఁడు. పూర్వకవిస్తుతి లేదు. ఇతరకవుల గ్రంథములనుండి లక్ష్యములను గైకొనలేదు. వంశవర్ణనములేదు. ఇఁకఁ గాలనిర్ణయమెట్లు సాధ్యము?

కవితాశైలి తెలియుటకై నీతని లక్ష్యములనుండి మూఁడు పద్యముల నుదాహరించెదను.

భిన్నవర్గయతి:—

మ. కనఁగా లక్ష్యములయ్యె సజ్జనమనః కంజార్క! బాలేందుమం
డన! సారంగకరాబ్జ! సద్గుణనితాంత శ్రీశ! సంజాతఖం
డన! గౌరీహృదయేశ! శంకర! కృతాంతస్ఫార దోర్గర్వలుం
ఠన! శ్రీపట్టణవాస! రక్షితసుధాంధస్సంఘరాజా! యనన్.

తద్భవములు:—

ఉ. జక్కవ లంచలున్ జముఁడు జన్నము సత్తియు బత్తిలచ్చియున్
రక్కసి వన్నెసింగమును రచ్చమొగంబును గాము నిద్దమున్

చక్కెర రిక్కలచ్చనము జవ్వనముల్ బయనంబు పక్కియుల్
లక్కయుఁ గక్కసంబనఁగ లక్ష్యములయ్యె మహేశ! శంకరా!
చ. సరససభాంతరంబులను సత్కవితల్ రచియింపుఁడీ యనల్
గురుతుగ మాతృకార్చనము గూడదు గావున శారదావధూ
చరణసరోజ యుగ్మమును సన్నుతిఁజేసి కవిత్వముల్ ఘనం
బరయ ఘటింపవచ్చునని రాదికవీంద్రులు సానురాగతన్.

ఈలక్షణమంజరి ముద్రితము కాలేదు. ఆంధ్రసాహిత్య పరిషత్కార్యాలయమునందొక వ్రాఁతప్రతియున్నది.

"గరళపురి, కపిలానదు లెచ్చటనున్నవో అవియేవియో తెలియరాలేదు".

---

183 కావూరి యెల్లయకవి

ఇతఁడు నియోగి బ్రాహ్మణుఁడు; శ్రీవత్సగోత్రుఁడు; వెంకనామాత్యపుత్త్రుఁడు.

ఈకవి మిత్రవిందా పరిణయమును ప్రబంధమును, బ్రహ్మాండపురాణమను నాలాశ్వాసముల పద్యకావ్యమును రచియించెను. మిత్రవిందాపరిణయ మిపుడెచ్చటను గానవచ్చుటలేదు. అందుఁ దనవంశముసుగూర్చి విస్తారముగాఁ జెప్పియుండుటచే బ్రహ్మాండ పురాణమున మఱలఁ జెప్పలేదని యీక్రింది పద్యములోఁ జెప్పియున్నాఁడు.

క. కరమొప్ప మిత్రవిందా
పరిణయమున నస్మదీయ పావనవంశం
బు రచించితిఁ గావున వి
స్తరముగఁ జెప్పఁబడదయ్యెఁ దత్కృతిమమిందున్.
క. శ్రీవత్స గోత్రతిలకుం
డై వెలసిన సుకృతి వేంకనార్యసుతుండన్

కాపూరి యెల్లనాఖ్యుఁడ
శ్రీవల్లభ పాదపద్మ సేవారతుఁడన్.

బ్రహ్మాండపురాణము శ్రీరామచంద్రున కంకితమీయఁబడినది ఇందు అర్థపంచక వివరణ ఖండముమాత్రమే చెప్పఁబడినదని యీక్రింది పద్యమువలనఁ దెలియుచున్నది. ఆపురాణము నంతయు నాంధ్రీకరింప లేదు.

గీ. అర్థపంచక విజ్ఞాన మమలహృదయ!
నీకు నెఱుఁగంగఁ జెప్పితి నెమ్మితోడ
దీని నెఱిఁగినవారు విజ్ఞానఘనులు
వారె శ్రీవిష్ణుపదమునఁ జేరువారు.

తిరుమల తిరువెంగలాచార్యుఁ డీతనిగురువని యీక్రిందిపద్యములోఁ గీర్తించియున్నాఁడు.

క. హరిపాదకమలసేవా
నిరతు విశుద్ధాంతరంగు నిర్మలచరితున్
తిరుమల తిరువేంగళ స
ద్గురు నాశ్రితముక్తిదాయకుని స్మరియింతున్.

బమ్మెర కేసకవి మల్లకవుల గురువుకూడ తిరుమలతిరువేంగళాచార్యుఁడే కాని వీరిరువురు నొకేవ్యక్తియని యెంచుటకుఁ దగిన యాధారములులేవు. వీరిరువురు నొకరేయైనయెడల, నీయెల్లయ కవి కేసకవి మల్లకవుల సమకాలికుఁడై క్రీ. శ. 1600 సంవత్సరప్రాంతమున నుండియుండును.

ఎల్లనకవికృతకోకోకమును గృతినందిన కుంటముక్కల మల్లనమంత్రికిఁగూడఁ దిరుమల తిరువెంగళాచార్యుఁడే గురువు. (ఎల్లనకవి చరిత్రమును జూడుఁడు. ఆ. క.త. 8 సం. 201 పుట) ఆతఁడును నీయెల్లయకవి గురువును నొకరే యని తోఁచుచున్నది. మల్లమంత్రి క్రీ. శ. 1500 ప్రాంతమువాఁడు. కావున నీకవియు నాకాలమునందుండి యుండునని నిశ్చయింపఁదగియున్నది.

ఇతఁడు సంస్కృతాంధ్రకవుల నీక్రింది పద్యములో నుతించి యున్నాఁడు.

సీ. కాళిదాసాది సత్కవులఁ బ్రార్థనచేసి
యాంధ్రకవీంద్రుల కాదియైన
శబ్దానుశాసను చరణముల్ సేవించి
హరిహరనాథ పదాబ్జభృంగుఁ
బ్రేమలోఁ దిక్కనసోమయాజి నుతించి
శ్రీభాగవత సుధా సేవనాభి
రతుని బమ్మెరపోతరాజు సన్నుతిసేసి
రామకథాసుధారసికులైన
భాస్కరుని రంగనాథునిఁ బ్రస్తుతించి
మఱియు ధారుణిఁ బరగు సమస్తసుకవి
వరుల సంప్రీతిఁ దలఁచి విద్వజ్జనముల
పాదపంకేరుహంబుల భక్తిఁ గొలిచి.

ఇతఁడు బమ్మెర పోతనను నుతించియుండుటచే 1500 సంవత్సరమునకుఁ బూర్వుఁడు కాఁడు. పదునాఱవశతాబ్దివాఁడని నిశ్చయింపవచ్చును.

కావూరు అను గ్రామము గుంటూరు మండలమునందున్నది. దానినిబట్టి యీతని గృహనామ మేర్పడియుండును. ఈతఁడా గ్రామ నివాసుఁడేమో!

ఈకవి కవిత్వము లలితమై మనోజ్ఞముగానున్నది. శైలికై కొన్ని పద్యముల నిచ్చుచున్నాఁడను.

బ్రహ్మాండ పురాణమునందలి పద్యములు.

ఉ. ఇన్నియుఁ జెప్పనేటికి బుధేశ్వర! నిశ్చయమేన నీవు వి
ద్వన్నుత! నీదుసూత్రమున ధారుణిపైననుఁ బూజసేయు వి
ప్రన్నులు నస్మదంశజులు భక్తులు మచ్ఛరణాగతుల్మరి
న్నన్నె తలంతు రందుకతనన్ సులభంబుగ మోక్షమిచ్చెదన్. ఆ.౧.

వ. అకటా! యీమనుజాధముం డిప్పుడు మోహాయత్తుండై యిట్టిపా
తకముల్ జేయునె దీనికేదిగతియో దారాత్మజార్థంబుగా
సకలాఘంబులు జేసినందుది వివస్వత్సూతి దండింపుచో
నొకరుండేకద వీడురారు తనయుల్ యోషిజ్జనుల్ బాంధవుల్.

చ. అనవుడు విష్ణుదత్తుడు మరాంతకు దూతలజూచి యిట్లనున్
ఘనభుజులార! యేజడుడ; కర్మవిహీనుడ; మూఢచిత్తుడన్
వనరుహనాభు కెన్నడును వందనమైన నొసంగనేర, నే
దినమునం జేసినాడ, బరదేవతకుం బరిచర్య సెప్పరే! ఆ ౩.

ఉ. వేదవిగర్హితంబు లగువృత్తము లెల్లను వర్జనీయముల్
వేదములం బురాణముల విశ్రుతమైన రమాధినాథు బ్ర
హ్మాదులు మానసాబ్జములయందు భజింపుచునుందు రట్టిదా
మోదరుం డాద్యుడెల్లు భవదుక్తుల మానుదునయ్య ధీనిధీ ఆ ౪.

చ. వెలవెలబారె మేఘములు విశ్రుత మయ్యెనభంబు పంకముల్
దులదులవారె ధాతశశిలోయజమిత్రులు కాంతి సంపదన్
వెలసిరి పద్మషండములు వేడ్క మరందము గ్రోలెం దుమ్మెదల్
కలకలుదేరె వారి శుభగస్థితినొప్పె సమస్త జంతువుల్. ఆ ౫.

చ. వలియును రామకృష్ణులు క్రమంబున గోపరిపాలనాథ్యులై
కరమనురక్తి వల్లవనికాయములం దమయీడువారి నా
దరమునగూడి యాడుచు ముదంబున వేణురవంబు సేయుచున్
సరసగతి న్వినోదములు సల్పుచు గోవుల మేపుచుండగాన్ ఆ ౬.

ఈగ్రంథమున పరశురామ, బలరామ, కృష్ణావతారముల చరిత్ర
ములు వర్ణితములైనవి.

—

184 అంగద బసవయ్య

ఈతఁడు ఇందుమతీ కళ్యాణమను ప్రబంధమును రచియించినట్లు రామాప్రెగ్గడ జగ్గన్నకవి ప్రబంధరత్నాకరమున నుదాహృతములైన యందలి పద్యములనుబట్టి తెలియుచున్నది. ఇంతకంటె నీకవి చారిత్ర మేదియుఁ దెలియరాలేదు. ఈతని యింటిపేరు అంగదయా? అంగరయా? యని సంశయము కలుగుచున్నది. జగ్గనకవి కాలము క్రీ.శ. ౧౫౬౦ యగుటచే నీతఁ డంతకుఁ బూర్వుఁడగుట నిశ్చయము. ఎంత పూర్వుఁడో తెలియదు. ఈతని యిందుమతీకల్యాణ మిప్పుడెచ్చటను గన్పట్టుటలేదు. ఉదాహృత పద్యములనుబట్టి యీతని కవిత్వము రసవంతమై మనోహరమైనది యని తోఁచుచున్నది.

మ. ఉదయస్తంభములోపలన్ వెడలి తా నుద్వృత్తమౌ దైత్యునిం
గుదియంబట్టి గభస్తిమన్నృహరి సక్రోధంబునన్ వాని దు
ర్మదగాత్రింబు కరంబులం దునుమ ధారాళాస్రపూరంబు కా
విదివిం బర్విన కైవడిన్ గలయఁ బర్వెన్ సాంధ్యరాగచ్ఛవుల్.

ఉ. బీదశచీవిభుండు దితిబిడ్డలవార్యులు వారుపళ్ళెలున్
బాదలఁ బెట్టఁగాఁ జెఱలు వట్టఁగ నుండుట భారమంచు రం
భాది మరున్నివాస లసదప్సరసల్ చనుదెంచి వచ్చిరో
నా దరఫుల్లపద్మవదనల్ విహరించుదు రప్పురంబునన్

సీ. హేమసింహాసనం బెక్క నుద్యోగించు
మణికల్పితాస్థాన మంటపమున,
విసరించుకొనఁ జూచు వింజామరంబున
వైరి వీరవిలాస వతులచేత
నాటింపఁదలఁచు నానాద్వీపసంధుల
గెలుపు గంబంబులు వలసినన్ని
దుష్టరాక్షసకోటిఁ దునుము విచారించు
మఘవన్ముఖాఖిలామరులు వొగడ

గీ. సంతసము జహ్నుకన్యాతటాంతరముల
నధ్వరంబులు గావింప నలవరించు
నెలఁత నిచ్చలు నిజగర్భ నివసదర్భ
కప్రభావ పరిప్రాప్తి గౌరవమున.

సీ. శశిమండలముమీఁద సాంద్ర చంద్రికవోలె
నునుమొగంబునఁ దెల్లఁదనము నిల్చెఁ
బసిఁడి కుండలమీఁద బలభిన్మణులు వోలె
వలిచన్ను ముక్కుల నలుపులొదవె
నిరుపేదమీఁది నిర్నిద్ర సంపదవోలె
మధ్యభాగంబున మహిమఁ దాల్చెఁ
గదలిన లతమీఁది కమ్మపూవులువోలె
నలవని మేనసొమ్ములు దొలంగెఁ

గీ. దరుణిగమనంబు మిగుల మాంద్యము వహించె
వనజపత్త్రాక్షి కోర్కులు కొనలు సాఁగె
వనిత నేత్రాంతములు వసివాళ్లువాడె
వనిత తనువల్లిశయ్యల శయ్యల వ్రాలఁగడఁగె

సీ. లాజవిమోక్ష వేళాసముద్గత హోమ
ధూమవాసన మేనఁ దొంగలింప
మృగనాభిమకరికా రేఖలై మృదుగండ
మండలిహోమధూమములు నిలువ
హోమధూమశిఖాముఖోష్ణంబు చోఁకి పూ
ర్ణేందు బింబాననం బెఱ్ఱవాఱ
మాటికి హోమధూమంబుచే వెడలెడు
కన్నీటఁ గాటుక కరఁగిపాఱ

గీ. గురుజనోక్తవిధానానుకూలచాల (?)
నిజవివాహ విలాసంబు నిర్వహించి
భోజుఁడప్పుడు వేడుక బుధకవివి (?)
తానములతోడ నార్ద్రాక్షతములు సల్లె.

185 కోడూరి వల్లభసూరి

ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; రాఘవపండితుని పుత్త్రుఁడు; ఎల్లయామాత్య పౌత్త్రుఁడు; హరితసగోత్రుఁడు; కవి దేవేంద్ర బిరుదాంకితుఁడు; ప్రబోధానందస్వామి శిష్యుఁడు.

ఈకవి భాస్కరాచార్య విరచితమైన లీలావతినుండి పాటిగణితమును బొమ్మలాట కాళయ ప్రేరణముచే రచియించెను. ఈగ్రంథము ముద్రితముకాలేదు. అసమగ్రమై జీర్ణదశలో నున్నయొక ప్రతి మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున నున్నది. ఈక్రింది గద్య పద్యములవలనఁ గవివృత్తాంతము కొంతవఱకుఁ దెలియఁగలదు.

గీ. ....తుఁడ
సుజనహితుఁడ నాపస్తంబసూత్రకలిత
హరిత గోత్రపయోధి నీహారకరుఁడ
నలఘు చరితుఁడ వల్లభాహ్వయుఁడ నేను.

గద్య:- ఇది శ్రీపరమహంస పరివ్రాజకాచార్య ప్రబోధానంద శ్రీచరణ సద్గురుచ్ఛాత్ర హరితగోత్ర కోడూరు యెల్లయామాత్య పౌత్ర రాఘవసూరిపుత్ర కవి దేవేంద్రా పరనామధేయ సుజన విధేయ సహజధైర్యవల్లభార్య విరచితంబైన లీలావతియనుపాటి గణితంబు.

కృతిప్రేరకుఁడైన బొమ్మలాట కాళయ; కర్ణాట సింహాసనాధీశ్వరులైన కృష్ణదేవరాయని, యచ్యుత దేవరాయనిఁగొలిచి వారిమన్నన లందినట్లును, గుమార తాతాచార్యుని శిష్యుఁడైనట్లును, ఈక్రింది పద్యములవలనఁ దెలియుచున్నది.

ఉ. శ్రీనరసింహనందను నరింనము విక్రముఁ గృష్ణరాయ భూ
జానిని వేఁడియుం దదనుజన్ముని నచ్యుతదేవరాయనిన్
దానధికాప్తుఁడై కొలిచి తద్దయుమన్ననఁగాంచి మించు
ద్యానిధి బొమ్మలాట విరుపాధిపుకాళని ప్రార్థనంబునన్.

క. అనిపొగడ గణుకు తౌనా
నన సంస్కృతభాష భాస్కరాచార్యులు చె

A0UA104B(1)

BC

BCI

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA104B111
పుస్తకం పేరు	ఆంధ్రకవితరంగిణి09
తారీఖు	31 December 2025
ముందు అట్ట	Yes No
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	269
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	No
లేని పేజీలు	P. Jagamma
తయారు చేసినది	P. Jagamma
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	Yashmat
పరీక్ష చేసినది	SARANYA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	[illegible]